# బి.ఎస్.రాములు రచనలు

# తెలంగాణ కథకులు
# కథన రీతులు

రెండవ సంపుటి

సంపాదకులు
**సిహెచ్.వి.ప్రభాకర్‌రావు**
**వనమాల చంద్రశేఖర్**

ప్రచురణ
**విశాల సాహిత్య అకాదమి**
హైదరాబాద్ – 500 013

# తెలంగాణ కథకులు
## కథన రీతులు – 2

**బి.ఎస్.రాములు**
Ph.9391036987
e-mail : bsramulu@gmail.com
blog & google : bsramulu

*సంపాదకులు*
**సిహెచ్.వి.ప్రభాకర్‌రావు**
**వనమాల చంద్రశేఖర్**
9704708980, 9391533339

ప్రథమ ముద్రణ : 2011

కవర్ డిజైన్ : అంకుష్ గ్రాఫిక్స్

బుక్ డిజైనింగ్ : జుగాష్‌విలి, 9848266384

డిటిపి : ఏవిఎమ్ గ్రాఫిక్స్, 9440096321

Publishers & Distributors:
**Vishala Sahitya Acadamy**
2-2-186/53/5, Rama Krishna Nagar,
Bagh Amberpet, Hyderabad - 500 013
& : +91-9391036987

Rs. **90/-**

# అంకితం

**కీ.శే. ఉప్పులంచ శంకర్**
26 జూన్ 1951 – 12 డిసెంబర్ 2009
**శ్రీమతి పార్వతి** గారలకు

దశాబ్దాల బాల్య స్నేహం...
ఆత్మీయత... అనుబంధాలు...
కష్టాలు, కన్నీళ్లు కలిసిపంచుకున్న క్షణాలు...
స్నేహితులందరిని కలిపే స్నేహశీలి...
50 ఏళ్ళ స్నేహమాధుర్యంలో...
సామాజిక పరిణామాల జ్ఞాపకాలతో...

**– *బి.ఎస్.రాములు***

## విషయ సూచిక


సంపాదకీయం .. 5

తెలంగాణ కథది దానికదే ప్రత్యేక చరిత్ర .. 7

**మూడు దశాబ్దాల సీనియర్ కథకుడు**

1 అచ్చమైన కార్మిక వర్గ రచయిత పి.చంద్ యాదగిరి 'గుమ్మన్ ఎగ్లాస్‌పూర్' కథల సంపుటి ... 15

1 తెలుగు సాహిత్యంలోకి కొత్త సామాజిక చరిత్ర 'భూనిర్వాసితులు' కథల సంపుటి ... 31

**తెలంగాణ దళిత, బహుజన కథకులు–కథన రీతులు**

1 దార్ల రామచంద్ర కథలు ... 40

1 నల్లాల లక్ష్మిరాజం కథలు ... 48

1 జాజుల గౌరి కథలు ... 60

1 గూడ అంజయ్య దళిత కథలు ... 66

1 కె.సీతారాములు కథలు ... 71

**రెండవ అధ్యాయం**

1 కథా రచన పాఠాలు
వస్తువు–శైలీ, శిల్పం
నేను – నా కథలు ... 81

1 మరొక తెలంగాణ ఉద్యమ కారుడు
ఉప్పులంచ శంకర్ ... 147

1 **బి.ఎస్.రాములు రచనలు–జీవిత పరిచయం** ... 150

1 **విశాల సాహితి కథా పురస్కార గ్రహీతలు** ... 158




# సంపాదకీయం

తెలంగాణ కథది దానికదే ప్రత్యేక చరిత్ర. నూరేళ్ళుగా తెలంగాణ కథ, వస్తువు సామాజిక పరిణామాలు ప్రత్యేకంగా కొనసాగుతూ వస్తున్నాయి. ఉదాహరణకు 1946–51, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, 1970 నుండి నక్సలైట్ల ఉద్యమం, 1953 నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, ఇలా నిరంతర పోరాటాలు, బలిదానాలు, త్యాగాలు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక చరిత్ర. ఒక స్వతంత్ర రాజ్యం స్థాయి నుండి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక సీమాంధ్రులకు, ఇతరులకు వలసగా వలసాధిపత్యానికి నిరంతరం గురి అవుతూ దోపిడి చేయబడుతూ, అందుకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తూ వస్తున్న ప్రాంతం.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం మూడవ దశ 1995 నుండి ప్రారంభమై అనేక మలుపులు తిరుగుతూ ప్రపంచ చరిత్రలో తన ఉద్యమాల ద్వారా ఒక ప్రత్యేకతను సంతరించుకుంటున్నది. అహింసాయుత, శాంతియుత, ఉద్యమాల ద్వారా కోట్లాది ప్రజలను సమీకరిస్తున్నది. రోడ్ల మీద వంట, రోడ్ల మీద ఆటపాటలు, బోనాలు, బతుకమ్మ ఆటలు, పాటలు, తెలంగాణ ధూంధాం కార్యక్రమాలు ఒక ఉత్తేజంతో సాగుతున్న ఉద్యమం పసిపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అందరి హృదయాలలో స్థిరపడింది.

తెలంగాణ రాష్ట్రం కోసం దేశ స్వాతంత్ర్యం కోసం కన్నా ఎన్నో రెట్లు ఉద్యమాలు చేయాల్సి వస్తున్నది. తోటివారని గౌరవిస్తే, వారికి రాజధాని లేదని అంగీకరించి అక్కున చేర్చుకుంటే వలస ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. మననే అణచివేస్తూ వలసగా మార్చుకున్నారు.

రాష్ట్ర ఏర్పడ్డప్పటి నుండి ఉద్యోగాల్లో, రాజకీయాల్లో, సాహిత్య సామాజిక ఆర్థిక రంగాలలో, సాగు నీటి ప్రాజెక్టులలో, సమస్త స్థానిక వనరులను దోపిడి చేయడంలో తమ స్వార్థాన్ని స్పష్టం చేసుకున్నారు. వారికి మూడు పంటలకు నీళ్ళు. మనకు ఒక పంటకు కూడా నీళ్ళ గ్యారెంటీ ఉండదు. పత్రికల్లో వారి భాషే. రేడియోలలో, సినిమాల్లో, పత్రికల్లో, టీవీల్లో వారి జీవితాలే, వారి సమస్యలే. తెలంగాణ సమస్యలు, తెలంగాణ జీవితాలు, సంస్కృతిని చిన్న చూపు చూస్తూ అన్ని రంగాల్లో ఆధిక్యతను ప్రదర్శిస్తూ మహోన్నతంగా ఎదగాల్సిన తెలంగాణ ప్రజలను కళాకారులను, రచయితలను, మేధావులను, విద్యావంతులను, కాంట్రాక్టర్లను, పారిశ్రామిక వేత్తలను, న్యాయమూర్తులను, అధికారులను ఎదగకుండా నిరంతరం అణచిపెడుతూ వస్తున్నారు.

ఇప్పటికీ కూడా ఈ అణచివేత ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. దీన్ని అధిగమిస్తూ తెలంగాణ రచయితలు, కళాకారులు తమ శక్తి సామర్థ్యాలను, ప్రతిభాపాటవాలను

ఎప్పటికప్పుడు ప్రదర్శిస్తూనే ఉన్నారు. అయినా వారికి సరియైన స్థానం దక్కడం లేదు. అన్ని రంగాలలో రెండవ శ్రేణి పౌరుల్లాగా, బానిసల్లాగా చూడబడుతున్నారు. సాహిత్య చరిత్రలో కూడా ఇదే జరుగుతున్నది. దాంతో ఎక్కడికక్కడ రచయితలు, కళాకారులు, ఉద్యమకారులు దీన్ని నిరసిస్తూ మన రాష్ట్ర చరిత్రను అన్ని రంగాలలో ప్రత్యేకంగా రాస్తూ, విశ్లేషిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా సామాజిక తత్త్వవేత్త బి.ఎస్.రాములు గారు తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా వందలాది రచనలు వెలువరించారు. యిరవైకి పైగా తెలంగాణ ఉద్యమ పుస్తకాలను ప్రచురించారు. తెలంగాణ సాహిత్య చరిత్రను పునర్ నిర్మించారు. తెలంగాణ కథలను వాటి ప్రాధాన్యతను, శైలి శిల్పాలను విశ్లేషించారు. కథలు రాయడానికి అనేక కథా వర్క్ షాపులను నిర్వహించారు. విశాల సాహితీ ద్వారా వందలాది రచయితలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

బి.యస్.ఆం.ప్ర దళిత రచయితల కళాకారుల మేధావుల, ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా రెండు దశాబ్దాలనుండి బి.సి, ఎస్.సి, ఎస్.టి మైనార్టీ రచయితలు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు, నాయకులు, ఉద్యమకారులు ఎదగడానికి సైద్ధాంతిక ప్రాతిపదికలను సమకూరుస్తూ ఎన్నో గ్రంథాలను వెలువరించారు. సామాజిక ఉద్యమాలలో పాల్గొంటూ మద్దతు ఇస్తూ ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు. తెలంగాణ తల్లి రూపకర్తగా బి.ఎస్.రాములు మరొక గొప్ప కర్తవ్యం నెరవేర్చి తెలంగాణ ప్రజల సంస్కృతికి చిహ్నంగా నిలిపారు. తెలంగాణ రచయితల కథల గురించి ఎన్నో వ్యాసాలు, పీఠికలు వ్రాశారు. అయా రచయితలను ప్రోత్సహించటంతో పాటు తెలంగాణ సామాజిక చరిత్ర పరిణామాలను రికార్డు చేసిన క్రమాన్ని మనముందుంచారు.

ఇలా బి.ఎస్.రాములుగారు సామాజిక తత్త్వవేత్తగా, ఉద్యమకారుడిగా ఎన్నో రచనలను సమాజానికి అందించారు. 'తెలంగాణ కథకులు, కథన రీతులు' అందులో ఒకటి. ఇది తెలంగాణ కథకులు, కథన రీతులు రెండవ సంపుటి. ఈ గ్రంథంలో పి.చంద్ అనే కలం పేరుతో రాస్తున్న వూరుగొండ యాదగిరి, దార్ల రామచంద్రం, నల్లాల లక్ష్మిరాజం, జాజుల గౌరి, గూడ అంజయ్య, కె.సీతారాములు, బి.ఎస్.రాములు గారల కథల గురించి కథన రీతులు గురించి పొందు పరిచాము.

రెండు దశాబ్దాల దళిత బహుజన సాహిత్య ఉద్యమం ఎన్ని రికార్డులను సృష్టించిందో! ఈ రచయితలంతా దళిత బహుజనులు కావడం, ఇందులోని జీవితాలు దళిత బహుజనుల జీవితాలు కావడం యాదృచ్ఛికం కాదు. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక కృషికి ఈ సంకలనం ప్రత్యక్ష నిదర్శనం.

ఈ సంకలనానికి సంపాదకత్వం వహించే అవకాశం ఇచ్చిన బి.ఎస్.రాములుగారికి కృతజ్ఞతలు. అందంగా కంపోజ్ చేసిన ఎ.వి.యమ్ గ్రాఫిక్స్ విజయ్‌కుమార్, కవర్ డిజైనింగ్ చేసిన అంకుశ్ గ్రాఫిక్స్ ఉపేందర్, చక్కగా ముద్రించిన కర్షక్ ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు.

**- సంపాదకులు.**

# తెలంగాణ కథది
# దానికదే ప్రత్యేక చరిత్ర

**- బి.ఎస్.రాములు,** సామాజిక తత్త్వవేత్త

తెలంగాణ సాహిత్యం ఎంతో ఉన్నతంగా ఎదిగింది. దాన్ని మార్కెట్ చేసే శక్తులు ఎదగాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సాహిత్యాన్ని ప్రచురించడం, కొనడం, కొనిపించడం ఒక ఉద్యమంగా సాగించాలి. అందుకు కేరళను ఆదర్శంగా తీసుకోవచ్చు. కోటి జనాభా వున్న కేరళలో యాభై వేల కాపీలు అమ్ముతున్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో యాభై వేల కాపీలు అమ్మే విధంగా మార్కెట్ వ్యవస్థను రూపొందించాలి. దిన, వార, మాస పత్రికలు, సినిమాలు, టీవీలు తెలంగాణలో కూడా ఈ మార్కెట్‌ను సాధించుకున్నాయి. నలభై శాతం సర్క్యులేషన్, రేటింగ్ కాస్త, అటు ఇటుగా జనాభా నిష్పత్తి ప్రకారం పొందుతున్నపుడు పుస్తకాలకు ఎందుకు మార్కెట్ వుండదు? తప్పకుండా వుంటుంది.

భారతీయ సాహిత్యం దశాబ్దాల వారీగా పరిశీలిస్తే అది నిజంగా భారతీయతలోని వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని, సంఘర్షణను ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని సూచిస్తుంది. అలాంటి ప్రయత్నాలు, పరిశోధనలు గత అరవయ్యేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా గానీ, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గానీ, విశ్వవిద్యాలయాల ద్వారా గానీ సాగడం లేదు. కేంద్ర ప్రభుత్వం దేశానికంతటికీ ఒక్కటే వున్నప్పటికీ పార్లమెంట్ హౌస్‌లో అన్ని రాష్ట్రాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చున్నట్టుగా భారతీయ సాహిత్యం పరిశీలనలో, పరిణామాల్లో ఒకటిగా ఎందుకు పరిశీలించడం లేదు? ఇది సాహితీ వేత్తల, సామాజిక శాస్త్రవేత్తల వైఫల్యం. లేదా ఇది కంపార్ట్‌మెంటల్ ఆలోచనా విధానానికి, పరిమిత దృక్పథానికి నిదర్శనం. తెలంగాణ సాహిత్యాన్ని భారతీయ సాహిత్యంతో, దక్షిణాఫ్రికా, దక్షిణ అమెరికా, బీహార్, జార్ఖండ్, చత్తీస్‌ఘఢ్ వంటి దేశాల, ప్రాంతాల సాహిత్యంతో పోల్చడం ద్వారా ప్రపంచ స్థాయిలో తెలంగాణ సాహిత్యం ఎక్కడ వుందో, ఇంకా ఎంత ఎదగాలో ఇతర భాషల్లోకి అనువాదమయ్యే సామీప్య సాహిత్యం ఏ మేరకు వుందో తెలుస్తుంది. ఇతర భాషల వారికి ఏ మేరకు స్ఫూర్తి నిస్తుందో కూడా తెలుస్తుంది.

కోస్తాంధ్ర సాహిత్యాన్ని బెంగాలీ, తమిళ, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ సాహిత్య పరిణామాలతో పోల్చినపుడు అది ఎక్కడి దాకా వచ్చిందో పరస్పర ప్రభావాలు ఎలా

కొనసాగాయో తెలుస్తాయి. తద్వారా ఆదాన్, ప్రదాన్, చక్కగా సాగుతాయి. అంతేగానీ ఒకే రాష్ట్రంలో వుందని తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల సాహిత్యాన్ని ఒకే గాటన కట్టి ఒకే పరిణామాల్లో విభాగంగా సాహిత్య చరిత్ర రాయడం పొరపాటు. అది కొందరి ఆధిపత్యానికి కుదిస్తుంది. ఆయా ప్రాంతాల, కులాల, మతాల జీవితం, సంస్కృతి, భాష ఆశలు, ఆశయాలు, ఆరాటాలు, అవకాశాలు వేరువేరుగా ఏకత్వంలో భిన్నత్వంగా నిర్దిష్టంగా కొనసాగుతూ వస్తున్నాయి. అందువల్ల వేటికవి ప్రత్యేకంగా పరిశీలించాల్సిందే. గంపగుత్తగా పరిశీలిస్తే కొంతమంది ఆకలి చావులకు గురవుతారు. ఉదా.కు ఒక ప్రాంతంలో తల అరకిలో బియ్యం చొప్పున వాడకం అవుతుందని లెక్క తీసి అందరూ మూడు పూటలా తింటున్నట్టే అని చెప్పినట్టు వుంటుంది. ఒకరు కిలో లాగించవచ్చు. మరొకరికి తిండికి లేక ఆకలి చావులు చావవచ్చు. అందువల్ల గంపగుత్త పరిశీలన సరైంది కాదు. నిర్దిష్ట పరిశీలన, విశ్లేషణ ద్వారానే అనేక విషయాలు వాటి భిన్నత్వం, వైవిధ్యం, వైరుధ్యం తేటతెల్లమవుతుంది.

భాష ఒక్కటే అయినప్పటికీ, బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల హిందీ సాహిత్య పరిణామాలు ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం ప్రత్యేకంగా కొనసాగుతూ వచ్చాయి. కులాల వారీగా, మతాల వారీగా కూడా సాహిత్య పరిణామాలు కొనసాగుతూ వచ్చాయి. ముందు ఎదిగిన కులాల వారి సాహిత్యం మొత్తం సమాజ సాహిత్యంగా పరిగణించారు. ఆ తరువాత విద్య అందుకొన్న కులాల వారి సాహిత్యం స్త్రీల సాహిత్యమని, దళితుల సాహిత్యమని, బీసీల సాహిత్యమని, ముస్లిం మైనార్టీల సాహిత్యమని అస్తిత్వవాదాల పేరుతో గుర్తించడం జరుగుతుంది. ప్రధాన సాహిత్యంలో పాత పీఠాలే ఆధిపత్యంలో వున్నప్పుడు ఇలా ఏదో ఒక పేరుతో అది ముందుకొచ్చి తమ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తు చేసి తిరిగి ప్రధాన సాహిత్య స్రవంతిలో తన స్థానాన్ని సాధించుకుంటాయి. ప్రాంతాల వారీగా కూడా ఉత్తరాంధ్ర సాహిత్యమని, రాయలసీమ సాహిత్యమని, ప్రవాసాంధ్ర సాహిత్యమని, కోస్తాంధ్ర సాహిత్యమని, తెలంగాణ సాహిత్యమని ప్రత్యేకంగా సాహిత్య పరిణామాలను విశ్లేషించారు. ఇటీవల దక్షిణ కోస్తా సాహిత్యమని, ఉత్తర కోస్తా సాహిత్యమని, మధ్య కోస్తా సాహిత్యమని, ఉత్తర తెలంగాణ సాహిత్యమని, దక్షిణ తెలంగాణ సాహిత్యమని కూడా ప్రత్యేకంగా పరిశీలించి ప్రత్యేకతలను, వాటి పరిణామాలను వింగడిస్తున్నారు.

అలా తెలంగాణ వేరు, రాయలసీమ వేరు, ఉత్తరాంధ్ర వేరు, కోస్తాంధ్ర వేరు. వీటి సాహిత్య పరిణామాలు ప్రత్యేకంగా కొనసాగాయి. ఆయా ప్రాంతాల, కులాల, మతాల వారి జీవితం ప్రత్యేక క్రమాల గుండా కొనసాగడం వల్లనే సాహిత్యంలో, సమాజంలో ప్రత్యేక పరిణామాలు రికార్డవుతుంటాయి. అందువల్ల వాటికవి విశిష్టమైనవి, ప్రత్యేకమైనవి. ఇటీవల ఒక జిల్లాలో ఒక కులం మహిళ పీహెచ్‌డీ చేసింది. జిల్లా మొత్తంలో ఆ కులంలో



పీహెచ్‌డీ చేసిన మొదటి మహిళ అని పరిశీలనలో తేలింది. అది ఆ కులం ప్రత్యేక పరిణామం. అలా మరెన్నో కులాల నుండి ఇప్పటికీ జిల్లాలో ఒకరైనా పీహెచ్‌డీ చేసిన మహిళ లేరు. దీన్ని ప్రత్యేకంగా పరిశీలించినప్పుడే వారి పట్ల శ్రద్ధ పెట్టి ఎదిగించడం సాధ్యం.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలై సాహిత్య, సామాజిక, చారిత్రక పరిణామాలన్నీ తెలంగాణకు ప్రత్యేకంగా కొనసాగాయని యాభైకి పైగా గ్రంథాలు వెలువడ్డాయి. ఇలా తెలంగాణ సాహిత్యం తనదైన దారిలో ముందుకు సాగుతున్నది. తెలంగాణ సాహిత్యం, తెలంగాణ ఉద్యమాలు, తెలంగాణ భావజాలాలు రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రభావితం చేస్తున్న దశ ఇది. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు మొదలుకొని మావోయిస్టు పార్టీ నేత గణపతి, భావజాల కర్తలు బి.ఎస్.రాములు, కంచ ఐలయ్య, కె.జయశంకర్, వి.ప్రకాష్, పాశం యాదగిరి దాకా వందల వేల మేధావులు, రచయితలు తెలంగాణ నుండి ఎదిగి దేశానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు ద్వారా కేసీఆర్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 2004 నుండి రెండు సార్లు అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులయ్యారు. ఇవ్వాళ రాజకీయాలన్నీ తెలంగాణ రాష్ట్ర చర్చ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

తెలంగాణ రచయితలు, సాహితీ వేత్తలు రకరకాల పేర్లతో విడివిడిగా వున్నారు. సమిష్టి కృషి తక్కువ. సమకాలీకులు పరస్పరం గౌరవించుకోవడం, మెచ్చుకోవడం, ప్రోత్సహించుకోవడంలో కమ్యూనికేట్ చేసుకుంటూ మార్కెటింగ్ చేసుకోవడంలో ఏదో ఈర్ష్య, తన సొమ్మేదో పోయినట్టు, తమ వాడు కాదన్నట్టు ప్రవర్తిస్తున్నారు. తను, తన గ్రూపు గురించి చెపుతూ అదే మొత్తం జిల్లా సాహిత్యంగానో, రాష్ట్ర సాహిత్యంగానో, మొత్తం ఉద్యమ సాహిత్యంగానో ప్రచారం చేస్తుంటారు. అలాగే తమ దళిత, స్త్రీవాద, ముస్లింవాద, బీసీవాద సాహిత్యం మొత్తం సాహిత్యంగా ప్రకటిస్తుంటారు. ఈ దశ సన్నకారు వ్యవసాయ దారుని మనస్తత్వానికి సంబంధించినది. ఇతరులను ఓర్వలేరు. కలుపుకోలేరు. నగరంలో, పట్టణంలో జీవిస్తున్నప్పటికీ ఆ జీవితానికి సంబంధించిన సమిష్టి భావన కూడా ఉండదు. తెలంగాణ రచయితలు అందరూ ఒకచోట కలిసిందెక్కడ? భావజాలాల పేరిట కొందరు, సంస్థల పేరిట కొందరు, కుల, మతాల పేరిట కొందరు, ఈర్ష్యా అసూయలతో ఎందరో విడివిడిగా ఉండదల్చుకున్నారు. గ్లోబలైజేషన్, మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ కంపెనీలు ఎదుగుతున్న క్రమంలో తెలంగాణ సాహితీ వేత్తలు కార్పొరేట్ పని విధానాన్ని గానీ, సహకార రంగ సమిష్టి కృషి ప్రాధాన్యత గానీ, దాని ఆవశ్యకత గానీ గమనించలేకపోతున్నారు. సహకార రంగంలో, కార్పొరేట్ రంగంలో తలా కొంత షేర్, బాధ్యతతో వేల, లక్షల కోట్ల మార్కెటింగ్‌ను, బ్రాండ్‌నేమ్‌ను సాధించుకుంటున్నారు. సమస్త రంగాలను కార్పొరేట్, సహకార రంగ పని విధానం

ప్రభావితం చేస్తున్నది. ఆధిపత్యం వహిస్తున్నది. శాసిస్తున్నది. ఈ దశలో కూడా, ఇవన్నీ తెలిసి కూడా వాటిని సాహిత్యంలో రాస్తూ కూడా సమిష్టి, సహకార, కార్పొరేట్ పని విధానాన్ని, మార్కెటింగ్ పని పద్ధతులను సాహితీ వేత్తలు, తెలంగాణ ప్రచురణ కర్తలు ఆచరించలేకపోతున్నారు. తమ స్వభావాలను మార్చుకొని మలుచుకోలేక పోతున్నారు.

సమిష్టి కృషి ప్రాధాన్యత అంటే ఏమిటి? తామే పత్రికలు, పుస్తకాలు ప్రచురిస్తూ మార్కెట్ చేసుకోవడం ద్వారా తెలంగాణ సాహితీ వేత్తలు, సంపాదకులు, సంకలన కర్తలు స్వయంగా తమ ప్రాంత ప్రజల సాహిత్య అవసరాలను తీర్చవచ్చు. అది వారి కర్తవ్యం. అంతేగానీ ఎవరో సీమాంధ్ర సంపాదకులు, ప్రచురణ కర్తలు, సంకలన కర్తలు ప్రచురించలేదని వాపోవడం, మా ఆయన ఇది తేలేదు, అది తేలేదు, పట్టు చీర కొనివ్వలేదు అని ఆడిపోసుకునే డిపెండెంట్ ఇల్లాలు వంటి మనస్తత్వమే. బి.ఎస్.రాములు, జూలూరి గౌరీశంకర్, ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబా, కర్ర ఎల్లారెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎలికట్టె శంకర్రావు వంటి కొందరే స్వయంగా తెలంగాణ సాహిత్యాన్ని ప్రచురిస్తున్నారు. సంకలనం చేస్తున్నారు. మిగతా వాళ్లంతా ఈ పని ఎందుకు చేయడం లేదు? చేసే వారికి ఎందుకు సహకరించడం లేదు? డబ్బులు లేకనా? హృదయం లేకనా? ప్రాధాన్యత గుర్తించకనా? ఆత్మావలోకనం చేసుకోవాలి.

నేను ఆయా జిల్లాల వారీగా తెలంగాణ కథలను సంపుటాలుగా తీసుకురావాలని, తెలంగాణ వర్తమాన సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు ప్రచురించాలని కరీంనగర్ జిల్లా కథలు, భారతీయ సాహిత్యం తెలుగు కథలు సంకలనాలను ప్రచురించాను. ఎంతమంది వాటిని ప్రోత్సహించారు? ప్రజల్లోకి తీసుకెళ్లారు? తెలంగాణలో వున్న వందలాది రచయితలు పూనుకుంటే తలా పది కాపీలు కొని ప్రజల్లో సర్క్యులేట్ చేస్తే రెండు వేల కాపీలైనా జనంలోకి వెళ్తాయి. ఉదాత్త, ఉన్నత ఆశయాలు కొరవడి కేవలం కెరీరిజానికి వ్యక్తిగత కీర్తి ప్రతిష్టలకు పరిమితమై ఇతరుల పట్ల ఈర్ష్యా, ద్వేషాలతో బతుకు ఈడ్వడం వల్ల ఇది సాధ్యం కావడం లేదు అని చెప్పవచ్చు.

ఈ విషయాలను చర్చించకుండా తెలంగాణ సాహిత్యం, తెలంగాణ సాహితీ వేత్తలు మార్కెటింగ్‌లో, ప్రజలకు చేరవేయడంలో ఇతర కారణాలను ముందుకు తెస్తున్నారు. తెలంగాణలో మధ్య తరగతి రూపొందకపోవడం వల్ల తెలంగాణ సాహిత్యం, దాని పరిణామాలు విస్తృతంగా సాగలేదనే వాదన అందులో ఒకటి. అది పాతకాలం ముచ్చట. ఇప్పుడు మధ్యతరగతి దేశంలోని అన్ని ప్రాంతాల్లోలాగే తెలంగాణలోనూ ఎదిగింది. అరబ్ దేశాల వలసల నుండి అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీ, శ్రీలంక, ఆఫ్రికా దేశాలకు వెళ్లి తమ నైపుణ్యం నిరూపించుకుంటున్నారు. అన్ని రంగాల్లో ఎదుగుతున్నారు.

ఆ క్రమంలో నేడు పత్రికలు, సినిమాలు, పుస్తకాలు, గైడ్‌లు సీమాంధ్రలో 60



శాతం, తెలంగాణలో 40 శాతం వాటాను జనాభా నిష్పత్తి ప్రకారం మార్కెట్ చేసుకోగలుగుతున్నారు. అనగా తెలంగాణలోనూ దేశవ్యాప్తంగా ఎదిగినట్టుగానే విద్యావంతులు మధ్యతరగతి, రచయితలు, కళాకారులు, మేధావులు ఎదుగుతున్నారు. 'జంట నగరాలు' అనే తమిళ నవల హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల గురించి రాసిందే. బొంబాయిలో మహాత్మా జ్యోతిబా పూలేతో కలిసి, సమాంతరంగా, స్వతంత్రంగా అనేక ఉద్యమాలను, సంఘసంస్కరణలను ముందుండి నడిపిన వారు తెలంగాణ నుండి వలస వెళ్ళిన బీసీ, ఎస్సీ కులాల వారే. వాటిని పరిశోధించి ఇటీవల మచ్చ ప్రభాకర్ పుస్తకాలుగా, వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. వట్టికోట ఆళ్వారుస్వామి తెలంగాణలో వెలువడిన సాహిత్యాన్ని ప్రచురించి ఇంటింటి గ్రంథాలయంలో చేర్చినట్టుగా నేడు సాహితీవేత్తలు అందరూ పూనుకొని చేసినప్పుడు తెలంగాణ సాహిత్యం విస్తృతి తెలుస్తుంది.

1918లోనే ఉస్మానియా యూనివర్సిటీ ఏర్పడింది. అంతకు నలభయ్యేళ్ల ముందే 1870-80లలో బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఏర్పడింది. ఈ విద్యావంతులంతా మధ్య తరగతిగా ఎదగకుండా ఎటువెళ్ళారన్నట్టు? ఔరంగాబాద్, నాగ్‌పూర్, గుల్బర్గా, బొంబాయిలలో తెలంగాణ నుండి వెళ్ళి చదువుకున్న పి.వి.నరసింహారావు మొదలుకొని వందలాది మంది మధ్య తరగతిగా, ఉన్నత తరగతిగా ఎదుగుతూ రాలేదా? ఈ పరిణామాలను ఎందుకు పరిశీలనలోకి తీసుకుకోవడం లేదు?

ఇలా 1950 నాటికే తెలంగాణలో వేలాది మంది తెలంగాణ వాళ్లు ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరంతా మధ్య తరగతే. వీటన్నింటినీ పరిశీలనలోకి తీసుకోవడం అవసరం. తెలంగాణలో బ్రాహ్మణ సామాజిక వర్గంతో పాటు అంతకన్నా ఎక్కువగా బీసీ, ఎస్సీలు, శూద్ర అగ్రకులాలుకూడా సాహిత్యంలో, ఉద్యమాల్లో ముందుకు సాగాయి. అందువల్ల శ్రామిక కులాల, గ్రామీణ జీవితాల చిత్రణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇలా తెలంగాణలో కేరళ జనాభా ఎంతుందో అంత మధ్యతరగతి కోటి జనాభాకు పైగా ఎదిగారు. అది యు.పి.బిహార్, ఒరిస్సా, మహారాష్ట్రకన్నా తక్కువకాదు.

పోలికలు, తులనాత్మక అధ్యయనం కొంతమేరకే ప్రయోజనం. 'స్పర్ధయా వర్ధతే విద్యా' అన్నారు. పోటీ పడితే విద్య అభివృద్ధి చెందుతుంది. ఇది ఒక దశదాకే పనికొస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతరులతో పోల్చితే కొంతకాలం తర్వాత పోల్చిన వారిపై ద్వేషం పెంచుకుంటారు. పిల్లలను స్వయంగా వారి ప్రతిభా సామర్థ్యాలపై నమ్మకం కలిగిస్తూ, అభినందిస్తూ ఎదిగించాలి. అంతేగానీ ఇతరులతో పోల్చి కించ పరచకూడదు. భారతదేశాన్ని రష్యా, యూరప్, అమెరికాలతో పోల్చి కించ పరచకూడదు. అవమానంతో, దీనత్వంతో తలదించుకోవాల్సిన అవసరం లేదు. ఒకే ఊళ్లో సంపన్నులు, పేదలు, అగ్రకులాలు, శ్రామిక కులాలు కలిసి జీవిస్తారు. పరస్పరం పోల్చుకుంటూ బతికితే పేదలు, శ్రామిక కులాలు నిరంతరం అల్పత్వ భావంతో అణిగిపోతూ ఇతరుల ఆధిపత్యాన్ని

ఆమోదించాల్సిన దుస్థితిలో పడిపోతారు.

జిడ్డు కృష్ణమూర్తి దేన్నీ మరోదానితో పోల్చకు అంటారు. దాన్ని అదిగా చూడు. ఆస్వాదించు. ఆ పువ్వును గమనిస్తూ, ఆనందిస్తూ వుండు. అంతేగానీ మరోపువ్వుతో పోల్చి దానికన్నా మరోపువ్వు బాగుందని అనడం వల్ల, అనుకోవడం వల్ల ఆనందం, రసాస్వాదన ఆవిరైపోతుంది. హృదయ స్పందన ఆగిపోయి ఆలోచన మాత్రమే మిగులుతుంది. ఆలోచన ఎప్పుడూ గతమే. పోల్చడం ద్వారా వర్తమానం గతంలోకి మారిపోతుంది. వర్తమానంలో దాన్ని ఆస్వాదించడం, ఉత్తేజం పొందడం, హృదయాల్లో రసావిష్కృతం కావడం అవసరం. అప్పుడే ప్రకృతి పశుపక్ష్యాదుల మానవ సంబంధాలలోని సాహిత్యం, సంస్కృతి, కళల్లోని సౌందర్యాన్ని ఆస్వాదించడం సాధ్యం. ధ్యానం, యోగం, మొదలైనవి కూడా ఈ క్షణంలో జీవించడాన్ని నొక్కి చెపుతాయి.

తెలంగాణ రాష్ట్ర సాహిత్యం, సాహిత్య చరిత్ర స్వతంత్రంగా దానికదే ఎదుగుతూ వస్తున్నది. ప్రత్యేకంగా సాగిన వందేళ్ల తెలంగాణ సాహిత్య, సామాజిక, రాజకీయ, ఆర్థిక క్రమాలను పలువురు సాహితీ వేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, చరిత్ర కారులు మనముందుంచారు. కథా సాహిత్యం విషయంలో కాసుల ప్రతాపరెడ్డి, అంబటి సురేందర్‌రాజు, ఎస్.జగన్‌రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి, బి.ఎస్.రాములు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పత్తిపాక మోహన్, బి.వి.ఎన్.స్వామి, కాలువ మల్లయ్య, కె.శ్రీనివాస్, గోగు శ్యామల, జూపాక సుభద్ర, జాజుల గౌరి, ఎలికట్టె శంకర్రావు, తదితరులు గత పదిహేనేళ్లుగా విస్తృతంగా తెలంగాణ కథా సాహిత్య చరిత్రను, దాని క్రమాలను వెలికి తీసి వ్యాసాలుగా, గ్రంథాలుగా ప్రచురించారు. తెలంగాణ కథలను సంకలనాలుగా కూడా వెలువరిస్తున్నారు.

దళిత, రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక 1990 దశాబ్దం నుండి తెలుగు సాహిత్యంలో తెచ్చిన మలుపు చారిత్రకమైనది. ఈ కృషిలో భాగంగా వందలాది కథలు, నవలలు తదితర ప్రక్రియలు వెలువడ్డాయి. ఇందులో అయిదుగురు దళితులు, అయిదుగురు బీసీలు వుండడం దరకమే ఐక్యవేదిక కృషిని చెప్పకే చెప్తుంది.

సాహిత్యాన్ని కేవలం తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషల వారీగా పరిశీలించడం పొరపాటు. ఒక ప్రాంత జీవితం ఆ ప్రాంత సాహిత్యంలో, ఆశల్లో వ్యక్తం అవుతుంది. అందువల్ల ఒక ప్రాంతంలోని అన్ని భాషల సాహిత్యాన్ని కలిపి పరిశీలించడం అవసరం. అది సరైన తులనాత్మకత అవుతుంది. అమెరికాలో, యూరప్‌లో, రష్యాలో వున్న తెలుగు వారి జీవితం వేరు, తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో వున్న వారి జీవితం వేరు. రెండూ తెలుగు భాషే అని వీరిలాగా వారు, వారిలాగా వీరు రాయలేదని, స్పందించలేదని చర్చించడం పొరపాటు. ఎవరి జీవితం వారిది. ఎవరి స్పందనలు వారివి.



అమెరికాలోని తెలుగు వాళ్లు అమెరికా పౌర జీవితానికి సంబంధించిన ఒక శ్రేణి. ఆ జీవితాలు అమెరికాలోని ఇతర ప్రజల జీవితాల చిత్రణతో, పరిణామాలతో పోల్చడం ద్వారా ఆ సాహిత్యానికి, ఆ ప్రజలకు మేలు జరుగుతుంది. అంతేగానీ అది తెలుగు సాహిత్యంగా తెలుగు నేలలో జీవిస్తున్న వారి జీవితంతో, సాహిత్యంతో, శైలీ శిల్పంతో, వస్తువుతో పోల్చడం సరైంది కాదు. తెలంగాణ సాహిత్యాన్ని, దాని పరిణామాలను, వస్తువు, శైలీ, శిల్పాలను వాటికవిగా ప్రత్యేకంగా పరిశీలించాలి. అప్పుడే అవి ఎలా సాగుతున్నాయో? ఎందుకు సాగుతున్నాయో? వాటి ప్రత్యేకత ఏమిటో, నిర్దిష్ట జీవితాలు, ఆశలు, పరిసరాలు, సంస్కృతి ఏమిటో తేటతెల్లమవుతుంది. అలా చేయకుండా గంప గుత్తలో కలిపేస్తే తెలంగాణ ప్రత్యేక అస్తిత్వాన్ని, ప్రత్యేక పరిణామాలను చూడ నిరాకరించడం అవుతుంది.

ఇంతదాకా తెలుగు సాహిత్యంలో కథకులు, కథన రీతుల గురించి సీమాంధ్ర, తెలంగాణ, మద్రాసీ ఆంధ్ర పరిణామాలన్నిటినీ కలిపేసి దేని అస్తిత్వం ప్రత్యేకత దానికి తెలియకుండా కొందరు ఆధిపత్య సామాజిక వర్గాల, ప్రాంతాల వారి సాహిత్యమే మార్గదర్శి అని, ఆ శైలీ, శిల్పాలే, ఆ వస్తువే గొప్ప అని, వారిదే ముందు చూపు అని దబాయిస్తున్నారు. ఇది ఆధిపత్యవాదుల కుట్ర. అస్తిత్వవాదాలు ఈ కుట్రలను బద్దలు చేశాయి.

ప్రాంతీయ అస్తిత్వవాదాలు, దళిత, బహుజన, స్త్రీవాద, మైనార్టీ, ముస్లింవాద, ప్రాంతీయ వాద, మాదిగవాద, గిరిజనవాద ఉద్యమాలు, సాహిత్యం, వారి ఆశలు, లక్ష్యాలు, కార్యక్రమాలు ప్రత్యేకంగా ముందుకు వచ్చి సమాజం ముందు నిలిచాయి. సమాజం వాటిని ఆదరించింది. ఆయా సామాజిక వర్గాలు, ప్రాంతాలు అక్కున చేర్చుకున్నాయి. ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అనే సూత్ర రీత్యా రాజకీయాల్లో, ఓట్లలో అందరినీ సమానంగా గౌరవించే అవసరం ఏర్పడినట్టుగా అస్తిత్వ ఉద్యమాలు, సాహిత్యం, సిద్ధాంతాలు విస్తరించే క్రమంలో అన్నిటినీ సమానంగా గౌరవిస్తేనే ఆధిపత్యవర్గాలు, కులాల సాహిత్యం కూడా గౌరవం పొందే అనివార్యత ముందుకు వచ్చింది.

అలా పరస్పరం గౌరవించుకునే ప్రజాస్వామిక సంస్కృతి, అస్తిత్వవాద ఉద్యమాల వల్ల విస్తరించి స్థిరపడింది. అంతకుముందు తమ అరసం సాహిత్యమే గొప్ప అని, తమ విరసం సాహిత్యమే సమాజానికి మార్గదర్శి అని, తమ బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, రాజుల సాహిత్యమే అందరికీ ఆదర్శమని చేసే వాదాలు బలహీనపడిపోయాయి. వ్యాపార పత్రికల్లో, సినిమాల్లో, టీవీల్లో మాత్రం ఇప్పటికీ బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వెలమ, రాజులు, వైశ్య తదితర ఆధిపత్య కులాల, వర్గాల సంస్కృతిని, కుటుంబాలను, వారి అభివృద్ధిని, సంక్షోభాలను ప్రధానంగా ముందుకు తెస్తున్నారు. ఏడాదిలో వచ్చే సినిమాల్లో నూటికి 80 ఇలాంటివే. టీవీ సీరియల్స్ కూడా నూటికి 90 ఇలాంటివే. స్వాతి, ఆంధ్రభూమి,

నవ్య, తదితర వార పత్రికల్లో, చతుర, స్వాతి తదితర మాసపత్రికల్లో వచ్చే సీరియల్ నవలలు కూడా నూటికి 80 శాతం ఇలాంటివే. మెజార్టీ ప్రజల జీవితాలను గానీ, సంస్కృతిని గానీ చిత్రించే సీరియల్ నవలలను ఎంపిక చేయడమే తక్కువ. ఇలా తమ మార్కెట్‌ను, సర్క్యులేషన్‌ను కుదించుకోవడానికి కూడా సిద్ధ పడుతున్నారు గానీ కొత్త పాఠకుల్లోకి, కొత్త సామాజిక వర్గ విద్యావంతుల్లోకి కొత్త మార్కెట్‌ను సృష్టించుకోవడానికి కొత్త ప్రయోగాలు చేయాలని, వారి జీవితాలను సీరియల్‌గా ప్రచురించాలని అనుకోవడం లేదు. అంతగా ఆయా సంపాదక వర్గాలు తమ సామాజిక వర్గాల కంపార్ట్‌మెంటల్ ఆలోచనలకు కుదించుకు పోయాయి. గిడసబారిపోయాయి. అందువల్ల చాలా మంది దళిత, బహుజన, మైనార్టీ సామాజిక వర్గాల రచయితలు కథలు, కవితలు, పాటలు, వ్యాసాలు, ప్రసంగాలకు, సాహిత్య విమర్శకు పరిమితమైపోవాల్సి వస్తున్నది. నవలలుగా చిత్రించాల్సిన వస్తువు ఇలా అద్దంలో కొండలా కథల్లో చిత్రించాల్సి వస్తున్నది. అందుకు నేనే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. నా కథలన్నీ నవలంత వస్తువును కలిగి వున్నాయని అనడం వెనుక ఈ పరిణామం కొనసాగుతున్నది.

ఇందులోని కథకులు ఇంకా రాస్తున్న క్రమంలో వున్న వారే. వారి కథల సంపుటాలకు ముందు మాటలు రాసిన సందర్భంగా చేసిన విశ్లేషణ మరింత సమగ్రం చేసి ఇందులో చేర్చడం జరిగింది. అలా వారి కథన రీతులను పరిశీలించే అవకాశం కలిగింది. సామాజిక ఉద్యమాల, భావజాల ఉద్యమాల సైద్ధాంతిక చర్చలో పని వత్తిడిలోను వీటిని రాయడం ఒక బాధ్యతగా స్వీకరించాను. అందువల్ల ఆయా కథన రీతుల పరిశీలనలో సామాజిక పరిణామాలు, వాటి నేపథ్యం ప్రాధాన్యత వహించడం సహజంగా జరిగిపోయింది. వస్తువే శైలినీ, శిల్పాన్నీ నిర్దేశిస్తుంది అని అంటారు. అనగా జీవితమే శైలినీ, శిల్పాన్నీ నిర్దేశిస్తుంది అని అర్థం. అయితే ఆ జీవితాన్ని ఎలా చెప్పాలి? ఎందుకు చెప్పాలి? ఎక్కడ ప్రారంభించి ఎక్కడ ముగించాలి? దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి? పాత్రల్ని, స్వభావాల్ని ఎలా రూపుదిద్దాలి? అనే అంశాలు రచయితల సామర్థ్యానికి, అభిరుచికి, అనుభవానికి సంబంధించినవి. కనుక కేవలం వస్తువు, జీవితం మాత్రమే శైలీ, శిల్పాన్ని నిర్దేశించదు. అధ్యయనం, అనుభవం, సాధన, ప్రపంచ సాహిత్య పఠనం మన శైలీ, శిల్పాల్లో గొప్ప పరిణామానికి మార్గం సుగమం చేస్తుంది. అందువల్ల తెలంగాణ కథకులు ఇందులో చర్చించిన, విశ్లేషించిన వస్తువుకు, శైలీ, శిల్పాలకు పరిమితం కాకుండా ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఇంతకన్నా గొప్పగా ఎదగాలని, తెలంగాణ సాహిత్యాన్ని తద్వారా తెలంగాణ ప్రజల సంస్కృతిని, జీవితాన్ని తెలుసుకోవడానికి ప్రపంచ ప్రజలు ఆరాట పడే విధంగా కృషి చేయాలని కోరుతున్నాను.





### అచ్చమైన కార్మిక వర్గ రచయిత

# పి.చంద్ యాదగిరి

## పారిశ్రామిక విప్లవం - కార్మిక వర్గం

పారిశ్రామిక విప్లవం క్రీ.శ. 1750లో వేగం పుంజుకున్నప్పటికీ, భారతదేశం నుండి 1810 దాకా చేతి వృత్తుల కుటీర పరిశ్రమల నుండి ఇతర దేశాలకు సరుకులు ఎగుమతి అవుతూ వచ్చాయి. 1810 నుండి ఈస్ట్ ఇండియా కంపెనీ, ఆ తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం ప్రత్యేకంగా సబ్సిడీలు ఇచ్చి పారిశ్రామిక ఉత్పత్తులను మన దేశంలో మార్కెట్‌ను విస్తరింప చేసుకున్నాయి. దాంతో దేశంలో అన్ని వృత్తులు దెబ్బతిన్నాయి. కూలీలుగా, కార్మికులుగా మారిపోవాల్సి వచ్చింది. మొదటగా రవాణా సౌకర్యాల కోసం రోడ్డు, రైలు మార్గాల నిర్మాణాల్లో కూలీలుగా మారిపోయారు. సముద్రపు ఓడ రేవుల వద్ద సరుకులు దించే, ఎక్కించే శ్రమ జీవులుగా మారిపోయారు. దేశంలో బట్టల మిల్లులు తదితర పరిశ్రమలు స్థాపించే క్రమంలో, పారిశ్రామిక కార్మికులుగా చేరుతూ వచ్చారు. తొలి శ్రామిక వర్గ ఉద్యమాలు, బట్టల మిల్లు కార్మికుల నుండి వచ్చాయి.

ప్రపంచంలో జెన్నీ నూలు వడుకు యంత్రంతో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. దాంతో చేనేత కార్మికులు మొట్టమొదటిసారిగా తమ సాంప్రదాయక వృత్తిని కోల్పోయి, మిల్లు కార్మికులుగా మారాల్సి వచ్చింది. అలా ప్రపంచలో కార్మిక వర్గం చేనేత కార్మికుల నుండి రూపుదిద్దుకోవడం మొదలైంది. మన దేశంలో ఈ మిల్లు కార్మికులు 16 గంటల పనిని ఎన్నో ఉద్యమాలు చేసి 12 గంటల పని విధానాన్ని సాధించుకున్నారు. ఆ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా 8 గంటల పని విధానం స్థిర పడింది. 1850-1920 దాకా సాగిన దేశంలోని కార్మిక వర్గ ఉద్యమాలకు మహాత్మాజ్యోతిబా పూలే, నారాయణ మేకాంజి లోకాండే, సత్య శోధక్ సమాజ్, దృక్పథాన్ని, స్ఫూర్తిని, నాయకత్వాన్ని అందించారు. ఆ తర్వాత కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కార్మిక వర్గ ఉద్యమాల్లో ప్రవేశించాయి.

బొంబాయి, అహ్మద్‌నగర్, సూరత్, నగరాల్లో విస్తరించిన బట్టల మిల్లు పరిశ్రమలో తెలంగాణా ప్రాంతం నుండి చేనేత కులాల వారు మిల్లు కార్మికులుగా వలస వెళ్ళి, కార్మిక

వర్గంగా మారిపోయారు. లక్షలాది మంది తెలంగాణ ప్రజలు వృత్తులు కోల్పోయి ఇలా నగరాల్లో కార్మికులుగా, చిన్న చిన్న వృత్తుల్లో చేరిపోయారు. కార్మిక వర్గ నాయకత్వం వీరి నుండే ఎదగాల్సిన ఆవశ్యకత ఉండింది. అలా ఆధునిక సమాజ కార్మిక వర్గ చైతన్యం పారిశ్రామిక కార్మికులుగా మారిన గ్రామీణ చేతి వృత్తి దారుల హృదయాల్లో బలంగా నాటుకు పోయింది. వారి పిల్లలు, వారసులు, కార్మిక వర్గ చైతన్యం పుట్టుక, పెరుగుదలలో అంది పుచ్చుకోవడం సహజంగా జరిపోయింది. అలా కొన్ని తరాల తరబడి తెలంగాణ ప్రాంత చేతి వృత్తి కులాల ప్రజలు వలసల ద్వారా పారిశ్రామిక ఉత్పత్తి నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా, ఆధునిక కార్మిక వర్గ చైతన్యంతో ముందుకు సాగారు. అలా తమ సొంత గ్రామాలకు పట్టణ, నగర నాగరికతను, సంస్కృతిని దిగుమతి చేశారు. ఆధునిక సమాజంతో గ్రామాలను అనుసంధానం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

## అచ్చమైన కార్మిక వర్గ రచయిత

అలా పి.చంద్ రెండో తరం కార్మిక వర్గానికి చెందిన రచయిత. ఇండియాలో కొందరు మధ్య తరగతి నుండి రచయితలుగా ఎదిగినవారు, కార్మిక వర్గం గురించి కూడా కొన్ని రచనలు చేశారు. కొందరే తొలి తరం కార్మికుల నుండి రచయితలు ఎదిగారు. పి.చంద్ తండ్రి నైజాం రాజ్యంలోని వరంగల్ అజాం జాహి బట్టల మిల్లు కార్మికుడు. పి.చంద్ సింగరేణి కాలరీస్ కంపెనీలో ఉద్యోగి. కార్మిక వర్గంలో పుట్టి, కార్మిక వర్గంలో పెరిగి, కార్మిక వర్గ రచయితగా ఎదిగిన రచయితలు ప్రపంచంలో ఎందరో ఉన్నారు. రష్యాలో మాగ్జిమ్ గోర్కీ, షోలకోవ్ వంటి రచయితలు ఎందరో ఉన్నారు. ఇండియాలో ఇలాంటి వారు చాలా తక్కువ. గోర్కీ వలే కార్మిక వర్గం నుండి ఎదిగి, కార్మిక వర్గ దృక్పథంతో, కార్మిక వర్గం గురించి రాసిన రచయిత పి.చంద్ యాదగిరి. ఇలా పి.చంద్ యాదగిరి సాహిత్యానికి, ఆయన జీవితానికి ఒక ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. పి.చంద్ యాదగిరి అచ్చమైన కార్మిక వర్గ రచయిత.

## విద్యార్థి దశ నుండే సాహిత్య అభిరుచి, సామాజిక చైతన్యం...

పి.చంద్, కార్మిక అనే కలం పేరుతో సుప్రసిద్ధిడైన వూరుగొండ యాదగిరి 11-09-1954న వరంగల్‌లో అజాం జాహి బట్టల మిల్లు వరంగల్ కార్మిక కుటుంబంలో ఉరుగొండ మల్లయ్య, వీరమ్మ దంపతులకు మూడో సంతానంగా జన్మించారు. 1975లో బి.కాం. చేశారు. నిరుద్యోగంలో రకరకాల వృత్తులు చేసి 1977 మే నెలలో సింగరేణి కాలరీస్ గోదావరి ఖనిలో క్లర్క్ ఉద్యోగంలో చేరారు. 2009లో విఆర్ఎస్‌లో భాగంగా రిటైర్ అయ్యారు.

హైస్కూల్ విద్యార్థి దశ నుండి యాదగిరి సాహిత్యంపట్ల ఆసక్తి పెంచుకున్నారు.



కాలేజీ విద్యార్థి దశలో ఎమర్జెన్సీలో డిఐఆర్ కింద 2 నెలల పాటు లాకప్‌లో, ఆ తర్వాత జైలు జీవితం అనుభవించారు. యాదగిరి సాహిత్య సంపర్కం పెరిగినప్పటి నుంచి ప్రేమ్‌చంద్‌ను బాగా అభిమానించారు. ఎంతగా అభిమానించారంటే తన కొడుకుకు ప్రేమ్‌చంద్ అని పేరు పెట్టడంతోపాటు, తన కలం పేరును పి.చంద్ అని స్థిరపరచుకున్నారు. పి చంద్ అంటే ప్రేమ్‌చంద్ అని ఉద్దేశ్యం.

## కలం పేర్ల ప్రయోజనాలు, నష్టాలు

వూరుగొండ యాదగిరి చేస్తున్న ఉద్యోగంలోని చిక్కులవల్ల సింగరేణి కాలరీస్ గురించి, బొగ్గు గనుల గురించి, అందులో పని చేసే కార్మికుల గురించి, యాజమాన్యం తీరుతెన్నుల గురించి, కార్మికుల సమస్యలు, స్థితి గతుల గురించి బయటి ప్రపంచానికి తెలిపే రచనలు చేస్తున్నప్పుడు అనేక కలం పేర్లను ఉపయోగించారు. వాటిలో కార్మిక, వి.హరి, పి.చంద్, చంద్రశేఖర్, ఉదయగిరి, కె.రమాదేవి మొదలైన కలం పేర్లు ముఖ్యమైనవి. మరికొన్ని కలం పేర్లతో రాయడంతోపాటు ఘోస్ట్ రైటర్‌గా ఇతరుల పేరిట కూడా అనేక రచనలను సరిచేయడం, రాసి ఇవ్వడం చేశారు. యాదగిరి ఎప్పుడూ కీర్తి కోసం పాకులాడలేదు. ప్రజల గురించి, ప్రజల సమస్యల గురించి పది మందికి తెలియాలని తాపత్రయం తప్ప, సాహిత్యంలో తన పేరు చిరస్థాయిగా ఉండి పోవాలని కోరుకోలేదు. అందువల్ల ఒకే కలం పేరుతో కాకుండా అనేక కలం పేర్లతో రాసుకుంటూ వచ్చారు. అనేక కలం పేర్ల వల్ల మూడు దశాబ్దాలుగా ఉరుగొండ యాదగిరి గారికి సాహిత్యంలో సముచిత స్థానం లేకుండా పోయింది. ఎన్నో కలం పేర్లతో రాసిన రచయిత ఒక్కరేనని అది ఉరుగొండ యాదగిరి అని, అతని ప్రధాన కలం పేరు పి.చంద్, కార్మిక అని సాహిత్య వేత్తలకు, పాఠకులకు తెలిసినప్పుడు అవి అన్నీ రాసింది ఇతనేనా? ఒక్కడే ఇంత వైవిధ్య పూరితమైన రచనలు చేశారా? అని ఆశ్చర్యం పోక తప్పదు. ఇలా కలం పేర్లతో ఒక ప్రయోజనాన్ని ఆశిస్తే సాహిత్య చరిత్రకు మరెంతో నష్టం కూడా జరిగిపోతుంది.

## విప్లవ ఉద్యమాల నేపథ్యం

1962లో ఇండియా, చైనా మధ్య యుద్ధం జరిగింది. దానిపై చర్చ సాగి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోని నాయకత్వ విభేదాలు బయటపడ్డాయి. వ్యక్తిగత విభేదాలకు ఆ చర్చ సైద్ధాంతిక రూపం ఇవ్వడానికి ఉపకరించింది. అలా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1964లో సిపిఐ, సిపిఎంగా చీలి పోయింది. సిపిఎంలో యువతరం ఎంతో కాలం ఇమడలేక పోయింది. సిద్ధాంతాలు చెప్పడానికి క్షేత్ర స్థాయిలో పని చేయడానికి మధ్య చాలా అంతరం గమనించారు. దాంతో యువతరం, రెండో శ్రేణి నాయకత్వం ఎక్కడికక్కడ సిపిఎంలో ఉంటూనే క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు ప్రారంభించారు. అలా బీహార్, ఉత్తరప్రదేశ్,

మధ్యప్రదేశ్, కాశ్మీర్, బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో ప్రజలను వారి సమస్యలపై సమీకరించి ఉద్యమించారు.

1967లో సిపిఎం పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో సిపిఎంలో జిల్లా నాయకులుగా పని చేస్తున్న చారు మజుందార్, సరోజ్‌దత్తా, స్థానిక సంతాల్ గిరిజనుల నాయకత్వంలో నక్సల్‌బరీ పేరిట ప్రాచుర్యం పొందిన ఉద్యమం సాగింది. దానిని సిపిఎం ప్రభుత్వం రక్తపుటేరులో ముంచింది. నక్సల్‌బరీ ఉద్యమ పంథాతో ఏకీభవించే వారు కలిసి సిపిఐ (మార్క్సిస్ట్, లెనినిస్ట్) గ్రూపులుగా ఏర్పడుతూ వచ్చారు. శ్రీకాకుళంలో ఆ ప్రేరణతో శ్రీకాకుళ ఉద్యమం సాగింది. కాసు బ్రహ్మానంద రెడ్డి, జలగం వెంగళరావు ఆ ఉద్యమాన్ని రక్తపుటేరులో ముంచారు.

## ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభావం

అదే సమయంలో తెలంగాణలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 1968 నుంచి తెలంగాణ సేఫ్ గార్డ్స్, ఆంధ్ర గో బ్యాక్, జై తెలంగాణ అనే మూడు దశల్లో ఉద్యమం సాగి, 1969లో మహోధృతంగా వెల్లువెత్తింది. విద్యార్థులు, యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి ఉద్యమించిన ఆ ఉద్యమం ప్రపంచ చరిత్రలోనే ఒక మైలు రాయి. విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం నష్టపోయినా, అందుకు ఎవరూ చింతించ లేదు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా సమైక్యత పేరిట 370 మంది విద్యార్థి, యువకులను పోలీస్ కాల్పుల పేరిట చంపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చైతన్యం పొందిన, విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు... సీమాంధ్ర వలస వాద దోపిడి, అణిచివేత నుండి దృష్టి మరల్చి స్థానిక భూస్వాముల దోపిడి అణిచి వేతకు వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించారు.

అలా బ్రిటీష్ ఆంధ్ర వలసాధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చైతన్యం మలుపు తిరిగి, ఒకే ప్రాంతంలోని రెండు వర్గాల మధ్య అంతర్గత పోరాటంగా, వర్గ పోరాటంగా సిద్ధాంతీకరించ బడింది. అలాంటి సిద్ధాంతానికి బ్రిటీష్ ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్ట్ నక్సలైట్ నాయకులే రూపం ఇచ్చారు. వారి సిద్ధాంతంలో సీమాంధ్ర వలసాధిపత్యానికి అనుకూలంగా ఉండడానికే 'ఆంధ్రా గో బ్యాక్' ఉద్యమాన్ని తెలంగాణ లోని భూస్వామ్య వ్యతిరేక ఉద్యమంగా మలిచి దశాబ్దాల పాటు తెలంగాణ అంతస్సఘర్షణలో కూరుకుపోయి, వెనుకబడిపోతూ రావడానికి కారణమైందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉద్యమంలో 1995 నుండి నూతన దృక్పథం ప్రవేశించింది.

## నక్సల్‌బరీ శ్రీకాకుళం స్ఫూర్తితో ఉత్తర తెలంగాణ విప్లవ సాహిత్యం...

ఇది ఇలా ఉండగా నక్సల్‌బరీ, శ్రీకాకుళ ఉద్యమం అణిచివేయబడి, బలహీన



పడిన తర్వాత ఉత్తర తెలంగాణాలో 1969 నుండి కొందరు విప్లవ సిద్ధాంతంతో యువకులను సమీకరించారు. అలా 1970 నుండి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుండి దండకారణ్యంగా విప్లవోద్యమాలు విస్తరించాయి. ఆ క్రమంలో తెలంగాణ నుండి ఎంతో సాహిత్య సృజన జరుగుతూ వచ్చింది. పాట, కళా రూపాలు, ప్రసంగం, కరపత్రాలు, వ్యాసాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపుల నినాదాలు, వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్స్ ప్రజలను ఎంతగానో చైతన్యం చేశాయి.

ఆ క్రమంలో కథలు, నవలలు కూడా వేగం పుంజుకున్నాయి. కథలు, నవలల్లో తొలి దశలో జ్వాలాముఖి, చెరబండ రాజు, తాడిగిరి పోతరాజు, తిరుపతయ్య, నిఖిలేశ్వర్, అంపశయ్య నవీన్ మొదలైనవారు రచనలు చేశారు. బ్రిటిషాంధ్ర ప్రాంతం నుండి ఉత్తర తెలంగాణ విప్లవోద్యమానికి అనేక మంది రచయితలు మద్దతుగా నిలిచారు. ముఖ్యంగా శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, కెవిఆర్, త్రిపురనేని మధుసూధనరావు, చలసాని ప్రసాద్, రావి శాస్త్రి, కాళీపట్నం రామారావు, నగ్నముని మొదలైన రచయితలు నక్సలైట్ ఉద్యమాలకు మద్దతునిచ్చే క్రమంలో తెలంగాణ విప్లవోద్యమాలకు కూడా వారి మద్దతును విస్తరించారు. 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. అదే క్రమంలో పౌర హక్కుల ఉద్యమాలు, విద్యార్థి, యువజన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి.

## తెలంగాణ విప్లవోద్యమ సాహిత్యానిది ఒక ప్రత్యేక చరిత్ర...

తెలంగాణ నుండి కొత్త తరం రచయితలు ఎదగడానికి, తెలంగాణ విప్లవోద్యమం ఒక అవసరాన్ని, సందర్భాన్ని సృష్టించింది. విప్లవోద్యమ అవసరాలు, విప్లవ రచయితలను ప్రోత్సహించాయి. విప్లవించే ప్రజలను సాహిత్యంలో చిత్రించాలనే ఆసక్తి పెరిగింది. అందులో రెండు అంశాలు ఇమిడి ఉండేవి. తెలంగాణ ప్రాంత జీవితాల్ని సాహిత్యీకరించాలనే లక్ష్యం ఒకటి. అందులో భాగంగా తెలంగాణ భాష, సంస్కృతి, మానవ సంబంధాలు రికార్డు చేయడం. రెండోది విప్లవోద్యమానికి, విప్లవించే ప్రజలకు మద్దతునిస్తూ, సమాజంలో విప్లవం పట్ల అవగాహన పెంచడం, స్ఫూర్తిని అందించడం.

ఆ క్రమంలో ఎందరో పాటలు, కవితలు, కథలు, నవలలు, వ్యాసాలు రాశారు. కొన్ని పత్రికలు కూడా ప్రత్యేకంగా వెలువడుతూ వచ్చాయి. అలా ఉత్తర తెలంగాణ విప్లవోద్యమం ఒక ప్రత్యేక నిర్దిష్ట విప్లవ సాహిత్యంగా ఎదుగుతూ వచ్చింది. 1975 జూన్ 25 నుండి 1977 ఫిబ్రవరి దాకా ఎమర్జన్సీ చీకటి రోజులు. 1977 మార్చిలో జనతా పార్టీ నాయకత్వంలో ఐదారు పార్టీల ఐక్య సంఘటనతో కేంద్రంలో జనతా ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. దేశ వ్యాప్తంగా ప్రజా స్వామ్య ఉద్యమాలు వువ్వెత్తున ఎగిసాయి. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు, యువకులు 'గ్రామీణ ప్రాంతాలకు తరలండి' అనే కార్యక్రమం

తీసుకున్నారు. గ్రామాల్లో వారి మాటలకు, పాటలకు ప్రజలు ఉత్తేజితులయ్యారు. 1969 నుండి ఉద్యమకార్యకర్తలుగా, నాయకులుగా పని చేస్తున్నవారి ఆశలు ఫలించాయి. రైతాంగం కదలబారింది. 'జగిత్యాల జైత్రయాత్ర' పేరుతో ప్రసిద్ధి పొందింది. త్వరలోనే కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాలుగా విస్తరించింది. తర్వాత దండకారణ్యం, గెరిల్లా జోన్ విముక్తి ప్రాంతం అని లక్ష్యాన్ని నిర్ణయించుకుంది.

ఈ క్రమంలో ఉద్యమాలపై నిర్బంధాలు పెరిగాయి. శత్రువులు చొరలేని లోతట్టు ప్రాంతాలకు ఉద్యమం విస్తరించాలని, అది రక్షణ కవచంగా ఉంటుందని ఉద్యమకారులు భావించారు. అలా ఇతర ప్రాంతాలకు విస్తరించిన క్రమంలో స్థానిక ప్రజల సమస్యలను అధ్యయనం చేస్తూ, వాటి పరిష్కారానికి ఆందోళనలు, ఉద్యమాలు, ప్రచారం చేపట్టారు. సమాజంలోని అనేక సెక్షన్ల ప్రజలు ఈ ఉద్యమాల పట్ల ఆకర్షితులయ్యారు. ఉద్యమాల్లో కలిసివచ్చే ప్రజల గురించి, కలిసి రావలసిన ప్రజల గురించి అనేక పాటలు, ప్రసంగాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు వందలు వేలు... లెక్కలేనన్ని... ఆ క్రమంలో కొందరు రచయితలు కథలు, నవలల్లో వీటిని చిత్రించడం వేగం పుంజుకుంది. అలా జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండ రాజు, సిహెచ్ మధు, అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, లక్ష్మీ, కె.రామ్మోహన్‌రాజు, తదితరులు కథలు, నవలలు రాశారు. 'సృజన' మాస పత్రిక ఉద్యమ సాహిత్యానికి వేదికయ్యింది. విప్లవ రచయితల సంఘం అధికార మాస పత్రిక 'అరుణతార', రత్నమాల సంపాదకత్వంలో వెలువడిన 'నూతన' మాస పత్రిక, రంగనాయకమ్మ సంపాదకత్వంలో వెలువడిన 'ప్రజా సాహితి' మాస పత్రిక ఉద్యమ సాహిత్యానికి పెద్ద పీట వేశాయి.

అలా ఎమర్జెన్సీ తర్వాత విప్లవోద్యమాల్లో, విప్లవ సాహిత్యంలో ఒక నూతన దశ ప్రవేశించింది. 'జ్వాలాముఖి', 'వేలాడే మందారం', 'చెరబండరాజు', 'మాపల్లె', 'ప్రస్థానం', 'సిహెచ్ మధు', 'తూర్పు ఎరుపులో మహిళ' (స్వాతి మాస పత్రికలో) మొదలైన నవలలు రాశారు. ఈ ఉద్యమాల నేపథ్యంలో, తెలంగాణ రైతాంగ ఉద్యమాల గత చరిత్ర గురించి కూడా అనేక నవలలు, కథలు వెలువడ్డాయి. దాశరథి రంగాచార్య ఎన్నో నవలలు రాశారు. సరిపెల్లి కృష్ణారెడ్డి 'ఉప్పెన' నవల ఆంధ్రజ్యోతి వీక్లీలో సీరియల్‌గా ప్రచురించబడింది. పుచ్చలపల్లి సుందరయ్య నైజాం కాలం నాటి 'తెలంగాణ ఉద్యమం' గురించి 'విప్లవ గుణపాఠాలు' పేరుతో పుస్తకం తెచ్చారు. ఇలా విప్లవోద్యమం తన సాహిత్యంతో పాటు, గత చరిత్రను తిరిగి చర్చనీయాంశం చెయ్యడానికి, రికార్డ్ చెయ్యడానికి ఎంతగానో ఉపయోగపడింది. అల్లం రాజయ్య రాసిన 'కొలిమి అంటుకున్నది' నవల 'సృజన' మాస పత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఆయన రాసిన కథలు ఉద్యమించే కార్యకర్తలకు, ప్రజలకు స్ఫూర్తిని ఇచ్చాయి. అంపశయ్య నవీన్ 'చీకటి రోజులు', ఎమర్జెన్సీ



గురించి నవల రాశారు. ఎమర్జెన్సీలోని ఘోరాలు గురించి ఎన్నో రచనలు వెలువడ్డాయి. మేరీటేలర్ రాసిన 'భారతదేశంలో నా జైలు జీవితం', స్నేహలతా దేవి 'స్మృతి' మొదలైనవి బాగా చర్చనీయాంశం అయ్యాయి.

1970 నుండి విప్లవ రచయితల సంఘం, 1972 నుండి జననాట్య మండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, జనసాహితి తదితర సంస్థలు ఉద్యమ సాహిత్యాన్ని విభిన్న ప్రక్రియల్లో ప్రచారం చేశారు. అలా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కథలను వెలికి తీసి, వాసిరెడ్డి నవీన్1983లో తన సంపాదకత్వంలో సంకలనాలు వెలువరించారు. ఆనాటి ఉద్యమకారుల గురించి గంగినేని తదితరులు రాసిన గాథలను విశాలాంధ్ర వారు పుస్తకాలుగా వెలువరించారు. స్త్రీ శక్తి సంఘటన, తదితర సంస్థలు ఆనాడు ఉద్యమాల్లో పాల్గొన్న మహిళల అనుభవాలను 1985లో 'మనకు తెలియని మన చరిత్ర' పేరిట గ్రంథస్థం చేశారు. 1980 నుండి సాహు, 'సాధన', భట్టాచార్య. పి.చంద్ తదితరులు ఆది వాసీ జీవితాలను కథలుగా, నవలలుగా మలిచారు.

ఉత్తర తెలంగాణలో ఉద్యమిస్తున్న ప్రజల గురించి ఇప్పటికి 300లకు పైగా కథలు, 20 దాకా నవలలు, 25 దాకా సినిమాలు వెలువడ్డాయి. విప్లవోద్యమంలో రైతు కూలీలు, విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యావంతులు, రచయితలు, కళాకారులు, ప్రజాస్వామిక వాదులు, సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, బీడి కార్మికులు మొదలైన అనేక సెక్షన్లు కలిసి నడిచారు. తమ సమస్యల కోసం ఉద్యమించారు. దీన్ని కార్మిక, కర్షక, విద్యార్థి యువజన, మేధావి ఐక్యత అని ప్రచారం చేశారు. గ్రామీణ రైతు కూలీల గురించి, వారి ఉద్యమాల గురించి తాడిగిరి పోతరాజు, తిరుపతయ్య, చెరబండ రాజు, లక్ష్మీ, అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, పి.చంద్ యాదగిరి, కాలువ మల్లయ్య, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, కె. రామ్మోహన్‌రాజు మొదలైన రచయితలు అనేక కథలు రాశారు. పులుగు శ్రీనివాస్, అక్కినేని కుటుంబరావు, జాతశ్రీ, ఆడెపు లక్ష్మీపతి, కార్మిక వర్గం గురించి ప్రత్యేక దృష్టితో కథలు, నవలలు వెలువరించారు.

### కార్మిక వర్గ విప్లవ సాహిత్యంలో పూరుగొండ యాదగిరి ఒక మహోన్నత శిఖరం

తెలంగాణ విప్లవోద్యమంలోని కార్మిక వర్గ సాహిత్యంలో పూరుగొండ యాదగిరి ఒక మహోన్నత శిఖరం. రాష్ట్రంలో తెలంగాణ కార్మికుల గురించి ఇంత విస్తారంగా రాసినవారు ఎవరూ లేరు. పి.చంద్ తన తొలి కథను 'కార్మిక' అనే కలం పేరుతో 1981లో 'సమ్మె' అనే కథ రాయడం జరిగింది. అది సింగరేణి కార్మికుల గురించిన కథ. అప్పటి నుండి పి.చంద్ యాదగిరి సింగరేణి కార్మికుల గురించి, బొగ్గు గనుల గురించి, ప్రభుత్వాల పాలసీల గురించి, యాజమాన్యాల గురించి, వేజ్ బోర్డుల గురించి

పలు కలం పేర్లతో ఫిక్షన్, నాన్ ఫిక్షన్ రచనలు ఎన్ని చేశారో లెక్కలేదు. నిర్బంధం రీత్యా తాను కూడా ఆయా రచనల గురించి రికార్డు చేసిపెట్టుకోలేదు.

పూరుగొండ యాదగిరి వందకు పైగా కథలు రాశారు. పదిదాకా నవలలు రాశారు. 'సమ్మె కథలు', 'భూ నిర్వాసితులు', 'జులుం కథలు' అనే పేరిట మూడు కథా సంపుటాలు వెలువడ్డాయి. 'గుమ్మన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్థుడు' అనే ఈ కథల సంపుటి ఆ క్రమంలో నాల్గవ కథా సంపుటి. ఈయన కథలు అనేక కథా సంకలనాల్లో చోటు చేసుకున్నాయి. కరీంనగర్ బుక్ ట్రస్ట్ 1983లో ప్రచురించిన 'బొగ్గు పొరల్లో', 1984లో ప్రచురించిన 'అడవిలో వెన్నెల' కథా సంపుటిలో, 1990లో వెలువడిన 'భూమిక' కథల సంపుటిలో, 1998లో వెలువడిన 'ఆధునిక కథా సరిత్సాగరం' కథా సంపుటాల్లో, 1989లో వెలువడిన నేల తల్లి విముక్తి కోసం 'జనజీవన పోరాట కథలు' సంపుటాల్లో 'అరుణతార' అనే కథల సంపుటాల్లో చేర్చబడ్డాయి. 2011లో తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన 'నూరేళ్ళ కథ' సంపుటిలో 'భూనిర్వాసితులు' కథ చేర్చబడింది.

యాదగిరి రాసిన వందకు పైగా కథల్లో ప్రస్తుతం 60 కథలు, వాటి వివరాలు దొరుకుతున్నాయి. మిగతా కథలను గుర్తుచేసుకొని సేకరించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఈయన రచనలు 10 ఫిక్షన్ పుస్తకాలు, 20 నాన్ ఫిక్షన్ పుస్తకాలు వెలువడ్డాయి. 1980-2010 మధ్య 30 ఏళ్లలో విప్లవ సాహిత్యం గురించి యాదగిరి రాసిన 'వస్తు వైవిధ్యం' ప్రత్యేకమైనది. నేను పాలమూరు లేబరు గురించి, విద్యార్థులు గురించి, బీడి కార్మికుల గురించి రాయడం ప్రారంభించి తర్వాత గ్రామీణ రైతు కూలీలు గురించి, వారి ఉద్యమాల గురించి, యువజనుల గురించి, విప్లవకారుల గురించి, ఉద్యమం తీరుతెన్నులు గురించి, వాటి లోతుపాతుల గురించి, ఆదివాసీల పోరాటాల గురించి, ఉద్యమంలోని మహిళల గురించి విప్లవ కథలు రాశాను. అల్లం రాజయ్య రైతు కూలీల గురించి ప్రధానంగా రాస్తూ గ్రామీణ పరిణామాలను చిత్రించారు. కొన్ని సింగరేణి కార్మికుల గురించి కూడా రాశారు. ఆదివాసీల గురించి కూడా కొన్ని కథలు రాశారు. ఉరుగొండ యాదగిరి రాసిన కథలు మేము రాసిన కథలకు డూప్లికేట్ గాని, కొనసాగింపు గాని కావు. అవి మేము రాయలేక పోయిన కోణాలను, ఉద్యమాలను, ప్రజలను, సింగరేణి కార్మికులను, భూ నిర్వాసితులను, ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులను, ఆదివాసి పోరాటాలను, కార్యకర్తలను మాయం చేసే నిర్బంధాలను గురించి రాసిన కథలు ఆయన ప్రత్యేక కథావస్తువును, శైలి, శిల్పాన్ని తెలుపుతాయి.

అనేక కలం పేర్లతో రాసిన కారణంగా యాదగిరి గారికి రచయితగా సాహిత్య చరిత్రలో సముచిత స్థానం లభించినట్లు లేదు. ఈయన రాసిన రచనలు తెలుసు, కాని అవి ఇతడే రాశాడని చాలా మందికి తెలియదు. అందువల్ల సాహితి వేత్తలు, సాహితి చరిత్ర కారులు యాదగిరిని ఒక గొప్ప విప్లవ రచయితగా, ప్రజల జీవితాన్ని, ఉద్యమాలను, సాహితీకరించిన గొప్ప సాహితీ వేత్తగా గుర్తించ లేకపోయారు. నిర్బంధాల వల్ల కలం పేర్లు పెట్టుకోవాల్సి వచ్చింది. కలం పేర్ల వల్ల ఒకే రచయిత ఇన్ని రచనలు చేశారని సాహిత్యానికి తెలియకుండా పోయింది. ఇన్ని రచనలు చేశాడని తెలపడానికి ఆయన తన సింగరేణి ఉద్యోగం నుండి రిటైరయ్యేదాకా సాధ్యపడలేదు. ఒక వైపు యాజమాన్యం, మరోవైపు ప్రభుత్వ నిర్బంధాలు కారణంగా యాదగిరి రచయితగా గుప్తంగా ఉండిపోవాల్సి వచ్చింది. నిర్బంధాల కారణంగా మరెన్నో రచనలు చేయగలిగి ఉండి, చేయలేకపోయారు. పత్రికలు ప్రచురణ సంస్థలు ప్రచురించే అవకాశం ఉంటే మరెన్నో రచనలు వెలువడి ఉండేవి.

ఈ లోపాన్ని గమనించి నేను, నిజాం వెంకటేశం కలిసి కరీంనగర్ బుక్ ట్రస్ట్ పేరిట 'భూమి', 'బ్రతుకుపోరు', 'బొగ్గు పొరల్లో', 'అడవిలో వెన్నెల' కథా సంపుటాలు, నవల ప్రచురించాం. 1982 నుండి ప్రారంభించిన ఈ ప్రచురణలు నేను రహస్య జీవితంలోకి వెల్లడంతో ఆగిపోయాయి. 'అడవిలో వెన్నెల' కథా సంపుటి వెలువడడంలో ఆర్కే తదితర మిత్రులు కూడా సహకరించారు. ఆనాటి విప్లవ సాహిత్యంలో ఈ నాలుగు పుస్తకాలు మైలు రాళ్లుగా నిలిచిపోయాయి. వీటిపై ఎంఫిల్ పరిశోధనలకు కూడా వెలువడ్డాయి. పి.చంద్ రచనలపై ఎంఫిల్ గాని, పిహెచ్‌డి గానీ రాకపోడానికి ప్రధాన కారణం ఆయన రచనలన్నీ ఒక్కచోట ఒకే రచయిత రచనలుగా గ్రంథస్థం కాకపోవడమే. ఎంతో వస్తు వైవిధ్యంతో వేల పేజీల రచనలు చేసినప్పటికీ, రచయిత ఒక్కరే అన్న విషయం తెలియకపోవడం వల్ల ఇలా జరిగింది. అందుకే వారి రచనలను ప్రస్తుతం గ్రంథ రూపంలో తీసుకురావడం జరుగుతున్నది.

## వస్తు వైవిధ్యంలో అనితర సాధ్యుడు

'సమ్మె' కథా సంపుటిలో యాదగిరి సింగరేణి కార్మికుల జీవితాలను, సమస్యలను, ఉద్యమం యొక్క తీరుతెన్నులను చిత్రించారు. 'భూ నిర్వాసితులు' సంపుటిలోని అనేక కథల్లో ఓపెన్ కాస్ట్ సింగరేణి బొగ్గు గనులను, సిమెంట్ ఫ్యాక్టరీలను, వాటివల్ల పర్యావరణం, ప్రజల జీవితాలు నాశనమౌతున్న తీరును అపూర్వంగా చిత్రించారు. 'జులుం' సంపుటిలో ఉద్యమాలపై కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల నిర్బంధాలను, ప్రజల కష్టాలను, సమస్యలను చిత్రించారు. సింగరేణి బొగ్గు గని కార్మికుల గురించి, సింగరేణి కార్మిక సమాఖ్య గురించి యాదగిరి చేసినన్ని రచనలు, కథలు మరెవ్వరూ చేయలేదు. ఫిక్షన్, నాన్ ఫిక్షన్ రెంటినీ సవ్యసాచిగా సంధించి లోకానికి సింగరేణి లోతుపాతులను తెలిపిన రచయిత, వ్యాసకర్త యాదగిరి. ఈ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పిట్టల రవీందర్,

ఎం.డి. మునీర్ వంటి రచయితలు, జర్నలిస్టులు సింగరేణి గురించి విస్తారంగా రాస్తున్నారు. కోల్ బెల్ట్ ఏరియాలో పిట్టల రవీందర్ ప్రత్యేకంగా 'చర్చ' అనే పత్రికను కూడా వెలువరిస్తున్నారు. ప్రస్తుతం వార పత్రికగా వెలువడుతున్న 'చర్చ' కొంత కాలం దిన పత్రికగా వెలువడింది. అప్పుడు సింగరేణి కార్మికోద్యమ తొలి నాయకుడైన శేషగిరి జీవితాన్ని 1940–1950 మధ్య జరిగిన సింగరేణి కార్మికుల ఉద్యమాలను శేషగిరి నవలలో రాయగా, డైలీ సీరియల్‌గా ప్రచురించారు. శేషగిరి నవల డైలీ సీరియల్‌గా ప్రచురిస్తున్నప్పుడు వేలాది మంది కార్మికులు బొగ్గు బావుల వద్ద ఆ పత్రిక ఎప్పుడు వస్తుందని ఎదురు చూసేవారు.

## జీవిత చరిత్ర రచనలో చెయ్యి తిరిగిన రచయిత

అలా పూరుగొండ యాదగిరి 'శేషగిరి' నవల 2001 లో పుస్తకంగా వెలువడింది. అంతర్జాతీయ కార్మిక యోధుడు కె.ఎల్. మహీంద్ర జీవితాన్ని, ఉద్యమాలను గురించి రాసిన గ్రంథం 2007లో వెలువడింది. హక్కుల యోధుడు బాలగోపాల్ పేరిట కోల్ బెల్ట్ ఏరియాలో బాల గోపాల్ చేసిన పర్యటనల ఆధారంగా ఆనాటి ఉద్యమాలను, పరిణామాలను బాల గోపాల్ కృషిని విశ్లేషించారు. అలా 'ఒక కన్నీరు' నవలలో పది మంది కార్మికులు బొగ్గు గనుల్లో చనిపోయిన దుర్ఘటన సందర్భంగా సింగరేణి కార్మిక జీవితాలను, విషాదాలను నవలికగా చిత్రించారు. 'విప్లవాగ్ని', 'నెత్తుటిధార', 'భూదేవి', స్ట్రైక్ తదితర నవలలను, జీవిత చరిత్రలను రాశారు.

మరో విశేషమేమంటే బండ్రు నర్సింహులు గారి జీవిత చరిత్రను నవలీకరించే క్రమంలో ఆయన జీవితం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి ప్రారంభమై నక్సల్‌బరీ పోరాటంలో రైతు కూలి సంఘం నాయకుడుగా చివరి దాకా క్రియా శీలంగా సాగిన క్రమం కారణంగా, 60 ఏళ్ల తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు 1990 దాకా సాగిన విప్లవోద్యమాల చరిత్రను ఒకే జీవితంలో, ఒక పరిణామ క్రమంలో చిత్రించే అరుదైన అవకాశం కలిగింది.

ఇలా యాదగిరి మాతరంలో, మా సమకాలికుల్లో మేమెవరమూ చేయలేని గొప్ప కర్తవ్యాన్ని నిర్వర్తించారు. చారిత్రక వ్యక్తుల జీవిత చరిత్రలను నవలలుగా రాయడం అంత సులభమేమి కాదు. వ్యక్తి జీవితంతోపాటు సమాజం, ఉద్యమాల నేపథ్యం, సమకాలికుల సంబంధాలు, ప్రభావాలు, కలిసి ఉంటాయి. వాటన్నింటిని అధ్యయనం చేసి చారిత్రక వ్యక్తుల జీవితాలను నవలీకరించడం అసిధారావ్రతం. ఆ పనిలో నైపుణ్యం సాధించిన యాదగిరి తన రచనల ద్వారా సాహిత్యంలో చిరంజీవి. కాలం గడిచిన కొద్దీ కాల నాళికలా ఉపయోగపడే రచనలు చేసిన యాదగిరి ధన్యజీవి.



## పి.చంద్ యాదగిరి సాహిత్య విశిష్టత ఏమిటి?

మేము సామాజిక పరిణామాలను కాల్పనిక సాహిత్యంగా, ఫిక్షన్‌గా రాస్తే, యాదగిరి సామాజిక చరిత్రను పరిణామాలను ఫిక్షన్ రూపంలో చరిత్రను రాయగలిగారు. మేము కొన్ని రచనలు మాత్రమే ఇలా చేయగలిగాము. కాని యాదగిరి రచనల్లో ఎక్కువ పాళ్లు సమకాలీన చారిత్రక రచనలే. నిజ జీవితాల వాస్తవిక చిత్రణలు. అందువల్ల యాదగిరి రచనలు సాహిత్యంలో భాగంగా నిక్షిప్తమైన చారిత్రక ప్రాధాన్యతగల ఐతిహాసిక రచనలుగా ప్రాధాన్యత సంతరించుకొన్నాయి. ఇందులోని కథలు కూడా అలాంటి చారిత్ర నేపథ్యం గల కథలే.

## ఈ కథల సంపుటిలోని వస్తువైవిద్యం, శిల్ప వైవిద్యం

ఈ సంపుటిలోని 'ప్రజాస్వామ్యం' కథ... ఎన్నికల డ్యూటీకి వెళ్లే ప్రభుత్వ ఉద్యోగి తరపున ఉత్తమ పురుష కథనంగా సాగుతుంది. ఎన్నికల కోసం జోనల్ కేంద్రం నుండి ఎన్నికల సరంజామ సంచుల్లో సదురుకుని లారీలో ఎన్నికల అధికారులు కలిసి బయలు దేరడంతో కథ ప్రారంభమౌతుంది. ఎక్కడో అడవిలో ప్రజల దగ్గరికి ఎన్నికల బ్యాలెట్ల పేపర్లు, బాక్సులు తీసుకుపోవడం ఎలా సాగుతుందో ఈ కథలో చూడవచ్చు. ఎన్నికల ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకొనే ప్రక్రియలో ఎంత పకడ్బందీ ఏర్పాట్లు ఉంటాయో ఈ కథ చదివితే తెలుస్తుంది. మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి భారత రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ఎన్నికల కమీషన్ ఎంత కృషి చేస్తాయో ఈ కథలో చూడవచ్చు.

అయితే ఉద్యోగస్తులు ఎన్నికల అధికారులుగా ఒక్కసారి అడవుల్లో డ్యూటీ చేయడానికే ఎంత చిరాకు పడుతుంటారో, అసౌకర్యాలకు ఎంత విసుక్కుంటారో, మధ్యతరగతి మనస్తత్వం ఎలా ఉంటుందో ఈ కథలో చక్కగా చిత్రించారు. ఆ మారుమూల గ్రామాల్లో కూడా ఆ ఊరి పటేల్ ఎంత ఆత్మీయంగా మర్యాదలు చేస్తారో చిత్రించారు. ఆ ఊర్లలోకి సాధారణంగా ఫారెస్ట్ జీపులో, పోలీస్ జీపులో తప్ప, ఎన్నికల ప్రచారం జరిగినప్పుడు కూడా సరిగ్గా రావు. ఈ కథలో అడవుల్లో జీవిస్తున్న ప్రజల జీవితాలను, మధ్యతరగతి ఎన్నికల అధికారి దృక్పథం నుండి చిత్రించారు.

ఆ ప్రాంతంలో ఎన్నికలను బహిష్కరించాలని ఉద్యమకారులు ప్రచారం చేశారు. వారి పిలుపును కాదని కొన్నైనా ఓట్లు వేయించాలని ప్రభుత్వం పోలీసులను పురి కొల్పింది. దాంతో ఒకటి, అర ఓట్లతో మొత్తానికి 24 ఓట్లు పోలైనాయి. సాధారణంగా ఒక పోలింగ్ బూత్‌లో 800 మంది ఓటర్లుంటారు. కానీ ప్రజలు ఓట్లు వెయ్యడానికి ముందుకు రాలేదు. మొత్తానికి పోలీసుల సహకారంతో, ఊరి వారి సహకారంతో బ్యాలెట్ బాక్సులతో సహా

ఎన్నికల అధికారులు తిరుగు ప్రయాణమవడంతో కథ ముగుస్తుంది.

**ఆదివాసీల అమాయకత్వాన్ని దోపిడీ చేసిన తీరు అనామతు ఖాతా...**

'అనామతు ఖాతా' కథలో షావుకారికి బాకీ మొత్తం చెల్లించినా సరే అనామతుగా ఐదు రూపాయలు బాకీ ఉన్నట్లు ఊరకే రాసిపెడతానని అంటాడు. ఆ తర్వాత ఎంత కథ జరిగిందో షావుకారు చేసిన మోసం ఏమిటో, గిరిజన ప్రజలు ఎంత అమాయకంగా, నిస్సహాయంగా జీవిస్తున్నారో ఈ కథలో తెలుపుతారు. వాస్తవిక సంఘటనకు ఇది కథా రూపం. విప్లవ కారులు, ఆదివాసి జీవితాలను అధ్యయనం చేస్తూ, వారి సమస్యలను పరిష్కరించే క్రమంలో ఎన్నో ఉద్యమాలు చేసారు. ఆదివాసులు కూడా చైతన్యవంతం అయ్యారు. ఉద్యమకారులు వారి జీవితాలలోకి ప్రవేశించే ముందు ఆదివాసీలను ఎలా దోపిడీ చేసేవారో ఈ కథ రికార్డు చేసింది. 'మదర్ ఇండియా' సినిమాలో మైదాన ప్రాంత దోపిడీని చిత్రిస్తే ఆదివాసీల జీవితాలను సాహు, పి.చంద్, సాధన అనేక కథల్లో చిత్రించారు. నేను కూడా 'అడవిలో వెన్నెల', 'మా బడి', 'కలిగిన వాళ్లు', 'తేనెటీగలు' తదితర కథల్లో చిత్రించాను. గిరిజనుల గురించి రాసిన కథలను ఎన్నిక చేసి, జీవన్ సంపాదకత్వంలో 2009–10 లో ప్రచురించిన 'ఇప్పపూలు' కథా సంకలనంలో ఈ 'అనామతు ఖాతా' కథను చేర్చారు.

**1984–89లో ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా గ్రామీణ ప్రజలకు చేసిందేమిటి?**

ఎన్.టి.రామారావు రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి ప్రజలకు మేలు చేశాడు. ప్రభుత్వ బడ్జెట్‌తోనే అది సాధ్యపడింది. అతని జేబులోంచి ఏమీ ఇవ్వలేదు. అతని సంపాదన అంతా, 300 కోట్లకు పైగా అతని కుటుంబానికే ధార పోశాడు. ప్రజల ప్రాణాలను తీసే హక్కు ఎన్.టి. రామారావుకు ఎలా వచ్చింది? ఎన్ని వందల మందిని చంపించాడు. ఎన్ని వేల మందిని జైలులో పెట్టించాడు? ఎన్ని లక్షల మందిని భయంకరమైన చిత్రహింసలకు గురిచేసి వాటిని భరించలేక అరబ్బు దేశాలకు వలస పోవడానికి కారకుడైనాడు. అతని కీర్తిలో ఈ మాయని మచ్చలు కనబడకుండా ఎందుకు చేస్తున్నారు? సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడం ప్రజల హక్కు. వాటిని పరిష్కరించడం ప్రభుత్వాల కర్తవ్యం. కాని ఎన్.టి.రామారావుకాని, అతని మంత్రివర్గ సభ్యులు కాని, ఉద్యమించే పేద ప్రజలపై లాఠీలు, తూటాలు ఉపయోగించారు. నేదురుమల్లి జనార్థన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కూడా ఇదే పని చేశారు. మర్రి చెన్నా రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాత్రం సుమారు రెండేళ్ళు 1989–91 మధ్య ఉద్యమించే ప్రజలను, వారి నాయకులను, చర్చలకు ఆహ్వానించారు. ఉద్యమాలను, సభలను జరుపుకునే సాపేక్షిక స్వేచ్ఛా వాతావరణం కలిగింప చేశాడు. అది కొంత



కాలమే సాగింది. ఎన్.టి.రామారావు, చంద్రబాబు నాయుడు, నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రులుగా వారి చరిత్ర రక్త చరిత్ర. ఈ రక్తసిక్త పిపాసులుగా వారు ఎలాంటి స్వభావం కలిగి ఉన్నారో ఈ సంపుటిలోని కథలు, జులుం, భూ నిర్వాసితులు, కథా సంపుటాలు తిరుగులేని విధంగా చిత్రించాయి.

**ఎన్.టి.ఆర్. ప్రయోగించిన నిర్బంధాలను చిత్రించిన సన్న జీవాలు...**

'సన్నజీవాలు' కథలో సత్యం ఉద్యమకారులు, అతని తల్లిదండ్రులు సావిత్రి, వెంకట శాస్త్రి, సత్యంను కేసులు పెట్టి జైల్లో పెట్టారు. ఎన్నో కష్టాలు పడి, బెయిల్ పిటీషన్ వేసి, బెయిల్ సాధించి, షూరిటీలను సమకూర్చుకుని, వరంగల్ సెంట్రల్ జైలు వద్ద విడిపించుకోవడానికి వస్తారు. అక్కడే పొంచివున్న సివిల్ పోలీసులు సత్యం జైలు నుండి బయటకు రావడంతోనే పట్టుకొని పోతారు. ఆ తర్వాత ఏమైనాడో తెలియదు. ఇలా ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా 1984–89 మధ్య వందదాకా విప్లవ కార్యకర్తలను, మిలిటెంట్లను అరెస్ట్ చేసి అడ్రస్ తెలియకుండా మాయం చేశారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు ప్రకటించిన వారిలో కూడా వీరి గురించి వివరాలు లేవు. ఇలా మాయం చేయబడిన వారి గురించి, వారి తల్లిదండ్రుల ఆవేదన గురించి, విషాదాల గురించి 'సన్న జీవాలు' కథ చిత్రించింది. ఈ కథా, కథన శిల్పం తల్లిదండ్రుల కోణం నుండి సాగుతుంది. ఈ కథ చదివాక మనస్సు విషాదంతో నిండిపోతుంది. ఇది నిజంగా ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమేనా అని ఆవేదన కలుగుతుంది. ప్రజల ఓట్ల ద్వారా ఎన్నుకోబడి, ప్రజలనే హింసించే, ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేసే నాయకులు, ప్రభుత్వాలు కాంగ్రెస్ అయినా, తెలుగుదేశం అయినా ఒకే తీరుగానే ప్రవర్తిస్తాయని చరిత్ర రుజువు చేసింది.

'జల్లెడ' కథలో అడవుల్లోకి పోలీసులను నక్సలైట్ల కోసం గాలించాలని ఎన్.టి. రామారావు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇచ్చి పంపుతూ వచ్చింది. నిజంగా విప్లవ కారులు గానీ, వారికి సహకరించే ప్రజలు కానీ, శత్రు దేశాల వాళ్లా? భారత పౌరులను శత్రు సైనికులను వేటాడినట్లు, వేటాడే కార్యక్రమమే జల్లెడ పట్టడం. దానినే పోలీసుల భాషలో కూంబింగ్ ఆపరేషన్ అంటారు. కూంబింగ్ ఆపరేషన్ కాల్పుల్లో చనిపోతుందెవరు? పేద ప్రజలు, పేద ప్రజల కోసం పోరాడుతున్న వారు. పేద ప్రజల కోసం పోరాడుతున్న వాడిగా ఎన్నో సినిమాల్లో నటించిన ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో పేదలను, ఏం చేశాడో ఎలా చిత్ర హింసలు పెట్టాడో? ఎలా కాల్చి చంపించాడో, ఈ కథా సంపుటి ప్రత్యక్ష సాక్ష్యం.

'గుమ్మన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్థుడు' కథలో అడవిని నరకడం, ఫారెస్ట్ ప్లాంటేషన్ పెట్టడం, అందులో స్థానిక ప్రజలు కూలీలుగా పనిచేయడం, పోలీసుల జులుం చిత్రించారు.

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు అడవిని కాపాడాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడ ఫారెస్ట్ అధికారులు ప్రవేశిస్తే అక్కడ అడవి మాయమైపోతూ వచ్చింది. ఇందులోని లింగన్నకు కూడా అదే అనుమానం కలుగుతుంది. తమ భూములు లాక్కుని ప్లాంటేషన్ పెట్టి, స్వతంత్రంగా బ్రతికిన వారిని, కూలీలుగా మార్చడం వల్ల ఆదివాసులు ఎంత బాధపడ్డారు? ఆ తర్వాత ఏం చేశారో ఫారెస్ట్ అధికారుల అహంకారం ఎలా ఉంటుందో ఇందులో చూడవచ్చు.

'అమ్మ' కథలో ఉద్యమంలో అమ్మలు నిర్వహించిన మహత్తర పాత్రను చూడవచ్చు. గోర్కీ రాసిన 'అమ్మ' నవలలో అమ్మ ఒక ఉదాత్తమైన పాత్ర. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాల్లో అమ్మలు అలా ఎంతో ఉదాత్తంగా ఉండే స్వభావాన్ని ఈ కథ చిత్రించింది. కామ్రేడ్ మదునయ్యను పోలీసులు అప్పటికే ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేశారు. కొద్ది రోజులకే ఒక కార్యకర్త ఒక ఇంటికి వస్తాడు. ఆమె కొడుకు కూడా ఉద్యమంలో తిరుగుతుంటాడు. పోలీసులు తలుపు తట్టినప్పుడు దర్వాజ కాడ నిలబడి కొడుకును పిలుస్తుంది. కొడుకును పోలీసులు పట్టుకుని పోతారు. విప్లవకారుడు బ్రతికి పోతాడు. ఎందుకిలా చేసింది అమ్మ? అమ్మ హృదయం ఏమంది? అనేవి కథలో కరుణార్ద్రంగా చిత్రించారు.

విప్లవకారులతో దళాలు ఏర్పడ్డాయి. దళాలు గెరిల్లా పోరాటం చేయడానికి ప్రజలను సమాయత్తం చేస్తున్నారు. దళాలు... వారి జీవితం, పోలీసుల వేట, ప్రజల చైతన్యం పెరుగుతున్న క్రమం, గెరిల్లా జీవితం అడవుల్లో ఎలా సాగుతుందో 'గెరిల్లా' కథలో చిత్రించారు.

కామ్రేడ్ పల్లె కనకయ్య స్మృతిలో అతడు ప్రజల్లో కలిసిపోయే తీరు, పోలీసులు అతన్ని వెంటాడి చంపిన తీరు, 'ఒరిగిన అన్నల కెన్నీయలో' కథలో చిత్రించారు. 'స్వర్ణోత్సవం' కథలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 50 ఏళ్ళకు తెలంగాణ ప్రాంతంలో కోస్తాంధ్ర వలసాధిపత్యం, వారి నాయకత్వంలోని ప్రభుత్వాలు ఎంత క్రూరంగా ప్రవర్తించాయో చిత్రించారు. 'చిగురు' కథలో ప్రజలు ఎలా తమ సమస్యల కోసం సమిష్టిగా ఉద్యమిస్తూ, ముందుకు సాగుతుంటారో చిత్రించారు.

### నిస్సహాయ జీవుల మౌన ఆక్రందన... సింగరేణి... రాధాబాయి కథ

'రాధాబాయి' కథ మాటల్లో చెప్పలేని నిస్సహాయ జీవుల మౌన ఆక్రందన. సింగరేణి అధికారులు, సింగరేణి కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయి కూలీలుగా మారిన ఆదివాసీ ప్రజలు, వారి మధ్య కొనసాగుతున్న ప్రత్యక్ష దోపిడి, అణిచివేత, హింస, క్రూరత్వం, లైంగిక అత్యాచారాలు, నిస్సహాయ స్థితిని ఎలా కాంట్రాక్టర్లు, అధికారులు మనిషిని అమానుషంగా వాడుకుంటారో హృదయవిదారకంగా తెలియజేస్తుంది. స్థానిక బొగ్గు గనులు స్థానికులను సంపన్నులను చేయాలి. అందుకు భిన్నంగా వారిని కూలీలుగా చివరకు



అత్యాచారాలకు గురయ్యే మహిళలుగా ఎలా మార్చింది? ఈ దయనీయ స్థితికి కారకులు ఎవరు? సీమాంధ్ర వలసాధిపత్యంతో పాటు కేంద్ర ప్రభుత్వం కారణం కాదా? ఈ పరిణామాలను, తెలంగాణ ప్రజలకు జరిగిపోతున్న అన్యాయాలను... ప్రత్యేక తెలంగాణ ఉద్యమ దృక్పథంతో చూసినప్పుడు అనేక విషయాలు కొత్తగా, కొత్త కోణంలో అర్థమౌతాయి. అందుకు ఇందులోని కథలు ఎంతగానో ఉపకరిస్తాయి.

'భూమి పుత్రుడు' కథ కూడా సింగరేణి బొగ్గు గనులకు సంబంధించిన కథే. ఓపెన్ కాస్ట్ గనులవల్ల ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ లోని భూములు, అణుబాంబులు పడిన హిరోషిమా, నాగసాకి ప్రాంతాలకన్నా హీనంగా, శతాబ్దాలు తరబడి మరుభూమిగా ఎలా మారుతుందో విశ్లేషించారు.

### తెలంగాణ ప్రజల కష్టాలకు కారకులెవరు?

తెలంగాణ ప్రాంతంలో ప్రజలు ఇన్ని కష్టాలు ఎందుకు పడుతున్నారు? ఈ కష్టాలకు కారకులు ఎవరు? దోపిడి దారులే ఈ కష్టాలకు కారకులు. ఈ దోపిడి దారులు ఎవరు? సీమాంధ్ర ఆధిపత్య వాదులు, వారి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు.

అంతేనా? తెలంగాణ ప్రాంతంలోని సహజ వనరులను ఎవరు తరలించుకుపోతున్నారు? ప్రకృతి వనరులపై, ఖనిజాలపై, ఉపాధి అవకాశాలపై, సమస్త వనరులపై తెలంగాణాలో ఎవరు ఆధిపత్యం చెలాయిస్తున్నారు? ఎవరు దోపిడి చేస్తున్నారు? సీమాంధ్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలు, దళారీ బూర్జువాలు, బిర్లాలు, దాల్మియాలు, థాపర్లు, అంబానీలు, కావూరి, రాయపాటి, లగడపాటి, మేకపాటి, సుబ్బిరామిరెడ్డి ఎవరికివారు అందినంత దోచుకుపోతున్నారు. తెలంగాణ ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చారు.

### ప్రజలు ఎందుకోసం ఉద్యమించారు?

తెలంగాణ ప్రజలు ఎందుకు విప్లవం కోసం ఉద్యమించారు? తమ జీవన ప్రమాణాలు పెరగాలని, తమ సమస్యలు తీరాలని, తమ పిల్లలకు ఉన్నత చదువులు, ఉద్యోగాలు లభించాలని, దున్నుకోవడానికి కాస్త భూమి కావాలని, సమస్త వనరులపై తమ హక్కు ఉండాలని, వాటి ప్రయోజనాలు తమకు అందాలని కోరుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డం ద్వారా ఇవి సాధ్యపడతాయి. తద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, స్వయం పాలన, స్థానిక వనరుల ప్రాధాన్యత, ఆత్మ గౌరవం, తెలంగాణ భాష, సంస్కృతి, తెలంగాణ జీవితాలు, పాఠ్య పుస్తకాల్లో చేరుతాయి. సాధికారికత పొందుతాయి. ప్రజల కష్టాలు ఎన్నో తీరుతాయి. స్వేచ్ఛగా జీవించే అవకాశాలు పెరుగుతాయి. బొంబాయి,

గల్ఫ్ దేశాలకు, ఇతర ప్రాంతాలకు వలస వెలుతున్న ప్రజల వలసలు తగ్గిపోతాయి. ప్రజలపై ఇలాంటి నిర్బంధాలు తొలిగిపోతాయి.

ప్రజలు సుఖశాంతులతో, ఉన్నత జీవన ప్రమాణాలతో జీవించడానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవసరం. ఆ అవసరాన్ని ఈ కథలు నొక్కి చెబుతాయి. వలస ఆధిపత్య వర్గాలు ఎలా దోపిడి చేస్తూ, తెలంగాణ ప్రజలను అరిగోస పెడుతున్నారో ఈ కథలతోపాటు యాదగిరి మొత్తం సాహిత్యం అనేక కోణాల్లో చిత్రించింది.

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కష్టాలు తీరుతాయి...**

తెలంగాణ రాష్ట్రం వస్తే కేవలం సింగరేణి గనుల బొగ్గుతోనే భారతదేశంలోని ఏ ప్రాంతంకన్నా మిన్నగా సంపన్న రాష్ట్రం అవుతుంది. ప్రజలు సుఖ శాంతులతో జీవిస్తారు. తెలంగాణ ప్రాంత ప్రజలు... వలస వాదుల, పెట్టుబడిదారుల ఆధిపత్యంలో గిలగిలలాడుతున్నారు. 60 ఏళ్ళుగా సాగుతున్న దోపిడివల్ల ఇతరులు వేల కోట్లకు పడగలెత్తారు. సంపన్నులయ్యారు. కాని తెలంగాణ ప్రజలు ఎలా కునారిల్లి పోతున్నారో ఈ కథలు చెప్పకనే చెపుతాయి. ముప్పైయ్యేళ్ల స్నేహానికి గుర్తుగా ఎంతో అభిమానంతో ఇంతటి చరిత్రాత్మకమైన కథల సంపుటిని నాకు అంకితం ఇస్తానంటే ఎలా కాదనగలను? ఇది షష్టిపూర్తి కానుకగా స్వీకరిస్తున్నాను.

వూరుగొండ యాదగిరి తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను, వలస దోపిడీని, వర్గ దోపిడీని, వనరుల దోపిడీని, సంపద దోపిడీని తన కథల్లో, నవలల్లో, ఇతర రచనల్లో కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో నూతన దృక్పథంతో ఈ కథలను, తెలంగాణ ఉద్యమ కథలను అధ్యయనం చేస్తే ఎన్నో గ్రంథాలవుతాయి. సామాజిక శాస్త్రవేత్తలు, యువ పరిశోధకలు, ఈ కథల ఆధారంగా పరిశోధనలు చేయడం ద్వారా నిర్దిష్టంగా తెలంగాణ ప్రజల జీవితాల్లో ఎంత అణచివేత, పీడన, పేదరికం, దోపిడి కొనసాగుతూ వచ్చిందో వెలికితీసిన వారవుతారు.

పి.చంద్ యాదగిరి రాసిన ఈ కథలు కేవలం కథలు కావు. కోట్లాది ప్రజల కన్నీటి గాథలు. ఉద్యమించే యువకుల భవిష్యత్ స్వప్నాలు. ఈ కథల్లో జీవితముంది. జీవితంలోని దుఃఖం వుంది. ప్రజల ఆశలను, ఆరాటాలను, పోరాటాలను ప్రజాస్వామ్యానికి భిన్నంగా ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పాలక వర్గాలు, దోపిడి వర్గాలు దోపిడి చేస్తూ అణచివేస్తున్న తీరు, వాటికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్న తీరు, ప్రజల చైతన్యం, సంస్కృతి, జీవన విధానాలు, వాటి పరిణామాలకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తాయి ఈ కథలు.



తెలుగు సాహిత్యంలోకి కొత్త సామాజిక చరిత్ర

## భూనిర్వాసితుల కథలు

"భూనిర్వాసితులు" ఒక విశిష్టమైన కథల సంపుటి. భారతీయ సాహిత్యంలోనూ ఇలాంటి కథలు అరుదుగా వస్తాయి. ప్రజలపట్ల నిబద్ధత, అచంచలమైన ప్రేమతో పాటు రచనా సామర్థ్యం తోడైనపుడే ఇలాంటి కథలు వస్తాయి.

పి.చంద్, కార్మిక కలం పేర్లతో రాసే వూరుగొండ యాదగిరి 1980 నుండి గత ఇరవై ఏడేళ్ళు గా ప్రజల పక్షం వహించి కథలు రాస్తున్నాడు. వందకు పైగా కథలు రాశాడు. వివిధ కలం పేర్లతో పద్దెనిమిది పుస్తకాలు వెలువడ్డాయి. ఆరు నవలలు ప్రచురించబడ్డాయి. 'శేషగిరి' నవలలో సింగరేణి కార్మికుల ఉద్యమాలను ఆనాటి సామాజిక పరిణామాలను ఒక చరిత్రగా రికార్డు చేశాడు. విప్లవ కార్మికోద్యమం గురించి 'బొగ్గులు' నవల రాశాడు. ప్రజాస్వామ్యం, గుమ్మన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్థుడు, సన్నజీవాలు, బిర్లామందిర్, కార్మిక కథలు సుప్రసిద్ధమైనవి. ఇంటి నుండి తీసుకువెళ్ళి మాయం చేసి చంపివేసిన కొడుకుల గురించి తల్లిదండ్రులు పడే ఆవేదన చిత్రించిన సన్నజీవాలు కథ కఠిన హృదయాలను కూడా కదిలిస్తుంది. ప్రజాస్వామ్యం కథలో పోలింగ్ ఆఫీసర్‌గా వెళ్ళిన అనుభవాల ద్వారా ప్రజాస్వామ్యం ఎలా అపహాస్యం చేయబడుతున్నదో చిత్రించారు. ఆదిలాబాద్ ఆదివాసి గోండు గిరిజనుల కష్టాల గురించి, కన్నీళ్ళ గురించి చలించి ఎన్నో కథలు రాశాడు.

సింగరేణి యాజమాన్యం చేస్తున్న మోసాలు, దోపిడీలు, కార్మిక వ్యతిరేక చర్యలు, వేజ్‌బోర్డు సమస్యలు, డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇప్పించడంలో జరిగే మోసాలు ఇలా సింగరేణి కార్మికుల గురించి పలు కోణాల్లో ఎన్నో కథలు రాశాడు. ప్రపంచీకరణ తరువాత ప్రభుత్వరంగ పరిశ్రమలు ఎలా నిర్వీర్యం అవుతూ వస్తున్నాయో ఆ నేపథ్యంలో చిన్నాభిన్నమవుతున్న కార్మికుల జీవితాల గురించి బలంగా చిత్రిస్తున్న ఏకైక శ్రామికవర్గ రచయిత పి. చంద్. ఇటీవలే 'జులుం' అనే కథల సంపుటి కూడా వెలువరించారు. ప్రేమ్‌చంద్ పై గల అభిమానంతో తన కలం పేరును పి. చంద్‌గా మార్చుకున్నాడు. కొంత కాలం కార్మిక పేరుతో కథలు రాశాడు. వరంగల్ లోని అజాంజాహి మిల్లు కార్మికుడి బిడ్డ అయిన యాదగిరి గోదావరిఖనిలోని సింగరేణి కాలరీలో ఆఫీసు అసిస్టెంటుగా

ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కొంత కాలం విరసం సభ్యుడుగా ఉన్నాడు. 'విశాలసాహితి బి.ఎస్. రాములు కథా పురస్కారం' అందుకున్నాడు. పేద ప్రజల వేదనే ఆయన కథా వస్తువు. ఆయన కథలన్నిటికి కేంద్ర బిందువు దుఃఖం. ఈ దుఃఖం పోవాలని చేసే ఉద్యమాలకు నైతిక మద్ధతు ఇస్తూ ప్రజల చరిత్రను కథల, నవలల రూపంలో రికార్డు చేస్తున్న నిబద్ధత గల కథకుడు.

అతని కథలన్నీ ఒక పుస్తకంగా వచ్చినప్పుడు అతని వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం స్పష్టమవుతుంది. ఈ 'భూ నిర్వాసితులు' కథల సంపుటిలో అన్ని కథలను చేర్చలేదు. ఈ కథలు ఒకే వస్తువును తీసికొని రాసినవి. ఇటీవల ఒకే వస్తువును తీసికొని ఒకే రచయిత దాని సమస్త కోణాలను, వైవిధ్యాన్ని చిత్రించే కథలు పెరుగుతున్నాయి. సాహిత్యం జీవితం లోలోతుల్లోకి వెళ్ళడాన్ని యిది సూచిస్తుంది. అలా ఈ మధ్య దళిత కథలు, స్త్రీవాద కథలు విరివిగా వెలువడ్డాయి. అలాగే 'అమ్మ' గురించి, 'బాల కార్మికుల' గురించి, 'యుద్ధం' గురించి కె.వి.నరేందర్ విడిగా వేసిన కథల సంపుటాలు వెలువడ్డాయి. నాగప్ప సుందర రాజు రాసిన 'మాదిగోడు' కథలు ఎండ్లూరి సుధాకర్ మల్లెమొగ్గల గొడుగు మాదిగ కథలు, మహ్మద్ ఖదీర్ బాబు దర్గామిట్ట కథలు వెలువడ్డాయి. వైద్యంలో స్పెషలిస్టులు పెరుగుతున్నట్టుగానే సాహిత్యంలోనూ స్పెషలైజేషన్ జరుగుతున్నది. ఇది హర్షించ దగిన పరిణామం.

సమాజ చరిత్ర సాహిత్య రూపం తీసుకున్నప్పుడు అది ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సమాజ చరిత్రతో పాటు మానవ సంబంధాలు చిత్రించినపుడు కథలు మరింత బలంగా ఉంటాయి. సైన్సు, టెక్నాలజీ, పారిశ్రామికీకరణ ద్వారా "అభివృద్ధి" చెందిన వారి పరిణామాల గురించి ఎంతో సాహిత్యం వచ్చింది. ఇవి "అభివృద్ధి" తాలూకు మరోవైపును చీకటి కోణాలను చూపే కథలు.

తెలుగు నేలలో 150 ఏళ్ళుగా పరిశ్రమలు, రైల్వేలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు విస్తరిస్తున్నాయి. లక్షలాది మంది నిరాశ్రయులైనారు. నిరుద్యోగులైనారు. జీవితాలు కోల్పోయారు. నమ్ముకున్న నేలను కోల్పోయారు. శతాబ్దాలుగా నమ్ముకున్న పల్లెలు. గూడేలు వలస పోవడం వల్ల నిర్మానుష్యమై పోయాయి. సిమెంటు దుమ్మువల్ల, భూగర్భ జలాలు అడుగంటడం వల్ల, వాగులు రసాయనాలతో కలుషితమవడం వల్ల పంట భూములు, బీడు వారాయి. కరువు, పేదరికం పెరుగుతున్నది.

ఈ కథల సంపుటి సింగరేణి బొగ్గు గనులవల్ల సిమెంటు ఫ్యాక్టరీల వల్ల సమాజంలో, గ్రామీణ జీవితాల్లో ప్రకృతిలో పర్యావరణంలో వస్తున్న మార్పుల్ని, వచ్చిన మార్పుల్ని తెలిపే సామాజిక ఆర్థిక చరిత్రను చిత్రించింది. ఇది తెలుగు సాహిత్యంలో భూనిర్వాసితులపై వారి దయనీయ స్థితిగతులపై వచ్చిన తొలి కథా సంపుటి. ఈ కథల



సంపుటి తెలుగు సాహిత్యంలోకి కొత్త సామాజిక ఆర్థిక చరిత్రను జతచేసింది. ఈ కథలు మనని వెంటాడుతాయి. ప్రశ్నిస్తాయి. హృదయాలను కల్లోల పరుస్తాయి. ఇది పేద ప్రజల కన్నీటి చరిత్ర.

ఈ కథలు చదువుతుంటే 'అభివృద్ధి' ఎవరికోసం, ఎందుకోసం అని ప్రశ్నించుకోకుండా ఉండలేము. దేశంలో 150 ఏళ్ళుగా అభివృద్ధి పేరిట జరిగిందేమిటి? "అభివృద్ధి" వల్ల ఎదిగిన వర్గాలు, జీవితాలు, ప్రాంతాలు ఎవరివి? "అభివృద్ధి" వల్ల వృత్తులు, భూములు, జీవితాలు కోల్పోయిన బాధితులకు "అభివృద్ధి"లో, కొత్త జీవితాలను గెలుచుకోవడంలో అందిన వాటా ఎంత? "అభివృద్ధి" ఎవరిని కొట్టి ఎవరిని బతికిస్తున్నది? "అభివృద్ధి" కోసం శతాబ్దాలుగా కొనసాగుతున్న జీవితం నుండి, భూమి నుండి, సంస్కృతి, జీవన విధానం నుండి వెళ్ళగొట్టబడి నిరాశ్రయులై, నిర్వాసితులైన పల్లె ప్రజలు ఎలా జీవిస్తున్నారు? "అభివృద్ధి"ని అందుకున్న వాళ్ళు వీరిని ఏ మేరకు పట్టించుకున్నారు? సమాజం, ప్రభుత్వాలు "అభివృద్ధి" బాధితుల పట్ల ఎందుకింత నిర్లిప్తంగా ఉంటున్నాయి? అని ఈ కథ మనస్సును వేధిస్తాయి.

అభివృద్ధి పేరిట జరిగేదంతా అభివృద్ధేనా? ఈ అభివృద్ధిలో నిజంగా అవసరమైనదెంత? సరుకు ఉత్పత్తి దారులకు మార్కెట్ వనరులు, ముడిపదార్థాలు, వనాలు, లక్షల ఏళ్ళనాటి ఖనిజ నిక్షేపాలు అవసరమైనట్టుగానే కొందరికి "అభివృద్ధి" అనే ప్రక్రియ అవసరమైందా! "అభివృద్ధి"లో లాభాలు కాకుండా మనిషి, మానవ వనరుల అభివృద్ధి మానవీయత పరమ లక్ష్యం కాకుండా పోతే ఈ ప్రభుత్వాలను ఏర్పరచుకోవడం దేనికీ.

## అభివృద్ధి అంటే ఏమిటి?

భారీ నీటి పారుదల ప్రాజెక్టుల వల్ల ప్రతి అయిదుగురు ఆదివాసుల్లో ఒకరు అనగా ఇరవైశాతం భూనిర్వాసితులయ్యారు. కాని అభివృద్ధిలో వారికి ఒక శాతమైనా అందలేదు. అరుంధతీరాయ్ ఇటీవల "దేశంకోసం" -భారీ డ్యాముల మానవ మూల్యం" అనే రచనద్వారా అభివృద్ధి బాధితుల గురించి అనేక విషయాలు వెలికి తెచ్చారు. అరెస్‌రావు "అభివృద్ధి వెలుగు నీడల" వ్యాసం ద్వారా అభివృద్ధి స్వభావాన్ని విశ్లేషించారు. "అభివృద్ధి" వల్ల ఉపాధి పొందిన వారెంతమందో దాదాపు అంతేమంది తమ జీవితాలు కోల్పోతే అది అభివృద్ధి అవుతుందా? నూరేళ్ళుగా యిదే జరుగుతున్నది.

పారిశ్రామిక విప్లవం కోట్లాదిమంది చేతివృత్తి కులాలను నిర్వీర్యం చేశాయి. వృత్తి చేతి వృత్తికులాల వాళ్ళు గిట్టుబాటు గాక కునారిల్లి పోయారు. 1810 దాకా ఈ దేశంనుండి ప్రపంచానికి సరుకులు ఎగుమతి అయ్యేవి. వేల ఏళ్ళుగా ఎందరు వలసవచ్చినా, ఎందరు దాడులు చేసినా ఈ దేశం సౌభాగ్యవంతంగా, జీవించిందంటే, ఇక్కడ కళలు, సాహిత్యం,

గుళ్ళల్లో దాచుకున్న సంపద అభివృద్ధి చెందాయంటే అదంతా శ్రమజీవుల, శ్రామిక కులాల చేతివృత్తి కులాల నిరంతర కృషి. పారిశ్రామిక వేత్తలుగా ఎదిరించాల్సింది పోయి పారిశ్రామిక విప్లవం వీరినే బాధితుల్ని చేయడం వల్ల గత 150 ఏళ్ళుగా వెనుకబడిపోయారు. "ఆధునిక విద్య" అందుకోగలిగిన కులాలు, వర్గాలు "అభివృద్ధి"ని సొంతం చేసికొన్నాయి. ఎస్సీలకు రిజర్వేషన్లు మినహా "అభివృద్ధి"లో అందిన వాటా ఏమీ లేదు. ఇలా ఎస్టీ, బీసీ కులాల వాళ్ళెందరో "అభివృద్ధి" వల్ల జీవితాలు కోల్పోయారు. కొత్త జీవితాల్లో మారడం అందరికీ అయ్యే పనికాదు. ఎన్నో తరాలు, కోట్లాది ప్రజలు శిథిలమైపోయారు. వాళ్ళు అట్టడుగు కార్మికులుగా, కూలీలుగా "పారిశ్రామికీకరణ" లో తమ జీవితాల్ని ప్రారంభించి తరాలు గడుస్తున్నకొద్దీ అభివృద్ధిలో, అధికారంలో కాస్త వాటా అందుకోగలుగుతున్నారు. అయినప్పటికీ వందలాది కులాల్లో ఇప్పటికీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, గెజిటెడ్ అధికారులు పారిశ్రామికవేత్తలు గానీ, న్యాయమూర్తులు గానీ ఒక్కరైనా లేరు. ఎనభయిశాతం నిరక్షరాస్యులుగా మిగిలి పోతున్నారు. "అభివృద్ధి" బాధితులకు ఏం జరుగుతున్నదో ప్రేంచంద్ "రంగభూమి" నవలలో విస్తారంగా చిత్రించారు. హత్యలకు, దోపిడీలకు, వేశ్యావృత్తికి, తాగుడుకు, సామాజిక విలువల విచ్ఛిన్నానికి పారిశ్రామికీకరణకు గల సంబంధాలను ప్రేంచంద్ అందులో స్పష్టం చేశారు. ప్రేంచంద్ పేరునే తన కలంపేరుగా పి.చంద్ అని మార్చుకున్న ఈ రచయిత కూడా ప్రేంచంద్ లాగా ఈ కథల్లో నేటి సమాజ ఆర్థిక చరిత్రను చిత్రించారు.

"హత్య" కథతో ఈ కథల సంపుటి ప్రారంభమౌతుంది. మానభంగానికి గురై హత్య చేయబడిన ఆదివాసి జంగుబాయి కన్నీటికథ "హత్య". ఆమె హత్య చేయబడింది. ఎవరు చేశారో తెలియదు. ఆవూరి వాళ్ళందరూ బతికుండగానే హత్యకు గురయ్యారు. ఈ హత్యలు జరిగిన, జరుగుతున్న తీరును ఒక చరిత్రను సామాజిక సంబంధాల పరిణామాల్ని చెప్పడానికి వస్తువును ఎన్నుకున్న తీరు మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ఒక సాదాసీదా కథలా, డాక్యుమెంటరీలా మొదలై దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీవల్ల ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ సమాజం ఏమైపోయిందో మన కళ్ళ ముందుంచుతారు. ఈ కథలు చదివాక "నర్మదా బచావ్ ఆందోళన్" గురించి రాసిన "దేశం కోసం......మానవ మూల్యం గ్రంథం మేధావి వర్గపు అంతః చేతనాన్ని కదిలించేరచన. పేదలు, భూమిలేని వాళ్ళకు కలిగిన కష్టనష్టాల పట్ల ఇంత తీవ్రంగా స్పందించి మద్దతు పలికిన రచయితను నేనింతవరకు చూడలేదు" అని అరుంధతి రాయ్ గురించి బాబా ఆమ్టే అన్నమాటలు ఈ రచయితపట్ల కూడా అక్షరాల నిజమనిపిస్తాయి. ఈ కథల్ని చదివితే అరుంధతీరాయ్ కూడా "నర్మదా బచావ్ ఆందోళన్" ఆదివాసీ జీవితాలను కథలుగా, నవలలుగా ఎలా రాయాలో, ఎందుకు రాయాలో అర్థం చేసుకుంటారు. తమ రాష్ట్రంలో జరిగిపోతున్న



అక్రమాలను కథలు, నవలలుగా రాయడం చైతన్యవంతమైన రచయితల కర్తవ్యం ఎందుకవుతుందో ఈ కథలు చెప్పకనే చెప్తాయి.

"సిమెంటు దుమ్ముతో నిండిపోయిన వాళ్ళ భూముల్లోకి మళ్ళీ జీవాన్ని నింపేది ఎవరు? చిందరవందర అయిపోయిన అమాయక గిరిజన బతుకుల్లో మళ్ళీ వసంతం చిగురిస్తుందా?" అని రచయిత వేసేప్రశ్నలు కన్నీళ్ళు తెప్పిస్తాయి. ఈ శరీరం, ఈ బతుకు మనదేనా?! సిమెంటు ఇళ్ళు, కట్టడాలన్నీ పేద ప్రజల ఎముకల్తో నిర్మించినవేనా? అని ఒళ్ళు జలదరిస్తుంది.

"భూ నిర్వాసితులు" కథ గోదావరి ఖని ఓపెన్‌కాస్టు బొగ్గుగని ప్రాంతంలోని పరిణామాల్ని చిత్రించింది. 'రాజు' చురుకైనవాడు. తాతపెట్టిన హోటళ్ళలో పనంత చేసేది రాజే. ఎకరాల భూమి తమది కాకుండాపోయింది. కల్లుపోషవ్వ, బీడీ రంగయ్య, హోటలు మల్లయ్య, సాయబలీ, రాజేశం మొ॥వాళ్ళు జీవితంలోంచి నడిచి వచ్చిన పాత్రలు. కథకూ జీవితానికీ మధ్య అంతరం చెరిపేసిన కథల సంపుటి "భూనిర్వాసితులు".

ఇజ్రాయిల్ వల్ల పాలస్తీనా ప్రజలు తమ మాతృభూమిలోనే నిరాశ్రయులై కాందిశీకులయ్యారు. కాని అంతకన్నా హీనంగా అభివృద్ధి పేరిట కోట్లాది ప్రజలు తమ మాతృభూమిలో తాము ఉన్నచోటే తమ ప్రమేయం లేకుండానే కాందిశీకులుగా మార్చబడ్డారు. బర్మా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక పౌరులను కాందిశీకులు తాత్కాలికంగా కొందరికి, శాశ్వతంగా కొందరికి ఆశ్రయం ఇచ్చిన మన సహృదయత మనలోనే బతుకున్న మనవారిపై ఎందుకు ప్రసరించలేదని ఈ కథలన్నీ మనలో ఆలోచనలు రేకెత్తిస్తాయి. ఈ మేరకు రచయిత తన లక్ష్యాన్ని ఎంతో ఉన్నతంగా సాధించారు.

లక్షల ఏళ్ళనాటి ఖనిజ నిక్షేపాల్ని గత రెండువందల ఏళ్ళలో ప్రపంచ పారిశ్రామిక రంగం విస్తారంగా ఖర్చుచేసింది. కేవలం వర్తమాన పారిశ్రామిక అవసరాల కోసం విస్తారంగా ఖర్చు చేసింది. కేవలం వర్తమాన లాభాలకోసం లక్షలేళ్ళ నిక్షేపాల్ని యధేచ్ఛగా వాడుకునే హక్కు మనకుందా! భవిష్యత్తరా మాటేమిటి? ఈ మట్టిని నమ్ముకున్న వారి బతుకు మాటేమిటి? రాజేశం బొగ్గు గనులకోసం తమ భూమిని గుంజుకోవడాన్ని ఎదిరించినందుకు బలైపోయాడు. చదువుకోవాల్సిన అతని కొడుకు టీకొట్టు కార్మికుడయ్యాడు. ప్రభుత్వమూ, పాలసీలు, ప్రజాస్వామ్యం ఇంతకన్నా మెరుగ్గా ఉండే అవకాశాలు లేవా? ఆ విశ్వాసాన్ని కలిగించి ఆచరించినపుడు అభివృద్ధి బాధిత ప్రజలకు ప్రజాస్వామ్యంపై కాస్తయినా విశ్వాసం పెరుగుతుంది. అది జరగనపుడు నాకులేని అభివృద్ధి ఇతరులకెందుకు అనే సహజ విధ్వంసక దృక్పథం కలుగుతుంది. అది రాజులో ఏ రూపం తీసుకుందో "భూనిర్వా సితులు" కథలో చూడవచ్చు.

"అభివృద్ధి" బాధిత ప్రజల జీవితాల్లో తిరిగి ఆనందం విరిసే సంక్షేమ పథకాలు చేపట్టడంలో చిత్తశుద్ధిలోపం తప్ప నిధుల కొరత కాదు. దేశరక్షణ వ్యయం పేరిట జాతీయ ఆదాయంలో 30 శాతం ఖర్చు చేయడం వల్ల ప్రతి ముగ్గురు సృష్టించే సంపద నుండి ఒక్కరిసంపద రక్షణ వ్యయానికే ఖర్చవుతున్నది. అదంతా అనుత్పాదక వృధా ఖర్చే.

ప్రభుత్వాలు, పాలకవర్గాలు, సామ్రాజ్యవాద దేశాలు, దోపిడి కులాలు, బలవంతులు ప్రతి సమస్యను శాంతిభద్రతల సమస్యగా మార్చి ఆనక పోలీసుల్ని సైన్యాన్ని ఉసిగొల్పి ఉద్యమ కారులను అణిచివేస్తారు. అయితే ఉద్యమం అణిగిపోయినా సమస్య అలాగే మిగిలిపోతుంది.

ఈ ఎత్తుగడల్ని అర్థం చేసుకొని ఏ ఉద్యమాన్నైనా, సమస్యనైనా శాంతి భద్రతల సమస్యగా మారకుండా జాగ్రత్తలు తీసికోవడంలోనే ప్రజల విజయం దాగివుంది. ఏ సమస్యయినా సామాజిక సమస్యే. అది సామాజికంగా, రాజకీయంగా, ప్రజాపరంగా శాసనపరంగా, ప్రభుత్వ శాఖల పరంగా పరిష్కరించబడే సమస్త ఎత్తుగడల్ని చేపట్టాలి. ప్రజల్ని మీడియాని భావజాలాన్ని ప్రభావితం చేయాలి. అప్పుడే సమాజంలో సరియైన సమగ్రమైన తాననుకున్న మార్పును, పరిష్కారాన్ని సాధిస్తుంది. ఈ కథల్లో ఎవరూ దీన్ని గుర్తించలేకపోయారు. తమ బతుకు మీద జరిగే దాడినే గమనించారు గానీ పరిష్కారాలు కనుక్కోలేకపోయారు. ఈ దశలోనే ఉండిపోతే ఎన్నాళ్ళు గడిచినా వాళ్లు కోల్పోయిన జీవితాల స్థానే కొత్త జీవితాల్ని గెలుచుకోలేరు.

ఇలాంటి దశలోనే అడవుల్ని కాపాడుకునే చిప్కో ఉద్యమం నర్మదా బచావో ఉద్యమం, అన్నాహజారే ఆదర్శ గ్రామ ఉద్యమం మొదలైనవి ఇతర ప్రాంతాల్లో వ్యాప్తి చెందాయి. మన రాష్ట్రంలో ఇంతపెద్ద సమస్యపై ఒక బాబా ఆమ్టే, ఒక అన్నాహజారే, ఒక సుందర్‌లాల్ బహుగుణ, ఒక మేధాపాట్కర్ ఎందుకు ఆవిర్భవించ లేకపోయారు. నక్సలైట్ల ప్రాబల్యం శాంతియుత ఉద్యమాల్ని, మేధాపాట్కర్ల ఆవిర్భావాన్ని అడ్డగిస్తున్నదా? సమాజం యొక్క చైతన్య స్థాయిననుసరించి రాజ్యవ్యవస్థ రూపుదిద్దుకుంది. సమాజాన్ని మార్చే క్రమంలో రాజ్యం కూడా మారుతుంది. రాజ్యం దానికదే అమూర్తం కాదు. సమాజానికతీతంగా రాజ్యం లేదు. రాజ్యమ్మీద కూడా సమాజం మీద పూనిక పెట్టి ఉద్యమాలు నిర్మిస్తే బాబా ఆమ్టే. బహుగుణ, మేధాపాట్కర్, శంకర్ గుహ నియోగి వంటి వాళ్ళ ఆవిర్భావం సాధ్యమౌతుందా! రాష్ట్రంలో మూతపడ్డ పరిశ్రమల్ల 80% తెలంగాణాలలోనివే. వారి బతుకులకు ప్రభుత్వం సమాజం, పార్టీలు, నక్సలైటు ఉద్యమాలు చూపిస్తున్న ప్రత్యామ్నాయమేమిటి? అని ఇవన్నీ ఆత్మ విరమ్మ చేసుకోవాల్సి ఉన్నది. శాంతియుత ఉద్యమాలు చేపట్టినప్పుడే సమస్య ఎంత చిన్నదైనా కారంచేడు, చుండూరు, ఉద్యమాల్లాగ జాతీయ స్థాయిని ఆకర్షించడం భావజాలాన్ని చైతన్యపరచడం సాధ్యమే.



ఈ రచయితకు అలాంటి సమగ్ర సామాజిక వికాస దృక్పథం ఇక్కడే అవసరం అవుతుంది. అప్పుడే వారి జీవితాల్లో ఆశ విశ్వాసం కలిగించే కథల్ని రాయడం సాధ్యపడుతుంది. జీవితం పట్ల విశ్వాసం కల్గించలేని నిరాశా విధ్వంసాన్ని, ఆత్మహత్యల్ని, కసిని సృష్టిస్తుంది.

రచయిత అయినవాడు పుట్టెడు కష్టాల్లో ఉండేవారిలో సైతం ఆశను, ఆత్మ విశ్వాసాన్ని సృష్టించ గలగాలి. జీవితాన్ని ప్రేమించేటట్టు చేయగలగాలి. బాధిత, పీడిత ప్రజలకే ఎవరికన్నా ఎక్కువగా అది అవసరం. కథలన్నిటా నిరాశ నింపిన రచయిత గంజాయి కథలో మాత్రం బతుకుపట్ల విశ్వాసాన్ని చిత్రించి ముగించాడు. అన్ని కథల్లోని జీవితాల్లో కూడా ఇలాగే జీవితం పట్ల ఆత్మవిశ్వాసాన్నిచ్చే విధంగా రాయగలిగితే అనగా ఆ పాత్రలు, రచయిత అట్లా ఆలోచించగలిగితే ఈ కథలే కాదు వారి జీవితాలు కూడా మరింత గొప్పగా ఉంటాయి.

అభివృద్ధి అందుకున్న వారి కథల్లో, జీవితాల్లో ఆశావాదం, ఆనందం ఉంటుంది. అభివృద్ధి పీడితుల్లో నిరాశ, దుఃఖం ఉంటుంది. ఈ స్థితి తాము తెచ్చిపెట్టుకున్నది కాదు. తమ ప్రమేయం లేకుండానే మార్చబడ్డ రక్తాశ్రువులు జీవితాలు. "రాజు"లో రాజుకునే ఆవేదన ఏరూపం తీసుకుంటుందో ప్రతీకాత్మకంగా చెప్పాడు రచయిత. అయితే అది కోల్పోయిన జీవితాలను తిరిగి గెలుచుకోవడానికి పనికిరాకపోవచ్చు. నిస్సహాయ స్థితిలో ఏం చేయాలో తోచని స్థితి. "భూ నిర్వాసితులు" కథ చదివాక వెంటనే మరోకథలోకి వెళ్ళలేము. మనచుట్టూ మనం చూస్తుండగానే ఎన్ని ఘోరాలు జరిగిపోతున్నాయో అని హృదయం కలికలి అవుతుంది. 50 ఏళ్ళుగా అభివృద్ధి పేరిట జరుగుతున్నదేమిటో బొమ్మకట్టి మనస్సు మూగపోతుంది.

తమ భూమిలోని సంపద కారణంగా అరబ్బులు పెట్రోలు అమ్మికొని కోటీశ్వరులయ్యారు. మనదేశంలో తమ భూమిలోని సంపద కారణంగా రైతులు, నిర్వాసితులయ్యారు. కరెంటు తీసేయబడుతుంది. నల్లానీళ్లు ఆపేయ బడతాయి. బడిమూసేయబడుతుంది. బలవంతంగా తమ భూమినుంచే ఖాళీ చేయించబడుతారు. బొగ్గు కోసం బ్లాస్టు చేసే కృత్రిమ భూకంపాల మధ్య బతుకు ఈడ్వాల్సి వస్తుంది. ఇలా....ఒక ఊరు బలియిచ్చే మేకలా 'జడితి' ఇవ్వడం కృత్రిమ భూకంపాల నీడలో నిత్యం బతుకు బలైపోవడం...బడి చదువుల తీరు...జడితి కథ.

ఈ అభివృద్ధి వ్యవస్థ బాధితులకు ఏమీయకపోయినా ప్రకృతి ఆకలిని ఇచ్చింది. ఆకలి దొంగతనాలకు పురికొల్పింది. బతుకునీయని వ్యవస్థ బలికోరింది. పనిచేసే హక్కు నిరాకరించబడింది. అన్ని తోవలు మూసుకుపోయాయి. సలీం, శంకర్‌లు దొంగలా!

వాళ్ళ భూముల్ని ఆక్రమించి కంచె వేసుకొన్న వాళ్ళు దొరలా! అధికారం చేతులుంటే విలువలు ఎలా మార్చబడతాయో. 'దొంగ' కథలో చూడవచ్చు.

భూనిర్వాసితులు "నీళ్ళకోసం" పోరాటం చేస్తే ఒరిగిందేమిటి? జరిగిందేమిటి? చైతన్యం ఎక్కడున్నా కాలరాయడం వల్ల సమాజాన్ని భయపెట్టి ఎవరూ ముందుకు రాకుండా చేస్తే ఈ దేశం బాగుపడేది ఎప్పుడు. ఇతర దేశాల్తో పోటీపడి ఎదిగేది ఎప్పుడు? కూడు, గుడ్డ, నీడ ఉన్న వాళ్ళను అవి లేకుండా చేసినాక అవి కావాలన్నందుకు ప్రాణాలు నీళ్ళలా ఖర్చుయిపోవడం ఏ రకమైన నాగరికత– "నీళ్ళకోసం" కథలో...వెంకటేశం చావు అతనొక్కడిది కాదు. అది చైతన్యాన్ని భయపెట్టే పిరికి చర్య.

భూనిర్వాసితుల పట్ల 'స్వామి' ఆవేదన ఇంతకాలంగా మనకెందుకు లేకపోయింది. అని "పునరావాసం" కథ చదివాక అన్పిస్తుంది. కమ్యూనికేషన్ గ్యాప్ అని మనం తేలికగా తప్పించుకోవచ్చు. ప్రజల గురించి ఆరాటపడే సామాజిక చైతన్యం గల మేధావులు, రచయితలు, ఉద్యమాలు తమ రాష్ట్రంలో జరుగుతున్నదేమిటో తెల్సుకోవాల్సిన బాధ్యతలేమీ లేదా! ఎవరో వచ్చి ఏదో చెప్పేదాకా ఏమీ తెల్సుకోకూడదా! తన కాంక్రీట్ నిర్మాణాలను వదిలి రాష్ట్రంలో కాసిన్ని రోజులైనా పర్యటన చేసి సమాజాన్ని తెల్సుకోకపోతే ఆ చైతన్యం చైతన్యం కాదు. బాధితుల పట్ల సమాజానికి కమ్యూనికేషన్ సృష్టించి స్పందింపజేస్తున్న ఈ కథకుడు రచయితలకు  ఆదర్శం కావాలి.

శ్యాంబెనగల్, ఆనందపట్వర్ధన్, బి.నర్సింగరావు, గిరీష్ కాసరవెల్లి వంటి దర్శకులు ఈ సమస్యల్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్ళి అర్థం చేయించడానికి, స్పందించడానికి ప్రాజెక్టులు, పరిశ్రమల వల్ల ఎంతమంది ఎలా నిర్వాసితులయ్యారో సినిమాలుగా, డాక్యుమెంట్లుగా టీవీ సీరియల్సుగా తీయడం ఒక సామాజిక అవసరం. ఆ బాధ్యతని వారు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఈ రచయిత పౌరసమాజం నుండి వేరే మరో సమాజాన్ని తొంగిచూస్తున్న కోణంలో కొన్ని కథల్ని రాసాడు. ఆ బాధిత ప్రజల దృష్టికోణం నుండి రాస్తే ఈ కథలు మరోలా ఉంటాయి. వారి సంస్కృతి, జీవితం, కుటుంబ సంబంధాలు, సంఘటనలు, సన్నివేశాలు, కల్పన మరింత చిక్కగా అల్లుకుంటాయి. రచయితకు తన పరిమితులు తెల్సు కాబట్టే ఈ శిల్పాన్ని ఎన్నుకొన్నాడు.

ఇందులో భాష గురించి కూడా ఒక మాట చెప్పాలి. ఇందులో అచ్చుతప్పుల్లా కనిపించేవి చాలామేరకు అచ్చుతప్పులు కావు. రచయిత తనదైన భాష రాసేతీరును ఏర్పరుచుకున్నాడు. కోస్తా ప్రాంత భాషను తెలంగాణా భాషలోని ధ్వనికనువుగా మార్చి బోయజంగయ్య తన కథల్లో గొప్ప శిల్పాన్ని సాధించాడు. పి.చంద్ ఈ కథల్లో కోస్తా



భాషను తెలంగాణా భాషకనువుగా రాయడంతో పాటు తెలంగాణా భాషను కోస్తా భాషకనువుగా రాసాడు. అందువల్ల ఇంతదాకా తెలుగు భాషలో పరిచయం లేని ఒక కొత్తవాక్యం, ఒక కొత్త ధ్వని నిర్మాణం ఇందులో కనబడుతుంది. ఎండ్లూరి సుధాకర్ గారి మాదిగ కథల్లోని భాష చర్చనీయాంశమైంది. ఇందులోని భాషకూడా కొందరికి మింగుడు పడని అంశమే అవుతుంది. ఇందులోని ఈ భాష ఇలా రూపొందడానికి కోస్తా భాష తెలంగాణా మాతృభాషపై రుద్దబడ్డం వల్ల మాతృభాషనొదులుకోలేక పరాయి కోస్తా భాషను పూర్తిగా రాయబుద్ధి కాక ఎదుర్కొన్న సంఘర్షణ ప్రధాన కారణం.

ఇది తెలంగాణలో పాఠ్యపుస్తకాలు చదివే విద్యార్థుల నుండి మొదలుకొని సినిమాలు, టీవీలు చూసే, పత్రికలు చదివేవారిదాకా తెలంగాణా వారంతా ఎదుర్కొంటున్న మాతృభాషా సమస్య. దీనిని పరిష్కరించుకోలేక పోతే తెలంగాణా మాతృభాష త్వరలోనే అదృశ్యమైపోతుందనిపిస్తున్నది. అందుకు ఇందులోని వాక్యాల్లో తెలంగాణా పదాలకు బదులుగా కోస్తా పదాలు అనుకోకుండానే వచ్చి పడడం నిదర్శనం. మూడు కోట్ల తెలంగాణా ప్రజలకోసం వారిభాషలోనే పాఠ్యపుస్తకాలు రాయడం దీనికి ఒక పరిష్కారం.

ఈ కథలు సాదాసీదా శిల్పంతో ప్రారంభమై గుండెల్ని పిండేస్తాయి. కథ ప్రక్రియ పరిమితిలోనే ఎంత జీవితాన్ని, ఎంత సామాజిక ఆర్థిక చరిత్రను "వస్తువు"ను చిత్రించవచ్చో. ఈ కథలు తెలుపుతాయి. ఈ కథల్ని ఇంతకన్నా బాగా రాయవచ్చు. అయితే ఈ పని ఇప్పటివరకూ ఎవరూ చేయలేకపోయారు. మోసేవాడికి తెల్సుకావడి బరువు అన్నట్లుగా "వస్తువు"ను కథలో ఇమిడ్చేవారికి తెల్సు శిల్పం బరువు.

ఇవి వ్యక్తిగత జీవితాల కథలు కావు. కాలక్షేపం కోసం అసలు చదవనవసరం లేదు. ఈ సమాజం మారుతున్న క్రమంలో జరుగుతున్న పరిణామాల్ని తెల్సుకోవడం కోసం చదవాలి. సామాజిక శాస్త్రవేత్తలు, పౌరహక్కుల సంస్థలు, పార్టీలు, ఉద్యమాలు చేయలేని పనిని ఈ రచయత చేసి ధన్యుడయ్యాడు.

## తెలంగాణ దళిత కథకులు-కథన రీతులు :

దార్ల రామచంద్ర

# కిర్రు చెప్పులు

కిర్రు చెప్పులు దార్ల రామచంద్ర రాసిన మొదటి కథల సంపుటి. రామచంద్ర 1992లో తెలుగు ఎం.ఏ. పూర్తి చేశారు. సాహిత్యానికి జీవితానికి అవినాభావ సంబంధం వుంది. డిగ్రీ విద్యార్థిగా ఉన్నప్పుడు 1985 నుంచి రామచంద్ర సాహిత్యంతో, సామాజిక చైతన్యంతో సన్నిహిత సంబంధంలా ఉంటున్నారు.

పేదవాళ్ళ జీవితమే ఒక కథ. పేద దళిత కుటుంబంలో 15-11-1960లో పుట్టిన రామచంద్రకు చదువు అబ్బడం, అబ్బి ఉద్యోగం దొరకటం, రచయిత కావడం అన్నీ యాదృచ్ఛిక సంఘటనలే. స్వయం కృషి ఫలితాలే. అనగా యివన్ని అతనికి బోనస్‌గా అందిన అభివృద్ధి. ఏమంటే అతను గోర్కి వారసుడు. అతని కుటుంబంలోని అన్నాతమ్ముడు ఇతర బంధువులు ఎవరూ విద్యనందుకోలేక పోయారు. ఇప్పటికి కూలి పని చేసుకొని బతుకుతున్నారు. వందల బంధువుల్లో రామచంద్ర ఒక్కడే చదువుకొని కాస్త ఉన్నతోద్యోగంతో మధ్యతరగతి స్థాయికి ఎదిగారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజిలో వైస్ ప్రిన్సిపాల్‌గా, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. ప్రేంచంద్, కిషన్‌చందర్, చెహోవ్, జాషువ, కుసుమ ధర్మన్న, బోయి భీమన్న కరుణకుమార్, కొలకలూరి ఇనాక్, బోయ జంగయ్య గార్ల సామాజిక వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ముందుకు సాగుతున్న దార్ల రామచంద్ర పాలేరుగా, కూలీగా మిగిలిపోయే దుస్థితి నుండి తృటిలో తప్పించుకున్నాడు. ఆకలిని జయించడం కోసం బడిలో పెట్టే ఉప్మా మీద ఆశతో చదువు ఒంటపట్టించు కుందామని బడిలో చేరి ఎదిగాడు.

ఓర్వలేని తనంతో దొరలు అతన్ని చదువు మాన్పించడానికి ఆ వూరి స్కూలునే మూసేయించి పాత బాకీ పేరిట పాలేరుగా మార్చారు. మూడేళ్ళు పాలేరుగా పని చేశాడు. పశువుల కాపలాలో కాలు విరిగి అంగవికలుడైనాడు. మూడేళ్ళ తర్వాత అక్కా బావల చేయూతతో తిరిగి బడిలో చేరి ఈ స్థితికి ఎదిగాడు. ఆ క్రమమంతా ఒక చరిత్ర, ఒక సంస్కృతి, ఒక పరిణామం. అతడు జీవితాన్ని గెలుచుకున్న క్రమం సామాజిక అంతర్గత యుద్ధం కన్నా తక్కువ కాదు. అందువల్ల అతని స్వీయకథకు సాహిత్య విలువతో పాటు



సామాజిక చరిత్ర తాలుకు ప్రాధాన్యత ఉంది. బాల చంద్రుడు, బాల్యం బతుకు, బతుకుబడి, కథలు అట్లా సాహిత్యంగా సామాజిక చరిత్రలో భాగంగా ప్రాధాన్యత సంతరించుకున్న ఆత్మకథనాత్మక కథలు.

తన గతాన్ని తాను తిరిగి తెల్సుకునే క్రమంతో తనలో తాను, తన కొరకు తాను, బతికే దశ నుండి యితరుల కొరకుకూడా బతికే పరిణామానికి విస్తరించిన అతని జీవితావగాహనలో భాగంగా తాను జీవించిన కులం, కుటుంబంతో పాటు, తన ఊరును, పల్లెను, పట్నాన్ని ఇందులోని కథలు చిత్రించాయి. తన చుట్టూ జరుగుతున్న అనేకానేక సామాజిక సమస్యలకు, సంఘటనలకు సాహిత్య రూపం ఇవ్వడం ద్వారా దార్ల రామచంద్ర సామాజిక చైతన్యం గల కథా రచయితగా ఎదిగారు. నాటి బాలచంద్రుడు కర్తవ్యం మరచిపోయి, తర్వాత కర్తవ్యంతో ముందుకు సాగి మరణించాడు. నేటి బహుజన బాలచంద్రుడు బతుకే ఒక సామాజిక యుద్ధంగా నిరంతరం పోరాటం చేస్తూ జీవితాన్ని గెలుచుకున్నాడు.

అందువల్ల కథల సంపుటి బాలచంద్రుడి బాల్యంలో ప్రారంభమవుతున్నది మరాఠీ దళిత సాహిత్యంలో ఆత్మకథలదే ప్రథమ స్థానం. తెలుగులో ఇంకా ఆ వొరవడి వేగం పుంజుకోవల్సి వుంది. కలకోటి కిషన్‌రావు 1982లోనే ఇలాంటి ప్రయత్నం చేశాడు. కాని జీవితం సాహిత్యాన్ని తినేయడంతో ఆగిపోయింది. గద్దర్, కత్తి పద్మారావు, బోయ జంగయ్య, గూడ అంజయ్య, మాష్టార్జీ అందెశ్రీ, గోరటి వెంకన్న, ఎండ్లూరి సుధాకర్, జి.కళ్యాన్‌రావు, సతీష్ చందర్ వంటి వాళ్ళు జాషువా లాగా, మరాఠిలో 'ఉచల్యా' నవల రాసిన లక్షన్ గైక్వాడ్‌లాగా తన ఆత్మకథలను తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయాల్సి వుంది. నేను రాస్తున్న ఆత్మకథ కూడా ప్రాథమిక విద్యాభ్యాసం వద్దే ఆగిపోయింది. కంచ అయిలయ్య ఆత్మకథ-ఆత్మకథ పరిధిని అధిగమించి "నేను హిందువునట్లయిత" అనే సైద్ధాంతిక గ్రంథంగా పరిణామం చెందింది. నాగప్ప గారి సుందరరాజు, ఎండ్లూరి సుధాకర్ మాదిగోడు కథల్లో కొంతమేరకు ఆత్మకథా ఘోషనే విన్పించారు. ఇందులోని ఆత్మకథలైన బాలచంద్రుడు, బాల్యం బతుకు, బతుకుబడి, రచయిత పుట్టి పెరిగిన స్థలకాలాల నిర్దిష్టలతో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

ఇందులోని కథలు కేవలం కథలు కావు. అవి సామాజిక చరిత్రను నిక్షిప్తం చేసుకున్న కథానాళికలు. కుల పూరిత గ్రామీణ భూస్వామ్య సమాజం నుండి ఆధునిక సమాజంగా పరిణామం చెందుతున్న ప్రగతి రథ చక్రాల కింద నలిగి పోతున్నదెందరో, రథమెక్కి ఊరేగుతున్నదెందరో ఈ కథల్లో కథా వస్తువుగా సాక్షాత్కరిస్తుంది. పారిశ్రామికీకరణ, గ్లోబలైజేషన్ ఎవరెవరిని తమ వృత్తుల్నించి నిర్వాసితుల్ని చేస్తున్నదో ఈ కథల్లో నిర్దిష్టంగా చిత్రించారు. కులం సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా,

సాంస్కృతికంగా నిర్వహిస్తున్న పాత్రేమిటో ఎంతో వేదనతో చిత్రించారు.

సామాజిక సమస్యల చిత్రణకే పరిమితమైనప్పటికీ ఈ కథల్లో తెలంగాణ బహుజన కులాల సంస్కృతి కూడా ప్రతిఫలించింది. బాలచంద్రుడు కథలో ఆకలి కోసం పేదలు వెనకట (ఇప్పటికీ) ఏమేం తమ ఆహారంగా మార్చుకున్నారో కన్పిస్తుంది. సజ్జ బువ్వ–తాటిపండ్లు–అంబలి చేసికొని తాగడం, తునికి పండ్లుతినడం, రేగుపండ్లు తినడం, గుగ్గిళ్ళు తాటిపండ్లు, తౌడులో బెల్లం కలిపి చేసిన రొట్టెలు, జెల్లలు, చందమామ చాపలు, కలిగంజి, జమ్మీతపండ్లు, గుబ్బకాయలు (పులిచింతకాయలు) ఇవన్ని పేదలు ఆకలి తీర్చుకోవడానికి పనికొచ్చిన తీరును ఒకకథలో అలవోకగా చెప్పిన కథ బాలచంద్రుడు. మూడేండ్లు దొర దగ్గర బాలకార్మికుడుగా పాలేరుగా ఉన్న బాలచంద్రుడు, బాల్యం బతుకు, చిత్రం ఈ కథ. దుర్భర దారిద్ర్యం అంటే ఏమిటో బాల కార్మికులంటే ఎవరో బాలచంద్రుడు బాల్యం బతుకు, బతుకుబడి కథలు కళ్ళకు కట్టిస్తాయి.

దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక ఉట్నూరు, కరీంనగర్, వరంగల్‌లో జరిగిన సదస్సుల మీదుగా హైదరాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో 13, 14 ఫిబ్రవరి 1993లో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర మహాసభలో ఏర్పడింది. అది లక్షలాది బహుజన ప్రజలకు ప్రేరణ అయింది. తెలుగు సాహిత్యంలో 1990–2000 దశాబ్దాన్ని దళిత దశాబ్దం అనే చర్చను ముందుకు తెచ్చింది. వేల ఏళ్ళుగా అణగారిన కులాలు, వర్గాలు నూతనోత్సాహంతో కలం పట్టాయి.

1993 జూన్‌లో హుస్నాబాద్‌లో దళిత, రచయితల, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక ఆధ్వర్యాన కథా వర్క్‌షాప్ జరిగింది. గబ్బిలం మాసపత్రిక ప్రారంభించబడింది. దళితులు తమ జీవితాన్ని ఆత్మకథలుగా రాయాలనే రాష్ట్రకమిటీ పిలుపు నందుకొని దార్ల రామచంద్ర ముందుకుసాగాడు. పూర్తి కాని ఆత్మకథ నుండి ప్రాథమిక విద్యా దశకు సంబంధించిన భాగాన్ని కథగా సవరించి గబ్బిలంలో ప్రచురించిన కథ "బతుకుబడి" తర్వాత ఆత్మకథ రచన ఆగిపోయింది. జీవితం సాహిత్యకర్తవ్యాల్ని తినేయడం వల్ల యిలా ఎందరో సాహిత్యకారులు ఆగిపోతున్నారు. 'బతుకుబడి' కథ స్వాతంత్రానంతరం పల్లెల్లోకి విస్తరించిన విద్యను అందుకోవడానికి సామాజికంగా, ఆర్థికంగా దళితులు పడ్డపాట్లు అవమానాలు ఏమిటో చిత్రిస్తుంది. తన కొడుకు చదువుకోవాలనే ఆరాటాన్ని తెలుపుతుంది. అయితే వీరి చదువుకోవడాన్ని ఓర్వలేని దొర ఇతర కారణాలు చూపి ఊళ్లో బడినే మూయించాడు.

భారతదేశంలో మొట్టమొదట బ్రిటిష్ ప్రభుత్వంలో రిజర్వేషన్లు కల్పించాలని కోరింది బ్రాహ్మణులు తర్వాత బహుజనులకు రిజర్వేషన్లు కల్పిస్తూ సాహు మహారాజ్ చారిత్రక



పురుషుడయ్యారు. అంబేడ్కర్ సైద్ధాంతిక పోరాటం చేసి అటు బ్రిటిష్ పాలకులను యిటు కాంగ్రెస్ బ్రాహ్మణవాదులను ఒప్పించి రిజర్వేషన్ సాధించారు. ఈ రిజర్వేషన్ల వల్లనే కోట్లాది బహుజనులకు ఆధునిక సమాజంలో సముచిత స్థానం అందుతున్నది. దార్ల రామచంద్ర అందులో ఒకరు. అయితే అతని బంధుమిత్రులు మూడువందల మందిలో అతడొక్కడే దీన్ని అందుకోగలిగాడు. ఈ కాస్త అభివృద్ధి కాలరాస్తూ రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రకులాలున్నాయి.

ఎస్టీలది ఎస్టీలకు, ఎస్సీలది ఎస్సీలకు, రిజర్వేషన్‌లో పోగా అగ్రకులాలు తమ జనాభా నిష్పత్తి కన్నా అదనంగా అనుభవిస్తున్నదంతా బీసీలకు చెందాల్సిందే. 1932 నుండి పూనా ఒప్పందంతో పాటే బీసీలకు రిజర్వేషన్లు అమలు జరిగి వుంటే ప్రస్తుత భారతదేశం యిలా ఉండేదికాదు, శ్రమపట్ల గౌరవంతో ఎదిగిన బీసీలతో భారతదేశం ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఎదిగేది. సమగ్రంగా అభివృద్ధి చెందడం కన్నా తమ స్వార్థం ముఖ్యమనుకునే అగ్రకులాల వల్ల దేశం దారిద్ర్యంతో కునారిల్లుతున్నది.

దీని మూడుతరాల చరిత్రను "మూడు తరాలు" కథలో అద్దంలా కొరడాలా చిత్రించిన తీరు ప్రశంసనీయం. అగ్రకులాల్లోంచి వచ్చిన వారు ఇంతకన్నా మంచి కథలు వ్రాయవచ్చు కాని వాళ్లు ఈ విషయంపై గొప్ప కథలు రాసిన వాళ్ళు అరుదు. రాసినవాళ్లకు కూడా ఈ కథలు వారి మొత్తం సాహిత్యంలో ప్రధాన భాగం కాదు. ఈ స్థితి కొలుకలూరి ఇనాక్ గారికి కూడా ఉంది. బహుజన సాహిత్యం ఈ స్థితిని మార్చింది. అట్లా వి.పి. సింగ్ ప్రవేశపెట్టిన మండల్ కమీషన్ సిఫారసుల అమలు తాలూకు ఒక అంశం అయిన రిజర్వేషన్ల వల్ల అతను తన ప్రధానమంత్రి పదవినే కోల్పోయారు. సామాజిక చర్చను తప్పుదారి పట్టించడానికి మండల్‌కు వ్యతిరేకంగా "కమండల్", రామజన్మభూమి సమస్య ముందుకు తెచ్చి ఈ అభివృద్ధి అందుకోవాల్సిన బహుజనాన్ని ద్వేషాలు రెచ్చగొట్టి మతవ్యతిరేక మిలిటెంట్లుగా మార్చి భస్మాసుర హస్తంలా మారి వారే హతులయ్యే క్రమాన్ని అగ్రకుల హిందూ ఫాసిస్టులు ముందుకు తెచ్చారు. "మూడుతరాల కథ" కు ఇదంతా నేపథ్యంగా ఉంది. ఈ చరిత్ర తెలియకపోతే కథను కేవలం శిల్పం ఆధారంగా చూసే వారికి నిరాశకలగడంలో ఆశ్చర్యం లేదు. బహుజన కథకులు కూడా దార్ల రామచంద్ర రాసినంత స్పష్టంగా కథల్లో ఈ విషయాన్ని చెప్పలేక పోయారు. అదే ఈ కథలకు ఒక ప్రత్యేకతను సంతరింపజేస్తున్నది.

"కిర్రు చెప్పులు" కథ గడిచిపోయిన గ్రామీణ జీవితాన్ని ఆధునిక సమాజంలో సముచిత స్థానం సంపాదించుకున్నాక రేపటి పౌరులు ఎదిగే బాలలకు చరిత్రను మౌఖికంగా అందించే కృషితో భాగంగా రూపుదిద్దుకొంది. దళిత జీవితాలకు కిర్రు చెప్పుల తయారి ఒక ప్రతీక. అందువల్ల బహుజన జీవితాలను స్ఫురింప చేయడానికి కథల

సంపుటికి "కిర్రు చెప్పులు" సరైన పేరని డా॥ కాలువ మల్లయ్య గారు సూచించడం అభినందనీయం. తోలును శుభ్రపరిచే మానవ సమాజ తొలి పారిశ్రామిక విప్లవం తాలూకు వృత్తి తీరుతెన్నులను ఈ కథ చక్కగా చిత్రించింది. ఈ కథలో కొసమెరుపు మరింత ఆసక్తికరంగా ఉంది.

ఆ వృత్తి వూడితే వూడింది. ఆత్మగౌరవం మిగిలింది. అంటరానితనం తగ్గుముఖం పట్టింది. ఈ విధానం వల్ల పూర్తిగా మార్పురాకపోయిన పాక్షికంగా మార్పు జరిగినందులకు మైసయ్య భద్రంకు గొప్ప మానసిక సంతోషంగా ఉంది.

గతం పట్ల ఈ వివేచన ఉన్నప్పుడు వెనుకటి కాలం మంచిది అని రాసే రచయితల దృక్పథంలో మార్పు వస్తుంది. అభివృద్ధిని ఆహ్వానించే, అనుభవించే వాళ్ళు సైతం వెనుకటికాలం గొప్పది అనే అర్థం కలిగే విధంగా రాయడం జరుగుతున్నది. అరసం, విరసం రచయితలు కూడా అదే గాడిలో నడవడం వారి చైతన్య రాహిత్యాన్ని సిద్ధాంత రాహిత్యాన్ని అధ్యయన రాహిత్యాన్ని తెలియజేస్తున్నది.

ఇటీవల సామాజిక అభివృద్ధి బాధితులు ఆత్మహత్యలు చేసికొని చనిపోవడం ఎక్కువైంది. గిట్టుబాటు ధరలేక, పంటరాక పత్తిరైతులు వందలాది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చీరాలలో చేనేత కార్మికులు ఎందరో తనువులు చాలించారు. సిరిసిల్లలో ఎందరో పవర్‌లూం కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరి సామాజిక ఆర్థిక, రాజకీయ, కారణాలను విశ్లేషిస్తూ కొన్ని కథలే వచ్చాయి. వచ్చిన కథల్లో ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితుల గురించే తప్ప అందుకుగల గ్లోబలైజేషన్, కేంద్రప్రభుత్వ పారిశ్రామిక విధానాల కారణాలను కథల ద్వారా అనగా జీవితాల ద్వారా నిర్ధారించలేక పోయారు. ఇది ఆయా కథకుల అధ్యయన ఆవశ్యకతను తెలుపుతుంది.

కాలువ మల్లయ్య, జూకంటి జగన్నాథం, ఐతా చంద్రయ్య పద్మశాలీల వలసల గురించి, బాలకార్మికుల గురించి, ఆత్మహత్యలు గురించి కొన్ని కథలు రాశారు. ముదుగంటి సుజాతారెడ్డి పత్తిరైతుల ఆత్మహత్యల్ని "జవాబులేని ప్రశ్నలు" కథలో చిత్రించాలని ఆశించారు. దార్ల రామచంద్ర "బతుకుధార" కథలో పద్మశాలీలు చేనేత వృత్తి కోల్పోయి భివండి వలస వెళ్లిన కార్మికుల గురించి, సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల ఆత్మహత్యలకు గురవుతున్న క్రమం గురించి "పత్తికాటు" కథలో పత్తి రైతుల ఆత్మహత్యల గురించి చిత్రించి చరిత్రను సాహిత్యీకరించాడు. ఈ సామాజిక సమస్యలపై రాయని భాస్కరుల కన్నా అలతి అలతిగా రాసేవాళ్ళే అభినందనీయులు. అలా అని పఠనీయతలేని కథలు కావివి.

గోరటి వెంకన్న, కాలువ మల్లయ్య, కె.వి. నరేందర్, సుద్దాల అశోక్‌తేజ వంటి



రచయితలు వెనుకటి సంస్కృతి సాంప్రదాయాల్ని పల్లె జీవితాన్ని ఆరాధిస్తూ కథలు నవలలు, పాటలు రాశారు. పల్లె జీవితం ఎంత క్రూరమైనదో ప్రేమ్‌చంద్ ఎన్నో కథలు రాశాడు. పారిశ్రామిక నాగరికతలో అభివృద్ధిని అందుకున్న వాళ్ళు హాలిడే ఎంజాయ్‌మెంటుగా విశ్రాంతిని గురించిన ఆలోచనలతో పల్లెల్ని ఆరాధిస్తున్నారు తప్పితే వీళ్లందరిని పల్లెల్లో ఉండమని శాసిస్తే మొట్టమొదట వ్యతిరేకించేది వీళ్ళే. కులవృత్తుల్ని గొప్ప చేస్తూ ఆధునిక అభివృద్ధి మార్గాలకు బదులుగా వాటిలో మునిగితేలే సంస్కరణల గురించి మాట్లాడే మేధావుల్లో మార్క్సిస్టులు, నక్సలైట్లు కూడా ఉండటం ఆశ్చర్యకరం. ఐతే అలా అవే కులవృత్తులు వీరు చేయవచ్చు కదా? విద్య ద్వారా అందే వృత్తులు చేయడం దేనికి అని ప్రశ్నిస్తే వీరి వద్ద జవాబు లేదు.

నీ అన్నం నాకుపెట్టు నీకు ఆకలి కాకుండ మందిస్తానన్నాడట వెనుకటికొకడు. ఈ ఆధునిక అభివృద్ధి అందుకొని కులవృత్తులను వదిలేసే మార్గాలను ప్రణాళికలను రూపొందించడం అవసరం. కొందరు అలా కాకుండా కులవృత్తుల్లో కూరుకుపోవాలని సూచనలు చేస్తున్నారు. ఇలాంటి వాళ్ళు పల్లె జీవితాన్ని ఆదర్శీకరిస్తున్నారు. వాళ్ళ పిల్లలను మాత్రం ఇంగ్లీష్ మీడియంలో చదివిస్తారు. వాళ్ళ పిల్లలకు పల్లెల ముఖాలు గాని కులవృత్తులు కాని తెలువవు. వారికి వారి పిల్లలకు ఆధునిక అభివృద్ధిని అందుకోవడంలో పోటీ రాకుండ ఉండడం కోసం వెనుకబడి పోయిన వారిని కులవృత్తుల్లో ఉండిపొమ్మని దారి మళ్లిస్తున్నారు. వీళ్ళు మిత్రుల రూపంలో కొనసాగుతున్న శత్రువులు. అగ్రకుల మార్క్సిస్టులు నక్సలైట్లు ఇవాలటి అభివృద్ధి మాకు రేపటి అభివృద్ధి మీకు అని పోరాటాలు చేయమంటారు. ఇలాగే బహుజన మేధావులు రచయితలు కొందరు నేటి సామాజిక అభివృద్ధి రిజర్వేషన్ ఫలాలు మాకు, కులవృత్తులు దరిద్రం మీకు కనుక సాంప్రదాయ వృత్తుల రక్షణకు పోరాడ మంటున్నారు. ఈ రకం భావజాల ప్రభావం సాహిత్యంలో బలంగానే ఉంది. దార్ల రామచంద్ర కూడా తనకు తెలియకుండానే దీని ప్రభావానికి లోనైనట్లుగా చాకిరేవు, అమ్మచెప్పిన కథ, అస్సోయిదూల, నా పల్లె గుండె పగిలింది కథలు తెలుపుతాయి.

కథలు, సాహిత్యం జీవిత వాస్తవికతను ప్రతిఫలిస్తూనే జీవితం పట్ల నిరాశను కాకుండా ఆశను విశ్వాసాన్ని కలిగించి వారికి తోడునివ్వాలి. అందుకు సమాజాన్ని రేపటి భవిష్యత్తును దర్శించగలిగే దార్శనికత అవసరమౌతుంది. ఈ కథల్లోని నిరాశ స్థానే ఆశ, దుఃఖం స్థానే సుఖాన్ని, కష్టాలని అధిగమించి గెలుచుకొనే మార్గాలు దర్శనమివ్వడం అప్పుడే సాధ్యమౌతుంది.

వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్ ఆ కాలంలో వచ్చిన ప్రకృతి ప్రేమ సాహిత్యం తెలుగులో జాతీయోద్యమ కాలంలో కాల్పనిక అమలిన శృంగారం రూపం మలుచుకున్నది. అటు

యూరప్‌లో గాని ఇటు మనదేశంలో గాని ప్రకృతి ప్రేమ చూపిన కాలంలో ఆధునిక అభివృద్ధి తనతో పాటు వెంటతెస్తున్న వేగం, పని ఒత్తిడి మానవ సంబంధాల మధ్యగల సంక్లిష్టత సంఘర్షణ నుండి సెలవు విడిదిగా ప్రకృతిని పల్లెని ప్రేమించే సాహిత్యం రాశాడు. అనగా వారంతా ఆధునిక అభివృద్ధి అందుకుంటే కాని సెలవు విడిదిగా (ఫాంహౌజ్) పల్లెల ప్రకృతిని ప్రేమించారు. తెలుగులో తెలంగాణ సాహిత్యంలో పల్లెల ప్రకృతిని ఆదర్శీకరించే సాహిత్యం సరిగ్గా అలాంటిదే.

అయితే పల్లెల్ని కులవ్యవస్థ విషం నుండి, అమానుషత్వం నుండి మానవీకరించి పట్టణ ప్రాంతాలలోని ప్రజాస్వామిక దృక్పథాలతో అభివృద్ధి పరిచినప్పుడు పల్లెలు ఆధునికతను వాటన్నిటికి ప్రతిఫలంగా 'ఇంకా ఎన్నాళ్ళీ నరమేధం?', 'మమ్మల్ని బతకనివ్వరా?', 'పల్లెతల్లి గుండెగోస', కథలుగా రూపొందాయి. నాకు అంకితమివ్వబడిన ఈ కథల సంపుటిలో అంబేద్కరిజం దృక్పథం జీవితమంత స్పష్టంగా సాక్ష్యాత్కరిస్తుంది.

2001 సం॥లో భారతీయ దళిత సాహిత్య అకాడమి న్యూఢిల్లీ వారి నుండి డా॥ బి.ఆర్. అంబేద్కర్ సాహిత్య ఫెలోషిప్ అవార్డు అందుకున్న దార్ల రామచంద్ర కథల్లో పేదప్రజల పట్ల ఆర్ధి ఉంది. వారి కన్నీటిలో తన కన్నీళ్ళు కలిసి ఉన్నాయి. వారి కష్టాలు తొలగి మంచి బతుకు బతకాలనే సంకల్పం ఉంది. అందువల్ల ఇది బహుజన ప్రజల పక్షం నిలబడిన కథలైనాయి. దార్ల రామచంద్ర జీవితంపై, కథలపై ఎం.ఫిల్, పిహెచ్.డి. పరిశోధనలు చేయాల్సిన అవసరం వుంది. అప్పుడే కష్టాల్లోంచి, పీడితకులాల్లోంచి కథకులుగా ఎదగడంలో ఎదురయ్యే అవరోధాలేమిటో వారు సాధించిన విజయాలు ఎంతగొప్పవో స్పష్టమవుతాయి.

దార్ల రామచంద్ర కిర్రు చెప్పులు కథల సంపుటి వెలువడిన తరువాత అదే ఉత్సాహంతో 30కు పైగా వివిధ కులాల గురించి, కులవృత్తుల గురించి మారుతున్న సమాజం గురించి చక్కని కథలు రాశాడు. వాటిని పుస్తకం రూపంలో తీసుకురావాల్సిన అవసరం ఉంది. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ వైస్‌ప్రిన్సిపాల్‌గా పదోన్నతి రావడం వల్ల పనివత్తిడిలో కథలు రాయడం తగ్గినట్టుంది. తెలంగాణ రచయితల వేదికలో చేరి ఉత్సాహంగా పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన కోణంలో మరికొన్ని కథలను రాశాడు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో వెనకబడిన ప్రాంతాలు, కులాలు కాస్త వెనకబడి సంకోచంతో ముందుకు నడుస్తుంటారు. లోప్రొఫైల్ మెయిన్‌టెయిన్ చేస్తుంటారు. కొందరు నోరు పెట్టుకొని ముందుకు సాగుతూ కొన్ని కథలు రాసినప్పటికీ సాహిత్య చరిత్రలో, కథా సంకలనాల్లో ప్రముఖంగా చేరుతుంటారు. దార్ల రామచంద్ర ఈ విషయంలో వెనకబడిపోయాడు. ఒక స్థాయికి ఎదిగాక వెనకబడివుంటే ప్రోత్సహించేవారు తక్కువ.



తమకు తామే ఆత్మవిశ్వాసంతో చుట్టూ వున్న సమాజంలో స్నేహితులను, సాహితీ మిత్రులను ఎదిగించుకుంటూ తన స్థానం కోసం ముందుకు సాగాల్సి వుంటుంది. ఎవరో పట్టించుకొంటారని ఒకస్థాయికి ఎదిగాక ఎదురు చూడ్డం వల్ల సాహిత్య కృషికి ఎంతో నష్టం. సాహిత్య సృజన ఆగిపోతుంది. అందువల్ల తమకు తామే ఎదిగే కృషి చేయాలి. ఎదిగే క్రమంలో ప్రోత్సహించే బదులుగా అసూయతో విమర్శించడం కూడా జరుగుతుంది. ఇవన్నీ సహజం. వాటన్నిటినీ అధిగమించుకుంటూ యువ రచయితలు ముందుకు సాగాలి.

కులవృత్తులు కోల్పోతూ ప్రణాళికబద్ధ అభివృద్ధిలో వారి స్థానమేమిటి స్పష్టం కాని దశలో దశాబ్దాలుగా పతనమవుతు శిథిలమౌతున్న జీవితాలకు హారతి పట్టిన దార్ల రాంచంద్ర ఎంతో అభినందనీయుడు. ఎన్నో కష్టాలు కడతేరి నూతన శతాబ్ది ప్రారంభం నుండి వేగంగా కథలు రాస్తూ ఈ సంపుటి వెలువరిస్తున్న దార్ల రాంచంద్రకు కూడా కోస్తా భాష ప్రభావం నుండి తెలంగాణ భాషకు మారడానికి నేర్చుకున్నది వదిలేస్తున్న క్రమం ఇందులో కనపడుతుంది. అందువల్లనే బతుకుబడి కథ సాఫీగా కనపడి అస్సోయిదూల కథ ఇతర కథలు మొరటుగా కనపడడానికి భాష పట్ల మనకు ఏర్పడ్డ దృక్పథమే కారణం తప్ప శిల్పం లేకపోవడం కాదు. అందులోని భాషను ప్రజల భాషగా గౌరవించడానికి సిద్ధ పడితే దాని గొప్పతనం తెలుస్తుంది.

తెలంగాణ ప్రజల ఆత్మను ఆవిష్కరిస్తున్న ఈ కథల్ని తెలుగు సాహిత్యం సాదరంగా ఆహ్వానిస్తూ అక్కున చేర్చుకొంటుందని ఆశిస్తూ అభినందిస్తున్నాను. ఈ పుస్తకాన్ని వినయ పూర్వకంగా ఇచ్చిన అంకితాన్ని సగౌరవంగా స్వీకరిస్తున్నాను.

నూతన శతాబ్ది యువ కథకుడు లక్ష్మిరాజం

# తిరుగు ప్రయాణం కథల సంపుటి

నల్లాల లక్ష్మిరాజం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదువుకొని పెరిగిన వాడు. వాళ్ల ఊర్లో దళితుల్లో తొలి అక్షరాస్యుడు. జగిత్యాలకు 10 కి.మీ. దూరంలో ఉన్న తక్కెళ్ళపెల్లి గ్రామంలో 5-10-1970లో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు. డిగ్రీ చదువు తోనే ఆగిపోయాడు. తొలితరం అక్షరాస్యులెదుర్కొనే ఈతి బాధలన్నీ లక్ష్మిరాజం కూడా అనుభవించక తప్పలేదు. 1985 నుండి అంబేడ్కర్ యువజన సంఘం నిర్మాణంలో చురుకుగా పాల్గొనడం ద్వారా సామాజిక వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నాడు. తన చుట్టూ జరుగుతున్న చరిత్రకు ప్రత్యక్ష సాక్షి, పాత్రధారి కూడా. అందువల్లే తొలి దశలోనే ఇలాంటి మంచి కథలు రాయగలిగాడు.

భారతదేశ చరిత్రలో తెలంగాణా ప్రాంతానికి ఒక ప్రత్యేక అస్తిత్వమున్నది. దక్కను పీఠభూమిగా ప్రాచుర్యం పొందిన ఈ ప్రాంతం ప్రకృతి జల సంపదల పరంగా జీవన వైవిధ్యంతో సమతుల్యతతో ప్రపంచంలోనే అరుదైన విశిష్టతను సాధించుకున్నది. తెలంగాణాలోని అడవులు పక్షులు జంతుజాలం వాగులు, నదులు, గొలుసు చెఱువులు, గుట్టలు, కొండలు, మట్టిరాళ్ళు అన్నీ ఎంతో వైవిధ్యంతో కూడుకొని ఉన్నాయి. ఇవి ఒక మినీ ప్రపంచాన్ని తలపిస్తాయి. రాజకీయంగా రక్షణ పరంగా ఇది సురక్షిత ప్రాంతం కావడం వల్ల ఇక్కడ సుస్థిర పాలనతో కొన్ని శతాబ్దాల పాటు ఆయా రాజవంశాల పరిపాలన కొనసాగడం సాధ్యపడింది.

బౌద్ధం కన్న పూర్వం నుండి ఉన్న తెలాంగులు గాంధార (ఆఫ్ఘనిస్తాన్) దాకా వెళ్ళి ప్రసిద్ధి పొందిన వారు ఉన్నారు. శాతవాహనులు ఒక గిరిజన తెగ నుండి ఎదిగి రాజవంశాన్ని స్థాపించి శాలివాహన శకాన్ని ప్రపంచానికి అందించారు. సిముకుడు అనే రాజు పేరును శ్రీముఖుడుగా సంస్కృతీకరించి చరిత్రను బ్రహ్మణీకరించారు. శాతవాహనులు గిరిజనులని వారికి సంస్కృతం రాదని "మోతాడకై" అనే చర్చ చక్కని ఉదాహరణ. ప్రపంచానికి వందలాది గొప్ప కథలను సేకరించి అందించిన గుణాఢ్యుడు, హాలుడు శాతవాహన రాజు కూడా. పాలి భాషలోను, ప్రాకృత గాథల్లోను, ప్రాచీన సాహిత్యంలోను, తెలంగాణా తెలుగు, తెలుగు వారి బతుకు నిక్షిప్తమై ఉన్నాయి. పాల్కురికి సోమనాథుడు, వేములవాడ భీమకవి, బమ్మెర పోతన, కవయిత్రి మొల్ల మొదలుకొని శేషప్ప, భక్త రామదాసు, రామ సింహ కవి దాక ఎందరో మహానుభావులు ఇక్కడ వెలిసారు. మహోజ్వల చరిత్ర కలిగిన తెలంగాణా ప్రాంతానిది ఒక ప్రత్యేక జాతి అస్తిత్వం అని కూడా చెప్పవచ్చు. తెలంగాణా సంస్కృతి, చరిత్ర విశిష్టత దీన్నే బలపరుస్తున్నవి. దక్షిణ భారతదేశంలోనే కాకుండా మొత్తం భారతదేశంలోనే తెలంగాణా సంస్కృతికి కొన్ని ప్రత్యేకతలు సాంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మాతృదేవత ఆరాధనలో భాగంగా పోచమ్మ, ఎల్లమ్మ, కట్టమైసమ్మ మొదలైన అమ్మ దేవతలు ఇక్కడ కొలవబడుతున్నారు.

ఇట్టి తెలంగాణ ప్రాంతం తనదైన చరిత్రను సంస్కృతిని మానవ సంబంధాల్ని కథలలో నవలలో నిక్షిప్తం చేయడం జరుగుతున్నది. తెలంగాణ కథలు తెలంగాణ ప్రాంత సామాజిక చరిత్రను తెలిపే కాలనాళికలు. నల్లాల లక్ష్మిరాజం వ్రాసిన కథలు అందులో భాగమే. ఇందులోని ప్రతి కథలో తెలంగాణ ప్రాంత సామాజిక చరిత్ర చిత్రించబడింది. ఈ కథలు చదివినాక తెలంగాణ సమాజంలోని మరికొన్ని కోణాలను మొదటిసారిగా తెలుసుకొన్న అనుభూతి కలుగుతుంది. జీవితమే ఆ ప్రత్యేకతకు కారణం.

గత పన్నెండేళ్లుగా తెలుగు కథ, గత వందేళ్లుగా ఎన్నడూ లేని విధంగా మహోన్నతంగా వస్తు వైవిధ్యంతో, శిల్ప వైవిధ్యంతో విస్తరిస్తూ వస్తున్నది. అప్పటిదాక సాహిత్య వస్తువుగా నోచుకోని ఎన్నో అంశాలు గత పది పన్నెండేళ్ళుగా చిత్రించబడ్డాయి. గత నూరేళ్ళలో ఏ దశాబ్దంలో రానన్ని గొప్ప నవలలు 1990 నుండి 2002 వరకు గల పది పన్నెండేళ్ళలో వెలువడ్డాయి. ఇవన్నీ అప్పటిదాకా సాహిత్యాన్ని ఆక్రమించిన దోపిడి కులాల మధ్య తరగతి జీవిత కథా వస్తువుకు భిన్నమైనది.

నల్లాల లక్ష్మిరాజం ఇప్పుడిప్పుడే కలం పట్టిన కథారచయిత అయినప్పటికి లబ్ధ ప్రతిష్టులయిన కథా రచయితల శైలి, శిల్ప, వస్తు విన్యాస స్థాయిని అందుకొన్నాడని ఈ కథలు నిరూపిస్తాయి. లక్ష్మిరాజం కథల్లో కాలువ మల్లయ్య, కె.వి.నరేందర్ కథల వలె చక్కని స్పష్టతతో పాటు సుస్పష్టమైన అభివ్యక్తి ఉంది. చెప్పదలుచుకున్న విషయం పట్ల తడబాటు లేనితనం ఇందులో చూడవచ్చు. ఎంతగొప్ప విషయాన్నైనా అలవోకగా వ్రాసే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని ఈ కథలు సాక్ష్యం ఇస్తాయి.

నల్లాల లక్ష్మిరాజం కథలు తెలంగాణ గురించి తెలియని వారికి ఒక పరిచయాన్ని అందిస్తాయి. తెలంగాణ గురించి తెలిసిన వారికి ఒక కొత్త కోణాన్ని తెలియజేస్తాయి. తెలంగాణలో జీవిస్తున్న వారికి ఒక కొత్త అనుభూతిని తమ జీవితాలను సాహిత్యకరించిన

తీరును చూసుకొని మురిసిపోయి ఆత్మవిశ్వాసం పొందుతారు. ఇందులోని కథలు దళితులకు ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతాయి.

విషాదాంత కథల రూపంలో చూపే సానుభూతి ద్వారా అమలు అయ్యే హింస ద్వారా తెలంగాణా సమాజం అవమానానికి అల్పత్వ భావనకు, అణిచివేతకు గురిచేయబడుతుంది. పాఠకుల్లో ఆత్మవిశ్వాసాన్ని బ్రతుకుపట్ల ఆశను పెంచుతూ బాధితుల పక్షాన నిలబడడం రచయితల కర్తవ్యం, నల్లా లక్ష్మీరాజం ఆ పనిని ఈ కథల్లో సమర్ధవంతంగా చేశాడు.

“తిరుగు ప్రయాణం” కథలో  పరస్పర అవిశ్వాసం, భయం, మనుషులను సమాజ పరిణామాలను ఎట్లా అతలాకుతలం చేస్తాయో చూడవచ్చు. తన పాలేరు కొడుకు నక్సలైట్లలో కలిసాడని దొర, దొర తనను పోలీసులకు పట్టిస్తాడని పాలేరు కొడుకు ఇద్దరు ఊళ్ళోంచి పారిపోతారు. గౌరారం సమీపంలో ఒక హోటల్‌లో ఇద్దరు తటస్థ పడటంతో కథ ప్రారంభమవుతుంది. కథ ఎత్తుగడ రచయిత చేయి తిరిగినతనాన్ని తెలుపుతుంది. శాంతియుత సహజీవనం ద్వారా శాంతియుత పరివర్తన జరగాల్సిన చిన్న చిన్న విషయాలు కూడా సాయుధ, మిలిటెంటుపోరాటాల వల్ల పరిష్కరించబడకుండా ఘనీభవించి ఇరుపక్షాలు తాము పుట్టి పెరిగిన నేలకు దూరమయ్యారు.

‘ఢాం’ అన్న శబ్ధంతో దొర గుండె గుభేల్‌మంది. కారు ఆగిపోయింది. అప్రయత్నంగా కళ్ళు మూసుకున్న దొర ముక్కోటి దేవతల్ని తలపించసాగాడు. “భగవంతుడా, నా చావు ఇట్ల రాసి పెట్టినావా? బయలు దేరంగా పిల్లి ఎదురైతేనే మనసు ఏదో కీడు శంకించింది. అనుమానం వచ్చినప్పుడు అక్కడే ఆగిన మంచిగుండు.”

కళ్ళు మూసుకున్న దొరకు ఎవరో దగ్గరకు వస్తున్నట్లు నీడగా అగుపించడంతో “అన్న... అన్న... మీకు దండం బెడ్తన్న... నన్ను చంపకుండ్రి అన్న నేనేం పాపం చేయలేదన్న. గదొక్క చిన్న పొరపాటు తప్ప, నన్ను క్షమించుండ్రి అన్న, రేపో మాపో సచ్చే ముసలోన్ని నన్ను చంపితే ఏమత్తదన్న మీకు” బిగ్గరగా అరుస్తూ విలపించసాగాడు నారాయణరావు దొర.” అంటూ కథ మొదలవుతుంది.

హైదరాబాద్ నుండి కరీంనగర్ వెళ్ళే దారిలో గౌరారం వద్ద కారు టైరు పగలడంతో భయపడ్డ దొరను డ్రైవరు అదేమీ కాదని చెప్తాడు. దాహంతో, భయంతో పిడసగట్టిన దొర సమీపంలో గల హోటల్‌లోకి నడుస్తాడు. హోటల్‌లో వాళ్ళ ఊరి రాజేష్ కనపడి భయంతో వణికిపోతాడు. దొరను చూసి రాజేష్ కూడా వణికిపోతాడు. రాజేష్ అన్నల్లో కలిశాడని దొర అనుకున్నాడు. కానీ భయంతో ఊరు విడిచి పారిపోయాడు. మళ్ళీ ఊరు మొఖం చూడలేదు. దొర రాజేశ్ అన్నల్లో కలిసి ఎక్కడ చంపుతాడోనని పారిపోయి



పట్నం చేరతాడు. ఇలా పరస్పరం భయంతో ఐదేళ్ళు గడిపారు. అసలు విషయాలు తెలుసుకున్నాక రేపు ఇద్దరం కలిసి ఊరికి పోదాం తయారుండు అంటాడు దొర. అనుకున్నట్టుగానే మరుసటి రోజు వచ్చి కారులో ఇద్దరు కలిసి ప్రయాణమయ్యారు. అక్కడ ఊర్లో చూస్తే నారాయణ రావు దొర పారిపోయాక రాంరెడ్డి దౌర్జన్యాలు పెరిగాయి. ఎవరో ఒక దొరను చంపడంతో పోలీసుల వేట మొదలైంది. బతుకు జీవుడా అంటూ ఒకరిద్దర్ని కలిసి తిరిగి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

ఈ కథలో తెలంగాణ ప్రాంత మూడు దశాబ్దాల విషాదం దాగి వుంది. చట్టబద్ధ అవకాశాలు సరిగ్గా ఆచరణలో ఉపయోగించుకుంటే సామాజిక ఉద్యమాలు లేవనెత్తిన సమస్యలు ఇంత జటిలమై ఉండేవి కావు అని కూడా గుర్తించవలసి ఉంది.

“రాజవ్వ కొడుకు” కథ పేరులోనే ఒక ప్రత్యేకతను సూచిస్తున్న కథ. తన పిల్లలను చదివించుకోవాలని తల్లిపడే తపన ఇందులో చూడవచ్చు. రాజవ్వ కొడుకు కథ ప్రతి ఎస్.సి. ఇంటా ఎప్పుడో ఒకప్పుడు జరిగిన కథే. బడుగు వర్గాల చదువులను దొరలు, రెడ్లు ఎన్ని రకాలుగా అడ్డుకొనేవారో ఈ కథలో మనకు ప్రత్యక్షమవుతుంది. తల్లిదండ్రుల బానిస బుద్దులు నిస్సహాయత దొరల, రెడ్ల పెత్తనాన్ని ఎట్లా కొనసాగింపచేస్తాయో ఈ కథలో చూడవచ్చు. “కిర్రు చెప్పులు” కథల సంపుటి ఫేం, యువ రచయిత దార్ల రాంచంద్ర ఇట్లా పాలేరుగా పనిచేసి కాలు విరగ్గొట్టుకోవలసి వ్చింది. అతనిప్పుడు లెక్చరర్ అయినప్పటికినీ ఆ అవిటితనం  గతానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచేవుంది.

“ఓరి పోడ ఇట్రా” పిలిచాడు రాజేశ్వర్ రావు దొర.

బడికి వెళ్తున్న దేవయ్య ఆగి ‘ఏంటి’ అన్నట్లు చూసాడు.

“గా కోమటోనింటికి పోయి నా పేరు చెప్పి ఒక పొగాకు రెమ్మ ఇయ్యమనుపోర”.

“నేను పోను నాకు బడికి ఆలస్యమైతది”

“ఏందిరో! పని చెప్పితే మర్ర వడుతున్నవ్ కావురమార” అంటూ కథ మొదలవుతుంది. ఇలాంటి సామాజిక సంబంధాల జీవితం నుండి రాజవ్వ కొడుకు ఎదుగుతాడు. చదువుకుంటాడు. ఆ ఊరికి సర్పంచ్ అవుతాడు. కాలం మారింది. అవగాహనలు మారుతున్నాయి. దొరల వారసులు దొరతనం వదిలి సమాజంలో కలిసి జీవించే సంస్కృతిని అలవర్చుకుంటున్నారు. బేధభావాలు క్రమంగా సడలుతున్నాయి. ఆ క్రమంలో దేవయ్యపై దొర కూతురు పద్మ మనసుపడుతుంది.

కథచివర్లో “ఔను ఆంటీ... ఇంత గొప్ప మేధావి, వక్త మన గ్రామంలోనే ఉండంగా మరి మా మమ్మీ, డాడీ నాకు ఎక్కడెక్కడో సంబంధాలు వెతుకుతుండ్రు అనవసరంగా.”

అంటూ ముసి ముసిగా నవ్వింది పద్మ.

భారతి నవ్వుతూ "అమ్మ దొంగా" అంటూ పద్మ బుగ్గ గిల్లింది.

అన్ని కష్టాల్లోను ఎలాగోలా ఈదుకుంటూ వచ్చి చదువుకొని చైతన్యవంతుడైన దేవయ్య సర్పంచ్‌గా ఎదిగి అందరి మన్ననలు పొందే క్రమం రాజవ్వ కొడుకు కథలో కనబడుతుంది. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లు దళితులకు ఎంత గొప్పగా వెలుగునిచ్చాయో ఈ కథ చెప్పకయే చెబుతుంది. దార్ల రాంచంద్ర, నల్లాల లక్ష్మిరాజం, ప్రఖ్యాత కవులు గూడ అంజయ్య, గోరటి వెంకన్న మొదలైన వారెందరో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో పెరిగి ఎదిగినవారే. ఇలా రాజవ్వ కొడుకు కథ వేలాది దళితుల ఆత్మకథలకు ఒక ప్రతీక. బాపురెడ్డి కూతురు పద్మ దేవయ్య వ్యక్తిత్వాన్ని చూసి మురిసిపోయి "అవును ఆంటీ! ఇంత గొప్ప మేధావి, వక్త మన గ్రామంలోనే ఉండంగా మరి మా మమ్మీ, డాడీ నాకు ఎక్కడెక్కడో సంబంధాలు వెదుకుతుంద్రు అనవసరంగా" అంటూ ముసిముసిగా నవ్వింది పద్మ" కథలోని ఈ కొసమెరుపు వల్ల ఇది దళిత సోషలిస్టు వాస్తవిక కథగా మారింది. కాలక్రమంలో వర్గ వైరుధ్యాలను సమాజం ఎట్లా పరిష్కరించు కుంటుందో, ఎలా పరిష్కరించుకోవాలో ఈ కథ అద్భుతంగా, సహజంగా చిత్రీకరిస్తుంది.

శంఖంలో పోస్తేనే తీర్థం అయినట్లు సమాజంలో కులరీత్యా, అధికారరీత్యా, ఆధిపత్యంలో ఉన్నవాల్లదే సరైన దృష్టిగా చెలామణిలో ఉంటుంది. పై వాళ్ళు మెచ్చుకోవాలనే తపనలో కూడా ఇదే ఉంటుంది. పల్లెల్లో దొరలకు, రెడ్లకు ఏది చేస్తే ఇష్టమో, అది చేసి తమనుతాము కుదించుకుని వారి మెప్పు పొందాలని చూస్తారు.

అందుకే రాజవ్వకొడుకు కథలో పెద్ద కొడుకులు ఇద్దర్ని పటేండ్లు పని మంతులని మెచ్చుకుంటుంటే, తన పేరు నిలబెట్టే కొడుకులని ఉప్పొంగిపోతాడు రాజనర్సయ్య. రచయితే స్పష్టంగా చెప్పినట్టు "ఇతర కులస్థులు కూడా దొరలు, పటేండ్లు మంచివారు అంటే మంచివారు, చెడ్డవారు అంటే చెడ్డవారు అని నమ్ముతారు. అధికారం, సాంఘిక హోదా, ఏ నిర్బంధం లేకుండానే తమకనుకూలంగా సమాజాన్ని శాసిస్తూ అణచివేస్తుందో దీనిలో గమనించవచ్చు.

అందుకే అధికారం కోసం పెద్ద దొరల స్థానాన్ని ఆక్రమించాలని మోతుబరి రెడ్డీలు దొరల కన్నా హీనంగా ప్రవర్తించడం సర్వసాధారణమైంది. దొరలకు తీసిపోకుండా తాము కూడా సాగించుకోవాలని ఈ కొత్త దొరలు, కొత్త పటేండ్లు ఎంత క్రూరంగా ప్రవర్తిస్తారో తిరుగు ప్రయాణం కథలోని రామిరెడ్డి, రాజవ్వ కొడుకు కథలోని సర్పంచ్ బాపురెడ్డి పాత్రల్లో గమనించవచ్చు. ఐనప్పటికిని బాపురెడ్డి కూతురు పద్మ, రాజేశ్వర్‌రావు దొర మనవరాలు భారతి ఆలోచించే తీరు స్త్రీలకు కులం లేదు అన్న అంబేద్కర్ విశ్లేషణను



గుర్తుకు తెస్తుంది. ఈ కథ సమాజంలోని విభిన్న పార్శ్వాలను చిత్రించాయి. దక్షిణ భారతదేశంలోని తెలంగాణా ప్రాంత సమాజ పరిణామాలను ఎనిమిది కథల్లో ఎన్నో పుస్తకాల్లో చదివినంత సారాంశాన్ని అందించారు రచయిత నల్లాల లక్ష్మిరాజం.

బ్రిటీష్ ప్రభుత్వం ఆహార సేకరణ దశ నుండి స్థిర వ్యవసాయం దశకు మారకుండ రకరకాల వృత్తుల్లో మిగిలిపోయిన తెగలు, కులాల వారిని నేరస్థ జాతులుగా (క్రిమినల్ ట్రైబ్స్) వర్గీకరించి సమాజంలోని అన్ని దోపిడీలకు, దౌర్జన్యాలకు వాళ్ళే కారకులని లక్షలాది మందిని హింసించారు, చంపారు, జైలులోకి నెట్టారు. దొంగతనమే వృత్తిగా గల వాల్మీకి మహాకవి అయ్యాడు. ఒక దొంగ మహాకవిగా ఎదిగే అవకాశాలు ఆనాడు ఉండడం ఒక గొప్ప విషయం. కాని ఇవాళ ఇంట్లో ఏది పోయినా పనిమనుషుల్నే అనుమానించడం, ఎక్కడ దొంగతనం జరిగినా వడ్డెర, ఎరుకలి, దొమ్మరి వారిని పట్టుకొచ్చి కొట్టడం, జైల్లోకి నెట్టడం రివాజుగా మారింది. ఇలాంటి కులంలో పుట్టి దొంగగా ముద్ర వేయబడి, ఎలాగోలా ఎదిగి "ఉచల్యా" అనే పేరుతో ఆత్మకథను నవలగా వ్రాసిన మహారచయిత లక్ష్మణ్ గైక్వాడ్. అది తెలంగాణా ప్రజల జీవితమే, మరాఠీ సాహిత్యంలో మణిపూసగా వెలువడింది. "దొమ్మరి గంగడు" కథ పోలీసులు, ప్రభుత్వం కలిసి మంచివాళ్లను ఎలా దొంగలుగా మారుస్తారో తెలుపుతుంది. దొమ్మరి గంగడికి ముగ్గురు బిడ్డలు, ఒక కొడుకు. పెద్ద బిడ్డ సరోజ వ్యభిచార వృత్తి చేయనని మారాం చేస్తే గంగడు తిట్టి కొట్టి "దందా"లోకి దించినాడు. కొన్నాళ్ళకు సరోజ ఎయిడ్స్ రోగంతో మరణించింది. రెండో కూతురు అయిన లత లారీ డ్రైవరుతో లేచిపోయింది. ఇలాంటి గంగడు పోలీసుల బాధ పడలేక పొరుగూరిలో ఉన్న బంధువుల దగ్గర ఇరవైవేలు అప్పు తీసుకొని ముట్టజెప్పిండు. పోలీసులు ఆ రూపాయలతో బంగారం కొనిపించి గంగడి మీదే కేసు పెట్టి జైలు పంపింద్రు. కొన్ని కులాలు వ్యభిచారమే కులవృత్తిగా కొనసాగడం కుల వ్యవస్థలో ఒక విషాద భారతం. నిజానికి దొమ్మరి విద్యలు ఒలంపిక్స్ క్రీడల కన్నా ఏ మాత్రం తీసిపోవు కాని సామాజిక గౌరవం ఇవ్వకపోవడం వలన కూడులేని వారయ్యారు. నీడలేని వారయ్యారు. ఆ దొమ్మరి విద్యలు కూడా నశిస్తున్నాయి.

పీడితుల బ్రతుకుల గురించి రావిశాస్త్రి కొన్ని కథలు వ్రాశారు. కాని ఆయన వ్రాసిన కథలు జీవితాన్ని చిత్రించినట్లు ఉండవు. వ్యవస్థని ప్రశ్నించినట్లు ఉంటాయి. ఇవాళ దళితుల నుండి క్రొత్త రచయితల తరం ఎదిగి వ్యవస్థను ప్రశ్నించడం కన్నా ముందు సమస్యను, జీవితాన్ని పట్టించుకొని కరుణార్ద్రంగా చిత్రించి మనసు కరిగించడం అవసరం అని బౌద్ధ అలంకార శాస్త్రాన్ని స్వీకరిస్తున్నారు. దొమ్మరి గంగడు లాంటి హృదయ విదారక విషాదాంశాలు జీవితమంత వాస్తవం. ఇలాంటి కథ రాయడానికి జీవితం తెలియడం సరిపోదు. ఎంతో ధైర్యం ఉంటే తప్ప రచయితలు ఇలాంటి కథలు

రాయడం సాధ్యపడదు.

పల్లెల్లో జ్ఞానం, విజ్ఞానం సంస్కృతి, చరిత్ర, మానవ సంబంధాలు ఉండాల్సిన తీరుతెన్నుల్ని ముచ్చట్ల రూపంలో ఒకరి నుండి మరొకరికి కొనసాగుతూ ఉంటాయి. మౌఖికమైన ఈ ప్రక్రియ వేల ఏళ్ళుగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్నాయి. అందుకే ముచ్చట్లు అంటే పల్లెల్లో చెవి కోసుకుంటారు. "మా వూరు ముచ్చట్లు" అనే కథ ప్రతి వూరి చరిత్రని తెలియజేస్తుంది. కులాల కతీతంగాఈ కులాధిపత్యానికి అనువుగా అక్రమ లైంగిక సంబంధాలు పల్లెల్లో ఇప్పటికీ ఎలా కొనసాగుతున్నాయో మావూరు ముచ్చట్లు కథలో చూడవచ్చు. అక్రమ లైంగిక సంబంధాల కారణంగా జీవితంలో ఎగుడు దిగుడులు ఎలా ఏర్పడుతాయో ఈ కథలో రచయిత చక్కగా చిత్రించాడు.

చుక్కారెడ్డితో ఎస్సీ కులానికి చెందిన శాంతమ్మ కలిసి తిరుగుతుంది. చుక్కారెడ్డి శాంతమ్మ భర్తను పైసలు నింపి నర్సయ్యను దుబాయ్ తోలేసిండు. శాంతమ్మకు సోపతి మరో నలుగురు ఆడవాళ్ళు తయారైండ్రు. ఈ సారి ఎస్సీ ఆడవాళ్ళకు సర్పంచ్ రిజర్వ్ అయింది. శాంతమ్మ సర్పంచ్ అయింది. సర్పంచ్ అయినంక కట్టుబొట్టు మార్చింది. అందంగా తయారవుతుంది. అయితే శాంతమ్మ పేరుకు మాత్రమే సర్పంచ్. అధికారమంతా చుక్కా రెడ్డిది. ఆఫీస్ పనిమీద చుక్కారెడ్డి, శాంతమ్మ కలిసి చిలుకా, గోరింకల్లా సైకిల్ మోటర్‌మీద జగిత్యాలకు పోతుంటే గ్రామం నివ్వెర పోయింది. ముచ్చటైన జంట అని కొందరు మెచ్చుకున్నారు. మావాళ్ళేమో మొఖాలు మాడ్చుకున్నారు. ఏడాది తరువాత మా అయ్య నన్ను చుక్కారెడ్డికి జీతం ఉంచిండు. చుక్కారెడ్డి భార్య బుచ్చన్నతోటి అలవాటు. శాంతమ్మ చుక్కారెడ్డి సంబంధం అందరికీ తెలుసు. బుచ్చన్న మంగమ్మ సంబంధం అందరికి తెలిసినా నోరు తెరిచి ఎవరూ మాట్లాడరు? ఇట్లా ఎందుకు?"

పల్లెలు ప్రశాంతంగా, స్వచ్ఛంగా ఉంటాయి అని అనుకునే వాళ్ళు లోకంలో తక్కువేమి లేరు. పల్లెల్లో అసూయ, ద్వేషం, పగ, నీచబుద్ధులు ఎలా వుంటాయో ప్రేమ్‌చంద్ వందేళ్ళ క్రితమే కథల్లో నవలల్లో చిత్రించాడు. అయినప్పటికి దూరపు కొండలు నునుపు. పల్లెలకు దూరంగా బ్రతికేవాల్లు పల్లెల్ని ఆదర్శీకరిస్తారు. నరవర్గశాస్త్రం (ఆంత్రోపాలజీ), సామాజిక శాస్త్రం, చరిత్ర ఈ దేశంలో ఏ కులము, జాతీ సంకరం కాకుండా పవిత్రంగా లేవు అని నిర్ధారించాయి. అనగా వైవాహికేతర లైంగిక సంబంధాలు, వివాహ సంబంధాల కన్నా బలంగా రక్త సంబంధాలను, సంతానాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థం. మిడిమిడి జ్ఞానం గల మధ్య తరగతివాళ్ళు ఇలాంటివి విని గుండెలు బాదుకుంటారు. తన భార్య లేక తన భర్త కూడా ఇంతే సంగతులా అని అనుమాన పక్షులై కలహాలు పెంచుకుంటారు.

పల్లెల్లో అక్రమ లైంగిక సంబంధాలు ఎంత బాహాటంగా కొనసాగుతంటాయో



"మావూరి ముచ్చట్లు" కథలో ఎంతో సహజంగా మన ముందుంచుతుంది. పేద కులాలకు, ధనిక కులాలకు మధ్య జరిగే అక్రమ సంబంధాలు కేవలం "లైంగిక దోపిడి"గా ముద్రేసి చూడటం, సమస్య లోతుల్లోకి వెళ్ళకపోవడమే. నేను "మెరుగు" కథలో "తెల్లబట్ట" కథలో వైవాహికేతర లైంగిక సంబంధాలు జీవితంలోని మిగతా పార్శ్వాల్లో ఎలా పాజిటివ్‌గా ప్రభావితం చేస్తాయో చిత్రించాను. చలం "దోషగుణం" కథలో నెగిటివ్ ప్రభావాన్ని చిత్రించాడు. మెరుగు, తెల్లబట్ట కథలు చదివాక లక్ష్మిరాజంకు ధైర్యం వచ్చింది. మావూరి ముచ్చట్లు రాయాల్నా సార్ అని అడిగాడు. సామాజిక చరిత్రను రికార్డు చేయడం రచయిత కర్తవ్యం అని చెప్పాను. నాకు ఆ జీవితాలు తెలుసుకొని, వాటిని దళితుల్లోంచి ఎదుగుతున్న లక్ష్మిరాజం రాయడమే కరెక్టు. లక్ష్మిరాజం నాకన్నా ఒక అడుగు ముందుకేసాడు. అక్రమ సంబంధాల సామాజిక పరిణామాల్ని చిత్రించాడు. స్త్రీ అక్రమ సంబంధం పెట్టుకుంటే మొత్తం తన కులం పరువే పోతున్నట్టు మొత్తం కులమంతా అవమానానికి గురవడం ఎలా జరుగుతుందో ఈ కథలో చూడవచ్చు. అయితే అక్రమ సంబంధానికి భర్త అంగీకారం కూడా ఉందని తెలిస్తే ఏం చేయడం? మద్రాసు ప్రావిన్సులోని తెలుగు వాళ్లలో అక్రమ సంబంధాలెక్కువ అని, లూజు క్యారెక్టర్ అని, డబ్బు కోసం ఏ పనైనా చేస్తారని నైజాం ప్రావిన్సులోని తెలుగువాళ్ళు ఏకసెక్కెం చేస్తుంటారు. కాని నైజాం ప్రాంతం అందుకు భిన్నమేమి కాదని "మావూరి ముచ్చట్లు" కథ స్పష్టం చేస్తుంది. కులం రీత్యాగల ఆధిక్యత అక్రమ సంబంధాలకిచ్చే విలువలు వేర్వేరు అని కూడా ఈ కథ చిత్రించింది.

"మా చిల్లర కులంలోనే అనుకున్నా, వీళ్ళదాంట్లో కూడా... మరి శాంతమ్మ, చుక్కారెడ్డి అక్రమ సంబంధం గురించి ఊరందరికి తెలిసి ముచ్చట్లు పెట్టుకున్నట్టు చుక్కారెడ్డి భార్య మంగవ్వ పాలేరు బుచ్చన్నతో పెట్టుకున్న సంబంధం ఎందుకు బయటకు పొక్కలేదు? ఒకవేళ తెలిసినా ముచ్చట్లు పెట్టుకోవడానికి జనం భయపడ్డారా? ఏమైనా పెద్దోల్లు పెద్దోల్లే, చిన్నోల్లు చిన్నోల్లే. పెద్ద కులపోల్లు తప్పు చేసినా గాని గౌరవించబడతారు. చిన్నకులపోల్లు తప్పు చేస్తేనేమో చులకనవుతారు. ఇందులోని మతలబు ఏమిటో అర్థమై చావదు" అనుకుంటాడు. ఇందులో పాలేరు. ఏ కులం కూడా వేల ఏళ్ళుగా ఎందుకు పవిత్రంగా లేదో, ఉండడం ఎందుకు సాధ్యం కాలేదో ఈ కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. అగ్రకుల స్త్రీ మాల మాదిగలతో లేచిపోతే అదొక వార్త అవుతుంది. "ఔనవ్వ మా మాలమాదిగోల్లం తప్ప అందరూ సక్కటి పూసలే, రంకు నేర్చి బొంకునేర్చుడు అందరికీ చేతనవుద్దా! ఏ కులంలోనైనా మంచోల్లు ఉన్నారు, చెడ్డోల్లు ఉన్నారు. కులం పేరు పెట్టి తిట్టుడెందుకవ్వ" అని అన్నాడు పాలేరు.

అక్రమ సంబంధం పెట్టకున్న చుక్కారెడ్డి శాంతమ్మల కూతురు, కొడుకు కలిసి లేచిపోవడం కథలో కొసమెరుపు. ఇది అగ్రకుల యువకులు మోసం చేస్తారని రాసిన

దళిత ప్రేమ కథలకు భిన్నమైన వాస్తవ జీవితం. వాళ్ళు అందులో వాదానికి అనువుగా జీవితాన్ని చిత్రిస్తే, ఇందులో జీవితం యధాతథంగా చిత్రించబడింది.

"ఎనిమిది రోజులకు తెలిసింది మా శంకరిగాడు, రజితవ్వ (చుక్కారెడ్డి కూతురు) కోర్టులో పెండ్లి చేసుకున్నారని. మళ్ళ మావూరు జనం ముచ్చట్లకు మూతలు చాపింద్రు" చలం బ్రాహ్మణ స్త్రీలను ముస్లింలు లేపుకుపోయినట్లు రాశాడు. దళితులు అగ్రకుల స్త్రీలు కలిసి పెళ్లి చేసుకోవాలని లక్ష్మిరాజం ఆశయం. ఇది అంబేద్కర్ కుల నిర్మూలన ఆశయాల్లో ఒకటి. అంబేద్కర్ వారసుడుగా రచయిత రాజవ్వ కొడుకు కథలోను, మావూరి ముచ్చట్లు కథలోనూ అదే ఆశిస్తాడు. కొడవగంటి కుటుంబరావు "పార్వతి పరిణయం" కథలోనూ, రంగనాయకమ్మ "బలిపీఠం" నవలలోనూ "మా కులం పిల్లని చేసుకుంటే మీకే కష్టం" అని చిత్రించారు. ఇవ్వాళ్ల దళిత రచయితలు దాన్ని తిరగేసి మీ కులం పిల్లలు మా కులం మగ పిల్లల్ని చేసుకుంటే ఎంతో సుఖపడతారు అని చెప్తున్నారు.

కుల పరిమితులు అధిగమిస్తే తక్కువ కట్నంతో కింది కులాల డాక్టర్లు, ఇంజినీర్లు, అధికార్లను అల్లుళ్లుగా చేసుకోవచ్చు. తద్వారా సొంత కులంలో కూడా పిల్లలు దొరక్క కట్నాల రేటు పడిపోతుంది. ఒక దశలో కన్యాశుల్కం కూడా ఇవ్వాల్సి రావచ్చు. వరకట్నం సమస్యకు ప్రధాన కారణం కులం పరిమితుల్లోనే పెళ్లి చేయాలనుకోవడం లోనే ఉంది. అందువల్లనే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ దేశంలో వరకట్నం సమస్య బాధిస్తున్నది. దీనికి పరిష్కారం కులాంతర వివాహాలే.

ఇవి మధ్య తరగతి సంస్కృతికి భిన్నమైనవి. అట్టడుగు కులాలు తమ యదార్థ జీవితాల్ని సమాజం ముందుపరిచి దానికి సామాజిక గౌరవం, సాహిత్య గౌరవం సాధించాలనే తపన ఈ కథలో కనబడుతుంది. మధ్యతరగతి సంస్కృతిలో ఇవన్నీ అంతర్భాగమై నప్పటికినీ కూడా వీటిని గుర్తించడానికి, గుర్తించినా గౌరవించి సాహిత్యీకరించ డానికి నిరాకరిస్తుంది. అందువల్ల దోపిడి కుల మధ్యతరగతి మనస్తత్వం కలవాళ్లు ఇలాంటి కథల్ని రాయలేరు. సుహృదయతతో స్వీకరించలేరు.

అలాగే ఇందులోని "తిరుగు ప్రయాణం", "యమపురిలో ఒకరోజు", "పడగనీడలో పావురాలు" కథల్ని అందరు వ్రాయలేరు. ఇవి ప్రజల్ని నిజంగా ప్రేమించే రచయితలే రాయగల కథలు. ఏ ప్రజల్నించి పుట్టారో, ఆ ప్రజల్ని సొంతం చేసుకొని వారి హృదయాల్ని ఆవిష్కరించే వాళ్ళే ఇలాంటి కథలు వ్రాయడం సాధ్యం.

నల్లాల లక్ష్మిరాజం స్వాతంత్ర్యానంతరం నడిచిన చరిత్రను కథల రూపంలో తిరగరాస్తున్న ప్రజా రచయిత. నడవాల్సిన చరిత్రకు మార్గదర్శనం చేస్తున్న సామాజిక స్పృహ కలిగిన రచయిత. ఇదెలా సాధ్యపడింది?



"పునరావృతం" కథ కేవలం కట్నం సమస్య కథ కాదు. నాకు తెలిసిన ఒకరిద్దరు మిత్రులు కట్నం లేకుండానే పెళ్లి చేసుకున్నారు. పాతికేళ్ళ తరువాత వాళ్ళ పిల్లలకు కట్నాలిచ్చి పెళ్లిళ్ళు చేయక తప్పలేదు. వెనకటికి ఇప్పటికీ సమాజం ముందుకు పోతున్నదో, వెనక్కి పోతున్నదో అర్థం కావడం లేదు. ఎందుకు అర్థం కావడం లేదు కాని భౌతిక సంపాదన పట్ల పెరిగిన వ్యామోహం సమస్త విలువల్ని నిర్దేశిస్తున్నది. రూపుమాపుతున్నది. "పునరావృతం" కథ వరకట్నం సమస్యని అతి సరళంగా, సూటిగా చెప్పిన చక్కని కథ.

"భలే బామ్మర్ది" కథ రచయిత హాస్య ధోరణి చిత్రణకు పరాకాష్ఠ. ఇందులో అద్భుతమైన శిల్ప విన్యాసం ఉంది. ఒక సీరియస్ విషయాన్ని అతి తేలికగా విప్పి చెప్పి పరిష్కరించడం ఈ కథలోని ప్రత్యేకత.

జీవితాన్ని అధ్యయనం చేయడం తగ్గించి సిద్ధాంత దృక్పథంతో రాయడానికి పరిమితమైన కథకులు ఉన్నారు. ఇలాంటి వారి కథల్లో వస్తు వైవిధ్యం, ఎత్తుగడ అనేక పరిమితులకు లోనై కొన్ని మూసలుగా తయారవడం చూస్తున్నాము. బహుజన కథలు జీవితం ప్రాథమికంగా రాయబడుతున్నాయి. అందువల్ల వాటి వస్తు వైవిధ్యానికి ఎత్తుగడల శిల్ప విన్యాసానికి ఎల్లలు లేవు. ఉద్యమ ప్రాంతాల జీవితాల్ని అత్యద్భుతమైన శిల్ప విన్యాసాలతో ఎత్తుగడలతో చిత్రించిన రచయితలు ఎందరో ఉన్నారు.

కాలువ మల్లయ్య రాసిన చిన్న దొరసాని, ముగ్గురు మిత్రులు..., కె.వి.నరేందర్ రాసిన చిగురుటాకు, డోర్ డెలివరి, దొరుంచుకున్న దేవక్క, పేదోడి గుడి, దొరమల్లచ్చిందు మొదలైన కథలు అద్భుతమైన ఉద్యమ పరిణామ కథలు. కె.వి.నరేందర్ రాసిన చిగురుటాకు కథ వలె యమపురిలో ఒక రోజు కథ ఒక మూల నుండి వెలుగు ప్రసరిస్తున్నట్లుగా కథ ప్రారంభమై మొత్తం సామాజిక జీవితం వెలుగు పరుచుకుంటుంది. నక్సలైట్ల పేరిట ఎంతమంది అమాయకులు బలి అవుతున్నారో ఈ కథలో చూడవచ్చు.

"పడగ నీడలో పావురాలు" కథ ఎవరికోసం ఎవరు చస్తున్నారో! ఎందుకు చంపబడుతున్నారో! కారణాలు తెలియని, తెలియనివ్వని దోపిడి వ్యవస్థ సృష్టించిన మారణహోమాన్ని చిత్రిస్తుంది. సౌదా "నల్లగుర్రపు నాడా" కథలో దేశ రక్షణ పేరిట సరిహద్దులో చనిపోతున్నది ఎందుకో ఎవరి కోసమో ఒక అద్భుతమైన విశ్లేషణ ఇచ్చాడు. కాలువ మల్లయ్య ముగ్గురు మిత్రులు కథలో చిన్న నాటి నుండి స్నేహితులైన వాళ్లు రైతు, పోలీసు, నక్సలైటుగా కాల పరిణామాల్ని బట్టి మారిన తీరును చూపించారు. ఈ ముగ్గురు చివరకు హత్య చేయబడతారు. ఉద్యమం పేరిట ఒక పార్టీ తెచ్చిన ఇలాంటి పరిణామాల్ని పొట్టకూటికై పోలీసు ఉద్యోగంలో చేరిన వాళ్ళ బతుకుల్ని వారిలోని మంచితనాన్ని వెలికితీసి

వ్రాసిన కథ "పడగ నీడలో పావురాలు".

స్పార్టకస్ "ఖాకీ బతుకులు" నవలలో వందేళ్ళ పోలీసు జీవితాలను కళ్ళకు కట్టినట్టు చిత్రించినారు. ఈ కథలో ఏదో ఒక ఉద్యోగం మనసున్న మనిషి పోలీసుగా మారినతర్వాత తన ప్రమేయం లేకుండానే బలైపోతున్న తీరుని చిత్రిస్తుంది. చనిపోతున్న పోలీసుల పట్ల ఎంతో ఆర్ధ్రత ఉంటే తప్ప కథల్ని వ్రాయడం సాధ్యం కాదు. స్వయంగా వృత్తి రీత్యా పోలీసు కావడం వల్ల ఈ కథను వ్రాయగలిగాడు రచయిత. ఇరువైపులా చనిపోతున్నది పొట్టకూటి కోసం ఆరాటపడుతున్న వాళ్లే కావడం ఒకచారిత్రక విషాదం. "యమపురిలో ఒక రోజు" కథ తెలంగాణా జీవితాల్లోని వాస్తవ నిర్బంధ పరిస్థితిని చిత్రిస్తుంది. ఎందరో అమాయకులు విప్లవ సానుభూతిపరుల పేరిట చిత్రహింసలకు, ఎన్‌కౌంటర్లకు గురవుతున్నారు. దీని గురించి ఎన్నో కథలు వచ్చాయి. కానీ లక్ష్మిరాజం కథ ఎత్తుగడలోనే ఒక విశిష్టత ఉంది. కథను నడిపించిన తీరు విప్లవ కథల్ని ఇట్లా కూడా రాయవచ్చా అని ఆశ్చర్య చకితులను చేస్తుంది.

దళిత సాహిత్యం విస్తరించాక విప్లవ సాహిత్యవేత్తల రూపంలో అణిచివేత కొనసాగుతున్నది. ప్రజల గురించి ప్రజల పక్షం వహించి రాసే కర్తవ్యంలో భాగంగా విప్లవ ప్రాంతాల ప్రజల్లోని ఆటుపోట్ల గురించి రాస్తున్న కథల్ని కావాలని సాహిత్య సమీక్షలల్లో, సాహిత్య చరిత్రలో వదిలివేస్తున్నారు. వాళ్లు రాసిందే సాహిత్య చరిత్ర అని భ్రమింపజేసే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణా కథా రచయితల వేదిక ఏర్పడింది. తెలంగాణాలోని సమస్త పరిణామాల్ని చిత్రించే వారికి ఇందులో స్థానం ఉంది. దీన్ని ఏర్పాటు చేయడంలో కూడా లక్ష్మిరాజం క్రియాశీలంగా పాల్గొన్నాడు. నేను విశాల సాహిత్య అకాడమి తరపున కథా పురస్కారాలు, జన్మదిన ఉత్సవాలు నిర్వహిస్తే కొందరు మహానుభావులకది కీర్తికాంక్షలా కనపడింది. ఇరవై ఏళ్ళ నుండి విప్లవం గురించి జగిత్యాల జైత్రయాత్ర గురించి ఊదరగొడుతూ ఒక్కనాడైనా ఇక్కడి పల్లెల్ని దర్శించకుండా, వాస్తవ పరిస్థితుల్ని తెలుసుకోకుండా తమ అజ్ఞానాన్ని అహంకారంగా ప్రదర్శించుకుంటారు కొందరు.

అలాంటి చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకొనే కుహనా విప్లవ రచయితలు, సమీక్షకులు, సానుభూతిపరులే బి.ఎస్.రాములుకు కీర్తికాంక్ష అని అంటారు. తక్కువ అంచనా వేయడం నుండి కూడా "కీర్తికాంక్ష" అనడం సాధ్యపడుతుంది. శ్రీశ్రీ షష్టిపూర్తి జన్మదినోత్సవం సందర్భంగా విరసం పుట్టిందని చెప్పుకునేవాళ్లకు సిగ్గులేకపోగా ఇతరుల జన్మదినాలను కించపరచడం వాళ్ళ దురహంకారానికి నిదర్శనం. ఒక సామాజిక ఉద్యమాన్ని నిర్మించే నక్సలైట్ల రచయితల సంఘానికి శ్రీశ్రీ జన్మదినం తప్ప మరో



సందర్భమే లేదా? బి.ఎస్.రాములు జన్మదినం సాహిత్య సృజనకు ఒక సందర్భం కావడం హర్షించవలసింది పోయి విమర్శించడంలో ఉన్నదేమిటి? అసూయ, ద్వేషం కాదా! విప్లవంలో పని చేయకుండానే విప్లవంలో పని చేసి వచ్చిన వారు ఎదుర్కొనే ఆటుపోట్ల పట్ల సానుభూతి లేకుండా మనిషిగా, రచయితగా నిలదొక్కుకోవటానికి సహకరించని వారే ఇలా మాట్లాడతారు. ఒక్క మీటింగైనా, పెట్టని, పెట్టలేని ప్రాంతాల్లో మీటింగులు పెట్టి సాహిత్య వాతావరణం సృష్టించి, సాహిత్య కారులను ఎదిగించడం కోసమే జన్మదినం పేర విశాల సాహితి పేర మహాసభలు నిర్వహించడం జరుగుతున్నదని వచ్చిన వారందరికి తెలుసు.

సృజనాత్మక, ఫిక్షన్ ఏమి రాయకుండానే ఖండన మండన ప్రకటనలతో రచయితలుగా పేరు పొందే దుర్గతిలో కూరుకుపోయిన వాళ్ళు ఇతరులను కీర్తికాంక్ష పరులనడమే ఆశ్చర్యం. ఈ రోత అలవాటు మాన్పించడం కోసమే దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక తన రచనల ద్వారా, కార్యకలాపాల ద్వారా ప్రజల్లోకి వెళ్ళాలని ఆయా సంఘటనలపై ఖండన మండన ప్రకటనలతో "కీర్తి దురద" గాళ్ళుగా మారొద్దని తీర్మానం చేసి ఆచరిస్తున్నది.

విశాల సాహితి బి.ఎస్.రాములు జన్మదినం సభల ద్వారా ఈ ప్రాంతం నుండి యాభై మందికి పైగా రచయితలు కళాకారులు ఎదిగారు. వారిలో నల్లాల లక్ష్మిరాజం ఒకరు. అలాగే నేను రాసిన "కథల బడి కథా సాహిత్య అలంకార శాస్త్రం" ద్వారా లక్ష్మిరాజంతో పాటు వందలాది కథకులు ఎదగడంలో క్రియాశీల పాత్ర నిర్వహించింది.

లక్ష్మిరాజం చరిత్రని, సాహిత్య చరిత్రని పునర్మూల్యాంకనం చేయదల చుకున్నాడు. అందులో భాగమే ఇతని కథలు, కవితలు, పాటలు, నాటికలు, ప్రసంగాలు.

ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక సభ్యుడిగా అంబేద్కరిజం ఆశయంతో ముందుకు సాగుతూ "తిరుగు ప్రయాణం" వంటి తొలి కథల సంపుటితోనే వస్తువులో, దృక్పథంలో, శిల్పంలో తన విశిష్టతను చాటుకున్న నల్లాల లక్ష్మిరాజం నూతన శతాబ్ది యువ కథకుడు.

### సాహిత్యంలో కొత్త నీరు జాజుల గౌరి

# మన్నుబువ్వ కథల సంపుటి

జాజుల గౌరి తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి. దళిత జీవితం నుండి ఎదిగి తిరిగి తమ జీవితాలను, గతాన్ని అక్షరీకరించే శక్తి సామర్థ్యాలను సాధించుకున్న రచయిత్రి జాజులగౌరి. ఇటీవలి సాహిత్యంలో ఒక దళిత రచయిత్రి కథా సంకలనం ఇన్ని కథలతో తీసుకురావడం బహుశ ఇదే ప్రథమం. తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా రికార్డుకాని దళిత జీవిత కోణాలు, సంస్కృతి  ఈ కథల్లో చూడవచ్చు. దళితులు తమ సొంతభాషని, అభివ్యక్తిని, సొంత శిల్పాన్ని ఎలా ఏర్పరచుకుంటారో ఈ కథల్లో గమనించవచ్చు. తెలుగు సాహిత్యంలో ఈ కథలు ఒక సామాజిక చరిత్ర.

ఆధునిక సాహిత్యంలో ప్రజలు తమ జీవిత ప్రతిబింబాలను చూసుకుంటున్నారు. ఆధునిక సాహిత్య అలంకార శాస్త్రాలు సమగ్రంగా రూపుదిద్దుకోలేక పోయినప్పటికి జీవితం పునాదిగా ప్రేమ్‌చంద్ మొదలుకొని జాజుల గౌరి దాకా సాహిత్యం సుసంపన్నం చేస్తూనే వున్నారు.

జాజుల గౌరి మొదటి కథ సంపుటి ఇది. అయినప్పటికి కథరాసే పద్ధతి చక్కగా తెలిసిన రచయిత్రిగా ఈ కథల సంపుటి నిర్ధారిస్తుంది. ఇందులోని కథలు కొన్ని మాత్రమే పత్రికల్లో అచ్చు అయినాయి. తెలంగాణా భాష సంస్కృతి, దళిత జీవితాలు ఈ కథల్లో వుండటంవల్ల కొంత, పత్రికలకు పంపే పద్ధతులు తెలియక కొంత, పేదరికం కారణంగా పత్రికలకు పంపలేక పోవడం కొంత ఈమూడు కలిసి కథలు పత్రికల్లో ఎక్కువగా అచ్చు కాలేకపోయాయి. 'మన్నుబువ్వ' కథల పుస్తకం వెలువడ్డాక అందులోని కథలను ఎంతో ఆదరంతో బైస దేవదాస్ 'నేటి నిజం' దినపత్రికలో సీరియల్‌గా ప్రచురించారు.

1969 మార్చి 2వ తేదీన జాజుల మల్లయ్య లక్ష్మమ్మలకు సికింద్రాబాద్‌లోని లోతుకుంటలో జన్మించిన జాజుల గౌరి మొత్తం వంశంలోనే పాఠశాలకు వెళ్ళిన మొదటి ఆడపిల్ల. నిరుపేద దళిత వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన జాజుల గౌరిలో చిన్ననాటనే కుల వ్యవస్థ, చాలిచాలని జీవన పరిస్థితులు మనస్సులో అల్లకల్లోలాన్ని రేపాయి. పచ్చని పంటపొలాలు, నిరంతరంగా రేడియో వినటం, పుస్తకాలు చదవటం గౌరి సాహిత్య



రంగంలో ప్రవేశించడానికి ఉపయోగ పడ్డాయి. అలా గౌరి 1980 నుండి కవితలు రాయటం మొదలైంది. 1996లో ఏకలవ్య పత్రిక నిర్వాహకులతో పరిచయం సాహిత్య జీవితానికి ఆలంబన అయింది. అదే సమయంలో "మాదిగ దండోర" ఉద్యమనేపథ్యంలో "మాదిగ సాహిత్య వేదిక" మొదలు అవటంతో డా॥ నాగప్పగారి సుందర్‌రాజు ప్రారంభించిన మాదిగ సాహిత్య వేదికకి పరిచయం అయి మాదిగ సాహిత్య వేదికకి ఉపాధ్యక్షురాలు అయింది. మాదిగ సాహిత్య వేదిక ద్వారా వచ్చిన సంకలనాలలో గౌరి రచనలు ప్రచురితమైనాయి. మొదటి సారిగా "మాదిగ సాహిత్య వేదిక కొరకు 1997-98 మధ్యన కథలు రాయటం మొదలైంది. ఇప్పటి వరకు ముప్పయి అయిదు కథలు, ఒక నవల, పది పాటలు వందవరకు కవితలు రాసింది. కాల్పనిక సాహిత్యాన్ని కాక నిజజీవిత సంఘటనలనీ కథా వస్తువుగా తీసుకుని రచనలు చేయటం జాజుల గౌరికి ఎంతో ఇష్టం. ఇద్దరు పిల్లలు, ఇల్లాలుగా ఉంటూనే ఎల్.ఎల్.బి. చేసింది. కీ.శే. శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి స్మారక ఆర్థిక సహాయంతో మన్నుబువ్వ కథల సంపుటి వెలువడింది.

ఆశించినట్టుగానే జాజుల గౌరి చక్కని రచయిత్రిగా ఎదిగారు. వందలాది కవితలు, మరికొన్ని కథలు, స్వీయచరిత్ర తాలూకు నవల రాశారు. అనేక పురస్కారాలు వరించాయి. అందులో చా.సో పురస్కారం మరింత విశిష్టమైనది. కష్టపడి ఎమ్.ఎ., ఎల్.ఎల్.ఎమ్. పూర్తి చేసి అడ్వకేట్‌గా ఎదిగారు. పేదరికంలో సైతం భర్త సహకారంతో అత్యున్నత విద్యను సాధించిన జాజుల గౌరి దళిత మహిళలకు గొప్ప స్ఫూర్తి.

రచయిత్రికి భాషపట్ల సంస్కృతి పట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. సొంత అభివ్యక్తిని సాధించుకున్న కవయిత్రిగా, దళిత స్త్రీ వాద రచయిత్రిగా, మాదిగ దండోరా ఉద్యమంలోంచి పుట్టిన కలికితురాయి జాజుల గౌరి. అందువల్ల భాషలో సంస్కృతిలో నేను నేనులేక్కనే అని స్పష్టం చేసింది. అందుకే పత్రికలకనుకూలంగా తన కథల్లోని భాషను మార్చటానికి ఇష్టపడలేదు. సమాజంతో రాజీ, పోరాటం ఏకకాలంలో సాగినపుడే ఫలితాలు, విజయాలు సాధ్యమవుతాయి. అనుభవం మీద ఈవిషయం అర్థమైన జాజుల గౌరి పత్రికా భాషలో కూడా కథలు రాయడం ప్రారంభించింది. ఈ సంపుటిలో వాటిని కూడ  చూడవచ్చు.

జాజులగౌరి ఒక నవల కూడ రాసింది. ఆ నవల మొదట రావలసింది. ఆ నవల తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా చిత్రించిన జీవితాలకు అదనంగా ఒక గొప్ప చేర్పు. ఈ కథల సంపుటి జీవితాన్ని విభిన్న కోణాల్లో విడివిడిగా చిత్రిస్తే ఆ నవల హైదరాబాద్‌లో జీవించిన, జీవిస్తున్న ఒక దళిత కుటుంబం సమాజం తాలూకు నలభైయేళ్ళ పరిణామాలు చిత్రిస్తుంది. ఆ నవల జాజుల గౌరి కుటుంబం యొక్క స్వీయ చరిత్ర కూడ. ఆ నవల వస్తే రచయిత్రిగా తెలుగు సాహిత్యంలో ఇటీవల వెలువడిన తొలితెలుగు దళిత స్త్రీ

రచయిత్రి రాసిన నవల అవుతుంది.

ఇందులోని కథలు ఆనవలలోని పరిణామాలే అయినప్పటికి ఇవి నవలకు అనుకరణకాదు. ఇవి స్వతంత్ర కథలు. ఈ సంపుటిలో ఇంకా అనేక విషయాలపై రాసిన కథలువున్నాయి. నవలల్లోలేని సౌకర్యం కథలు రాయడంలో వుంటుంది. కథల్లో ఎంతో జీవితాన్ని చెప్పవచ్చు. ఒక కథల సంపుటిలో ఎన్నో నవలల జీవితాన్ని పాఠకులు చదువొచ్చు. అలాంటి కథల సంపుటిలో ఇది ఒకటి.

"విద్యార్థి" కథలో దళిత పిల్లలు వారి బాల్యం వారి చదువు తీరుతెన్నులు ఆహ్లాదకరమైన జ్ఞాపకాలు, అదే సమయంలో బాధలు, ఆవేదనలు ఎలా వుండేవి చిత్రిస్తుంది. చదువంటే పుస్తకాలకే పరిమితమా అనే ప్రశ్న అంత చిన్న వయసులో కలగటం కొందరికి అతియోశక్తిగా కనపడవచ్చు. నేను రాసిన పాలు కథలో కూడ ఒక పిల్లవాడు దోపిడిని తొలగించుకొని హయిగా బతికే తీరు గురించి తల్లికి వివరిస్తే తల్లే ఆశ్చర్యపోతుంది. అయితే విద్యార్థి కథలో భాష పిల్లల భాష కాకుండ పెద్దలు ఉపన్యాసం యిచ్చిన తీరులో వుంటుంది. జ్ఞాపకాల సమీక్ష కాబట్టి ఇలా వచ్చివుండవచ్చు.

"పట్టాలు" కథలో ఇళ్ళ స్థలాలపేరిట పేదల ఆశలతో ఆడుకునే రాజకీయాలు చిత్రించబడ్డాయి. అక్షరం కథలో దళితులకు చదువుపట్ల ప్రేమపెంచిన టీచర్లు పెంచే ఆత్మవిశ్వాసం కనపడుతుంది. ఇది జాజుల గౌరి తన టీచర్లపట్ల గౌరవంగా అందిస్తున్న పూల సజ్జ.

"నీళ్ళబాయి" కథలో ఒక స్పష్టమైన స్త్రీ, పురుష వివక్షతో కలిసి ఆడుకునే పిల్లలను ఎలా వేరుచేస్తారో తెలుపుతుంది. ఎంత వయస్సునుండి "ఈ ఆడపోరలకు గింతనన్న సెరం లేదన్న మగ పోరగాల్లతో గల్సి ఎట్ల ఈతకొడ్తుండ్రో సూడు." అని విడదీయడం జరుగుతుందో ఈ కథలో చూడవచ్చు. నల్లాలు రాకముందు మంచినీళ్ళు స్నానాలు వ్యవసాయబావులు ఎలా వుండేవో అవి ఒక సాముహిక జీవన కేంద్రాలుగా ఆటపాటల కేంద్రాలుగా ఎలా వుండేవో చాలమందికి తమ జీవితాలను గుర్తుచేస్తుంది ఈ కథ.

పేదరికం అమాయకత్వం కన్నపిల్లలకు శాపంగా పరిణమించి బాల్య మరణాలకు ఎలా దారితీస్తుందో బాలింతలుగా ప్రసవంలో ఎంత మంది చనిపోతున్నారో గుండెలు పిండివేసి దృశ్యాలను కొటీలు కథ తెలుపుతుంది. గుండం కథలో నీళ్ళబాయి కథలోని పరిణామాల్లోలేని కుల సమస్య కనపడుతుంది. గుండంల తానాలు అందరితో చేయడానికి అభ్యంతరం ఏమిటో అప్పుడప్పుడే అర్థమవుతున్న దశను తెలుపుతుంది. "నాయినా నాకు తెల్వకడ్గుతా అసలు కులమంటే యేందే, ఆచారమంటే ఏందే గవన్ని యేడ్నెల్లి వచ్చినయే" అని ప్రశ్నించడంలో స్వతంత్ర భారత దేశ ఫలాలు యిమిడివున్నాయి. కులమతాల కతీతంగా



ఎదుగుతున్న భావజాల చైతన్యం, సంస్కృతి పిల్లల్లో ఎలా వికసిస్తున్నదో కూడ ఈ కథ తెలుపుతుంది.

"సూరీడు" కథ బాలకార్మికుల్లో దళిత బాలుడు "దొరా వద్దు దొరా నీ కాల్మొక్తా బాంచను దొరా నన్ను గిట్ల పెండల వడేసి కొట్టకుండ్రి" అంటూ గజగజ వణికే దయనీయ బతుకులు చిత్రిస్తుంది.

"విచ్ఛిన్నం" కథ మధ్యతరగతి ఇల్లాలు కోణంలో నడిపించిన కథ. పచ్చని చెట్లను నరికేయడం, పుట్టబోయే ఆడపిల్ల అని తెలిసి ఆబార్షన్ చేయడం రెండు పోల్చి చూపటం ఈ కథలోని ప్రత్యేకత. 'మార్పు' కథ కూడ మధ్యతరగతి జీవితాలు చిత్రించే కథ. తాగుబోతు భర్త భార్యను హింసించే పరిణామాలు పిల్లల్లో కలిగించే భావాలు ఎలా వుంటాయో తల్లిదండ్రులకు కనువిప్పు కలిగిస్తుంది.

"దేవుడు" కథలోని వర్షం, వరదలకు కూలిపోయే పేదల గుడిసె జీవితాలు వారి ఆక్రందన మనల్ని కలచివేస్తుంది. "కంచె" కథలో "గంతెనేనా గిన్ని దినాల కంటే గిప్పుడు మస్తు పరకుగైనవు నిరుడేమో మాలెక్కనే లంగ జాకెట్లేసుకుంటివి గిప్పుడేమో వోణీ లేయవట్టివి. గివెందుకేస్తవో ఏమో" అంటూ బుజ్జి ముందుకు ఉరికి మర్లి జూసింది "ఎందుకేస్తారా, ఎందుకేస్తారా నాకేమెర్క, ఏడోక్లాసుకొచ్చే తాలకల్ల నీకే తెలుస్తది." బాలిక ఎదుగుతున్న క్రమంలో సమాజం వేసే కంచెలు ఎలా వుంటాయో జీవితమంత స్పష్టంగా చిత్రిస్తుంది. కట్టెల కోసం వెళ్ళె పేదలను ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళు ఎలా లైంగికంగా దోపిడి చేస్తారో ఈ కథలో చూడవచ్చు. స్త్రీ, పురుషుల మధ్య వయసుతో పాటు పెరిగే వ్యక్తిత్వాలు అంతరాలను సంఘర్షణను యిదేంఅన్యాయం అని మనముందుంచుతుంది.

"నిట్టూర్పు" కథలో సిటీలో ఉద్యోగం చేసే యిల్లాలి అవస్థ భార్యగా, తల్లిగా అందరికి అన్ని చేసిపెట్టాల్సిన వనిత బతుకు బాస్‌తో భర్తతో పిల్లలతో సానుభూతి కరువై పనిలో సహాయంచేసే వారు కరువై తనలోతానే కుమిలిపోయే మధ్యతరగతి స్త్రీ నిటూర్పుల కథ యిది. అయితే గత పదిహేనుయేండ్లుగా ఈ స్థితిలో కొద్దిగా మార్పువచ్చింది. భర్త కూడ వంటచేయడం పిల్లలను ఆడించడం వాళ్ల పనులు చేసిపెట్టడం అందులోని ఆత్మీయత, ఆనందాన్ని అనుభవించడం యిప్పుడెప్పుడే నేర్చుకుంటున్నారు.

"బతుకు" కథలో మల్లమ్మ కుటుంబం కూలీనాలి పని పూట గడవని జీవితం దయనీయ స్థితిగతులు కన్నీళ్లు తెప్పిస్తాయి. "అమ్మ" కథలో ఎయిడ్స్ వ్యాధి ఎన్ని రూపాల్లో వ్యాపిస్తున్నదో తెలుపుతుంది. రక్తదానం చేస్తే సరిగ స్టెరిలైజ్ చేయని సూదులవల్ల రక్తదాతకి ఎయిడ్స్ సోకిన స్థితి దాని పరిణామాలు దయనీయం.

"నేన్‌నేన్‌లెక్కనే" కథ దళితుల బాల్యం వికసిస్తున్న విద్యార్థి జీవితం, ఏమిలేని

జీవితాలు చదువులో ముందు ఉండటంతో స్కూలులో, క్లాస్‌లో పెరిగే గౌరవం ఆత్మవిశ్వాసం మనిషిని ఎలా ఉన్నతంగా తీర్చిదిద్దుతాయో స్పష్టం చేస్తుంది. ఇది జాజుల గౌరి ఒక్కరి ఆత్మ కథేకాదు. నాలాంటి ఎందరో ఆత్మకథలకు ప్రతీక ఈ కథ. "నేను గెల్వలేనన్కుంద్రా మీ ముందల ఎట్లా గెల్వాలో గట్లనే గెలుస్తా" అని చిన్నప్పుడు చాలామంది ఇలాగే సంకల్పం చెప్పుకున్నారు, సాధించారు.

ఏమిలేని పేదలు పేదకార్మికులు జీవితంలో పట్టుదలతో వేలకోట్ల రూపాయలు పరిశ్రమ ఆధిపతులుగా ఫోర్డ్‌లాంటి వాళ్ళు ఎదిగారు. అలాగే అన్నిరంగాల్లో లక్షాలది మంది ఎదిగారు. రామోజీరావు ఇంటింటికి పేపరు వేసే పేపరు బాయ్‌గా వున్నప్పుడు పత్రిక పెట్టాలని, సినిమా స్టూడియో కట్టాలని కలలుగన్నాడట. ఈనాడు ఈటీవి రామోజీఫిల్మ్ సిటి మొదలైన వాటితో అయిన కలలను నిజం చేశాడు. జాజుల గౌరి కూడా నూతన శతాబ్ది వైతాళిక రచయిత్రిగా ఎదిగి సమాజానికి మార్గదర్శకంగా ముందుకు సాగుతుంది అని నా విశ్వాసం.

"భంగిమ" కథలో ప్యూను పనిచేస్తున్న కొడుకును వెతుక్కుంటూ పల్లె నుండి పట్నం చేరిన తండ్రి అడ్రసు తెలియక ఎండదెబ్బతో చెట్టుకింద పడి చనిపోతే తాగిచనిపోయాడని అసహ్యించుకునే మానవత లోపించిన మరజీవితాలను చిత్రిస్తుంది.

"చదువు", "పగటిబెల్లు" కథల్లో చదువు గురించి పేదపిల్లల్లో వుండే ఆసక్తి దాన్ని అందుకోలేని పేదరికం స్థితిగతులను మరో కోణంలో చిత్రిస్తుంది. "మైల' కథలో జాలికి సమానత్వానికి కులవివక్షకి మధ్య తేడాతోపాటు ఆత్మవిశ్వాసం సాధించుకుంటున్న తీరు చూడవచ్చు."మన్నుబువ్వ" కథలో జాజుల గౌరి అనుభవించిన పేదరికం, దుర్భర దారిద్ర్యం ఆకలి తాళలేక మన్నుబుక్కిన అమాయకత్వం అది అనుభవిస్తే కాని తెలియని స్థితి."సేరుపట్లు" "సిడి", "దవఖాన", "పండుగ", "దస్తకత్" కథలు కూడ దళిత బడుగు వర్గాల జీవిత కోణాలను చిత్రిస్తాయి.

ముందే చెప్పినట్టుగా ఈ కథల సంపుటి తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి. ఒక దళిత స్త్రీ అతి పేదరికం ఎదుగుతు దైన్యాన్ని వదిలించుకుంటూ ధైర్యాన్ని చిక్కబరుచుకుంటూ జీవితాన్ని గెలుచుకోవాలని పట్టుదలతో ముందుకు సాగుతున్న క్రమంలో రాసిన కథలివి. ఇవి కేవలం కథలు కావు. ఎవరి గురించో మరొకరు రాసిన కథలు కూడ కావు. తమ గురించి తామే రాసుకుంటున్న నూతన సాహిత్య చరిత్ర కథలివి.

సాహిత్యంలో సమాజాన్ని అన్వేషించే సామాజిక శాస్త్రవేత్తలకు సమాజ చరిత్రను ఒక రిసోర్స్‌గా అందించే కథలు ఇవి. కొలకలూరి ఇనాక్, బోయ జంగయ్య, ఎండ్లూరి



సుధాకర్, గుండెడప్పు కనకయ్య, నాగప్ప గారి సుందర రాజు మొదలైన రచయితలు దళిత జీవితాన్ని అద్భుతంగా కథలుగా, నవలలుగా చిత్రించారు. వారి వారసత్వాన్ని అందుకొని ముందుకుసాగుతున్న రచయిత్రి జాజుల గౌరి. మహారాష్ట్రలో నలభైయేళ్ళ క్రితం ప్రారంభమయి చరిత్ర సృష్టించిన దళిత సాహిత్యం తెలుగులో 1990 నుండి వేగం పుంజుకుంది. డా॥ కె.లక్ష్మినారాయణ దళిత కథలను ఎనిమిది సంకలనాలు వెలువరించి చరిత్ర సృష్టించాడు. ఇప్పుడు అతని పని మళ్ళీ పెరిగింది. మరెన్నో సంకలనాలుగా వేయాల్సిన కథలు తెలుగు సాహిత్యంలో వచ్చి చేరాయి. జాజుల గౌరి కూడ ఇందులో ఒకరు.

తమ జీవితమే ఒక కథగా, నవలగా మారిన ప్రయాణమే దళితుల బతుకు పోరాటం. జాజుల గౌరి ఈ బతుకు పోరాటాలను మరిన్ని చిత్రిస్తుందని ఈ కథలు హామీ యిస్తాయి. సాహిత్య వేత్తలు పాఠకులు సాదరంగా ఈ కథల సంపుటిని అక్కున చేర్చుకుంటారని ఆశిస్తాను.

కాలాన్ని చరిత్రగా నిక్షిప్తం చేసిన

# గూడ అంజయ్య దళిత కథలు

గూడ అంజయ్య సుప్రసిద్ధ వాగ్గేయకారుడు. మహాకవి. భారతదేశంలో అందరూ కలిసి అన్ని భాషల్లో ఒకే రాగంతో ఒకే పాటను పాడుకునే పాటను రాసిన మహాకవి. 'ఊరు మనదిరా ఈ వాడ మనదిరా' అనే పాట భారతీయ భాషల్లో అదే ట్యూనుతో పాడబడుతున్నది. గూడ అంజయ్య వేల పాటలు రాయలేదు. కొన్ని వందల పాటలే రాశారు. అయితేనేం తెలిసిన కవి. అందరి తలలో నాలుకైన కవి. వందేమాతరం గేయాన్ని రాసిన బంకించంద్ర ఛటర్జీ మరెన్నో పాటలు రాయలేదు. కాని ఆ గీతమే జాతీయగీతాల్లో ఒకటిగా ఆబాలగోపాలానికి తెలుసు. అలాగే గూడ అంజయ్య రాసిన 'ఊరు మనదిరా' ఆబాలగోబాలానికి తెలుసు. ఒక పాటకు శతజయంతి ఉత్సవాలు జరపడం అరుదైన విషయం. వందేమాతరం గీతం ఈ గౌరవానికి నోచుకుంది. అలాగే 'ఊరు మనదిరా' పాట ముప్పైయ్యేళ్ళ జన్మదినోత్సవాన్ని జరుపుకుంది. ఈ రెండు గీతాలు ప్రజా ఉద్యమాలకు తలలో నాల్కలా అమిరిపోయినవే కావడం వీటిలోని అంతస్సూత్రం.

1-11-1954న ఆదిలాబాద్ జిల్లా లక్షెట్టిపేట తాలూకా, దండెపల్లి మండలంలోని లింగాపురం గ్రామంలో జన్మించిన గూడ అంజయ్య ఇటీవల కథలు కూడా రాయడం ప్రారంభించాడు. పాటల రచయితలు కథలు రాయడం అరుదైన విషయం. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు చక్కని కథలు, నవలలు రాశారు. కవితలు, పాటలు రాసేవారికి కథలు, నవలలు రాయడం లెబోరియస్‌గా వుంటుంది. భావాన్ని సూటిగా చెప్పే తత్వం పాటలో వుంటుంది. కథల్లో, నవల్లో జీవితాన్ని చిత్రించడం వుంటుంది. జీవితాన్ని చిత్రించే నేర్పు పాట రాయడం కన్నా ప్రత్యేకమైంది. ఈ ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించినవారే పాటలతో పాటు కథలు, నవలలు రాయడం సాధ్యమవుతుంది. కె.సీతారాములు కవిగా, నాటకకర్తగా, దర్శకుడిగా, కథకుడిగా, వ్యాసకర్తగా, ప్రయోక్తగా పలు ప్రక్రియల్లో నైపుణ్యం సాధించారు. అందరికీ ఇది ఆదర్శం.

గూడ అంజయ్య కథకుడిగా తనను తాను నిరూపించుకున్నారు. కేవలం పాటల రచయితగా వచ్చిన ప్రతిష్టతోతన పలుకుబడితో ఇందులోని కథలకు గొప్పతనం రాలేదు.



కథల్లోనే ఆ గొప్పతనం ఉంది. గొప్ప కథల లక్షణాలను సంతరించుకున్న కథలు ఇందులో వున్నాయి. కథల్లోని జీవితం యాభైయ్యేళ్ళ నాటిదైనా ఇప్పటికీ చదవాలనిపించే తీరులో చిత్రించడం ఈ కథల విశిష్టత.

ఇందులోని ఒక్కొక్క కథ ఒక సుదీర్ఘ జీవితాన్ని లాంగ్ షాట్‌లో నిక్షిప్తం చేసుకున్న డాక్యుమెంటరీ. ఇప్పటిదాకా తెలుగు సాహిత్యంలో రికార్డుకాని దళిత జీవితాలను చిత్రించిన ఈ కథలు సాహిత్యానికి ఒక మంచి చేర్పును అందించాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం నైజాం రాజ్యంలో ఎంతోమంది కులవ్యవస్థ అణిచివేతకు వ్యతిరేకంగా ఇస్లాం మతం పుచ్చుకున్నారు. ఆర్యసమాజ్ సంస్థ వారిలో చాలామందిని తిరిగి హిందూమతంలోకి తీసుకువచ్చే కార్యక్రమాలు తీసుకుంది. హిందూమతంలో తిరిగి కులాంతరాలు అణిచివేత, హింస అలాగే కొనసాగుతున్నాయి. కులసంఘాలు సమాజం కరడుగట్టుకుపోయి అభ్యుదయ భావాలు గలవారిని కులం నుండి వెలేసినా నా నా మానసిక హింసలతో గురిచేసిన సంఘటనలు ఎన్నో వున్నాయి. తెలంగాణా తొలితరం కథకులైన జి.రాములు 'ఆత్మఘోష' అనే కథలో 1945లో ఇలాంటి దుర్మార్గాలకు విసిగి ఇస్లాం మతం పుచ్చుకున్న అనివార్యతను చక్కగా చిత్రించారు. అయితే ముస్లిం మత వ్యాప్తి కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొన్ని శక్తులు దళితుల నుండి ఇస్లాంలోకి మార్చే కృషి కొంతకాలం సాగింది. ముఖ్యంగా ఎక్కువ జనాభా ముస్లింలున్నప్రాంతాలు స్వతంత్ర దేశాలుగా విడిపోవచ్చు అని పాకిస్తాన్ ఏర్పాటుకు ముందు కొన్ని భావాలు బలంగా వ్యాప్తి చెందాయి. ముస్లింల జనాభా నైజాం రాజ్యంలో పెరిగితే పాకిస్తాన్ లాగే నైజాం రాజ్యాన్ని కూడా ప్రత్యేక దేశంగా ప్రకటించుకోవచ్చు అనే భావాలు ఆనాటి వారిలో కలిగాయి. దాంతో భూమి ఆశ చూపి ఇస్లాం మతంలోకి మార్చారు. ఈ క్రమం ఎలా సాగిందో 'ఇనాం శెలుక' చిత్రిస్తుంది. నిజంగా వారికి భూమి కూడా అందలేదు. వారిని ఇస్లాం మతంలోకి మార్పించిన కరీం అనే అతనికి కొంతభూమి దొరికింది. అంతేగానీ మతం మార్చుకున్నవారికి లభించింది శూన్యం. ఈ మోసం ఎలా జరిగిందో వివరించిన కథ 'ఇనాం శెలుక'. ఒక మతం నుండి అది ఎంతచెడ్డదైనా, మంచిదైనా దాన్నించి మారేటప్పుడు ఎదురయ్యే మానసిక సంఘర్షణ, సాంస్కృతిక సెంటిమెంట్స్ మొల్దారం తెంపినపుడు మనిషి తన ప్రాణం పోయినంతగా విలవిల లాడేట్టుగా ఎలా చేస్తాయో గొప్పగా చిత్రించిన కథ ఇది.

భీరువూరి కథ ఒక విచిత్ర మానసిక స్థితికి సమాజం ఎలా కారణమో చక్కగా చిత్రించింది. ఊరి దొర చేసే అన్యాయాలకు అంతులేదు. జ్వరం వచ్చి ఇంట్లో పడుకున్న మనిషిని పిలిపించి కొట్టి చంపిన దృశ్యం భయానకమైంది. భయంతో ప్రజలు బిక్కచచ్చిపోవాలనే దొర ఇలా చేశాడు. అలాంటి సంఘటనలను ఎన్నిటినో చూసిన

భీరువూరి కష్టపడి ఎందుకు పనిచేయాలో అర్థంకాని దశకు చేరుకుంటాడు. తనకు చెందని కష్టాన్ని తను ఎందుకు చేయాలి? అని కలిగిన భావం అతన్ని పూర్తిగా మార్చివేసింది. అన్నం కుండల దొంగగా రూపాంతరం చెందాడు. ఒక తాత్విక అంశాన్ని జీవితమంతా వాస్తవికంగా గొప్పగా చిత్రించిన కథ భీరువూరి. వందేళ్ళ క్రితం ప్రేంచంద్ అనే మహారచయిత ఇలాంటి తాత్వికాంశాలతో 'కఫన్' అనే కథ రాశాడు. మృణాల్‌సేన్ అనే సుప్రసిద్ధ దర్శకుడు తెలుగులో దీన్ని 'ఒక ఊరి కథ' పేరుతో సినిమా తీశాడు. భీరువూరి కథ ఆ కథలాగే మరింత జీవితాన్ని కొత్తగా చెప్పిన విశిష్టమైన కథ.

'అమ్మక్క' కథ కూడా తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో జరిగిపోయిన సంఘటనలను కళ్ళకు కట్టిస్తుంది. తెలంగాణలో పనులు లేక అరబ్ దేశాలకు వలస వెళుతున్న క్రమాలను, ప్రజల ఉద్యమాలను అణచివేయడానికి గ్రామాల్లో తిష్టవేసిన పోలీసులు సృష్టించే సమస్యలు మొదలైన సామాజిక పరిణామాలను చక్కగా చిత్రించింది. ఇలాంటి నేపథ్యంలో స్త్రీలు పల్లెల్లో ప్రత్యేకంగా ఎదుర్కొనే సమస్యలు ఎలా వుంటాయో వాటిని చెప్పుకున్నా కష్టమే, చెప్పుకోకపోతే మరింత నష్టమే అనే దుస్థితి ఎలా కొనసాగిందో... సున్నితమైన సమస్యను పరిష్కరించుకోలేక ఎందరో ఆత్మహత్యలు చేసుకున్నారు. అత్యాచారాలకు గురి అయ్యారు. పోలీసులు గ్రామాల్లో ప్రజల భయాన్ని మరింత పెంచి ఎలా లైంగిక దోపిడీకి పూనుకుంటారో ఈ కథ తెలుపుతుంది. అలాంటి దశలో అమ్మక్క కాస్త ధైర్యం తెచ్చుకుని అత్తకు ఈ విషయం వివరించింది. ముందు భయపడిన అత్త చివరకు సమస్యను పరిష్కరించడానికి నర్తనశాలలో సైరంధ్రికి బదులుగా భీముడు చేరినట్లుగా అత్త దుండగులను దొంగ దొంగ అంటూ పట్టించిన తీరు ప్రజల హృదయాల్లో ఉత్తేజాన్ని నింపింది. ముప్పైయ్యేళ్ళయిపోయింది. అరబ్బు దేశాలకు వెళ్ళిన భర్త ఎయిడ్స్ తెచ్చుకొని పోయాడు. అత్తాపోయింది. రాజారాం తాళ్ళరేవుకు గంగ దాటిన అమ్మక్క జాడలేదు. అని కథ ముగుస్తుంది. అమ్మక్క విప్లవంలోనే చేరిపోయిందో, ఏమైపోయిందో పాఠకుల ఊహకే వదిలేశారు రచయిత.

ప్రాజెక్టులు, నీటికాలువలు కొందరికి ఉద్యోగాలనిచ్చాయి. వారి క్యాంపుల్లో పల్లెల్లో రైతులు పంటలు లేక స్వాభిమానం చంపుకొని చెప్రాసీలుగా మారిన పరిణామాల్ని దయనీయంగా చిత్రిస్తుంది గౌరుదకథ. అంతకన్నా దయనీయంగా దళితులను ఉద్యోగమిస్తానని మోసం చేసి గౌరని బతుకును ఆత్మగౌరవాన్ని నలిపేసిన తీరు హృదయ విదారకరమైనది. పల్లె ప్రజ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కాలువలు తవ్వే ఇంజనీర్లు ఉద్యోగం ఇప్పిస్తానని ఆశపెట్టి మనిషి మలాన్ని శుభ్రపరిచే పనికి ఒప్పించి చివరకు మోసం చేసిన వైనం మానవత్వం వున్న ప్రతి మనిషిని కదిలించివేస్తుంది.

వినాయకరావు, సుబ్రహ్మణ్యంలోని అగ్రకుల నీచత్వం మనుషులను ఎలా నీచంగా



చూసి పని తీసుకుందో, ఎలా మోసం చేస్తుందో ఈ కథ స్పష్టం చేస్తుంది. ప్రాజెక్టు కట్టే ఇంజనీర్ల క్యాంపులు గ్రామాల్లో సృష్టించే సంస్కృతిని, ఆశలను, మోసాలను ఒక కోణంలో ఈ కథ చక్కగా వివరిస్తుంది.

'జప్తి' కథలో మరొక జీవితం సాక్షాత్కరిస్తుంది. 'చచ్చిన శవమాగదట-సర్కారు బాకీ ఆగదట' అనే సామెత తెలంగాణ పల్లెల్లో ప్రాచుర్యం పొందింది. సర్కారు బాకీ పేరిట పట్వారీలు, తహసీల్దారులు, దొరలు ఎంత క్రూరంగా, దుర్మార్గంగా ప్రవర్తించేవారో ఈ సామెత తెలుపుతుంది. లసుమయ్య కున్న పొలాన్ని మూడేండ్ల తాసీలు కింద పట్వారీ కల్లంలోని గింజలన్నీ జప్తు చేసిండు. లసుమయ్య భోరున ఏడ్చుకుంటూ పొలం దిక్కు ఉరుకుతండు... పొలంల పడి భోరున ఏడుస్తండు... ఎవరో చెయ్యి ఊపుతుండ్రు... చెయ్యి ఊపిరి దిక్కు లసుమయ్య అడుగులేసిండు.' అని కథ ముగుస్తుంది. ఈ కథ విప్లవ పూర్వ పరిస్థితులను చిత్రిస్తుంది. ప్రజలు విప్లవం కోసం ఎందుకు కదిలారో ఈ కథ స్పష్టం చేస్తుంది. లసుమయ్య విప్లవకారుల సంబంధాల్లోకి వెళ్ళిపోయాడని సూచిస్తూ కథ ముగుస్తుంది.

ఇందులోని కథలు ప్రజలు దైన్యాన్ని, అమాయకత్వాన్ని, ప్రజల సంస్కృతిని దృశ్యీకరణ శిల్పంతో, సంభాషణాచాతుర్యంతో చక్కగా చిత్రించిన కథలు. ఈ కథల్ని చదువుతుంటే కథలు చదివినట్టుగా వుండదు. వారి జీవితాలు మన ముందు దృశ్యాలు దృశ్యాలుగా సాక్షాత్కరిస్తాయి. ఇందులోని పాత్రలు పాత్రలు కావు. అవి నిజజీవితం నుంచి మన ఎదుటికి నడిచివచ్చిన నిజ జీవితాలు. నిర్మలమైన, స్వచ్ఛమైన, పనిని ప్రేమించే దళిత ప్రజలను వారి కడగండ్లను చిత్రించడానికి 'ఊరు మనదిరా' పాట రాసి జాతి మొత్తాన్ని మేల్కొలిపి ముప్పై ఏళ్ళ తర్వాత గూడ అంజయ్య అనేక విషయాలపై కథలు రాయాల్సి రావడం తెలుగు సాహిత్యం కోల్పోయిన వస్తువులను తెలుపుతుంది. అందుకే దళితులకే తెలుసు దళితుల ఆర్తి, ఆర్తనాదాలు, దళితులే తమ జీవితాలను చిత్రించుకోవాలి అనే నినాదం పుట్టింది.

పాటలతో పాటు గూడ అంజయ్య ప్రసంగాలు కూడా ఒక ప్రత్యేకమైన శిల్పాన్ని, ఆకర్షణని కలిగివుంటాయి. ఇప్పుడు గూడ అంజయ్య ఈ కథల ద్వారా గొప్ప రచయితగా హృదయం ఉన్న మనిషిగా, శిల్పం తెలిసిన కథకుడిగా కూడ తనదైన ముద్రతో కనపడతాడు.

గూడ అంజయ్య మంచి వక్త, గాయకుడు. మంచి ప్రాశ్నికుడు. నిర్భీతితో ప్రశ్నించే నిత్య చైతన్యశీలి. గూడ అంజయ్య రచన గొప్పది. గూడ అంజయ్య జీవిత ఆచరణ గొప్పది. గూడ అంజయ్య కమిట్‌మెంట్ గొప్పది. గూడ అంజయ్య ఒక వ్యక్తి కాదు. ఒక సామూహిక శక్తి అతను. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఏర్పాటుకై

శ్రమించిన సాహితీవేత్త. దళిత కళాకారులారా, మేధావులారా, మీరెటువైపు అంటూ 1992లో వేసిన కరపత్రం తెలుగులో సాహిత్యంలో ఒక మైలురాయి. తెలుగు సాహిత్య ఉద్యమాలను ఆ కరపత్రం నిర్భీతిగా ప్రశ్నించింది. అటో ఇటో తేల్చుకోమంది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జూన్ 1992లో గూడ అంజయ్య మేసిన ఆ సింహగర్జన రాష్ట్రమంతటా ప్రతిధ్వనించింది. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఈ నేపథ్యంలో ఏర్పడింది. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక నిర్మాతల్లో ఒకరైన గూడ అంజయ్య మొదటినుండి సామాజిక ఉద్యమాలను, నిర్మాణాలను నిర్మించాలని పూనుకున్నవాడే. 1974లో అరుణోదయ సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేయడంలో గూడ అంజయ్య పాత్ర మరువలేనిది. దరకమే ఐక్యవేదిక నిర్మాణం తర్వాత గూడ అంజయ్య పాట కవుల వేదికను ఏర్పాటు చేశారు. తెలంగాణ పాట కవులను కూడగట్టి తెలంగాణ జిల్లాల్లో వేలాదిమందితో గొప్ప సభలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక పాటలను రాశారు. పాడి చైతన్యం రగిలించారు. తెలంగాణా తల్లి బుర్రకథను రాసి ప్రదర్శించి తన కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇలా ఒక రచయిత తాను, తన కుటుంబంతో జీవిస్తూ సమాజానికి చేయగలిగిన మేరకు చేయడంలో గూడ అంజయ్య ఎవరికన్నా వెనుకబడి లేరని అతని ఆచరణ నిరూపిస్తున్నది. దళితులు ఎవరి చరిత్ర వారు రాసుకోవాలి. అలా గూడ అంజయ్య తన చరిత్రను తానే రికార్డు చేశారు. ఆ చరిత్ర వెలికివస్తే ఆయన కృషి పట్ల మరింత వెలుగు ప్రసరిస్తుంది.

నేను, గూడ అంజయ్య కలిసి ఎన్నో కార్యక్రమాలు తీసుకున్నాం. ఎన్నో సభల్లో కలిసి పాల్గొన్నాం. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక నిర్మాణంలో కలిసి పాలు పంచుకున్నాం. ఆయన అభిప్రాయాలను, సిద్ధాంతాలను బహుజనతత్వం గ్రంథంలో ఆయన పేరిటే రికార్డు చేశాను. వాటిని నా అభిప్రాయాలు అనుకున్న వారు లేకపోలేదు. అంతగా తాత్విక సైద్ధాంతిక గాఢతను కలిగి వున్న గూఢ అంజయ్యకు సామాజిక కార్యకర్తగా, సంస్థల నిర్మాతగా చరిత్రలో రావలసిన స్థానం రాలేదనే ఆవేదన వుంది. వేమనను శతాబ్దాల తరబడి అణిచి వేయాలనుకున్నారు సాంప్రదాయవాదులు. వాళ్ళే అనామకులయ్యారు. వేమన విశ్వవ్యాప్తంగా విస్తరించారు. అలాగే గూడ అంజయ్య కూడా నిరంతర కృషితో విస్తరించే క్రమంలో తన చరిత్రను సామాజిక చరిత్రగా మలుపు తిప్పుతాడని నా ఆశ. గొప్ప కథలను ఎవరూ స్పృశించని జీవితాలను కథలుగా మలిచి తెలుగు సాహిత్యాన్ని సంపన్నం చేసిన మిత్రుడు, సహచరుడు గూడ అంజయ్య గారికి నా హృదయపూర్వక అభినందనలు.



కె.సీతారాములు వాస్తవిక చిత్రణ

# హాస్టల్ కతలు

సామాజిక అభివృద్ధిలో విద్యపాత్ర ప్రముఖమైనది. ఆధునిక యుగంలో విజ్ఞాన శాస్త్రాలు, కళలు, ఎంతగానో విస్తరించాయి. విజ్ఞానం లిపిబద్ధం కావడం అనివార్యమైంది. పారిశ్రామిక విప్లవం తర్వాత అక్షరాస్యతకి అభివృద్ధికి మధ్య అనివార్యమైన లంకె ఏర్పడింది. ఆధునిక విద్య అందని సమాజాలు తెగలు, కులాలు, మతాలు ఎంతో వెనుకబడి పోయాయి, వారి జీవితంలో సంస్కృతిలో ఈ వెనుకబాటు తనం కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

మనిషి సంఘజీవి. సామాజిక జీవితం వలననే మనిషి ఇతర ప్రాణులను మించి ఎన్నో రెట్లు అభివృద్ధిని సాధించడం సాధ్యపడింది. అభివృద్ధిని అందుకున్న వాళ్ళు అభివృద్ధికి వెనుక బడిన వాళ్ళు అనేవిగా సమాజంలో రెండు వర్గాలు కొనసాగుతుంటాయి. మార్క్సిస్టులు, పాలకవర్గాలు, పీడిత వర్గాలు అని వర్గ విభజన చేస్తుంటారు. ఈ విభజన రాజకీయపరమైనది. సామాజిక పరమైన విభజన అభివృద్ధి అందినవారికి అందనివారికి మధ్యన ఉంటుంది. అందువల్ల అభివృద్ధి అందాల్సినవారికి అనువుగా ప్రజా పోరాటాలు, సంక్షేమ పథకాలు, సామాజిక చైతన్యం మొదలైనవి కొనసాగుతుండాలి.

ప్రజల సంక్షేమంపట్ల బాధ్యత ఫీలయ్యే ప్రతి వ్యక్తీ, సంస్థా, పార్టీ వర్తమాన ఆచరణలో కల అభివృద్ధి పథకాల్ని, సంక్షేమ పథకాల్ని మరింత సమర్థవంతంగా విస్తృతంగా అమలు జరుపడానికి కృషి చేయాల్సి ఉంటుంది. ఈపని చేయనివారు తమ సంస్థ, పార్టీ ప్రచారానికే పరిమితమయిన వారవుతారు. తద్వారా ఆయా పథకాల అమలు బాధ్యత ఆయా ప్రభుత్వాలదే అని పరోక్షంగా అంగీకరించిన వారవుతారు. ప్రజలకోసం కృషి చేసే వారెవరైనా నేడు అభివృద్ధి అందాల్సిన వారికి సక్రమంగా నేడున్న వనరులను, పథకాలను అందించే కృషికి తోడ్పడాల్సి ఉంటుంది. కాని ఆయా రాజకీయ పార్టీల ప్రవర్తన ఆయా ప్రభుత్వాలను విమర్శించడమే పనిగా పెట్టుకొనడం చూస్తున్నాం.

పేద పిల్లల అభివృద్ధికి హాస్టళ్ళు, స్కాలర్‌షిప్‌లు ఎంతో చేయూతనిస్తాయి, ఆ మధ్య చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగారి హయాంలో అటెండర్ల వ్యవస్థను తొలగించాలని ఒక ప్రయత్నం

జరిగింది. అభివృద్ధిలో అట్టడుగున ఉన్నవారికి ప్రభుత్వంలో లభించే ఉద్యోగం జీవితం అటెండరే. అటెండర్ వ్యవస్థవల్ల వారి సంతతి చదువుకొని ఎంతో కొంత మధ్యతరగతిగా ఎదిగారు.

కె. సీతారాములు ఈ రాష్ట్రం గర్వించగదిన ఉద్యోగసంఘ నిర్మాతల్లో ఒకరు. చిత్త శుద్ధిగల గొప్ప సామాజిక కార్యకర్త. తాను నమ్మిన ఆశయాలకోసం జీవితాన్ని కుటుంబాన్ని అంకితం చేసిన వ్యక్తి. అతడొక ప్రయోక్త, అతడొక నాటక కర్త, అతడు హృదయంఉన్న మనిషి, అతడు తన హాస్టల్‌కేగాకుండా ఈ సమాజానికే ఒక వార్డెన్‌గా, సంరక్షకుడుగా బాధ్యత ఫీలయి కార్యరంగంలో ఆచరిస్తున్నవాడు. అతనికిచ్చిన అవార్డులద్వారా, ప్రశంసల ద్వారా ఆయా అవార్డులు గొప్ప గౌరవం పొందాయి. సీతారాములు దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుల్లో ఒకరు.

తన స్వీయ అనుభవాల్ని కథలుగా, నవలలుగా రాసి ఒక సాహిత్య విప్లవాన్ని సృష్టించిన మహారాష్ట్ర దళిత సాహిత్య ఒరవడి ఈ రచనతో తెలుగులో వేగం పుంజుకుంటున్నది.

ఒక్క మాటలో చెప్పాలంటే హాస్టల్ వార్డెన్లు నూతన సమాజ నిర్మాతలు, తమ కర్తవ్యాలను ప్రతి వార్డెన్ సక్రమంగా నిర్వర్తిస్తే అభివృద్ధికి దూరంగా ఉన్న పేద కులాల, వర్గాల తెగల విద్యార్థులు ఒక భవిష్యత్ నూతన మానవీయ సమాజంగా రూపుదిద్దుకోవడానికి కృషి చేసినవారవుతారు. అందుకు సాక్ష్యంగా నిలుస్తాయి ఇందులోని కథలు.

హాస్టల్ కథలు నిజానికి కథలు కావు. జీవితంలో జరిగిన సంఘటనలను యథాతతంగా కథలుగా మలచిన విశిష్ఠ కతలు. నాటక కర్త దర్శకుడు కూడా అయిన కె. సీతారాములు తాను ఈ కథలు ఎందుకు రాశారో ఇలా తన లక్ష్యాన్ని చెప్పారు. “మన దేశంలో కొండకోనల్లోని గిరిజనుల అభ్యుదయం కోసం మన ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాయి. సామాజిక అభివృద్ధిలో వారి వాటా వారికందడానికి పునాది కృషి జరగాలి. అభివృద్ధిని అందుకోవడం కూడా అభివృద్ధికి చేరువైనప్పుడే సాధ్యం. ఆ స్థాయికి ఎదిగించే కృషినే పునాది కృషి అంటారు. గిరిజనులు నాగరిక సమాజంతో పోటీపడి అభ్యుదయం సాదించాలి. ఇది నెరవేరాలంటే పొట్ట, బట్ట, నీడ కావాలి. ఈ లక్ష్య సాధన కోసం మన రాష్ట్రంలో కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించబడుతుంది.

హాస్టళ్ళ సక్రమ నిర్వహణలో అనేక సాధకబాధకాలు ఎదురవుతాయి. అందులో కొన్ని రాజకీయ పరమైనవి. కొన్ని సంస్కృతి పరమైనవి. కొన్ని ఆర్థిక పరమైనవి. కొన్ని సిబ్బంది పరమైనవి. కొన్ని సామాజిక విలువలకు సంబంధించినవి. ఒక వార్డెన్‌గా



ముఖ్యంగా ఒక మనిషిగా నాకెదురయిన అనుభవాల దృష్ట్యా ఈ సమస్యలను హాస్టల్ కతల రూపంలో మీ ముందుంచే ప్రయత్నం చేస్తున్నాను.

ఇలాంటి వాటిలో ఇది నా తొలి ప్రయత్నం. నేను కొన్ని కవితలు, పాటలు, నాటికలు రాసినా కథల రూపంలో రాయడం ఇదే మొదటి సారి. ఇందుకు దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక హుస్నాబాద్‌లో 1993 జూన్‌లో నిర్వహించిన కథా వర్క్‌షాపు నాకెంతో ఉపకరించింది. బి.ఎస్. రాములు గారి ప్రోత్సాహం ఎంతగానో సహకరించింది.”

హాస్టల్ కథల గురించి డా॥ పి.వి. రమణ ఇవి అనుభవ నిధులు అని పేర్కొన్నారు. నిబద్ధత, నిజాయితీ, నిష్కర్షత, నిర్మలత ఉన్న వ్యక్తి హృదయంలో పొంగులు వారే జలపాత ఘోష. అక్షర అక్షరంలోనూ ప్రతిధ్వనిస్తుంది. ఈ గ్రంథంలోని ప్రతి కథ సీతారాములు అనుభవ నేపథ్యంలో ప్రాణం పోసుకున్నదే కావడం ఒక ప్రత్యేకత.

హాస్టల్ కథలు తొలి ప్రయత్నం అయినప్పటికీ కథా స్వరూపం ఎంత చక్కగా పట్టుకున్నాడో తొలి కథలోనే తెలిసి పోతుంది.

“ఆరో ఇంటర్వ్యూ

ఈసారి హాస్టల్ వార్డెన్ ఉద్యోగానికి

పిలవగానే లోనికి వెళ్ళాను

జిల్లా కలెక్టర్ బెనర్జీ, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కృష్ణమూర్తి, స్థానిక ఎం.ఎల్.ఎ ఇంకా మరికొందరు కూర్చొని ఉన్నారు.” ఇలా నిరుద్యోగి ఇంటర్వ్యూ ఎదుర్కొనే ప్రశ్నలకు ఎలా జవాబిచ్చాడో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఇంటర్వ్యూ చేసేవాళ్ళు రచయిత రాసిన కవితను పత్రికలో చదివిన సంగతి గుర్తు చేస్తారు. సూటిగా జవాబులు చెప్పేసరికి ఆ జవాబులు విన్న మిగతా నిరుద్యోగులు నీకు ఇక జన్మలో ఉద్యోగం రాదని తేల్చేశారు. కానీ ఇంకా నిజాయితీపరులు ఎందరో ఉన్నారని నిరూపిస్తున్నట్టుగా వారం గడిచేసరికే రచయితకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందింది. అది రచయిత బాధ్యతను మరింత పెంచింది. ఆదర్శవంతంగా జీవించాలని హాస్టల్‌ను కూడా ఆదర్శవంతంగా నిర్వహించాలని అప్పుడే మనసులో అనుకున్నారు. భద్రాచలం నుండి గోదావరి దిగువ లాంచీల్లో 40 కి.మీ. వెళితే గోదావరి ఒడ్డున కుక్కునూరు ఉంటుంది. ఆ ప్రయాణం ఒక మర్చిపోలేని అనుభవంగా దృశ్యీకరణ చేస్తాడు. దీన్ని 2వ కథలో పొందుపరిచాడు. “గోదావరి అంచులోని పచ్చని తోటలు, పుప్పొడి రేణువులు సూర్యరశ్మిలో రంగుల హరివిల్లుగా తుషార బిందువు సందువరాల్లో తమాషాల పన్నీరు వర్షించినట్లుగా మరో నవలోకాన్ని సృష్టిస్తుంది. ఆ ఇంద్ర లోకంలో గిరిజన కర్షకులు పార్వతీశంకరుల భంగిమలను అభినయిస్తున్నట్లుగా

దృశ్యాలు ఎంత తిలకించినా ఏదో తెలియని అనుభూతితో తదేకంగా చూడాలనిపిస్తుంది.” ఇలా నిరుద్యోగ యువకుడు మహబూబాబాద్ నుండి బయలుదేరి ఎక్కడో కొండ కోనల్లో ప్రకృతితో సహజీవనం చేస్తున్న ఆదివాసీ ప్రజల శ్రమజీవన సౌందర్యాన్ని ప్రేమించిన సన్నివేశం నిజంగా అపూర్వం. ప్రతి ఆదివాసీ ప్రాంతాల ఉద్యోగి ఇలా ప్రకృతిని, ఆదివాసీ ప్రజలను ప్రేమిస్తూ వారి అభ్యుదయానికి కృషి చేస్తే ఈ దేశం ఎంతో వేగంగా ముందుకు సాగుతుంది. ఆ ప్రయాణం సాగి ఆనంద అనుభూతులతో కుక్కునూరు చేరి హాస్టల్ ఎక్కడో కనుక్కుంటాడు.

హాస్టల్ అంటే అదేమీ బిల్డింగ్ కాదు. కాసె గడ్డితో వేసిన గుడిసె పాకలు. అక్కడ వార్డెన్‌గా హాస్టల్ వాచ్‌మన్ అధికారం చెలాయించడం చూసి తొలుత ఆశ్చర్యపోయాడు రచయిత. హాస్టల్ అస్తవ్యస్తంగా వుందని ఒకే పూటకు అర్థమైపోతుంది. 3వ కథలో కుక్కునూరు గ్రామ శివారు అయిన రామసింగారం వెళ్ళి అక్కడి ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నాడు. గ్రామ పెద్దలను వారు పరిచయం చేశారు. “మీరైనా హాస్టల్‌ను సరిగ్గా నడుపుతారా?” సర్పంచ్ ప్రశ్న.

అంతదాకా అలాంటి విశ్వాసం ఎవరూ ఇవ్వలేక పోయారని ఆ ప్రశ్న అర్థం. హాస్టల్‌లో సంఖ్య తక్కువ. అందుకని హాస్టల్‌లో సీట్లు నింపడానికి ముందు కృషి చేయాలనుకున్నారు. సంక్షేమ పథకాలు స్వార్థపర భోక్తలకే ఎలా మారుతున్నాయో కొద్ది రోజుల్లోనే అర్థం చేసుకున్నాడు. హాస్టల్ విద్యార్థులను ప్రతి రోజు ఉదయం దగ్గరుండి స్నానాలు చేయించడం. వారి బట్టలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవడం. అనారోగ్యంగా ఉన్న పిల్లలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్ళడం మొదలైనవాటితో పాటు చొక్కా తొడుక్కొని గుండీలు పెట్టుకోవడం కూడా నేర్పాల్సి వచ్చింది విద్యార్థులకు. సంరక్షకుడు అంటే హాస్టల్ విద్యార్థులకు తల్లీ, దండ్రిలా బాధ్యతలు వహించాలనే అనుభవం చవి చూశాడు. ఆ తల్లిదండ్రుల పాత్రల్లోకి తనను తాను మలచుకున్నాడు. తెలుగు భాషలో మాట్లాడలేని గిరిజన విద్యార్థులకు ఎదుటివారిని సంబోధించడం ఎలానో తెలియని పిల్లలకు అన్నీ నేర్పాల్సిన గురువుగా కూడా బాధ్యతలను స్వీకరించారు. 15 రోజుల్లోనే హాస్టల్ నిర్వహణలో వచ్చిన మార్పులను చూసి ఆ హాస్టల్ కిరాయదారు, గ్రామ సర్పంచ్, స్కూల్ టీచర్లు, గ్రామస్తులు రచయితను ఆదరించడం మొదలు పెట్టారు.

అయితే అవినీతికి అలవాటు పడిన అధికారులు ఒక్కటికి రెండు సార్లు తనిఖీకి వచ్చి నిజాయితీగా ఉంటూ పనిచేయడం ఎంత కష్టమో అనుకునేట్టుగా అనేక విధాలుగా చెప్పి చూశారు. తమ కిస్తులు ఎలా ఇవ్వాలో, పైవాళ్ళకు ఎలా ఇవ్వాలో అని చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలైనా భరించడానికి సిద్ధంగా ఉన్న సీతారాములు వాటికి తల ఊపలేదు.



దాంతో నిజాయితీపరులకే కష్టాలు మొదలయ్యాయి. వాచ్‌మెన్ అంతదాకా చేసిన పెత్తనాన్ని అవినీతిని సవరించడం చాలా కష్టమైపోయింది. చివరికి వార్డెన్ ప్రాణానికి అతడొక్కడే శత్రువుగా మారగలడు అని అనిపించింది. ఈ విషయంలో ఎన్ని రిపోర్టులు రాసినా అధికారుల నుండి స్పందన కరువైంది. అయినప్పటికీ పేదరికంలో పుట్టి పెరిగిన సీతారాములు పేదలకు ఖచ్చితంగా సేవ చేసి వారిని ఎదిగించడానికే కృతనిశ్చయుడయ్యాడు.

అతని పట్టుదల, దీక్ష ముందు ఎందరో ఉన్నతాధికారులు, వారి జులుం ఓడిపోయింది. ఆలస్యంగానైనా సరే సీతారాములును గౌరవించక తప్పలేదు. వార్డెన్‌లలో అతనంటే సదభిప్రాయం ఏర్పడింది. కాలక్రమంలో జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా కె. సీతారాములు నిజాయితీపరుడుగా ప్రభుత్వాధికారులు, నాయకులు, విద్యార్థులు, తోటి వార్డెన్లు గుర్తించి గౌరవించారు. వార్డెన్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లాలో నక్సలైట్లు ఎమ్మార్వోతో పాటు సిబ్బందిని కిడ్నాప్ చేసినప్పుడు సంప్రదింపులకు జిల్లా కలెక్టర్ కె. సీతారాములు గారిని పంపారు. సమస్య సులువుగా పరిష్కారమై కిడ్నాపైన అధికారులు విడుదలయ్యారు. ఈ ఒక్క సంఘటన చాలు సీతారాములు పట్ల ప్రభుత్వ అధికారులకు, అదే సమయంలో నక్సలైట్ ఉద్యమకారులకు ఎంత గౌరవం ఉందో తెలుపుతుంది. ఈ గౌరవాలు ఎంతో కష్టపడితే గానీ దక్కలేదు. ఎంత కష్టపడ్డాడో ఈ కథల పుస్తకమే సాక్ష్యమిస్తుంది.

3వ కథ తల్లీ, దండ్రి, గురువుగా వార్డెన్. 10 రోజులు సంక్రాంతి సెలవుల్లో స్వగ్రామం మానుకోట వెళ్ళాడు. ఈ సారి సెలవుల తరువాత భార్య సావిత్రిని కూడా కుక్కునూరు గ్రామానికి తీసుకొని బయల్దేరాడు. భార్యాభర్తలు కలిసి చేసిన ఆ బురద లాంచీ ప్రయాణాలు మరో అనుభూతిని కలిగింప చేశాయి. మానుకోటలో పక్కింటి అమ్మాయి సావిత్రిని మనసు పడి పెళ్ళి చేసుకున్నాడు. అమ్మాయి తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. నిరుపేద కుటుంబం. ఆమె కూడా ఆదర్శాలు గల వ్యక్తి. ఇంటర్ టీటీసీ చేసి ఏ పని దొరికితే ఆ పని చేస్తున్న రోజుల్లో అమ్మాయికిచ్చిన మాట ప్రకారం ఎవరెన్ని విధాల వారించినా పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరువాత ఆరు నెలలకే ఉద్యోగం వచ్చింది. భార్యను వెంట తీసుకొని వెళుతుంటే మిత్రులు సీతారాములు వనవాసం వెళుతున్నట్లున్నది అని అంటే సీతారాములు వనవాసం కాదు సుందర వాసంకు వెళ్తున్నాం అని నవ్వుతూ జవాబిచ్చాడు. ఇలా జీవితమే ఒక ప్రయోగశాలగా మలుచుకున్న రచయిత పరిణామం ఈ కథలో కనపడుతుంది.

26 జనవరి ప్రజాస్వామ్య దినోత్సవాన్ని హాస్టల్‌లో చక్కగా నిర్వహించి పిల్లలకు ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశారు. హాస్టల్ సమస్యలు, పరిస్థితులు, ఉంటున్న

ప్రదేశాలు కొత్తయినా సావిత్రి భర్తతో సహకరించింది. ఒకరికొకరం అన్నట్లుగా కుక్కునూరులో జీవించారు. హాస్టల్ పిల్లలే తమ పిల్లలుగా భావించారు.

4వ కథ ఎలుగుబంటి బారి నుండి ఎలా తప్పించుకొని బయటపడ్డాడో చిత్రించిన తీరు దృశ్యాన్ని కళ్ళముందుంచి ఒళ్ళు గగురుపొడుస్తుంది. ఇంటికి చేరేదాకా భార్య భర్త గురించి ఎంత నిరీక్షిస్తుందో ఈ కథ చివరన ఒక్క మాటలో చెప్తాడు. నేను నైట్ వాచ్‌మెన్‌ని అనే శీర్షిక పెట్టిన 5వ కథలో వార్డెన్ల కష్టాలు, హాస్టల్ సిబ్బంది డ్యూటీలో నిర్లక్ష్యం, హాస్టల్ నిర్వహణలో ఎన్ని కష్టాలు తెస్తుందో చిత్రించాడు. ఎంత తింటున్నావు నీకు ఎంత కావాలి అనే శీర్షికలో హాస్టల్ సిబ్బంది ఏ విధంగా ప్రవర్తిస్తారో సంక్షేమ శాఖల జిల్లా అధికారులు అంతకు రెట్టింపుగా వక్రమార్గంలో ప్రవర్తిస్తారని ఆ సంఘటనను కథనీకరించారు. జీతం డబ్బులు మంజూరు చేయడానికి, హాస్టల్ విద్యార్థుల సరుకుల బిల్లులు మంజూరు చేయడానికి ఎలా పీడించుకు తింటారో జిల్లా అధికారి దీక్షా దక్షతలు లేకపోతే సిబ్బంది పనితీరు ఎంత అస్తవ్యస్థంగా ఉంటుందో ఈ సన్నివేశాలు తెలుపుతాయి. కోర్టుకు చెవులుంటాయి కానీ కళ్ళు ఉండవు అనే కథలో వాచ్‌మెన్ ప్రవర్తన మీద ఎన్నిసార్లు రిపోర్టు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో బూర్గంపాడు తహసిల్దారు బీడీవో వర్గాలను కలిసి వివరించాడు. జిల్లా గిరిజన శాఖాధికారి వార్డెన్‌నే తప్పుపట్టాడు. వాచ్‌మెన్ దొంగతనం జరిగిందని పోలీసు రిపోర్టు ఇచ్చి టీచర్‌ను రెండు బకెట్లు అర్ధరాత్రి ఎత్తుకుపోయినట్టు చెప్పాడు. ఆ విషయంలో గ్రామస్థులు, అధికారులు, పోలీసులు రెండు వర్గాలుగా చీలిపోయారు. విషయం ఏఎస్‌పి దాకా తీసుకువెళ్ళితే అసలు విషయాలు బయట పడ్డాయి. వార్డెన్‌ను ఎలాగైనా అక్కడి నుంచి సస్పెండ్ చేసి పంపించాలని వాచ్‌మెన్ చేసిన కుట్రలు ఈ కథలో చదివి తెలుసుకోవచ్చు.

విద్యార్థుల సంక్షేమం కాపాడాలంటే వార్డెన్‌గా ఎంతటి జటిల సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందో వేసవి సెలవుల తరువాత విద్యార్థులను హాస్టల్‌లో చేర్పించడానికి కోయ గూడాలకు వెళ్ళడం సంఘటనలో చూడవచ్చు. నేను చదువుకుంటే బాగుపడతానని మాకేమీ తెలుసు బాబూ అని, మాకో హాస్టల్ ఉందని ఉత్తగనే చదువుకోవచ్చని మాకు తెలియదని పిల్లల తల్లిదండ్రులు మమేకంగా చెప్తారు. వారందరినీ సముదాయించి వారం రోజుల్లో 50 హాస్టల్ సీట్లను భర్తీ చేశాడు. క్రమంగా హాస్టల్‌ను క్రమశిక్షణాలయంగా మార్చాడు. గోదావరి కళ్ళు తెరిచింది కథలో గోదావరి వరద ప్రవాహంలో చిక్కుకుపోయి ప్రాణాలతో బయట పడిన తీరు చిత్రించాడు. రెండేళ్ళ తరువాత అక్కడి నుండి గార్లకు బదిలీ అయింది. అప్పటికి తాను కుక్కునూరులో ఉండడంతో మిగతా కుటుంబ సభ్యులు సరిగా పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు అనారోగ్యంతో మంచం పట్టారు. ఏ పని చేయలేని స్థితికి వచ్చారు. అయినా డ్యూటీ మొదటి ఆశయం తరువాత వ్యక్తిగత కుటుంబ



బాధ్యత అని నిర్ణయించుకున్నారు.

అధికారులు తాగుతారు. వారికి సీసాలను వార్డెన్ వర్కర్లే మోస్తారు అనే విషయాన్ని మరో కథలో చిత్రించారు. కుక్కునూరు నుండి గార్లకు వచ్చాక చూస్తే గార్ల వార్డెన్ తాగుడుకు బానిసగా మారి విద్యార్థుల్ని పట్టించుకోకుండా చేయకూడని పనులు చేసే వాడని అందువల్లే విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అతన్ని బదిలీ చేయించారని తెలిసింది. అక్కడ వాచ్‌మెన్ పత్తా లేదు. కుక్కునూరులో పని చేసిన తీరు తెలుసుకున్న సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు ఎవరికి వారు సర్దుకొని హాస్టల్ నిర్వహణ సక్రమంగా సాగేట్టు సహకరించారు. తాగుబోతు వాచ్‌మెన్‌ను తాగడం మాన్పించి మార్చిన తీరుతో హాస్టల్ మరింత మెరుగైంది.

వాచ్‌మెన్ మారినా వార్డెన్ బదిలీ అయి కొత్త వార్డెన్ వచ్చినా హాస్టల్ విద్యార్థుల్లో మార్పు రాకపోవడంతో రాత్రి, పగలు హాస్టల్‌లోనే ఉండాలని నిశ్చయించుకున్నాడు. దొంగతనంగా రైలెక్కి సినిమా చూసి వస్తున్న విద్యార్థులను పట్టుకొని నిలదీసి క్షమాపణ రాయించి తీసుకొని మిగతా విద్యార్థులకు హెచ్చరిక చేశాడు. అలా విద్యార్థులు క్రమంగా దారికి వస్తుంటే మరికొందరు విద్యార్థులు స్టడీ పేరుతో బయట రూములు తీసుకున్నామని వెళ్ళిపోతుండేవారు. వారిని అదుపులోకి తేవడానికి వాళ్ళ రూములను చెక్ చేశాడు. చదువు పేరిట ఆ రూముల్లో పేకాట ఆడడం గమనించాడు. ఆ తరువాత వారిని ఎలా దారికి తెచ్చాడో కథలో చిత్రించాడు.

ఆమెనే మా వెంట పడింది అనే కథలో బయట రూమ్ తీసుకున్న విద్యార్థులు ఒక అమ్మాయితో కథ నడపడం పసికట్టిన వార్డెన్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఈ చెంప, ఆ చెంప వాయించాడు. పోలీసులకు పట్టిస్తానని బెదిరించాడు. కట్టెపుల్లలు అమ్ముకునే అమ్మాయి గజ గజ వణికిపోయి తప్పయింది అంటూ రెండు కాళ్ళమీద పడిపోయింది. విద్యార్థుల్లో పతన సంస్కృతి ఎలా పెరుగుతూ వస్తుందో అందుకు వాతావరణం ఎలా దోహదం చేస్తున్నదో ఈ కథలో చిత్రించారు. మరో కథలో వార్డెనే వర్కర్‌గా మారిన సందర్భాలను చిత్రించాడు. హాస్టల్‌లో సామాన్లు, ఇస్త్రీపెట్టెలు, చిల్లర డబ్బులు దొంగతనం కావడం మామూలుగా జరుగుతూ ఉంటుంది. దొంగను పట్టుకొని తండ్రిని పిలిపించి టీసీ ఇచ్చి పంపించివేయడంతో మిగతా విద్యార్థుల్లో మార్పు మొదలైంది.

కూర ఎక్కువ వేయనందుకు వర్కర్‌ను తన్నిన బోర్డర్లు కూడా ఎలా ఉంటారో పార్టీ ప్రచారం కోసం సైకిల్ ర్యాలీకి హాస్టల్ విద్యార్థులు ఎలా వెళుతుంటారో వారిని ఎలా దారికి తెచ్చాడో మరో కథలో వివరించాడు. జిల్లాధికారులు అసలు కలువలేదేమి బిడ్డా అంటూ లంచాల గురించి పీడించే తీరు ఎలా ఉంటుందో చిత్రించి గిరిజన సంక్షేమ

శాఖ పని తీరును బట్టబయలు చేశారు.

హాస్టల్ భవన నిర్మాణం కోసం చేసిన కృషి ఫలించింది. మామూళ్ళు ఇవ్వని వారిని మళ్ళీ మళ్ళీ తనిఖీలు చేసి నానా ఇబ్బందులకు గురిచేస్తారు. వీటన్నింటిని అధిగమించి గ్రామ ప్రజలు ఆదరణ అభిమానం పొందాడు. ఆ క్రమంలో ఖమ్మం జిల్లా వార్డెన్ల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. 1985లో బయ్యారం హాస్టల్‌కు బదిలీ చేశారు. బయ్యారం హాస్టల్‌ను కూడా త్వరలోనే ఆదర్శ హాస్టల్‌గా తీర్చి దిద్దారు. ఆ హాస్టల్ నిర్వహణను వీడియో తీసి జిల్లా అంతటా ఆదర్శ హాస్టల్‌గా జిల్లా కలెక్టర్ అజయ్ ప్రకాష్ సహానీ ప్రదర్శింపచేసారు.

ఇలా ఖమ్మం జిల్లాలో 1995లో అన్ని రంగాల్లో 3వ సారి ఉత్తమ వార్డెనుగా అవార్డును, సత్కారాన్ని అందుకున్నారు. హాస్టల్‌ను విద్యార్థులే స్వయంగా నిర్వహించుకునే విధంగా శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. బాధ్యతను పెంచారు. జిల్లా దినపత్రికల్లో సీతారాములు గురించి అనేక ప్రశంసలు, వార్తలు ప్రచురించాయి. ఆయన తన కుటుంబ సభ్యులను, విద్యార్థులను కళాకారులుగా తీర్చిదిద్ది వందలాది గ్రామాల్లో మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు ఇచ్చారు. విద్య ప్రాధాన్యతను తెలిపారు. మద్యం వ్యసనం మాన్పించే నాటికలు ప్రదర్శించారు. ఇలా హాస్టల్‌ని, విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చి దిద్దిన వార్డెన్లు ఎందరో ఉన్నారు. వారందరికీ ఈ కథల సంపుటి ఒక ప్రతీక.

నూతన సమాజ నిర్మాణం ఎక్కడోలేదు. సోషలిస్టు సమాజం ఎపుడో అకస్మాత్తుగా ఊడిపడదు. అదొక పరిణామ క్రమం. అది నిరంతర నిత్యజీవితాచరణ నుండే నిర్మాణమవుతుంది. విప్లవం పరిణామశీలమైనది. విప్లవం ఆయుధాల్లో ఉండదు, జీవితంలో ఉంటుంది. నిత్యజీవితమే ఒక యుద్ధం – ఒక విప్లవక్రమం. దాన్ని పట్టుకోవాలి. పట్టుదలతో ఆచరణలో నిలబడగలగాలి. అపుడే నూతన సమాజ నిర్మాణం జరుగుతుంది. అన్ని రంగాల్లో ఈ కృషి ఏకకాలంలో జరిగినపుడే సమగ్ర సామాజిక విప్లవం అవుతుంది. అందుకు ఒక ప్రతీక సీతారాములు జీవితం.

విప్లవ కారుల్తోసహా సమగ్ర సామాజిక వికాసాన్ని కోరేవారెవరైనా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ద్వారా సమాజాన్ని దర్శించడానికి వారి రోజువారీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దాలో తెల్సుకోవడానికి ఈ కథలు ఎంతో ఉపకరిస్తాయి. విప్లవ కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుడు, రాజకీయనాయకులు, విద్యార్థి సంఘాలు సీతారాములుగారి ఈ జీవితానుభవాల నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

అవినీతికి నిలయమైన అన్ని డిపార్టుమెంట్ల్లాగే సంక్షేమశాఖల్లోనూ సృజనాత్మక



శక్తి నశిస్తుంది. అవినీతికరమైన జీవితం సృజనాత్మకత వికాసానికి గొడ్డలిపెట్టు. ప్రజలు అపహాస్యం చేసే ప్రభుత్వ ఉపాధ్యాయ వర్గాల్లోను గొప్ప రచయితలున్నారు, అవినీతికి నిలయమైన సంక్షేమశాఖలోను ఉత్తమ రచయితలున్నారు. బి.డి. శర్మ, యస్.ఆర్. శంకరన్, ఫణికుమార్, ఏ. విద్యాసాగర్‌లాంటి వాళ్ళెందరో సంక్షేమ శాఖల నిర్వహణ ద్వారానే గొప్పవాళ్ళుగా ప్రపంచానికి తెలిసారు. వయోవృద్ధులు సి.వి. కృష్ణారావుగారు సంక్షేమశాఖలో పనిచేసి డైరెక్టరుగా రిటైరయిన రచయిత అని చాలామందికి తెలిసే ఉంటుంది. ఆ కోవలోనే సంక్షేమశాఖలోనూ క్రింది ఉద్యోగులున్నారు. చుట్టూతా ఉన్న అవినీతి కారణంగా నిజాయితీపరులైన వార్డెన్లకు గుర్తింపు కరువైంది. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురించిన ఉప్పెన నవల రాసిన సరిపెల్లి కృష్ణారెడ్డి ఒక హాస్టల్‌వార్డెనే అనే విషయం చాలామందికి తెలియదు. ఈ దేశంలో ఆధునిక సామాజిక విప్లవాన్ని ప్రారంభించిన మహాత్మా జ్యోతిరావ్ పులేకూడా హాస్టల్ వార్డెన్‌గా పనిచేసేవాడని చాలామందికి తెలిసే ఉంటుంది. వార్డెన్‌గా నాకెదురైన అనుభవాలు, సమస్యలు, ఆ సమస్యల్ని పరిష్కరించుకొన్న తీరు సీతారాములువీ, నావీ ఒకే తీరుగా ఉండడం ఆశ్చర్యకరం. సంఘటనలు, స్థలకాలాలు వేరైనా ఈ హాస్టల్ కథలు వార్డెన్‌గా నా స్వీయచరిత్రలో భాగంకూడా. మా యిరువురి వ్యక్తిత్వాలు ఒకే రకమైనవి కావడంవల్లే ఈ సారూప్యత సాధ్యపడింది.

నేటిపౌర సమాజంలో మధ్య తరగతి జీవులుగా ఎదగడానికి అట్టడుగు కులాలకు హాస్టల్ సౌకర్యాలు ఎంతో కొంత చేయూతనిస్తాయి. పేద ప్రజల్నుంచి కొందరినైనా ఎదిగించడంలో ప్రభుత్వాలు వారు ఆయా కులాలకు సెక్షన్లకు ప్రతినిధులుగా తాము పుట్టి పెరిగిన సమాజానికి సేవ చేస్తారని ఆశించాయి, ఈ లక్ష్యం పెద్దగా నెరవేరలేదు.

వ్యక్తిగత ప్రయోజనానికి సామాజిక ప్రయోజనానికి మధ్యనుండే వైరుధ్యం వ్యక్తిగత ప్రయోజనానికనుగుణంగా పరిష్కరించబడుతున్నది. దీనివలన విలువలు నశించి సామాజిక ప్రయోజనాలు గాలికి వదిలేయబడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు – ఉపాధ్యాయులు మొదలయినవారు ఈ సామాజికాభివృద్ధిలో సాధనాలుగా పని చేస్తారని అటు ప్రభుత్వాలు ఇటు ప్రజలు ఆశించారు. కాని ఆచరణలో వీరి వ్యక్తిగత స్వార్థాలు జీవన ప్రమాణాలు ఆయా ప్రభుత్వాల లక్ష్యాలయి అందుకు పన్నులు సమకూర్చే సాధనాలుగా ప్రజలు మార్చబడ్డారు. ఇదీ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విషాదం. లక్ష్యం కావల్సిన ప్రజలు ఆయా ప్రభుత్వాలకు పార్టీలకు, ఉద్యోగులకు సాధనాలుగా మారిపోయారు. విప్లవ పార్టీలు కమ్యూనిష్టులుకూడా ఇందుకు మినహాయింపు కాదు, వీరు తమ వ్యూహం ఎత్తుగడల లక్ష్యాలకనువుగా ప్రజల్ని సాధనాలుగా భావిస్తారు.

అన్ని రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఈ స్థితే సంక్షేమ హాస్టళ్ళలోనూ కొనసాగుతోంది. చిత్తశుద్ధిలేని ఆచరణ అంతటా స్పష్టంగా కనిపిస్తుంది. అన్ని రంగాల్లో

సేవాభావం లోపించడం ఇటీవల కొట్టొచ్చినట్టు కనపడే పరిణామం. "గవర్నమెంట్ సర్వెంట్" అంటే ప్రభుత్వ సేవకుడనే అర్థం, కాని గవర్నమెంట్ సర్వెంట్ అనే పదం ప్రజలమీద అధికారం చెలాయించడానికి పర్యాయపదమైపోయింది. ప్రభుత్వ ఉపాధ్యాయులుకూడా మినహాయింపు కాదు. ప్రభుత్వ ఉద్యోగం దొరికేదాక దొరకాలని తాపత్రయపడటం, దొరికిన తరువాత ఉద్యోగ భద్రతకోసం ఉన్నత జీవన ప్రమాణాలకోసం వెంపర్లాడటం, అవి లభించిన తరువాత అసలు కర్తవ్యాన్ని మరిచి ఇతర ఆదాయ వనరులను వెతుక్కోవడమే పరమావధి కావడం చూస్తూ ఉన్నాం.

ఈ స్థితి ఒక్క రోజులో వచ్చిందికాదు ఒక్క రోజులో పోయేదికాదు, ఎవరంతట వాళ్ళు స్వీయ సంస్కారం అలవర్చుకొని సమాజంపట్ల బాధ్యతవహించి ఎక్కడికక్కడ కృషి చేసినపుడే ఇది సాధ్యం. దీన్ని నైతిక విప్లవం అని సామాజిక విలువలకు సంబంధించిన సాంస్కృతిక విప్లవమని వ్యవహరించవచ్చు. చట్టాలెన్ని ఉన్నప్పటికీ ఈ నైతిక సామాజిక విలువల విప్లవం వ్యక్తిగత స్థాయిలో విజయవంతం అయినపుడే నిజమైన "మానవీయ పౌరసమాజం" ఆవిష్కృతమవుతుంది. అలాంటి నైతిక సాంస్కృతిక విప్లవానికి ఒక ప్రతీక, ఒక ప్రతినిధి కె. సీతారాములు.



రెండవ అధ్యాయం

# కథా రచన పాఠాలు వస్తువు-శైలీ, శిల్పం

# నేను - నా కథలు

(బి.ఎస్.రాములు గారు 'కథా రచన పాఠాలు - వస్తువు శైలీ, శిల్పం' అనే పుస్తకం రాశారు. అందులో తన కథలను ఉదహరిస్తూ వస్తువు, శైలీ, శిల్పం, భాష, సంభాషణ, పాత్రల చిత్రణ, సన్నివేశ చిత్రణ, కథ ప్రారంభం, ముగింపు, కథా కథనం మొదలైన అంశాలను విశ్లేషించారు. నూతన రచయితలకు, సాహితీ వేత్తలకు అవి ఎంతో ఉపయోగం. ఎమెస్కో వాళ్ళు అందులోని మొదటి సంపుటి ప్రచురిస్తామని తీసుకున్నారు. మిగతా సంపుటాల్లోంచి కొన్ని అధ్యాయాలను 'నేను-నా కథలు' అనే పేరిట ఇందులో చేర్చడం చాలా అవసరం అనిపించింది. తద్వారా బి.ఎస్.రాములు గారు తన కథల గురించి స్వయంగా ఏం ఆలోచించారో, ఏం చిత్రించారో తెలియడంతో పాటు పాఠకులకు, సాహితీ వేత్తలకు ఎలా చిత్రించాలో, ఎలా అర్థం చేసుకోవాలో కూడా అదనంగా తెలుస్తుంది. అందువల్ల వీటికి రెట్టింపు ప్రాధాన్యత వుందని గమనించకోరతాము. - సంపాదకులు)

## 'మెరుగు-తెల్లబట్ట' కథల నేపథ్యం

ఇది ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో 'మెరుగు-తెల్లబట్ట' కథల నేపథ్యం గురించి అడిగినప్పుడు వారి పేజి పరిమితికి లోబడి 1997లో ఇది రాశాను... ఈ కథల్లోని సంఘటనలకు, పాత్రలకు, ప్రేరణ అయిన సంఘటనల్ని, పాత్రల్ని నిర్దిష్టంగా పేర్కొంటే అదే ఓ నవల అవుతుంది కనుక ఆ ప్రయత్నం చేయడం లేదు. వేల ఏళ్లుగా వస్తున్న సాహిత్యంలో స్వభావ నమూనా పాత్రలు విభిన్న స్థల కాలాల్లో వేరే పాత్రలుగా కనపడే వాటిని, "ప్రేమకథ" రూపంలో సామాజిక పరిణామాలను "మెరుగు, "తెల్లబట్ట" కథలు చిత్రించే ప్రయత్నం చేశాను. తద్వారా ప్రేమకథ రూపంలో ఒక కుటుంబంలోని, గ్రామంలోని సామాజిక పరిణామాల్ని రికార్డు చేశాను.

వ్యక్తీకరించే శక్తి, అవకాశం, అవసరం, సమాజం స్పందించే తీరు ననుసరించి ప్రేమభావాలు వ్యక్తమవుతాయి. అవ్యక్తమవుతాయి. అదృశ్యమవుతాయి. స్థాయీ భేదాలు

పొందుతాయి. సమాజంలోని ఆధిపత్య వర్గాలకు, కులాలకు, పురుషులకు ప్రేమ భావాలు వ్యక్తీకరించే అవకాశాలు హెచ్చు. ఇతర వర్గాలకు, కులాలకు, స్త్రీలకు ఈ అవకాశాలు నిరాకరించబడుతూ నిరాదరించబడుతున్నాయి. స్త్రీలు చొరవ తీసుకొని ప్రేమ భావాలు వ్యక్తీకరిస్తే అలుసుకు గురవుతున్నారు.

ప్రేమను వ్యక్తం చేసినందుకు శూర్పనఖ ముక్కు చెవులు ఖండించబడ్డాయి. పీడిత కులాల ప్రేమ భావాల స్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. విప్లవం పట్ల ప్రేమ భావాల్ని వ్యక్తం చేసే వారిని చిత్రహింసల పాలు చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ పేరిట హత మారుస్తున్నారు. కొందరు ప్రేమభావాలను వ్యక్తీకరించలేనపుడు తమను తాము అర్పించుకోవడం ద్వారా ప్రేమను వ్యక్తం చేస్తారు. స్త్రీ శీలాన్ని అర్పిస్తే సమాజం హర్షించడం లేదు. మిగతా త్యాగాల్ని హర్షిస్తున్నది.

సమాజం కోసం ఏదో చేయాలి అనే సామాజిక ప్రేమను వ్యక్తీకరించడం కోసం కొందరు సమాజానికి తమను తాము అర్పించుకుంటారు. వ్యక్తీకరించే శక్తి, అవకాశం లేని సామాజిక ప్రేమ ఇంకెలా వ్యక్తం చేయాలో తెలియక ఎందరో దేశం కోసం, ప్రజల కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడుతుంటారు. మరోవైపు ఆచరణలేని వారు భావ వ్యక్తీకరణ ద్వారా మాటలతో కోటలు కడుతుంటారు. ఉత్త మాటలు తప్ప ఉదాత్త ఆచరణ ఉండదు.

నేను కుటుంబాన్ని, ఉద్యోగాన్ని వదిలేసి పూర్తికాలపు కార్యకర్తగా ఇల్లు వదిలేయడం... 'మెరుగు', 'తెల్లబట్ట' కథల్లోని విప్లవ పాత్రలు ఒక కోవలోనివి. నాకు చిన్నప్పుడు ప్రేమించడం, ఆరాధించడం ఆచరించడమే కాని ప్రేమను వ్యక్తం చేయడం పెద్దగా రాలేదు.

కథలు, నవలలు చదివి సినిమాలు చూసి ప్రేమను వ్యక్తం చేయడం ఎలాగో కొంత తెలుసుకున్నాను. కాని ప్రేమను వ్యక్తీకరించే అవకాశం వుండేది కాదు. తద్వారా అది మూగప్రేమ. నా ప్రేమలో చాల భాగం అవ్యక్త ప్రేమ. రంగవ్వ, సారవ్వ పాత్రల్లోని మూగ ప్రేమతో ఈ సంబంధం ఇలా జీవిత సంబంధం. ప్రేమించడానికి పెద్దగా కారణాలు కూడా వుండేవి కావు. ఒక చల్లని మాట, ఒక చక్కని చూపు, ఒక చక్కని ఆదరణ చూసి వారిని ప్రేమించబుద్ధయ్యేది. సామాజిక ప్రేమను ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పనిచేయడం ద్వారా వ్యక్తపరుచుకున్నాను. మొదటి దశలోని సామాజిక ప్రేమ ఇది. సారవ్వ భర్త వెంకటయ్య ఆ దశలో ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యాడు.

శరత్ బాబు చిత్రించిన దేవదాసు లాంటి వాళ్ళు, భావకవులు తమ విషాద ప్రేమను వ్యక్తం చేసే వాళ్లు. నాకూ అలా వ్యక్తం చేయాలనిపించేది. అవకాశం వుండేది కాదు. అనుభవాలు కలుగుతున్న కొద్దీ అవకాశాల వెనక సామాజిక చలన సూత్రాలున్నాయని



స్పష్టమవుతూ వచ్చాయి. పీడిత వర్గం, పీడిత కులాల వాళ్ళు ప్రేమించడం, నిషేదాన్ని దేవదాసులా భావకవుల్లా వ్యక్తీకరించడం సాధ్యపడుతుందా అనే ప్రశ్న కలిగింది. జీవితానుభవాలనుండే ఈ ప్రశ్న పుట్టింది.

పెళ్ళికి భిన్నంగా కొనసాగించే లైంగిక సంబంధాల గురించి చిన్నప్పటి నుంచి చాలా వినేవాడిని. స్త్రీలు అలా చెప్పుకోవడం నేనెపుడూ వినలేదు. సంసారాలు సాగుతుండగానే ఈ అక్రమ సంబంధాలు యధావిధిగా కొనసాగడం ఎన్నో చూశాను. ప్రముఖ రచయిత 'చలం' ఈ పల్లెటూరి పామర జనం జోలికి పోలేదు. దళిత దృక్పథం, స్త్రీవాద దృక్పథం కొత్త వెలుగులు ప్రసరింప జేశాక నా చిరకాల అనుభవాలకు, చూసిన జీవిత కోణాలకు కొత్త శక్తి వచ్చింది. 'దేవదాసు' కథ పీడిత కులంలో పీడిత వర్గంలో పుట్టిన వారికి సాధ్యపడదు అని స్పష్టం కాజొచ్చింది. దీన్ని 1983 వేసవి సెలవుల్లో జరిగిన కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ కథా వర్క్‌షాపులో వివరించాను.

దళిత మగ దేవదాసు పాలేరుగా వుంటూ తాగి ఓ పార్వతీ అని కలవరిస్తే భూస్వామి, అగ్రకులస్థుడు నా కూతుర్ని పలవరిస్తావా అవి కొట్టి చంపి బావిలో పడేస్తాడు. అదే దేవదాసు స్త్రీపాత్ర అయితే ఆమెకు కనీసం అలా తాగే అవకాశమూ వుండదు. ఆమె తన బాధను వ్యక్తీకరించే అవకాశం ఈ సమాజం ఇవ్వడం లేదు. ఎస్సీ, బీసీ, స్త్రీలు ప్రేమించి ప్రేమించబడి విషాదాన్ని వ్యక్తం చేయలేకపోయిన వాళ్లెందరో తెలుసు. ఈ వర్గ కుల పురుషాధిక్యత భూస్వామ్య గ్రామీణ సమాజం వారి గురించి వ్యక్తీకరించే అవకాశాన్ని నిరాకరిస్తూ వస్తున్నది. వారి విషాదాలకు, కన్నీళ్లకు సాహిత్యంలో స్థానం లేకుండా పోవడం నన్ను కలిచివేసింది.

దళిత దేవదాసులను, దళిత స్త్రీ దేవదాసులను జీవితానుభవాల నుంచి వెలికితీసి వ్యక్తీకరించడం అవసరం అనుకున్నాను. 'తెల్లబట్ట' కథలోని సారవ్వ, మెరుగు కథలోని రంగవ్వ దళిత స్త్రీ దేవదాసుకు రెండు వ్యక్తీకరణలు.

'మెరుగు' కథను మీ ఆత్మకథా... అని చాలా మంది అడిగారు. ఆ పాత్రలు ఫలానా వారి గురించేనా... అని వారి జీవితాల్లో ఎదురైన వారిని పేర్కొన్నారు. అవి కల్పిత పాత్రలు కావు. ఆనాటి సామాజిక స్థితిలోని ప్రతీకాత్మక పాత్రలవి. 'మెరుగు', 'తెల్లబట్ట' జంట కథలు.

సారవ్వ భగ్న ప్రేమ దళిత స్త్రీ దేవదాసు కథైతే అగ్రవర్ణ స్త్రీ దేవదాసు కథ మాలతిది. సారవ్వతి విషాదాంతమైన ప్రేమ. అదే ప్రేమను సుఖాంతంగా మలచుకున్న ప్రేమ రంగవ్వది. మాలతి కూడా రంగవ్వలా జీవించబోయినా అవకాశాలు కోల్పోయిన స్త్రీ.

సారవ్వలోని విషాదప్రేమలో నా ఆత్మకథ కొంత వుంది. సారవ్వ సామాజిక ప్రేమ

నా సామాజిక ప్రేమతరతమ భేదాల్తో పోల్చుకోవచ్చు. ఇవన్నీ జీవితంలోని పాత్రలే. ఒకనాటి మానవ సంబంధాలు– సామాజిక పరిణామాలు వీటి కథా వస్తువు.

సాహిత్యం చదివి వుండకపోతే మెరుగు, తెల్లబట్ట కథలు, పాత్రలు ఇలా చిత్రించగలిగి వుండేవాడిని కాదు. సాహిత్యంలో స్వభావ నమూనా పాత్రలు నిరంతరం పునర్జన్మనిస్తుంటాయి. స్థల కాల సమాజ చరిత్ర నిర్దిష్టతల కారణంగా అవి వేర్వేరుగా కనబడుతూ పాతవీ కొత్తవీ రెండూ వాటి సాహిత్య స్థాయి ననుసరించి సాహిత్యంలో నిలబడిపోతుంటాయి. ఈ విషయమై అధ్యయనం జరిగితే ఎన్నో విషయాలు తెలుస్తాయి.

"ఆమ్రపాలి", "మృచ్ఛకటికం"లోని వసంతసేన, శకారుని పాత్రలు స్థలాలు, కులాలు మార్చి చిత్రించడం ద్వారా 'కన్యాశుల్కం' అనే నాటకంలో మధురవాణి, గిరీశం పాత్రలుగా రూపాంతరం చెందాయి. కన్యాశుల్కం కూడా వైవాహికేతర లైంగిక సంబంధాలు కేంద్రంగా సాగిన కథే. ఆమ్రపాలి, వసంతసేవ, మధురవాణియే మరో నిర్దిష్ట స్థల, కాల, కుల జీవితంలో రంగవ్వగా పరిణమించింది.

పాపులర్ రచనలు అని ఇటీవల పేరు వచ్చింది కాని పాపులర్ అయి చదవడం మంచి రచనలకే ఎక్కువ అవసరం. పాపులర్ రచనగా వుండే సీరియస్ సాహిత్యం వేగవంతం కావడం ఎంతో అవసరం. ప్రేమ్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని మెరుగు, తెల్లబట్ట కథలు రాశాను. 'సవాసేరు గోధుమలు' అనే ఆరు పేజీల కథలో నలభైఏళ్ల సమాజ పరిణామాల్ని చెప్పాడు ప్రేంచంద్. నేను చందమామ, బాలమిత్ర కథల్లా సాదాసీదాగా కథ చెప్తూ వెళ్లాలనుకోవడం వెనక ప్రేంచంద్ ప్రేరణ, ఆసియా కథనపద్ధతి వుంది. మెరుగు, తెల్లబట్ట, సదువు, ఇల్లాలు కథల్ని చందమామ కథల్లా చెప్పడానికి మరో కారణం కూడా వుంది.

నవల రాసే ఓపిక లేదు. రాస్తే పత్రికలకు వేసే ఓపిక లేదు. వేస్తే చదవాల్సిన వారికి చదివే ఓపిక లేదు. ఒక పేజీ కథ రాసుకుని దాన్ని సిన్మాగా తీస్తున్నప్పుడు సంక్షిప్తంగా రాయడం అవసరం అన్పించింది. నవలంత జీవితాన్ని కథలో పెట్టడానికిది మరో కారణం.

'మెరుగు' కథలో 1957–64 మధ్య అప్పాయింటై పల్లెల్లో పంతుళ్లుగా వెళ్లి అక్కడ ఏం చేశారు? నేటి నిరక్షరాస్యతకు నాటి వాళ్లు ఎలా కారణం... ఉపాధ్యాయులు చదువు చెప్పారా... కల్లు తాగుతూ దొరల సూటుకేసులు మోస్తూ తిరిగారా... అనేవి కథలో పట్టిన మేరకు చెప్పడం జరిగింది. ఆ జీవితం నాకన్నా పదేళ్ల ముందు తరం టీచర్లది. నేను 1977లో టీచర్ల నుండి నక్సలైట్లుగా మారిన తరానికి చెందిన వాడిని.

రంగవ్వ పాత్ర మధ్య తరగతి ఉద్యోగిని జీవితంలో పునర్జన్మించిన క్రమానికి 'మెరుగు'



కథలోని 'లక్ష్మి' ప్రతీక. మాలతి కన్న లక్ష్మి కాస్త ముందుకు నడిచింది. స్త్రీవాదుల అవగాహనపై, పనితీరుపైగల అసంతృప్తి వల్ల వారినే సంబోధిస్తూ కథ ప్రారంభించాను.

పౌరహక్కుల సంఘ ఉద్యమ నిర్మాత ఒకరు ప్రజల ఆర్థిక సాంఘిక స్థితిగతులపై పిహెచ్‌డి చేశారు. ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ వుండడంతో వైవాహికేతర లైంగిక సంబంధాల పాత్ర స్పష్టపడి తలపట్టుకున్నాడు. అలాగే ఇటీవలి దళిత ఉద్యమాలకు ప్రధాన ప్రేరణలైన రెండు ఘటనల్లో నిందితుల్ని బాధిత కులాల స్త్రీలు పరామర్శించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక అవ్యక్తం చేయబడ్డాయి. వీటిని దృష్టిలో వుంచుకుని రంగవ్వ పాత్ర స్థలకాల పరిమితుల మేరకు చిత్రించాను. అలాగే అవ్యక్తం చేయబడ్డ అగ్రకుల స్త్రీలతో దళిత పురుషులకు గల సంబంధాలను 'తెల్లబట్ట' కథ ద్వారా చెప్పాను.

రంగవ్వ, మాలతి, సారవ్వల పట్ల కరుణార్ద్రత కలిగేట్టుగా చిత్రించాలనుకున్నాను. సారవ్వ చనిపోయినట్టు చిత్రించిన రాతప్రతి చదివిన స్త్రీలు ఇంత జీవితం చెప్పి నిరాశను మిగిల్చేదైతే మీరు కథ ఎందుకు రాసినట్టు. అలాంటి సారవ్వలకు తిరిగి జీవించే ధైర్యాన్ని అవకాశాన్ని ఇచ్చినపుడే కథ అర్థవంతం అవుతుందని తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. కథ ఎఫెక్టు కోసం జీవితాల్ని చంపడం భావ్యం కాదన్న వారితో ఏకీభవించి కొద్ది వాక్యాల్లో ఆమె జీవితాన్ని ఎలా గెలుచుకో గలిగిందో చూపించాను. ఈ రెండు కథల్లో ఆసియా దేశాల కథన నిర్మాణ పద్ధతిని అనుసరించినా పాశ్చాత్య కథన రీతులను సమన్వయించే శిల్ప ప్రయత్నం కొంత చేయడం జరిగింది.

ఇప్పటిదాకా తెలుగు సాహిత్యంలోకి రాని భారతీయ సమాజాన్ని, జీవితాల్ని, కోణాల్ని చిత్రించడం మెరుగు, తెల్లబట్ట, సదువు, ఇల్లాలు, గాడిద, రియల్ ఎస్టేట్ కథల లక్ష్యం. జీవితానుభవాలే అందుకు పునాది.

ఇద్దరు భార్యలతో సుఖంగా సంసారం చేస్తున్నారు. అక్కినేని నాగేశ్వరరావుతో 'మంచికుటుంబం' వంటి సినిమాలు తీసి ఇద్దరు భార్యలతో ఎంత చక్కగా వుండవచ్చో చెపుతున్నారు. త్రిమూర్తులకు కూడా ఇద్దరేసి భార్యలు. తిరుపతి వెంకన్నకు ఇద్దరితో పాటు మరో భార్య బీబీ నాంచారమ్మ ఉందని చక్కగా చెపుకుంటున్నారు. అలాగే ఇద్దరు భర్తలతో సుఖంగా సంసారం చేసే మహిళల గురించి కుటుంబ వ్యవస్థ జీవితాలున్న వారి వ్యక్తీకరణను సాహిత్యాదరణతో తీసుకురావడం స్త్రీవాదులు చేయాల్సిన పని. మెరుగు, తెల్లబట్ట కథలు అందుకోసం చేసిన ఒక ప్రయత్నం. పల్లెలోంచి ఎదిగే దళిత స్త్రీ వాదులు దీన్ని స్పష్టంగా విశ్లేషిస్తారు.

సారవ్వ భర్త వెంకటయ్య సమాజాన్ని ప్రేమించడం నేరం కాదు. దాన్ని వ్యక్తీకరించడం ఆచరించడం వల్ల కలిగిన పరిణామాలు అతను ఎదుర్కొన్న తీరు అతన్ని అసహ్యించుకునేట్టు

చేశాయి. కాని పాలకవర్గాల నిర్బంధాల్ని అసహ్యించుకునేట్టు చేసి సారవ్వ భర్త పట్ల కూడా కాస్త కరుణ కలిగే విధంగా రాయగలిగి వుంటే మరింత బాగుండేది.

'మెరుగు', 'తెల్లబట్ట' కథల్లో రంగవ్వ, సారవ్వలకు న్యాయం చేయబోయి వారి భర్తల కోణాల్ని, స్థితిని వదిలేసినట్టయిందనిపిస్తోంది. ఈ అవ్యక్తం చేయబడ్డ వీరి ప్రేమ భావాలను కూడా వ్యక్తం చేసే ప్రయత్నం చేస్తాను. అవ్యక్త స్త్రీలను వ్యక్తం చేయబోయి అవ్యక్త పురుషులను అవ్యక్తంగానే మిగల్చానా... అదే జరిగితే... అందుకు 'కథ' ప్రక్రియకున్న పరిమితి కారణం అనుకుంటాను.

**నా కథల ప్రారంభాలు కొన్ని :**

**ఎంతో జీవితం గడిచిపోయాక ప్రారంభమయ్యే 'రాత్రిపూలు'**

ఎంతో జీవితం గడిచిపోయాక కథ ప్రారంభిస్తే పాఠకుల ఊహాశక్తి, ఆసక్తి పెరుగుతుంది. కథ కూడా ఆసక్తికరంగా సాగుతుంది. 'బతుకుపయనం' కథా సంపుటిలోని 'రాత్రిపూలు' కథను ఎంతో జీవితం గడిచిపోయాక ఇలా సంభాషణతో ప్రారంభించాను.

"అన్నయ్యా! నీ భావాల వల్ల నువ్వు నీ జీవితాన్ని చాలా నష్టపోయావు. నీ బతుకుపొద్దు పడమటికి వంగింది. నీతోటి వాళ్ళు ఎప్పుడో ఆగిపోయారు. వాళ్లు చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఫలాలు అనుభవిస్తున్నారు. నువ్వు చేసినకాడికి చాలు. నువ్వు చెయ్యాల్సింది యిక యువతరం చేయాలి. చేస్తుంది. నేనింకా ఎన్నాళ్ళో బతకనని నీకు తెల్సు. నా చివరి కోరిక మన్నిస్తావు గదూ!"

ప్రమీల ఏడుస్తోంది.....

రమేశ్ మనస్సు భారమైంది... గొంతు పెకలలేదు.

ఆసుపత్రి గదిలో నిశ్శబ్దం... బెడ్‌పై ప్రమీల. మంచం ప్రక్కనే స్టూలు మీద రమేశ్.

చెల్లెలు ప్రమీల కళ్లను తుడిచాడు రమేశ్.

"ప్రమీలా! అలా అనకు. నువ్వు తప్పక బతుకుతావు. నిరాశ పనికిరాదు. ఆత్మవిశ్వాసం రోగాల్ని కూడా జయిస్తుంది."

ఇలా కథ సాగుతుంది. సహజంగా సంభాషణ రూపంలో విరుద్ధాంశాల చర్చతో కథ ముందుకు సాగుతుంది. కథతో పాటు తాత్విక చర్చ కూడా ముందుకు సాగుతుంది. ప్రదేశం ఆసుపత్రి. సందర్భం చావుకు సమీపించిన చెల్లెలు. ప్రధాన పాత్ర అన్నయ్య రమేష్ త్యాగాలు, జీవితం. ఆ జీవితం యొక్క తాత్వీకరణ. రమేశ్ ప్రేమించి భంగపడ్డాడు. ఆమె మరొకర్ని పెళ్లి చేసుకొని హాయిగా వుంది. కానీ రమేశ్ పెళ్ళి చేసుకోలేదు. తమ్ముళ్లను,



చెల్లెల్లను చదివించాలని, సామాజిక న్యాయం కోసం ఉద్యమాలు చేయాలని పెళ్లిని వాయిదా వేసుకొని జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు. ఆయన త్యాగాలు, నాయకత్వం ఆయన కోసం కాదు.

ఉద్యమం ఒక దశకు ఎదగగానే ఎవరో దాన్ని అందుకొని ముందుకు సాగుతుంటే రమేశ్ యువ నాయకత్వంతో పోటీ పడలేక ఓడిపోయాడు. ఆగిపోయాడు. ఆగిపోయిన చోటే త్యాగాలు చేస్తూ వస్తున్నాడు. అతని జీవితం అలా మారడానికి కారకులెవరు? ఎవరిని నిందించే అవకాశం లేదు. అనేక కారణాలు అందుకు తోడయ్యాయి. అయినా అతని త్యాగాలు వృధా పోలేదని చీకట్లో కనిపించే నక్షత్రాల్లా రాత్రి పూసే పూలలా తానూ ఒక కర్తవ్యం నిర్వర్తిస్తున్నానని ఒకతృప్తితో జీవిస్తున్నాడు. మనిషిలో ఇలాంటి తృప్తి ఏదో ఉంటుంది. తృప్తిలో ఒక అసంతృప్తి ఉంటుంది. కొంత తృప్తి వుంటుంది. తృప్తి పూర్తిగా సంతృప్తిగా మారితే మనిషి చనిపోతాడు. ఈ తాత్వికాంశాన్ని 'సదువు' కథలో గంగాధరి చనిపోవడంలో చిత్రించాను. అది చాలా మందికి చెప్పే దాకా తెలియదు. అలాగే రమేశ్ త్యాగాలు, తృప్తి, అసంతృప్తి, జీవిత పరిణామాలు చాలామందికి తెలియవు. చెల్లెలికి కూడా తెలియదు.

ప్రతి మనిషి తప్పో ఒప్పో తనకు అనుకూలమైన లాజిక్‌ను నిర్మించుకుంటాడు. దొంగకు ఒక లాజిక్ వుంటుంది. లంచావతారాలకు కూడా ఒక లాజిక్ వుంటుంది. నేను పని చేసి పెడుతున్నాను. దాంతో కోట్లు సంపాదిస్తున్నాడు. వన్ పర్సెంట్ మార్జిన్ మామూలు తీసుకుంటే తప్పేమిటి? వాడు కాంట్రాక్టులో థర్టీ పర్సంట్ మార్జిన్ కొడుతలేడా? అని లాజిక్‌తో జీవిస్తుంటారు. ఈ లాజిక్ లేకపోతే వాళ్లు బతకలేరు. టెన్షన్స్, తప్పు చేశామనే భావన వెంటాడుతుంది. ఆరోగ్యం దెబ్బతింటుంది. షుగర్, అల్సర్స్, బీపీ మొదలైన రోగాలు వస్తాయి. తాను చేస్తున్న పనిని సమర్థించుకుంటూ ఆత్మవంచన, పరవంచన చేసుకున్నప్పుడే అతడు స్థిరంగా, హాయిగా, సుఖంగా జీవిస్తుంటాడు. అందువల్ల మోసగాళ్లు, దగాకోర్లు, నాయకులు తమదైన లాజిక్‌ని, సమర్థనను తమకు తాము తయారు చేసుకుంటారు. దాన్ని చిత్రించడం అవసరం. అందుకు అలాంటి వారిని పరిశీలించడం అవసరం. ఇక్కడ రమేశ్ తన వైఫల్యాలకు లేదా త్యాగాలకు ఇచ్చుకున్న లాజిక్ ఎలా వుందో చూద్దాం.

"పెళ్ళి చేసుకొని మీరంతా ఏం సాధిద్దామనుకున్నారు? ఏం సాధించారని? ప్రకృతిలో పశు పక్ష్యాదులూ, ప్రతి ప్రాణీ పిల్లల్ని కంటున్నాయి. అదేనా మీరు సాధించింది.?"

"అన్నయ్యా!... అదే లేకపోతే ఈ ప్రపంచమే లేదు. నువ్వు లేవు. నేను లేను."

"అదే ప్రపంచమా!"

"కాదు."

"అయినపుడు నా యిష్ట ప్రకారం నన్ను బతకనీ"

ప్రమీల మూగబోయింది.

"ప్రమీ! నా భావాలే నన్ను బతికిస్తున్నాయి. నీవు సమాజం కోసం చేస్తున్నానని అంటున్నదంతా నిజానికి నా కోసమే. అదే నా ఆనందం. నా భావాలు వదులుకోమనడం నన్ను చనిపోవాలని కోరడం తప్ప వేరు కాదు."

అన్నయ్యతో అంతగా వాదించడం యిదే మొదటిసారి. బహుశ చివరిసారి కూడా! అనుకుంది ప్రమీల. చూపుతిప్పుకుంది.

కిటికీలోంచి ఆకాశంలో చుక్కలు రాత్రిపూలలా మిలమిల మెరుస్తున్నాయి.

"అన్నయ్యా! నేను జీవితంలో అమ్మతనం సాధించాను. ఈ జీవితానికి యిది చాలు."

తృప్తిగా కళ్ళు మూసుకుంది ప్రమీల. రమేష్ ఆత్మీయంగా తలపై చెయ్యి వేసి నిమిరాడు.

ఇక్కడ ప్రమీల సంసారం, కుటుంబం అనే జీవితాన్ని అందులో సాధించిన సౌఖ్యాలను తల్లితనాన్ని ఆదర్శీకరించింది. అన్నయ్య రమేష్ తన భావాలను, ఆ భావాల ఆధారంగా చేసిన త్యాగాలను, గడిచిన జీవితాన్ని సమర్థించుకున్నాడు. నా భావాలే నన్ను బతికిస్తున్నాయి అనేది గొప్పమాట. కోట్లాది మంది ప్రజలు తమ భావాల కోసం, బంధాల కోసం, అనుబంధాల కోసం, ఆత్మీయతల కోసం బతుకుతుంటారు. కష్టాలు ఓర్చుకుంటారు. గృహ హింసను సహిస్తుంటారు. సంవేదనలన్నీ తమ భావాలే.

అయితే ఏదీ పూర్తి సత్యం కాదు. సత్యంలోని ఒక అంశం మాత్రమే సత్యంగా వ్యక్తీకరణ పొందుతూ వుంటుంది. 'సదువు' కథలో భావాల గురించి చర్చ సాగుతుంది.

"నీ భావాలే నీవా? ఆ భావాలు కలగకముందు నీవు లేవా? నీ భావాలు మారితే నీవు లేవా? నీకు ఈ భావాలు కలగకముందు ఆ భావాలను స్వీకరించింది నీవే కదా! నీవు స్వీకరించిన భావాలు నీవి ఎలా అయ్యాయి? నీవు స్వీకరించినప్పుడే అవి నీ భావాలయ్యాయి. నువ్వు లేకముందు కూడా ఆ భావాలు వున్నాయి. నువ్వు వదిలేసిన తరువాత కూడా ఆ భావాలుంటాయి. నీవు కూడా వుంటావు. నీలో కొత్త భావాలుంటాయి. నీ జీవితం కొత్త జీవితంగా మారుతుంది" అనే చర్చ 'సదువు' కథలో సంభాషణలో భాగంగా చూడవచ్చు.

కొత్త వూరుకో, ప్రదేశానికో, కొత్త బంధువులింటికో లేదా ఎక్స్‌కర్షన్‌కో, తీర్థ యాత్రలకో పోయినపుడు ప్రతిది శ్రద్ధగా ఆసక్తిగా చూడ్డం సహజం. వీలైన మేరకు



ప్రతిదీ గుర్తుంచుకునే ప్రయత్నం చేస్తారు. మానేరు డ్యాంనో, శ్రీరాంసాగర్‌నో, నాగార్జున సాగర్‌నో, నందికొండనో, సాలార్‌జంగ్ మ్యూజియంనో, రామప్పగుడినో, తాజ్ మహల్‌నో, ఫతేపూర్ సిక్రీనో మొదటిసారి చూస్తున్నప్పుడు అక్కడి విశేషాలు, ప్రత్యేకతల్ని ఆసక్తితో గమనిస్తాం. గైడుతో అడిగి తెలుసుకుంటాం. హృదయంలో వాటిని పదిలంగా ముద్రించుకుంటాం. వాటితో పాటు ఆ ప్రయాణం జరిగిన తీరును అక్కడ కలిసిన మనుషుల్ని, మనతో వచ్చిన వారిని భలేగా గుర్తుంచుకుంటాం. కథకులుగా మనం ఈ ప్రపంచాన్ని కొత్త ప్రదేశాన్ని చూస్తున్నట్టు పరిశీలించాలి. ఒక విదేశస్థుడు మన ఊరికొస్తే చాలా విషయాలు గమనిస్తాడు. ఆ వూళ్లోని విషయాలు, విశేషాలు సామాజిక పరిణామాల్ని చెప్పడానికి ఇదొక కథన పద్ధతి.

బస్ కండక్టర్లు, టీచర్లు, తహసిల్దార్లు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, ప్రయాణాలు చేసే వారు, సేల్స్ రిప్రజెంటేటివ్‌లు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు రోజు ఎంతోమందిని చూస్తుంటారు. వారి స్వభావాలు తెలుస్తుంటాయి. అనేక విషయాలు చెవిన పడుతుంటాయి. వినాల్సి వస్తుంది. ఓపికుంటే బోలెడు కథలు రాయవచ్చు. నేను బస్సు ప్రయాణంతో కొన్ని కథలు ప్రారంభించాను, వరుసలు, ఎవరికివారే, ప్రేమ కథల్లో బస్సు ప్రయాణమే ప్రారంభంగా కథను పరిసరాలను, విభిన్న వ్యక్తుల్ని, వారి స్వభావాల్ని చిత్రించాను.

## మరొకర్ని సంబోధిస్తూ కథ ప్రారంభించడం – 'మెరుగు' కథ

మరొకర్ని సంబోధిస్తూ కథ ప్రారంభించి నడపవచ్చు. నేను తాత మనవరాలికి చెప్తున్నట్టు, 'మెరుగు' కథలో ఆనాటి సంగతులు చెప్పాను. కథ ఇలా ప్రారంభమవుతుంది.

"నీ ప్రశ్న స్పష్టంగానే ఉంది. జవాబే నా దగ్గర స్పష్టంగా లేదు. నీ జీవితాన్ని నువ్వు నిర్ణయించుకోవడమే సబబు. అందుకని జవాబు తెల్సినా చెప్పడం భావ్యం కాదు. నా ఎరుకలో యిలాంటి కొన్ని చూశాను. వాటిని నీ ముందుంచుతాను. అన్నీ ఆలోచించి నీ నిర్ణయాలు నీవు తీసుకోవడమే మంచిది. ఓడిపోతే ఎవరిమీదా నెట్టివేయకుండా దాన్ని అధిగమించి తిరిగి జీవితాన్ని గెల్చుకోవడం అనేది అది నీ నిర్ణయమే అని నీకు ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే సాధ్యం. 'మెరుగు' (తొలి చినుకు) పడగానే విత్తనాలేస్తే వర్షాల్లేక ఎండిపోవచ్చు....

.... లక్ష్మీ! నీ హృదయంలో వసంత మేఘం నిండా ఆవరించుకొని వుంది. ఆకు రాల్చిన శిశిరంలో నేనున్నాను. నేను చెప్పేది ఒకటైతే నీకు అర్థం అయ్యేది మరొకటి కావచ్చు. మనిద్దరం వేర్వేరు పరిస్థితుల్లో ఉండడమే కారణం. నాకు వసంతాల మీద ఆసక్తి పోయింది...."

అని కథ గతంలోకి పోతుంది. చాలా కథలు ఇట్లా వర్తమానంలో మొదలెట్టి గతం గురించి, జ్ఞాపకాల గురించి రాసే పద్ధతిలో వస్తుంటాయి. మీరూ రాయవచ్చు. చాలా ఎక్కువ విషయాల్ని, కథలో చెప్పాలనుకున్నప్పుడు ఈ పద్ధతి ఎంతో సౌకర్యంగా వుంటుంది. సమాజం మారుతున్న తీరు, మనుషులు, మమతలు, ఊరు పరిమాణం చెందుతున్న తీరు పాతకు కొత్తకు పోలికతో, పాత స్వభావానికి నేటి స్వభావానికి మధ్య వైరుధ్యంతో, రెండు రకాల స్వభావాల సంఘర్షణతో ఎన్నో విషయాల్ని ఎంతో జీవితాన్ని ఈ కథ చెప్పే పద్ధతిలో చెప్పవచ్చు.

## చాలాకాలం తర్వాత ఆ వూరికెళ్ళినట్టు ఎందుకు రాస్తారు? – 'వరుసలు' కథ

చాలాకాలం తర్వాత ఆ వూరు వెళ్లినట్టు లేదా చాలాకాలం తర్వాత ఆ స్నేహితుల్ని, బంధువుల్ని కల్సినట్టు – రాసే కథలు అలా ఎందుకు రాస్తారంటే, ఆ కథల్లో ఒక గొప్ప సౌకర్యం వుంటుంది. ప్రతిదీ కొత్తవారు చూస్తున్నట్టు చెప్పవచ్చు. అక్కడే వున్న వారు చెప్తే ఇన్ని రోజుల్నించీ నీకివి తెలియవా ఇపుడెందుకు చెప్తున్నావు అన్నట్టు చూస్తారు. చాలాకాలం తర్వాత అక్కడికి వెళ్లడం వల్ల ఆనాడు ఎలా వుండేవి ఇపుడెలా వున్నాయి అని ప్రతి విషయాన్ని నాటి స్మృతులతో నేటి వాస్తవాలతో తులనాత్మకంగా పోల్చి చెప్పడం, తేడాలు చెప్పడం, పరిణామాల్ని, మార్పులు చిత్రించడం ఈ పద్ధతిలో సాధించబడుతుంది. తద్వారా ఎన్నో ఏళ్ల నాటి విషయాల్ని కూడా కొద్ది రోజుల కథలో భాగంగా చెప్పవచ్చు. ఈ పద్ధతి ఒక రకంగా జీవితాన్ని సమీక్షించుకోవడం లాగా సాగుతుంది. ఉదాహరణకు నేను రాసిన 'వరుసలు' కథలో ఈ పద్ధతి తీసుకున్నాను.

## చదువరులను సంబోధిస్తూ చెప్పే 'వరుసలు' కథ

"ఈ మధ్య పెళ్లి ముహూర్తాలన్నీ ఉదయమే పెడుతున్నారు. దీనివల్ల ఎవరికీ ఇబ్బంది లేదు. ఇంటివద్దే స్నానాలవీ ముగించుకొని... సమయానికి పెళ్లి అవడంతోనే భోంచేసి ఎక్కడి వాళ్లు అక్కడకు వెళ్లిపోవచ్చు. ఏమ్మాట్లాడుకున్నా భోజనాలయ్యేదాకానే. తర్వాత పెళ్ళి పందిరి ఖాళీ.

వరసకు మా అన్న కూతురి పెళ్ళి. అందుకని చాలామంది పాత చుట్టాల్తో పరిచయాల్ని రెన్యువల్ చేసికోవాలని ఉదయమే లేచి స్నానాలవీ ముగించి గబగబా తయారై అందరం బస్సెకాం. తార్రోడ్డు మీద సాఫీగా వెళ్తోంది బస్సు. పూర్వం ఆ వూరికి ఏవైపు నుండి తోవ సరిగ్గా వుండేది. అమ్మమ్మతో చిటికెన వేలు పట్టుకొని గంటన్నర పరుగులాంటి నడకతో ఆ వూరు చేసేసరికి ఒక్క కాలివేలు కన్నా దెబ్బ తగిలి పసుపు అద్దాల్సి వచ్చేది. చెప్పులు లేని కాళ్లకు తోవలో అన్నీ గులకరాళ్లు, దెబ్బలు...



"ఆ వూరు మా అమ్మమ్మగారి పుట్టినిల్లు, నా పల్లెటూరి జ్ఞాపకాలన్నీ ఆ వూరితో ముడివేసుకున్నవే. అది జగిత్యాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఇపుడు చిల్వాకోడూరు, ధర్మారం మీదుగా పెద్దపెల్లి, గోదావరిఖని వెళ్లే రూటులో రెండో స్టేజియే ఆ వూరు.

బస్సు లక్ష్మీపురం పాత క్రాస్ రోడ్డు దాటుతుంటే గుర్తొచ్చింది. ఆ వూరివాళ్లు మా పెరళ్ళు పోతాయి అని పెద్దపెల్లి వెళ్ళే రోడ్డు నిర్మాణానికి అడ్డం తిరగడంతో అది జాప్తాపురం మీదుగా పోయింది. అప్పట్నించి జాప్తాపురంకు సిరి వచ్చింది. ఇపుడు లక్ష్మీపురం ఒక మూలకైపోయింది. రోడ్డును రానీయకుండా చేసుకున్నందుకు ఇపుడు తమను తామే తిట్టుకుంటారు ఆ వూరివాళ్లు.

నా విషయంలోనూ అలాగే జరిగింది. జాప్తాపురం మేన సంబంధాల వాళ్లు నన్ను మాకు వద్దుపొమ్మన్నారు. ఇంటిముందు జాగలేదు. ఇంటెనక జాగలేదు. ఓ పొలం లేదు, పెరడు లేదు. ఏ పూటది ఆ పూట కొనుక్కొని తింటారు. వ్యవసాయం ఉన్న ఇంటికిస్తే ఏడాది గాసం ఇంటినిండా ఉంటుంది. ఏదీ కొనుక్కోనవసరం ఉండదు అని నన్ను అల్లుణ్ణి చేసుకోవడానికి వరుస మేనమామలు నిరాకరించారు. నా కోసం పిల్లనిమ్మని అడిగి అమ్మ, అమ్మమ్మ అవమానంతో ఇంటికి తిరిగి వచ్చారు. గా సదువుకునే పోరనికి ఇస్తమా? ఏం పని చేసుకొని బతుకుతడు. ఎదురు కట్నం ఇచ్చినా మీకివ్వను పో అన్నాడట ఓ మామ. ఇరవై అయిదేళ్ళ తర్వాత ఇపుడు అయ్యో ఎందుకు ఇవ్వకపోతిమి అని తమను తామే తిట్టుకుంటారు. ఆ వరుసైన మేనమరదళ్లు మరీ బాధపడ్తుంటారు. ఈ చిన్నపాటి ఉద్యోగమూ, సౌఖ్యమూ చూసి."

ఇలా వెనకటి కాలంలో వ్యవసాయం ముఖ్యమనుకునే వాళ్లు. చదువు ప్రాధాన్యత గుర్తించలేదు. చదువుకొని ఉద్యోగం సంపాదించుకున్నాక అతడు ఎదిగాడు. వ్యవసాయ దారులు అలాగే వుండిపోయారు. వ్యవసాయంలో చాలక చివరకు బొంబాయి, భివండికి బట్టల మిల్లు కార్మికులుగా పనికి వెళ్ళారు. ఈ పరిణామాలను చిత్రించడానికి నేను నిజంగానే పెళ్ళికి వెళ్ళినప్పుడు నాకు ఇస్తానన్న మేనమరదలు ప్రశ్నించిన క్రమం అంతా రాశాను. నూటికి తొంభైపాళ్లు వాస్తవిక జీవితమే. ఈ కథ అచ్చయ్యాక మళ్లీ వారికి వినిపించాను. ఇలా వాస్తవాలను, గత పరిణామాలను దశాబ్దాల జీవితాన్ని కథల్లో చెప్పడానికి వర్తమానంలో ఒక సంఘటన సృష్టించి గతంలోకి వెళ్ళినట్టు చెప్పడం ద్వారా ఎంతో జీవితాన్ని కథలో సంక్షిప్తంగా చెప్పవచ్చు. చాలామంది ఇలా రాయడానికి కారణం ఇదే.

## సంభాషణతో ప్రారంభమయ్యే 'వారసత్వం' కథ

సంఘర్షణతో పాటు అంతదాకా జరిగిన వాదోపవాదాలన్నిటిని పూర్వపక్షం చేస్తూ

తన వాదాన్ని వినిపించే కూతురు గురించి నేను రాసిన 'వారసత్వం' కథలో సంభాషణ ఇలా వుంటుంది. సంభాషణతోనే కథ ప్రారంభం అవుతుంది. అంటే కథ అప్పటికే ఎంతో జరిగిపోయింది. దాన్ని పాఠకులు ఊహించుకుంటారు. తద్వారా వారి ఊహాశక్తి పెరుగుతుంది. కథ చాలా జరిగిపోయాక కథ ప్రారంభం వుండడం చక్కని పఠనాసక్తిని పెంపొందిస్తుంది. పెళ్ళి చూపులు అయిపోయాయి. పెళ్ళి నిశ్చయం చేశారు. ఎంగేజ్‌మెంట్ రేపే. కిరణ్మయికి ఆ పెళ్లి ఇష్టం లేదు. ఇష్టం లేని పెళ్లికి ఒప్పుకోవాల్సి వచ్చింది. కానీ సమయం దగ్గర పడుతున్న కొద్దీ మనసులో సముద్రాలు ఉప్పొంగుతున్నాయి. ఇదీ జరిగిన కథ. ఇది కథలో చెప్పలేదు. కథ డైరెక్టుగా ఇలా ప్రారంభమవుతుంది.

"ఆ పల్లెటూరి సంబంధం నేను చేసుకోను. ఎవరిని చేసుకుంటే బాగుంటుందో మందితో చెప్పించుకోవడానికి నేను చిన్న పిల్లను కాను. గ్రూప్-1 లేదా లెక్చరర్ ఉద్యోగం దొరికే దాకా పెళ్ళి వద్దంటే వినరేం? జీవితం పట్ల ఎవరి అవగాహన వారికి వుంటుంది. మీకున్నంత అనుభవం లేకపోవచ్చు. టీచర్ ఉద్యోగం చేస్తున్నాను. మూడు వందల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను డీల్ చేస్తున్నాను. నేను పని చేస్తున్నది కూడా పల్లెటూరి బడిలోనే కదా! పల్లెటూరి మనస్తత్వాలు నాకు తెలియవా?"

ఎమ్మెస్సీ, యం.ఫిల్, బి.ఇడి. చేసిన గోల్డ్‌మెడలిస్ట్ కిరణ్మయికి కోపం, దుఃఖం జమిలిగా వస్తోంది. తన వినయమే తన భవిష్యత్తును ముంచిందని వెక్కివెక్కి ఏడ్చింది. రాత్రి నిద్రపోయినట్టు లేదు. ఈ సంబంధం ఎలా వదిలించుకోవాలో తెలియక సతమతమై నిరాశలో కూరుకుపోయింది కిరణ్మయి.

"అమ్మా! వాళ్లు మీకు అంత దగ్గరి పాత చుట్టాలైతే జగిత్యాల సంబంధమని నాన్న నిన్ను చేసుకునే బదులు ఆ పల్లెటూరి మేన సంబంధం చేసుకోవాల్సింది. నలభయ్యేళ్ల క్రితమే నాన్నకు పనికిరాని మేన సంబంధాలు నాకెందుకు?"

వంట గిన్నెలు తోముతున్న కిరణ్మయి తల్లి లక్ష్మిబాయి చకితురాలైంది. ముసలి అత్తమామల మూర్ఖత్వం వల్ల ఇంత దూరం వచ్చిందని తిట్టుకుంది. కిరణ్మయి తండ్రి రాజేశం కరీంనగర్ డిగ్రీ కాలేజిలో లెక్చరర్‌గా చేస్తున్నాడు. ముసలి తల్లిదండ్రుల కోసం కుటుంబాన్ని కోరుట్లలో వుంచి వారానికోసారి కరీంనగర్ నుండి వస్తుంటాడు.... కథ ఇలా సాగుతుంది. అసలు ఏం జరిగిందో పాఠకుడు ఉత్కంఠతో ఊపిరి బిగపట్టి కథ వెంట పరుగెడుతుంటాడు. ఇలా వ్యతిరేకాంశాలు, అనుకూలాంశాలు రెండు వెంటదివెంట సంభాషణలో కొనసాగినప్పుడు డైలాగులు తీవ్రంగా వుంటాయి.

ఇంతకుముందే చెప్పినట్టు సినిమాల్లో, టీవీల్లో హీరోకు-విలన్‌కు, హీరోయిన్‌కు-హీరోకు మధ్య, హీరోయిన్‌కు- తల్లిదండ్రులకు, హీరోయిన్‌కు-అత్తమామలకు సఖ్యత



కుదిరేదాకా డైలాగులు పేలాలు వేయించినట్టు చకచకా సాగుతుంటాయి. ఆ డైలాగుల బలంతో టీవీ ఎపిసోడ్‌లు వారాల కొద్దీ నడుస్తుంటాయి. కథల్లో కూడా అలాంటి డైలాగ్ బలంగా చెప్పగలిగితే పాఠకులకు రెండు భిన్న కోణాలు అర్థమవుతాయి.

అమ్మ, నాన్నలు చెప్పిందానికి, బాస్ చెప్పిందానికి 'అలాగే' అని తలూపితే సంభాషణ సాగదు. అమ్మ, నాన్నలను, బాస్‌ను ఎదిరించినప్పుడు గాని, ఏకీభవించినప్పటికీ పరస్పర పూరకంగా, స్వీకరణగా సంభాషణ నడిపితే కథ ముందుకు సాగుతుంది. కిరణ్మయి అమ్మ, నాన్నలను ఎదిరించలేనితనం నుండి అమ్మ, నాన్నలను ఎదిరించే ధైర్యాన్ని కూడగట్టుకొని ఆక్రోశంతో, ఆవేశంతో డైలాగ్ తీవ్రంగా పలికింది."

### లేఖతో 'అయిదవవాడు' కథ ప్రారంభం

"క్రితం రోజు పెట్టిన చోటే ఉన్న ఉత్తరాన్ని తీసి మరోసారి చదువుకుంది సుమలత. ఆ ఉత్తరం మెరుపై, ఉరుమై, కుండపోత వర్షమై సుమలత పూర్తిగా తడిసిపోయింది. ఆనందంతో అణువణువూ ఉత్తేజంతో నవయవ్వనం... గడ్డ కట్టిన ఎద మంచు గుహలో విద్యుత్ ప్రవాహం....

"ప్రియమైన సుమలతా!

కలల్లో కళ్లల్లో కదలాడుతున్న ప్రేయసీ! హంస రాయబారం ఫలించని దమయంతీ! ప్రవరాఖ్యుని పొందని ప్రియ వరూధినీ! ముని ఆశ్రమ శకుంతలా! ఈ దుష్యంతుడికి భరతుడిని ఎప్పుడు కని యిస్తావు. చారుదత్తుని పొందని ప్రియ వసంతసేనా! ద్రౌపదీ పంచభర్తృకా! అహల్యా శాపవిమోచనీ! నిన్ను చూడక ఎన్నాళ్లయిందో, నా అణువణువూ నిన్ను చూడాలని నిన్ను స్పర్శించాలని ఎంత పరితపిస్తున్నదో...

సుమా! అనుపమా! గాలవ్యునికి శరీరం అద్దెకివ్వబడిన మాధవీ! మహాభారత మూలపుటమ్మ మాధవిలా ఎన్ని యుగాలు గతించనీ... తిరిగి తిరిగి బయల్దేరిన చోటికే చేరుతావని ఎదురు చూస్తాను. నీ కోసం జీవితమంతా చకోరమై ఎదురు చూసే మనిషొకరున్నారని క్షణమైనా గుర్తుంచుకో, నాకు జీవితాన్ని, విశ్వాసాన్నిచ్చిన నా హృదయేశ్వరీ! నీ నిర్ణయం ఒక జీవితాన్ని వెలిగిస్తుందని మరిచిపోకు.

ఇపుడు చక్కని సందర్భం కల్సి వచ్చింది. మన ధర్మరాజు కూతురు పెళ్లికి నువ్వు ఒక రోజు ముందుగానే తప్పక వస్తావు. మనం ఇంద్రప్రస్థ లాడ్జిలో కలుసుకుంటాం. నువ్వు తప్పక వస్తావనీ నేను నిన్ను కలుస్తాననీ, నా కలల రాణిని చూస్తాననీ నీలో ఐక్యం అయ్యే ఆ ఘడియ కోసం అనుక్షణం ఎదిరిచూస్తూ...

– నీ అయిదవవాడు

రత్నాకర్ ఆ ఉత్తరం చదివితే ఎంత బావుండు అని కనపడేట్టు టేబిల్ మీద పెట్టింది సుమలత. రత్నాకర్ చదవాలి, చదివి ఎవడీ అయిదవవాడు అని అడగాలి. మిగతా నలుగురు ఎవరు అని గొంతు చించుకొని అరవాలి. తాను ద్రౌపదిలా చిరునవ్వు నవ్వి చెప్పాలి. అతనిలో కసి రేగాలి అని కోరుకుంది సుమలత. కాని రత్నాకర్ ఆ ఉత్తరం చూసినట్టు లేదు. పిల్లలైనా చూసి డాడీకి చూపినట్టు లేరు. అందుకు నిరాశపడిపోయింది సుమలత.

ఆ ఉత్తరం చదివితే రత్నాకర్ తనకు విడాకులిస్తాడు. తానూ అదే కోరుకుంటోంది. తన గురించి ఎన్ని పుకార్లు ప్రచారం అవుతాయో. అయినా అతను చదివితే బావుండేది. తాను కాలేజీ లైఫ్‌లో ఎంతమందికి కలల రాణిగా బతికిందో అందరికీ తెలియాలి. తన ఓరకంటి చూపుతో ప్రేమపూరిత స్పర్శతో తన మాటపై గౌరవంతో ఎంతమంది చదివి ఉద్యోగాలై జీవితాలు గెలుచుకున్నారో అందరికీ తెలియాలి.

కాలేజీ లైఫ్‌లో, విద్యార్థి సంఘాల్లో తిరిగినపుడు ఎన్ని సభలు, ఎన్ని సమస్యలు, ఎంత మందిని ఆర్గనైజ్ చేయడం, పగలూ రాత్రీ... ఎంత ఉత్సాహం. ఎంతమంది స్నేహితులు. ఎంత ఉత్తేజం. ఆ కలలన్నీ ఏమయ్యాయి.... "

## సర్వసాక్షి కథనంతో ప్రారంభమైన 'వేదవతి'

సర్వసాక్షి కథనం అంటే రచయిత కథ చెప్తూ, చిత్రిస్తూ, వర్ణిస్తూ అక్కడక్కడ పాఠకులకు ఎబ్బెట్టుగా వుండకుండా వ్యాఖ్యానిస్తూ, నిర్వచనాలను చేరుస్తూ కథ నడిపించడం. దీన్నే థర్డ్ పర్సన్ ప్రథమ పురుష కథనం అని కూడా అంటారు. ఉదా.కు బయోడేటా కథలాగా సర్వసాక్షి కథనాన్ని 'వేదవతి' కథలో ఇలా రాశాను.

"వేదవతి భర్త తిప్పాకర్ రావుగారు వేదవతి కన్నా ఆరేళ్ళు చిన్నవాడు. వేదవతి ఇంటర్ చేస్తున్నప్పుడు తిప్పాకర్‌రావు అయిదో తరగతి. వేదవతి టీచర్ ట్రైనింగ్ పూర్తయ్యే సరికి తిప్పాకర్ ఎనిమిదో తరగతికొచ్చాడు."

## సన్నివేశంతో ప్రారంభమయ్యే 'ప్రేమధార'

"పొద్దున్ననగా బిల్డింగ్ పనికి వెళ్ళిన సువర్ణ గుడిసెకు చేరే సరికి చీకటి పడుతోంది. ఇద్దరు పిల్లలు మట్టిలో ఆడుకుంటున్న వారల్లా 'అమ్మా' అంటూ పరిగెత్తుకొచ్చారు. "నేను వచ్చే దాకా రాసుకుంటూ ఉండాలని చెప్పాను ఆడుకుంటున్నారేంటి అని విసుక్కొని దగ్గరకు తీసుకుంది సువర్ణ. కాళ్ళు చేతులు కడుక్కొని పొయ్యి ముట్టించింది సువర్ణ. పిల్లల పుస్తకాలు సర్ది ఊడ్చింది. బియ్యం చాటలో పోసుకొని రాళ్ళేరుతోంది సువర్ణ.

మూడు వీదుల అవతలి భాగ్యరేఖ సువర్ణా అని పిలుచుకుంటూ గుడిసెలోకి వచ్చింది.



"ఇవాళ లేటయిందేమిటి?" అని అడిగింది భాగ్యరేఖ.

కొత్త మేస్త్రీ సతాయిస్తున్న విషయం చెప్పబోయి ఎందుకులే అనుకుని ఆగిపోయింది సువర్ణ. "హరిబాబు నీకోసం వచ్చాడు. నీవు లేవని మా యింట్లో కాసేపు కూర్చుండి వెళ్లిపోయాడు. వెళ్లిపోయి అరగంటైంది" అంది భాగ్యరేఖ.

అరగంటకుపైగా సతాయించిన మేస్త్రీని తిట్టుకుంది సువర్ణ. ఎన్నాళ్ళకొచ్చాడు హరిబాబు. సువర్ణకు ఏవేవో జ్ఞాపకాలు. హరిబాబు కన్పించక మూడేళ్ళయిపోయింది."

## పాత్ర పరిచయంతో ప్రారంభించిన 'వరలక్ష్మి'

"వరలక్ష్మి దేనికీ ఆశపడే స్వభావం కాదు. అందితే ఆనందించే స్వభావం. ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన వరం అని తల్లిదండ్రులు ఎంతో ప్రేమగా వరలక్ష్మి అని పేరు పెట్టుకున్నారు. ఆమె పుట్టగానే యిది నా కోడలు అని మాట తీసుకుంది మేనత్త.

"అన్నయ్యా! దీన్ని నా కొడుక్కే యివ్వాలి. అట్లా మాటిస్తేనే దీని పుట్టువెంట్రుకలకు వస్తా" అని బెట్టుచేసింది మేనత్త భూలక్ష్మి.

వరలక్ష్మి పుట్టిన్నించి అన్నీ కల్సి వస్తున్నాయి. అది పుట్టిన గడియ అదృష్ట గడియ అని అందరూ మురిసిపోయారు.

భూలక్ష్మికి పుట్టిల్లంటే ఎంతో ప్రేమ, అన్నయ్యలు తలా ఒక షాపు పెట్టుకని కాస్త మంచిగా బతుకుతున్నారు. భూలక్ష్మి వాళ్ళాయన బొంబాయి, భీవండి వలసపోతాడు. బట్టల మిల్లులో పని చేస్తాడు. వెనకటే తండ్రి పోయినా, చేనేత కులవృత్తి పోయినా పూర్వంలాగే అన్నింటికి తండ్రిలా మర్యాదలు చేసే అన్నలంటే ఆమెకు ఎంతో మమకారం.

వరలక్ష్మికి పెళ్ళి గరించి ఏమీ తెలియని వయస్సులోనే పెళ్ళికి తొందరపెట్టింది. భూలక్ష్మి. ఇంట్లో తనకో కూతురులా తోడుంటుందని పని చేస్తుందని ఆశ. తొమ్మిదేళ్ళ వరలక్ష్మికి, పద్నాలుగేళ్ళ ఆంజనేయులుకూ అట్లా పెళ్ళి జరిగింది."

## కొటేషన్‌తో ప్రారంభమయ్యే 'మమతలు'

"డబ్బు అధికారం కులం స్వార్థం అంతస్థు ముందు ప్రేమలన్నీ ఉత్తవే" మనస్సులో మరోసారి అనుకున్నాడు కాంతయ్య.

కాంతయ్య బస్సెక్కుదామనుకొని వచ్చాడు. జగిత్యాల కొత్త బస్టాండు ఎదుట గుడిసె హోటల్లో బెంచి మీద కూర్చున్నాడు. పేపరు చూస్తూ బస్టాండు లోపలికి వెళ్తున్న బస్సుల బోర్డులు చూస్తున్నాడు. అతను ఎక్కాల్సిన బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. అతను అక్కన్నించి కదల్లేదు.

ఏది ప్రేమ, ఆ ప్రేమంతా ఎక్కడ పోయింది. ప్రేమ ముందు అన్ని ఓడిపోతాయి అనుకున్నాడు కాంతయ్య. కాని అలా జరగలేదు. ఇది ప్రేమ అవునా కాదా అనే అంతస్సంఘర్షణతో అతని బుర్ర బద్దలవుతున్నది. తన ప్రయాణ నిర్ణయం మార్చుకొని పక్కనే ఉన్న పార్కులో కాసేపు కూర్చున్నాడు. కొలిక్కిరాని ఘర్షణతో ఎక్కడెక్కడో తిరిగి యింటిదారి పట్టాడు.

తల్లి చంద్రమ్మ కొడుక్కోసమే ఎదిరిచూస్తోంది. పొద్దట్నించి తినకుండా సరవ్వ వచ్చే వేళకు తప్పించుకొని ఎటేటో తిరుగుతున్నాడు కొడుకు. నాలుగు రోజుల్నించి యిదే తిరుగుడు. ఏదో గుర్తొచ్చి కొంగుతో కళ్లొత్తుకుంటూ అంది చంద్రమ్మ.

"సరవ్వ నీ కోసం చూసి చూసి పోయె. రాత్రికి మనల్ని బోయినానికి రమ్మన్నది. నేను ఊర్లె కచ్చి అయిదు రోజులాయె అత్తా! కాంతయ్య ఒక సారన్న కలువకపాయె. నేనస్తే కలువక పాయె. మా యింటికి రాకపోయె. నేను ఏం పాపం చేసిన అత్తా! నా మొకం జూడకుంట తప్పిచ్చుకుంటుండు అని ఏడ్చింది సరవ్వ."

కొడుకు కాంతయ్య ముహంలో మారుతున్న రంగులు చూసి నిశ్శబ్దమై పోయింది చంద్రమ్మ."

## కథంతా ఉత్తరంగానే సాగిన 'పంజరం'

"డియర్ ఆనంద్! నీ రెండు ఉత్తరాలు అందాయి. నీ ముద్దుల కొడుకు అనిల్ తొందరగా దొరికినందుకు సంతోషం. నేను చిన్నప్పుడు పదో తరగతిలో ఇంట్లోంచి పారిపోయినప్పుడు ఏడాది దాకా ఎవరికీ దొరకలేదు. నీకు తెల్సు! ఆ ఏడాదంతా నేను ఎంత కష్టపడ్డానో. ఈ కాలపు పిల్లలకు అలా కష్టపడే స్వభావం తగ్గుతున్నట్లుగా ఉంది. వారం రోజులకే మీ అనిల్ పారిపోయి దొరికాడు. మీ నుండి డిమాండ్సు తీర్చుకోవాలనే తత్వం, పరాధీనత తప్ప స్వయంగా జీవితాన్ని గెలుచుకోగలననే విశ్వాసం లేదని అర్థం.

నేను ఇంట్లోంచి పారిపోయింది మీ అనిల్‌లా అమ్మానాన్నల ద్వారా నా డిమాండ్లు నెరవేర్చుకోవడం కోసం కాదు. కుటుంబంలోని హింస, దారిద్ర్యం, భరించలేక పారిపోయాను. చదువు మీదున్న ఆపేక్షతో చదువు వదిలేసి పారిపోవడం ఒక పేరడాక్సు.

ఇంట్లో అమ్మకు నేను చదువుకోవాలని ఉన్నా, నాన్న సాగనిచ్చిందెక్కడ? అమ్మ పొలం పనులకు కూలీ పనికి వెళ్తూ ఇంటి పనంతా నాకే చెప్పేది. సంపాదించింది తాగి తందనాలాడి కూలి పనికి పొమ్మని కొట్టడం తప్ప నాన్న చదువుకొమన్న దెప్పుడు? తమ్ముడ్ని, చెల్లెల్ని ఎత్తుకొని ఆడించడంతో పాటు పేడతెచ్చి పిడుకలు చేయడం, గుట్టకు పోయి కట్టెలు కొట్టుకరావడం మొదలుకొని మొత్తం పనులన్ని నాకే చెప్పేవాళ్లు.



ఇప్పుడు అనిల్ పారిపోయింది ఇన్ని కష్టాలు భరించలేకే అంటావా? ఏ ఒక్క రోజైనా అనిల్ మార్కెట్ వెళ్లి కనీసం కూరగాయలైనా తెచ్చాడా? తన డ్రెస్సులు తాను ఏ రోజైనా ఉతుక్కున్నాడా? ఏ పూటైనా తిండికి దొరక్క ఆకలితో పడుకున్నాడా? నీ కొడుకు తిండి ఎక్కువై గారాబం, స్వార్థం ఎక్కువై పారిపోయాడు. ఇంత కఠినంగా అంటున్నందుకు బాధపడకు. అనిల్ ఒక్కడి కోసం నువ్వు పెడ్తున్న ఖర్చుతో ఈ దేశంలోని పేద పిల్లలు నలుగురు కడుపునిండా తినవచ్చు."

## ఫోన్ సంభాషణతో ప్రారంభమైన 'బతుకుపయనం'

"... పిల్లవాడు బెంగుళూర్లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పని చేస్తున్నాడు. మ్యారేజి బ్యూరోలోంచి బయోడాటా రాసుకొచ్చిన. పిల్లవానితోటి ఫోన్లో మాట్లాడిన. ఈ సంబంధం సెటిల్ అయ్యేట్టు కనపడుతున్నది. వాళ్లకు కట్నం మీద కూడా పెద్ద పట్టింపులు లేవన్నారు. అమ్మాయికి స్టేట్స్‌లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పనిచేసే అర్హతలుంటే చాలు అని అన్నరు.

అతడు వితిన్ వన్నియర్‌ల స్టేట్స్‌కు పోయే అవకాశం ఉందట. మీ నేటివ్ అక్కడే గద. మీరొకసారి పోయి పిల్లవాని ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ తెల్సుకుంటే మన దివ్య గురించి ప్రొసీడవుదాం."

బీడియల్‌ల్లో సైంటిస్ట్‌గా పని చేస్తున్న శివరాజం ఫోన్లో అరగంట నుంచి చంద్రమౌళిని మళ్ళీ మళ్ళీ బతిమాలుతున్నాడు.

"అలాగే-అలాగే. నాక్కూడా కొంత రీసెర్చ్ వర్కుంది. రెండు మూడు రోజులు అటే వుంట. వాళ్ళ వూరికి కూడా పోయొస్త. ఓ.కె. తప్పకుండా...." అంటూ ఫోన్ పెట్టేశాడు చంద్రమౌళి.

ఆ రోజు సాయంత్రమే జగిత్యాల బయల్దేరాడు చంద్రమౌళి. జగిత్యాల మిషన్ కాంపౌండ్‌లో రామేశం అనే ఫ్రెండింట్లో దిగిన చంద్రమౌళి పెళ్ళి సంబంధం గురించి రొటీన్‌గా అడిగాడు. రామేశం అయిదారుగురికి ఫోన్ చేసి వివరాలు రాబట్టాడు.

"ఆ పిల్లవాని తండ్రి లస్మయ్య కటకం లింగయ్య దగ్గర కూలికి బట్టలు నేస్తడట. ఒక తమ్ముడు, యిద్దరు చెల్లెండ్లున్నరట. మొత్తం ఫ్యామిలీల చదువుకొని ఎదిగింది ఆ పిల్లవాడొక్కడే. చెల్లెండ్లు బీడీలు చేస్తున్నరు. తమ్ముడు డిగ్రీ ఫెయిలయిండు" అంటూ వివరాలు చెప్పుకొచ్చాడు రామేశం."

## స్వయంగా తన కథ తానే చెప్పుకొనే 'బందీ'

తన గురించి తాను చెప్పుకునే కథను ఉత్తమ పురుష కథనమని, ఫస్ట్ పర్సన్ కథనమని అంటారు. ఉత్తమ పురుషలో చెప్పే కథనం రెండు విధాలు. నేను అనే పాత్ర

స్వయంగా తన కథనే ప్రధానంగా చెప్పడం. మరొక విధానంలో ఇతరుల కథను చెప్పడం కోసం అతని సన్నిహిత మిత్రుడు వలె అక్కడక్కడ తన పాత్రను 'నేను' పాత్రగా చెప్పడం. 'తెల్లబట్ట' కథలో నేను పాత్రను ఇతరుల గురించి చెప్పే పాత్రగా చిత్రించాను. 'మెరుగు' కథలో ఇతరుల గురించి సగం కన్నా ఎక్కువగా, తన గురించి కూడా కొద్దిగా చెప్పుకునే విధంగా 'నేను'ను చిత్రించాను. 'బందీ' కథలో స్వయంగా తన కథను తానే చెప్పుకునే పాత్రగా చిత్రించాను.

"ఇది నేను ఆర్డీవో కాక ముందటి మాట. సమయం వచ్చింది కాబట్టి చెప్తున్నాను. ప్రతి మనిషి జీవితంలోనూ ప్రేమించే సమయం ఒకటి వస్తుందనుకుంటాను. నాకూ అలాగే జరిగింది.

నేను ఎమ్మెస్సీ, బి.ఇడి. చేశాక అప్పర్ ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. సొంత జిల్లాలో మొదటి ఉద్యోగం అది. అప్పటికి గ్రూప్ వన్ మెయిన్ పరీక్షలు పూర్తి చేశాను. ఆర్డీవో ఉద్యోగం రావాలంటే ఎన్ని మెలికలో, వచ్చేదాకా నాకా విశ్వాసం లేకపోయింది. పల్లెటూళ్ళో ఉద్యోగం భలే పసందు అన్పించి మనస్సు ఉరకలు వేసింది.

నేను పుట్టింది పల్లెటూళ్ళోనే అయినా ఎనిమిదో తరగతి నుండి ఊరు వదిలి హాస్టల్లో చేరాను. అప్పటి నుంచి పట్నం, పల్లె జీవితాలు రెండూ నాలో పెనవేసుకున్నాయి. నేను పల్లెలకు మరీ దూరం కాలేదు. మరీ దగ్గర కాలేకపోయాను. పెరుగుతున్న నా విద్యావసరాలు నన్ను పల్లెల గురించి పట్టించుకోనీయలేదు. డబ్బుల వెసులుబాటు లేక పట్నం జీవితాన్ని అనుభవించలేదు. రెంటికీ ప్రేక్షకుడిలా పైసా ఖర్చు లేకుండా అనుభవం మాత్రం సంపాదించాను. పల్లెటూళ్లో బండిపంతులు ఉద్యోగం నాకు ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది....

నేను ఆ వూరికి కొత్త. నా కన్నా కొద్ది నెలలు ముందే రేణు ఆ స్కూల్లో టీచర్‌గా చేరింది. రేణు ఆ వూరి ఆడపడుచే. రెడ్లమ్మాయి. బి.ఎస్సీ, బి.ఇడి చేసింది.... రేణు అందంగానే వుంటుంది. రెడ్లమ్మాయి కావడం వల్లో ఏమో, లేక సొంత కావడం వల్లో కాని ఆమె నడకలో, మాటలో, సంస్కారంలో ఎంతో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది..."

### పరిసరాల వర్ణనతో ప్రారంభించిన 'తల్లీ కొడుకులు'

"ఆ పల్లె రెండు జిల్లాలను కలిపే రహదారికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ రాత్రి లారీల రాకపోకల ధ్వనులు అక్కడికి కూడా లీలగా గాలితోపాటు చేరుతున్నాయి.

ఉత్తర ప్రాంతాన్నీ దక్షిణ ప్రాంతాన్ని రెండు జిల్లాలుగా చీల్చిన గోదావరి పరవళ్ళ ధ్వనులు ఆ నిశిరాత్రిలో నిద్రపోతున్న పల్లెకు తన నిత్య చైతన్యాన్ని ఆదర్శంగా స్వీకరించమని చెవిలో గుసగుసలు పెడుతున్నట్లుగా వున్నాయి.

జిల్లా పరిషత్ వారు వేయించిన అప్రోచ్‌రోడ్ మరమ్మతు లేక పాడుబడిపోతోంది. గుంతలు గతుకులు-ఎడ్లబళ్ళు చేసిన రోడ్డుకోత - పాములా ఆ పక్కనే మెలితిరుగుతూ కాలిబాట.

ఊరికి పడమర దిక్కుగా ఆ వాడ వుంది. ఆ వాడలో చివరి గుడిసె అది. ఆ వాడకూ ఆ చివరి గుడిసెకూ నడుమ సర్పంచు పెరడుంది. అందువల్ల ఆ గుడిసె మరీ విడివడ్డట్టుగా వుంది.

చాలా ఆలస్యంగా నిద్రకుపక్రమించినా ఎందుకో తొందరగా మెలుకువ వచ్చేసింది తల్లి మైసమ్మకు. అసలు నిద్ర పట్టిందో లేదో. కళ్ళు నులుముకొని లేచి కూర్చుంది.

మనుమరాలు లచ్చవ్వ గాఢనిద్రలో వున్నట్టుంది. కడుపులోకి అదుముకున్న కాళ్ళని సరిచేసి గాఢంగా నిట్టూర్చింది మైసమ్మ."

'పాలు', 'రియల్ఎస్టేట్', 'ప్రేమ', 'అడవిలో వెన్నెల', 'దొంగగొడ్డుకు లొటారం' మొదలైన కథలు పరిసరాల వర్ణనతో ప్రారంభించి పాత్రల్ని ప్రవేశ పెట్టడంతో ప్రారంభమవుతాయి. 'మాబడి', 'మెరుగు', 'తెల్లబట్ట' కథలు ఎదుటి వారిని సంబోధిస్తూ ప్రారంభమవుతాయి. 'మాబడి', 'మెరుగు' కథల్లో ఎదుటి వారిని సంబోధిస్తూ మొత్తం కథంతా ఒకరే మాట్లాడుతుంటారు. 'స్మృతి', 'జీవనయానం' కథలు కొటేషన్‌తో ప్రారంభమవుతాయి. కొందరు మానసిక ఆలోచనలతో కథలు ప్రారంభిస్తారు.

ఇలా కథల ప్రారంభాలు ఎన్ని రకాలుగానైనా ఉండవచ్చు. అనేక ప్రయోగాలు చేస్తూ కొత్త కథ ప్రారంభాలను సృష్టించవచ్చు.

### కథలో నిర్వచనాలు, కొటేషన్లు - రచయిత దార్శనికత

మనకు కథలో ఏదో చెప్పాలనిపిస్తుంది. ఏదో చెప్పడం కోసమే కథలు రాస్తాం. కాని కథ పూర్తయ్యాక అసంతృప్తిగా వుంటుంది. మనం చెప్పదల్చుకున్న అంశం అందులో సరిగ్గా చెప్పలేకపోయామని అనిపిస్తుంది. అప్పుడు ఏం చేయాలో తోచదు. అలాంటప్పుడు ఈ కింది ప్రయోగాలు చేశాను. అందుకు అనువైన చైతన్యంగల పాత్రలను, సన్నివేశాలను, కథ ప్రారంభ ఎత్తుగడలను సృష్టించాను.

### జీవితాన్ని కథల్లో నిర్వచించడం

1. కథల ప్రారంభంలో కొన్ని మంచి వాక్యాలు, వ్యాఖ్యలు, విశ్లేషణలు, తాత్వీకరణలు,

సూత్రీకరణలు, నిర్వచనాలు పెట్టాను. పాత్ర మాటలే కొటేషన్లుగా, నిర్వచనాల్లాగా, విశ్లేషణలుగా వచ్చేట్టు చూశాను.

## జీవితం పట్ల పాత నిర్వచనాలను మార్చి కొత్త నిర్వచనాలు ఇవ్వడం

2. మరొక పద్ధతి అనుసరించాను. ఒక భావం ప్రజల్లో ప్రచారంలో వుంటుంది. దాన్ని ఒక సూత్రంగా ప్రారంభంలో రాసి కథ పరిణామంలో ఆయా పాత్రలు ఆ సూత్రాన్ని తప్పు అని కొత్త సూత్రానికి చేరుకోవడంతో కథ ముగించే పద్ధతిని అనుసరించాను. పాత్రల అనుభవాల నుండి పాత సూత్రం పోయి కొత్త సూత్రం ఎలా ఎదుగుతూ వచ్చిందో చెప్పడమే కథ ఎత్తుగడ, ముగింపుగా వుంటుంది. ఇలా ఒక కొటేషన్ ఇచ్చి అది తప్పని దానికి మరో పార్శ్వం వుందని, అందుకు భిన్నమైన సత్యాన్ని చెప్పడంతో కథను ముగించాను.

## సంభాషణల్లో నిర్వచనాలు, జీవిత విశ్లేషణలు

3. కథ మధ్యలో కూడా సంభాషణల్లో, సన్నివేశాల్లో, సంవాదంలో ఎన్నో సూక్తుల వంటి, నిర్వచనాల వంటి వాక్యాలు రాశాను. అందుకు అనువైన కథాంశాన్ని, పాత్రల చైతన్యాన్ని ఎన్నుకున్నాను. నా తాత్విక వ్యాసాల విశ్లేషణల సారాంశం జీవితంలోంచి, అనుభవాల్లోంచి ఆయా పాత్రలు ఎలా పొందుతూ వచ్చాయో చిత్రీకరించాను. అందువల్ల ఆయా పాత్రలు తాత్విక చైతన్యంతో వాటిని చర్చించ గలిగే, రెండు పాత్రలు పరస్పరం విరుద్ధ భావాలతో సంఘర్షించగలిగే గల స్థాయి గల వారినే సమాజం నుండి ప్రతినిధి పాత్రలుగా మలిచాను.

## జీవితాన్ని చిత్రించాలి తప్ప వ్యాఖ్యానించకూడదా? ఎందుకు?

4. కొందరు సాహితీవేత్తలు, సాహితీ విమర్శకులు కథల్లో, నవలల్లో మంచి వాక్యాలు, వాఖ్యలు, వాఖ్యానాలు, విశ్లేషణలు, సూత్రీకరణలు చేయకూడదు అని చెపుతుంటారు. వారి ఉద్దేశంలో అవి అంతర్లీనంగా వుండాలి. వాటిని సాహితీవేత్తలు, ఉత్తమ పాఠకులు వెలికితీసి చెప్పాలి అని వారి ఉద్దేశం. కథ డాక్యుమెంటరీలాగా, ఫోటోగ్రఫీలాగా మాటలు లేని వెనకటి మూకీ సినిమాలాగా ఉండాలని, అలాంటి కథా ప్రక్రియ గురించి వారు చెపుతున్నారు. కథ రాసే విధానంలో అదొకటి మాత్రమే. కథ ఇలాగే రాయాలనే సూత్రాలు, సిద్ధాంతాలు వ్యాకరణం వంటివి, అలంకార శాస్త్రాల వంటివి. వ్యాకరణం, అలంకార శాస్త్రాలు ముందు పుట్టవు. ప్రజలు భాషను వాడుతున్న క్రమంలో సాహిత్యం రాస్తున్న క్రమంలో వాటి నుంచి కొన్ని సాధారణ అంశాలను సూత్రీకరించడం ద్వారా వ్యాకరణం, అలంకార శాస్త్రాలు రూపొందుతూ భవిష్యత్ తరాలకు మరికొంత మార్గదర్శనం



నిర్దేశిస్తాయి. పాత వాటిని అధిగమించి పాత సూత్రాలను, కథ, నవల నిర్మాణాలను బద్దలు కొట్టి కొత్త శైలీశిల్పాలను, స్వరూప స్వభావాలను ఆ తరువాతి తరం సాధిస్తూ వుంటుంది. పాత సూత్రాలు, పాత అలంకార శాస్త్రాలు వీటిని కొత్తను అడ్డగిస్తాయి, వ్యతిరేకిస్తాయి. అందువల్ల వ్యాకరణాన్ని, అలంకార శాస్త్రాన్ని, సాహితీ వేత్తలను పక్కన పెట్టి ప్రజలు, సృజనాత్మక రచయితలు, కళాకారులు, ముందుకు సాగుతూ వుంటారు.

## నాటకంలోని డైలాగుల్లాగా కథల్లో చర్చలు రాయవచ్చు

5. ఏదో చెప్పడం కోసమే కథ, నవల రాస్తారు. సినిమా తీస్తారు. అందువల్ల ఏమీ చెప్పకూడదు అనడం పొరపాటు. నాటకంలో డైలాగుల ద్వారా చాలా విషయాలు చెపుతారు. వేదిక మీద ప్రదర్శించడం వీలుకాని అనేక అంశాలను, సంఘటనలను, స్వభావాలను, సన్నివేశాలను సంభాషణల రూపంలో, సంవాదాల రూపంలో నాటకంలో ప్రవేశ పెడతారు. అలాగే టీవీ సీరియళ్లలో, సినిమాల్లో, నవలల్లో, కథల్లో కూడా రచయితలు ఈ పని చేస్తుంటారు. తద్వారా చెప్పదల్చుకున్నది ఆయా పాత్రల చర్చల ద్వారా రచయిత పాఠకులకు అందిస్తారు. అందువలన రచయిత కథలో, నవలలో స్వయంగా ఏదీ చెప్పకూడదు అనే మాట రచయితలు తమకు తాము చేతులు కట్టేసుకుని లాకప్‌లో బందీ కావాలని చెప్పడమే తప్ప వేరుకాదు. కథ రచయిత రాస్తేనే కాగితం మీదకు ఎక్కుతుంది. కథకుడు కథ స్వయంగా చెపితేనే ఇతరుల చెవికి సోకుతుంది. రచయిత చెప్పకపోతే ఒక వాక్యం కూడా బయటకు రాదు.

## ఉపన్యాసాల్ని కథలుగా ఎలా మార్చవచ్చు?

6. నేను ఒక నవలలో మూడు ప్రసంగాలు పెట్టాను. ఒక ఉద్యమ నాయకుడు చేస్తున్న ప్రసంగాలుగానే రాశాను. మాక్సిం గోర్కీ రాసిన 'అమ్మ' నవలలో ఇలాంటి ఉపన్యాసాలు చూసిన తర్వాత ధైర్యం చేసి ఈ ప్రసంగాలు పెట్టినప్పటికీ కొందరు సాహితీ వేత్తలు నవలా స్వరూపం దెబ్బతిన్నది అని అన్నారు. నిజానికి ఉద్యమ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఆ రాత ప్రతిని చదివి చాలా సంతోషించారు, ఉత్తేజం పొందారు. కానీ ఆ ఉద్యమాలకు వెలుపల వుంటూ వ్యక్తిగత జీవితం జీవిస్తూ ఉద్యమ సాహిత్యం పట్ల కాస్త మద్దతు ఇచ్చే పాఠకులైన సాహితీవేత్తలు ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నేను నవల రాసిందే ఆ ఉపన్యాసాల్లో ఉన్న ముఖ్యాంశాల కోసం. అవి లేనప్పుడు నవల దేనికి అని బాధపడ్డాను. అందుకని ఆ నవలలోంచి ఆ మూడు ప్రసంగాలను కలిపి కథా రూపం ఇచ్చి 'అక్కా చెల్లెల్లు' అనే కథగా మలిచాను. పట్టణంలో నివసించే కార్మిక వర్గాన్ని అక్కగా గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమిస్తున్న రైతాంగ ప్రజలను చెల్లెలుగా ప్రతీకాత్మం చేసి అక్కకు చెల్లె తమ గ్రామాల్లో ఏం జరుగుతోందో, తాము ఎలా

ఉద్యమిస్తున్నారో గ్రామీణ సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నాయో, ఉత్తరం రూపంలో కథనీకరించాను. ఇది శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన 'మార్గదర్శి', పానుగంటి లక్ష్మీనర్సింహం రాసిన 'జంగాలశాస్త్రి' ఉపన్యాసాల ఒరవడిలో రాయబడింది.

### హరికథ, బుర్రకథల్లోలా వ్యాఖ్యానించే కథన శిల్పం

7. స్టేట్‌మెంట్లు ఇవ్వకూడదు అని, పాత్రలను వ్యాఖ్యానించకూడదని, వాటిని చిత్రిస్తూ వెళ్ళాలని అంటుంటారు. కానీ చాలామంది గొప్ప రచయితల కథల్లో పెద్ద స్టేట్‌మెంట్లు, నిర్వచనాలు వున్నాయి. పాఠకులు అలాంటి వాటి ద్వారా ఎంతో తెలుసుకున్నామని ఆనంద పడుతుంటారు. ఆ కొటేషన్, నిర్వచనం, సంభాషణలో వాక్యం రాయాలంటే పాత్ర స్థాయిని పెంచాల్సి వస్తుంది. పాత్ర స్వభావాన్నే మార్చాల్సి వస్తుంది. అన్ని సందర్భాల్లో అలా చేయడం కుదరకపోవచ్చు. అందువల్ల రచయిత స్వయంగా వ్యాఖ్యానించవచ్చు. హరికథలో, బుర్రకథలో కథకుడు కథను అభినయించడంతో పాటు, కథ చెప్పడంతో పాటు కథను వ్యాఖ్యానిస్తాడు, విశ్లేషిస్తాడు. శ్రోతలు ఎంతో సంతోషంగా వాటిని స్వీకరిస్తారు. వింటారు. వివేచన పెంచుకుంటారు. అయినా రాసే కథలకు ఈ పద్ధతి పనికిరాదని కొందరు అంటుంటారు. అది వారి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. దాన్ని పాటించాల్సిన అవసరం లేదు. హరికథ లాగా, బుర్రకథలాగా కథను, పాత్రలను వ్యాఖ్యానిస్తూ కూడా కథలు రాస్తుంటారు.

### ఫస్ట్ పర్సన్ ఉత్తమ పురుష కథనంలో ఉండే సౌకర్యం

సాహితీవేత్తల విమర్శలకు జవాబుగా కథ ఎత్తుగడను, ప్రారంభాన్ని, కథా కథనాన్ని చాలా మంది రచయితలు మార్చుకున్నారు. ఫస్ట్ పర్సన్, ఉత్తమ పురుష కథనంలో నేను అనే పాత్ర ద్వారా ఎంతైనా వ్యాఖ్యానించవచ్చు. ఏ విషయం మీదైనా, ఎన్ని భావాలైనా చెప్పుకోవచ్చు. అలా నేను చాలా కథలను 'నేను' పాత్ర ద్వారా రాశాను. 'నేను' పాత్ర ద్వారా కథ రాస్తే పాఠకులకు స్వయంగా రచయిత అనుభవాలను లేదా పాత్ర అనుభవాలను తమ కోసం ప్రత్యేకంగా చెపుతున్న సాన్నిహిత్యం, ఆత్మీయత ఫీలవుతారు. 'నేను' కథన పద్ధతి ద్వారా హరికథ, బుర్రకథతో పాటు శ్రవ్య, మౌఖిక కథా సాహిత్య లక్షణాలన్నిటినీ, వాటి ప్రయోజనాలన్నిటినీ రచయితలు, పాఠకులు పొందవచ్చు.

### సెకండ్ పర్సన్‌ను సంబోధించే కథన శిల్పంలోని సౌకర్యం

8. మరొకరికి రాసే ఉత్తరాల పద్ధతి, మరొకరిని సంబోధిస్తూ రాసే కథ కూడా ఇలాగే శ్రవ్య, మౌఖిక కథ వల్ల లభించే ప్రయోజనాలన్నిటినీ అటు రచయిత, ఇటు శ్రోతలు, పాఠకులు పొందవచ్చు. అందువల్ల ఈ పద్ధతిలోనూ నేను చాలా కథలు రాశాను.



9. ఫస్ట్ పర్సన్, సెకండ్ పర్సన్ (నీవును, ఇతరులను సంబోధిస్తూ) కథన రీతులు ఆయా కథ చెప్పే పాత్రల స్వభావాలను, మనస్తత్వాలను, అంతరంగాలను తెలుసుకున్న సంతోషం పాఠకుల్లో కల్గిస్తాయి. కేవలం దృశ్యీకరణ ద్వారా రాసే కథల ద్వారా దీన్ని సాధించడం అంతసులభం కాదు.

### కథల ప్రారంభంలో నిర్వచనాలు ఇచ్చే కథన శిల్పం

10. ఇది అభ్యాసంతో అబ్బే విద్య. నేను 'దుస్తులు' కథను కొటేషన్‌తో ప్రారంభించాను. కథలో మనం ఒక స్టేట్‌మెంటో, కొటేషనో, సూక్తో, సూత్రీకరణో చెపుతున్నట్టు ప్రత్యేకంగా కనపడకుండా ఆకుచాటు పిందెవలె వాటిని జాగ్రత్తగా రాయడం అవసరం. తల్లి చీర చెంగుల్లో శిశువులు దాక్కొన్నట్టుగా ఆ వాక్యాలు దాగి వుండాలి. ఆ నైపుణ్యం సాధన మీద అలవడుతుంది. మొరటుగా, డైరెక్టుగా చెపితే కథలో రచయిత చొరబడి వ్యాఖ్యానిస్తున్నాడు. కథ చెప్పే బదులుగా, చిత్రించే బదులుగా వ్యాఖ్యానించడం సరైంది కాదు అని అంటారు. కొన్ని కథల్లో ఎంత రాసినా చెప్పడం, చిత్రించడం వీలు కాదు. వాటిని సంభాషణలోనో, కొటేషన్‌లోనో చదువరులకు తెలపాలని ఉత్సాహంగా వుంటుంది. అది చెప్పకపోతే కథ రాయడం ఎందుకు అనే భావన కూడా కలుగుతుంది. అందువల్ల అలాంటి సందర్భాల్లో కొంత చాకచక్యంగా వీటిని చెప్పక తప్పదు. ఇలా కథలో చెప్పలేనివి చెప్పడం వీలు కానివి, కథ సారాంశం ఏమిటో చెప్పాలనుకున్నవి కొటేషన్లు, నిర్వచనాలుగా చెప్పవచ్చు. ఇండియా టుడే పత్రికలో ప్రచురించిన 'దుస్తులు' కథ ఇలా ప్రారంభం అవుతుంది.

"మనస్సు తొడుక్కునే దుస్తులు కొన్ని పైకి కనపడతాయి. కొన్ని లోదుస్తుల్లా లోపలే ఉండిపోతాయి. మనస్సు ఈ దుస్తుల్ని ఎందుకు వేసుకుంటుందో ఇదమిత్థంగా చెప్పలేం. భయం వల్ల జీవిత అభద్రత నుంచి రక్షణ అనుకొని కొందరు వేసుకొంటారు. కొందరు తాము ఇతరుల కన్నా భిన్నం. గొప్ప అనే అహం, అధికారం, సాంఘిక హోదా కోసం వేసుకుంటారు. దాన్నే కొందరు తేజస్సు అని వర్ణిస్తారు."

"మనస్సు వేసుకునే దుస్తులు కృతకంగా అదనంగా అతికించుకున్న ఈకలు తోకలు. అవి కపటత్వానికి నిదర్శనాలు. అవి మనిషి నుంచి మనిషిని దూరం చేస్తాయి. ఈ దుస్తుల్ని వదిలించుకున్నప్పుడు మనుషులు స్వచ్ఛమైన సహజ మానవులుగా, నిస్వార్థ పరులుగా ఎదగడం ఇప్పటికీ సాధ్యమే."

ఇలా ప్రారంభించి స్టార్స్ పెట్టి కథ కూడా కథలోని పాత్రలను వ్యాఖ్యానిస్తూ కథన శిల్పాన్ని రూపొందించాను. ఇలా...

"సత్తయ్య పుట్టినప్పుడు అందరిలా సహజంగానే పుట్టాడు. పసివాడుగా పక్కలోనే

కాలకృత్యాలు తీర్చుకున్నాడు. తల్లే సిగ్గు నేర్పింది. తల్లే భాష నేర్పింది. బట్టలు వేసుకోవడం నేర్పింది. తల్లే సత్తయ్య తనను తాను ప్రేమించుకోవడాన్ని నేర్పింది. పేలాలు జేబులో పోసి 'ఎవలకు పెట్టకుండా తిను' అని తల్లే స్వార్థాన్ని నేర్పింది. సత్తయ్య స్వార్థాన్ని ప్రేమించాడు. అతని తల్లి ఇప్పుడు పల్లెటూర్లో పాత పెంకుటింట్లో ఉంటోంది. సత్తయ్య బంగళాలో ఉంటాడు. తల్లికీ, చెల్లికీ, తమ్ముడికీ చీరసారెలు అందరికన్నా కాస్త ఎక్కువే ఇస్తాడు. కానీ, తన ఇంట, తన వెంట ఉంచుకోడు.

సత్తయ్య టీచర్ ట్రైనింగ్ చేస్తున్నప్పుడు, ప్రేమించిన సుమతిని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు ఇంటిల్లిపాదీ వ్యతిరేకించారు. అతనికి అదే వరం అయిపోయింది. ఆ సాకుతో అయిన వాళ్ళందరితో సంబంధం తెంపుకొని బాధ్యతలు వదిలేశాడు."

## ఈ కథన రీతిలో సాధించిన అంశం

ఈ కథలో కపటత్వం గురించి, స్వార్థం గురించి కొటేషన్ ఇచ్చి స్వార్థాన్ని తల్లి నేర్పితే తల్లే ఎలా దాని బాధితురాలైందో కథ ప్రారంభంలోనే చెప్పాను. ఇలా కొటేషన్ ఇచ్చి ఆ తరువాత కథా సన్నివేశాలను ప్రారంభించాను. అలాగే కొన్ని కథల్లో ఒక కొటేషన్ ఇచ్చి అది తప్పు అని రెండవ కోణాన్ని చెప్తూ కథంతా నడిపి మొదట ఇచ్చిన కొటేషన్ లేదా మొదట పేర్కొన్న భావం ఎలా తప్పో కథ ముగింపులో చెప్పాను. మరికొన్ని కథల్లో సంభాషణ సందర్భంగా అనేక కొటేషన్‌లు, అనేక విశ్లేషణలు చేశాను. అవి కథ చదివినప్పుడు కథలో భాగంగా చక్కగా ఇమిడిపోయాయి. వాటిని విడదీసి చూస్తే అవి చాలా సీరియస్ కొటేషన్లు, సీరియస్ చర్చలు, తాత్విక అంశాలు.

## చెప్పదల్చుకున్న దానికి అనువుగా పాత్రలను, సంఘటనలను సృష్టించాలి

11. కొన్ని సార్లు మనం చెప్పదల్చుకున్న దానికి అనువుగా పాత్రల స్థాయి పెంచాలి. అందుకనువైన పాత్రల్ని సృష్టించాలి. సంఘటనల్ని సృష్టించాలి. ఉదా.కు ముఖ్యమంత్రిలాగా మాట్లాడాలంటే ముఖ్యమంత్రి పాత్రనుగానీ, ఆ స్థాయి చైతన్యం, అధికారం గల పాత్రను సృష్టించాల్సిందే. ముఖ్యమంత్రి తన స్థాయికి తగినట్టుగా మాట్లాడాలి. తన స్థాయికి తగినట్టుగా మాట్లాడే పాత్రలుగా సృష్టించినప్పుడే సంభాషణలో అలాంటి లోతైన చర్చ కొనసాగే అవకాశం వుంటుంది. అంతేగానీ స్వయంగా రచయిత మధ్యలో కొటేషన్ల లాగా చెప్పడం, వాఖ్యానించడం కథను దెబ్బతీస్తుంది. పాఠకులు కథ నుండి డైవర్ట్ అవుతారు.

## ఉద్యమకారుని పాత్రద్వారానే ఈ చైతన్యం, విశ్లేషణ సాధ్యం

'దక్షయజ్ఞం' కథలో అనేక విషయాలు చెప్పాను. అవి చరిత్ర లాగా వుంటాయి.



కొటేషన్‌లాగా వుంటాయి. నిర్వచనం లాగా వుంటాయి. అభిప్రాయాల్లాగా వుంటాయి. అవన్నీ తన గాథను న్యాయమూర్తికి విన్నవించుకుంటున్న పెంటయ్య అలియాస్ ప్రవీణ్ చైతన్య స్థాయికి సంబంధించినవి. అవి ఆయన అభిప్రాయాలు, అనుభవాలు. అందువల్ల అనేక విషయాలు అందులో చెప్పడం వీలు పడింది. ఉదాహరణకు...

"మా సరుకులు, కళలు ప్రపంచాన్ని ఆకర్షించాయి... దాంతో ప్రపంచం నుండి ఇక్కడకు వలసలు, దండయాత్రలు సాగాయి. మా సరుకులు తిన్న వాళ్లు... స్వార్థ పరులై దేశాన్ని వాళ్లకప్పగించారు. మాకు భాష రాదు... భావం చెప్పడం రాదు... మాకు చరిత్ర లేదు... నాది చరిత్ర కాదు... ఎవరి చరిత్రనో... నాయకత్వాన్నో మోయడమే నా పని...

"నా చరిత్రంతా మసిబారిపోయింది. ఇప్పుడు మా బతుకంతా నిప్పులేని పొగ... మా జీవితాలిప్పుడు సగం కాలిన కమురు వాసన... ఇక్కడ మనుషులిప్పుడు ఒక్కసారిగా మండి చావరు... అటు మంటకు, ఇటు బూడిదకు కాని ఈ బతుకును ఉరితీయండి...

"నేను ఒక వ్యక్తిని కాదు... లక్షలాది, కోట్లాది తెలంగాణ నేల తల్లిని... నా బిడ్డల్ని, చెల్లెల్ని మునపటి దేవదాసీలా వేశ్య అనే బోర్డు మెడలో కట్టి నాకు మరణ శిక్ష విధించండి...

"నా తెలంగాణకిప్పుడు స్వేచ్ఛ కావాలి... మేము రూపొందించుకున్న ఊర్లు మావి కావాలి... మేము అడవి నరికి సాగు చేసిన ఈ సమస్త భూములు మావి కావాలి... ఈ అభివృద్ధి ఫలాలన్నీ మాకు చెందాలి. మేము అభివృద్ధి చెందాలి... మాకు స్వేచ్ఛ కావాలి... కొంచెం బతుకు మారాలని కోరుకున్నందుకు ఈ సమాజాన్నంత మార్చాలని నెత్తికెత్తిన బరువు... నుండి కూడా స్వేచ్ఛ కావాలి...

"... ఓ... నా ప్రపంచ ప్రజలారా! కాలికమురు కంపు కొడుతున్న ఈ శవంతో సంభోగాన్ని అరికట్టి మానవత్వాన్ని రక్షించండి. మా స్వేచ్ఛ, సమానత్వం కోసం సహకరించండి..." ఇది తెలంగాణ ప్రజలందరి బాధ, ఆవేదన. 1996లో రాసిన 'దక్షయజ్ఞం'లో ఇలా ఎన్నో చెప్పే అవకాశం వచ్చింది.

## గ్లోబలైజేషన్ లాభోక్తలైన మధ్య తరగతి రెండునాల్కల ధోరణి

12. అలాగే 'కామన్‌వెల్త్' కథలో ఎల్లాకర్ పాత్రతో గ్లోబలైజేషన్ గురించిన ఎన్నో కోణాలు చెప్పాను. గ్లోబలైజేషన్ గురించి మధ్య తరగతి మేధావులకు తెలిసినట్టుగానే ఎన్నో భిన్నమైన కోణాలు ఎల్లాకర్‌కు తెలుసు. గ్లోబలైజేషన్ విషయంలో మధ్య తరగతి మేధావులు గ్లోబలైజేషన్ ప్రయోజనాలన్నీ అనుభవిస్తూ, ఎదుగుతూ తమ పిల్లల్ని దానిని అందుకోవాలనీ, అమెరికా వెళ్లాలని కోరుకుంటారు. అదే సమయంలో శ్రామిక కులాలు, శ్రామిక వర్గాలు గ్లోబలైజేషన్ వల్ల వృత్తులు, ఉపాధి కోల్పోయిన తీరు పట్ల సానుభూతిని

వ్యక్తం చేస్తూ గ్లోబలైజేషన్ వల్లనే ఈ పతనమని మైకులు పెట్టి అరుస్తుంటారు. అంతేగానీ వాళ్ళను కూడా తమ లాగా గ్లోబలైజేషన్ వల్ల కలిగే లాభాలను అందుకొని ఎదగాలని, అందుకు ఆధునిక విద్య, సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో గబగబా ఎదగాలని, అందుకు పేదలకు ప్రభుత్వం స్కాలర్‌షిప్పులు, హాస్టళ్లు, ఫీజుల రీయింబర్స్‌మెంట్ ద్వారా సహకరించాలని ప్రచారం చేయరు. ఇలాంటి వాళ్లకు ప్రతీక ఎల్లాకర్. ఇలా ఎల్లాకర్ సందర్భాన్ని బట్టి ఒకదాన్ని సమర్థిస్తాడు. మరొకదాన్ని వ్యతిరేకిస్తాడు. అంబటి సురేంద్రరాజు ముందు మాటలో అన్నట్టు ఎల్లాకర్ పాత్ర నేటి భారతీయ సగటు, మధ్యతరగతి ద్వంద్వ ప్రమాణాలకు ప్రతీక.

## నమూనా పాత్రలు, నూతన స్వరూప స్వభావాలు ఎలా సంతరించుకుంటాయి?

13. నమూనా పాత్రలు శతాబ్దాల తరబడి ఆయా కాలాల్లో, నూతన స్వరూప స్వభావాలు సంతరించుకుంటాయి. శతాబ్దాల క్రితం 'మృచ్ఛకటికం'లో శకారుని పాత్రను చిత్రిస్తే దాన్ని తీసుకొని గిరీశం పాత్రగా నూతన పరిస్థితుల్లోకి పరిణామం చెందించాడు గురజాడ. గ్లోబలైజేషన్ యుగంలో అలాంటి పాత్రనే మరింత తెలివి మీరి ఎల్లాకర్‌గా పరిణమించాడని సురేంద్ర రాజు చెప్పింది వాస్తవమే.

"గ్లోబలైజేషన్, అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలకు శత్రువు అని కొందరు ఊదరగొడ్తున్నరు. అంతర్గత వైరుధ్యాల నుంచి దృష్టి మళ్లించడం కోసం పాలకవర్గాల్లోంచి ఒక సెక్షన్ పని గట్టుకొని ఈ ప్రచారం చేస్తున్నది. వాళ్ల నోరు పెద్దది. అదే నోరు తోటి భారతదేశ ప్రజలకు కుల వ్యవస్థ కులాంతరాలు, అంతర్గత ప్రథమ శత్రువు అగ్రరాజ్యంగా ఎదగకపోవడానికి కులమే ప్రధాన అడ్డంకి అని వీల్లెందుకంటలేరో ఎరుకేనా? వాళ్లంతా కులవ్యవస్థ వల్ల అన్ని రకాలుగా లాభపడేటోల్లే గాబట్టి."

## శ్రామికుల గ్లోబలైజేషన్, సరుకుల గ్లోబలైజేషన్ గురించి

'కామన్‌వెల్త్' కథలో ప్రపంచీకరణలోని అనుకూలాంశాల గురించిన కోణం – "నీ పిచ్చిగని సరుకుల గ్లోబలైజేషన్ అంటే ఏందిరా? సరుకుల గ్లోబలైజేషన్ అంటే శ్రమశక్తి గ్లోబలైజేషన్‌రా! శ్రమశక్తి గ్లోబలైజైనంక శ్రామికుల గ్లోబలైజేషన్ ఎంతసేపురా? సరుకులను గ్లోబలైజ్ చేసినంక మనుషులు గ్లోబలైజ్ కాకుంట ఉంటార్రా? అది ఎట్లనో ఒకట్ల విశ్వమానవ కుటుంబానికి దారి తీయక తప్పది."

గ్లోబలైజేషన్‌ను దాని దుష్ఫలితాలతో సహా అది అనివార్యమైనప్పుడు దాని ప్రయోజనాలను పొందడానికి అనుకూలంగా సమాజం, సామాజిక వర్గాలు, ఉత్పత్తి విధానాలు మార్చుకోవాలి.



## తత్వశాస్త్రాల్లో భావాలు, విప్లవాల గురించి

14. అలాగే విప్లవం గురించి చాలా మందికి అర్థం కాని తాత్విక సమస్య ఏమిటో 'సదువు' కథలో రికార్డు చేశాను. ఉదా.కు "విప్లవం అనేది నీ కోరిక. నీ కోరికను ప్రజల కోరికగా మార్చాలన్నదే నీ సిద్ధాంత పోరాటమంతా. నీ కోరికల్ని ప్రజల మీద రుద్దుతున్నావు. ప్రజలు కొందరు ఔననడంతో అది ప్రజల కోరిక అని మభ్యపెడుతున్నావు. నీవు ప్రజల కోసం పని చేయడం అంటే ఏమిటి? నీకంటూ నీకే కోరికలూ లేని స్థితికి నీవు చేరుకున్నపుడు కదా నువ్వు ప్రజల కోసం పని చేయడం సాధ్యపడేది. అంటే నీ కోరికల్ని నీవు జయించావా? నిన్ను నీవు జయించావా? నీ మనస్సును నీవు జయించావా?" ఇది ఒక భారతీయ తత్వగురువు వేసిన ప్రశ్న. తత్వశాస్త్రం చదవడం, తాత్విక గ్రంథాలు రాయడం జరిగి వుండకపోతే ఈ కథలో ఇలాంటి విషయాలు రాయడం సాధ్యం కాదు.

## ఎవరు బ్రహ్మజ్ఞానులు? నిర్వచనం సమూలంగా మార్చిన తీరు

అలాగే ఆ అచలతత్వగురువు మరోచోట బ్రాహ్మణవాదులు హిందూ అగ్రకుల వాదులు బ్రహ్మజ్ఞానం గురించి చేస్తున్న తప్పుడు సూత్రీకరణను 'సదువు' కథలో సవరిస్తూ "బ్రహ్మజ్ఞానం పొందిన వారే బ్రాహ్మణులు అనే మాటేమిటి?" ఎవరో శిష్యులు ప్రశ్నిస్తే ఇలా జవాబిచ్చారు.

"అది తప్పు నాయనా! బ్రహ్మజ్ఞానం పొందిన వాళ్లే శూద్రులు, చిల్లర జాతులు. ఈ ప్రకృతిలో లీనమయ్యే ఏ వృత్తీ చేయని బ్రాహ్మణజాతికి బ్రహ్మజ్ఞానం, బ్రహ్మానందం లభించడం ఎలా సాధ్యం? వారు ఇది నాది, నా కులం, నా కులం గొప్ప అనే భావాన్నే జయించలేకపోయారు.

ఈ భేషజాలకు బ్రహ్మజ్ఞానం, బ్రహ్మానందం ఆమడ దూరం ఉంటుంది. ఈ ఆధిక్యత, అహంకారం వదులుకున్న వారికే అది సాధ్యం. అదే బ్రహ్మజ్ఞానం. అదే ఈ మాయ నుండి విముక్తం కావటం. స్వార్థం, అసూయ, భవభావ బంధాలు నేను గొప్ప, ఇది నాది, ఇది నీది కాదు అనే ఈ లోకంలో వీటన్నిటి మధ్య జీవిస్తూనే మానవులు ఈ మాయ నుండి బయటపడటమే అసలు నిర్వాణం, అదే అసలు సన్యాసం.

## నాది అనే స్వార్థానికి నిస్వార్థానికి మధ్య తేడా చెప్పిన బుద్ధుడు

"ఏదీ నీది కానపుడు అన్నీ నీవే అవుతాయి అని చెప్పిన బుద్ధుని మాట గొప్పమాట. గంగధరి కోరుతున్నది విడిగా ఉండే ఆదర్శ ప్రపంచం. అది ఎన్నడూ సాధ్యం కాదు. ఈ లోకంలో అన్నిటా ఉంటూనే లోక కళ్యాణం కోసం అన్ని పనులూ చేస్తూనే ఏదీ తనది కాదు అనే స్థితికి తన ఆత్మను, మనసును జయించడం గురించే మనం చెప్పవలసింది.

ఈ భార్యాబిడ్డలు, ఈ ఆస్తిపాస్తులు, అధికారం, పేరు ప్రతిష్టలు, కులం, మతం ఈ దేహంతో పాటు నీ భావాలపై కూడా ఇది నాది అనే ఆస్తి హక్కులేని అభావ స్థితికి చేరుకోవడమే ఈ మాయ నుండి విముక్తి కావడం. అపుడే నిజమైన స్వేచ్ఛ, స్వచ్ఛమైన ప్రేమ, కరుణ, ఆదర్శ ప్రపంచం, నిజమైన సోషలిజం అనుభవంలోకి వస్తుంది. బుద్ధుడు, కబీరు, గురురవిదాసు చెప్పిన సారం ఇదే నాయనా! అదే ఈ కార్తీక పున్నమి సందేశం." 'సదువు' కథలో ఈ అవగాహన రచయితకు లేకుండా ఆయా పాత్రలను సృష్టించి వారి చైతన్యంలో భాగంగా చిత్రించడం అసాధ్యమైన విషయం.

## జీవితంలో రిజర్వేషన్లు, కులం, ఆస్తులు నిర్వహిస్తున్న పాత్ర కథల్లో...

15. 'మమతలు' కథలో ప్రేమికుల మధ్య ఘర్షణ రూపంలో రిజర్వేషన్ల గురించి చర్చించాను. ప్రేమ గురించి బీసీ రిజర్వేషన్ల గురించి, మహిళా రిజర్వేషన్ల గురించి సమాజంలో జరుగుతున్న సంఘర్షణ వల్ల పుట్టినప్పటి నుండి కలిసి జీవించిన స్నేహితులు క్రమంగా ఎలా విడిపోతూ వచ్చారో 'మమతలు– మానవ సంబంధాలు' కథ సంపుటిలోని 'మమతలు' కథలో ఆ పరిణామాల క్రమాన్ని చిత్రించాను.

"సరూ.. నువ్వు చాలా మాటలు నేర్చావు. నువ్వు మరిచిపోవాలనే నిర్ణయించు కున్నావని స్పష్టంగా చెప్పకుండా యీ డొంక తిరుగుడెందుకు?"

"కాంత్, అప్పుడు లేచిపోదామంటే నువ్వు ధైర్యం చేయలేదు. అమ్మా, చెల్లీ, యింకా ఏదేదో అన్నావు. ఇప్పుడు ఎంతెంత అభాండాలు వేస్తున్నావు. నువ్విలా అంటుంటే నా హృదయంలో ఎంత బాధకలుగుతున్నదో నీకు తెలుసా? నేనిపుడు సంసారం చేస్తున్న స్త్రీని. ఇపుడు నేను ఓ దేవదా, ఓ పార్వతీ అని ఏడ్చినట్టు ఏడుస్తూ కూర్చుంటే సంతోషమా! స్త్రీలు ఎక్కడో పుట్టి ఎక్కడో నాటేయబడే మొక్కల లాంటి వారు. పెళ్లయ్యాక ఈ వ్యవస్థలో స్త్రీలకు అంతకు క్రితం ఉన్న ప్రేమ విషాదాలు వ్యక్తం నుండి అవ్యక్తం చేయబడతాయి. బాధను సైతం వ్యక్తం చేసే అవకాశం యీయదు ఈ సమాజం."

"సరూ! పారిశ్రామికీకరణ మీకు ఆధునిక అభివృద్ధిని, నాగరికతను యిచ్చింది. కాని మా వాళ్ళకు ఉన్న కులవృత్తులు పోగొట్టింది. జీవితాలు కాలే కడుపులతో కొడిగట్టిపోయినై. అంబేడ్కర్ ఎందరికో వెలుగు చూపినా గాంధీ పంథాయే రహదారి అయింది. కాని ఈ యిద్దరికి గురువైన జ్యోతిబా ఫూలే వేసిన బీసీల దారి అక్కడే ఆగిపోయింది."

"చూడు కాంత్. మహాత్మాఫూలే తన భార్యకు అక్షరాలు నేర్పి టీచర్‌గా తీర్చిదిద్దాడు. ఆ సావిత్రిబాయి ఫూలే మన దేశంలోని మొదటి మహిళా టీచరు. ఈ ఆదర్శాన్ని నీవెందుకు ముందుకు తీసుకు పోకూడదు. నీ భార్య పద్మ మరీ చదువు రానిదేమీ కాదు. ఇంటర్



చదివిన అమ్మాయిని నీకనుకూలంగా తీర్చిదిద్దుకోలేకపోతే ఇక సమాజాన్నెలా తీర్చిదిద్దుతావు. ఆమె నీకు చెప్పకుండా పోయింది సరే. మరి నువ్వేపోయి రమ్మని ఎందుకడగలేదు. సరవ్వ వల్లనే నా సంసారం గిట్లయిందని మీ ఆవిడ అనుకుంటే ఆ తప్పు ఎవరిది. అలా అనుకోవాలనే నీ ఉద్దేశమా!"

ఇలా రచయిత చైతన్యం, అవగాహననుసరించి పాత్రల చైతన్యాన్ని కూడా పెంచి తద్వారా ఆయా పాత్రల ద్వారా ప్రేమ సన్నివేశాల్లో కూడా పాత్రల చైతన్యస్థాయిని అనుసరించి సిద్ధాంత చర్చలు, సంఘర్షణలు చిత్రించవచ్చు.

## ఫెమినిజం–పెట్టుబడి–నిర్మాణాల నిర్వచనాలు

16. 'మలుపులు' కథలో నేను ప్రేమ గురించి, పెట్టుబడి గురించి, రాజకీయాల గురించి అనేక సూత్రీకరణలను చేశాను. అందుకు అనువైన పాత్రలను, సన్నివేశాలను, సందర్భాలను సృష్టించాను. ఉదాహరణకు...

"ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఇవన్నీ రాజకీయాలే. ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే, సామాజికమైనదే. వీటితోపాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువల వల్ల సాధ్యపడుతున్నది."

"నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల, పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు."

## సామాజిక పరిణామాలను సూత్రీకరించే కథన శిల్పం

'వరుసలు' కథలో 'నేను' పాత్ర నిజంగా నా పాత్రే. అది నా జీవితమే. అందులోని మా బంధువుల జీవితం కూడా వాస్తవమే. అందులోని మేనమరదలు, నా భార్య కూడా వాస్తవమే. అందులోని పెళ్లి, సందర్భం కూడా వాస్తవమే. ఆ వూరు కూడా వాస్తవమే. యధాతథంగా జరిగిన విషయాలే కథగా మలిచాను. నా అవగాహనను నా పాత్ర ద్వారా నేను విశ్లేషిస్తూ వచ్చాను. నేనే ఆ పాత్ర కనుక నాకున్న అవగాహనను ఎంతయినా అందులో రాశి పోయవచ్చు. అంత చిన్న కథలో ఎంతో పెద్ద రాశి పోశాను. గ్రామీణ

సమాజం ఎందుకు వెనకబడిపోతూ వచ్చిందో, పట్టణ సమాజం ఎలా ఎదుగుతూ వచ్చిందో, బట్టల మిల్లు కార్మిక వర్గం ఎలా క్రమక్రమంగా పతనమవుతూ వచ్చిందో, ప్రభుత్వ, ప్రభుత్వరంగాల సంఘటితరంగం ఎలా జీతభత్యాలు పెంచుకొని జీవన ప్రమాణాలు పెంచుకుంటూ అభివృద్ధిని తరవాతి తరాలు కూడా అందుకొంటూ ముందుకు సాగారో ఈ కథలో విశ్లేషించాను. ఉదాహరణకు...

"ఏదైనా సరే కార్మికరంగం గానీ, ఉద్యోగరంగం గానీ సంఘటిత రంగంగా యాజమాన్యంతో బేరం చేయగలిగిన శక్తి, మనకు ఉండే కీలక స్థాయిననుసరించి కూలీలు జీతాలు గిట్టుబాటవుతాయి. వెనకట వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అందుకని అది లేని నాకు నిన్ను యివ్వనన్నారు. ఇపుడది గిట్టుబాటు లేనిదైపోతున్నది. వెనకటి బట్టల మిల్లు కార్మికరంగం దాని స్థానం బలంగా ఉన్నంతకాలం కూలీ బాగా గిట్టుబాటై ఆ కార్మికుల్లోంచే చిన్న పెట్టుబడిదారులు పుట్టి యిపుడు షోలాపూర్, భీవండి బట్టల మిల్లుల యాజమానులయ్యారు. ఇపుడా అవకాశం లేదు. కంప్యూటర్ ఎలక్ట్రానిక్ రంగాలిపుడీ దశలో ఉన్నాయి. అందులో నిన్నటి ఉద్యోగుల్లోంచి నేడు వేలకోట్ల అధిపతులయ్యారు."

## సామాన్య ప్రజలు కూడా జీవితాన్ని సూత్రీకరిస్తారు

'వరుసలు' కథలో మేనమరదలు స్వయంగా ఇలా అడిగింది. ఆమె భావాలనే కథలో ఇలా పెట్టాను. "ఏమైనా బావా! నాయిన అవ్వా ఒక్కరేమిటి మా యి పల్లెలో వ్యవసాయాన్ని నమ్ముకొని బతికినవాళ్ళున్నారు గానీ బాగుపడ్డవారు లేరు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే తిండికి కొరత లేదు.

కాని జంతువులు కూడా ఏదో తిని బతుకుతాయి. మా మీద వేసే పన్నుల్తో అడ్డగోలు జీతాలు దొబ్బి మీరు సుఖాలనుభవిస్తున్నారు. మేమేమో వెనకబడి పోతున్నాం. ప్రభుత్వం మీ సౌఖ్యాల కోసమే పుట్టినట్టుంది. మా కోసమని పుట్టిన ప్రభుత్వం మీ సుఖాలు, సౌకర్యాలకి పరిమితమైపోయింది. అందుకే నువ్విట్లా ఎర్రగా, బుర్రగా నునుపు తేలినావు. నీ పిల్లలు బాగా చదువుకొని ఎదుగుతున్నారు."

అది నన్ను ఉద్దేశించిన మాటైనా మా ఆవిడ తననే అన్నట్టు ముఖం మాడ్చుకుంది. అలా ముఖం మాడ్చుకున్న విషయం కూడా వాస్తవమే.

17. అయితే కథల్లో, నవలల్లోని కొటేషన్‌లకు ఒక పరిమితి వుంది. 'ఆనందమఠం' నవలలో బంకించంద్ర 'వందేమాతరం' గీతం రాశారు. అది జాతీయ గీతంగా జాతీయోద్యమంలో మహోన్నతమైన పాత్ర నిర్వహించింది. అలాగే ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవలలో మూడు గీతాలు రాశారు. అవి ఎంతో స్ఫూర్తి నిచ్చాయి.



## కథలు రాస్తూ దార్శనికుడుగా నేను కోల్పోయిందేమిటి?

18. కానీ నేను నా నిర్వచనాల పట్ల, కథల్లో చేసిన విశ్లేషణ పట్ల కాస్త అసంతృప్తితో వున్నాను. కథల్లో రాశాను కదా అని నేను వ్యాసాల్లో ఆ అంశాలను ప్రత్యేకంగా వెంటనే రాయకుండా అశ్రద్ధ చేశాను. కానీ ఆ కథల్లోని కొటేషన్లలో లేదా కథల్లోని ఇతివృత్తంలో చెప్పదల్చుకున్న అంశాలను తిరిగి వ్యాసాలుగా, ప్రసంగాలుగా విస్తారంగా రాసినప్పుడే వాటికి వ్యాప్తి పెరిగింది. ఆ విశ్లేషణకు సరైన న్యాయం జరిగింది. అందువల్ల వ్యాసాలు రాయడం ప్రధానం అని భావించి కథలు రాయడం పట్ల కాస్త అశ్రద్ధ చేశాననే అనుకుంటాను.

అందుకే 2005 తరువాత నా కథలు అచ్చు కాలేదు. వ్యాసాలేమో చాలా పుస్తకాల్లో వచ్చాయి. సుమారు 30 పుస్తకాల దాకా తెచ్చాను. సామాజిక అవసరం, ఉద్యమంలో భావజాల చైతన్యం ఎప్పటికప్పుడు మారాల్సిన మలుపులు గురించి వ్యాసాలు, ఉపన్యాసాలు, పాటలే అందుకు తగిన ప్రక్రియలు.

కథ తీరికగా ఎప్పుడైనా చదువుకొనే అవకాశం వుంది. అయితే కథకు జీవిత కాలం ఎక్కువ. వ్యాసాలకు, ప్రసంగాలకు తక్షణ ప్రయోజనం ఎక్కువ. వాటి జీవిత కాలం ఎంత వుంటుందో చరిత్ర నిర్ణయిస్తుందే తప్ప ఎవరూ చెప్పలేరు. కథల్లోనైతే మానవ సంబంధాలు, సంస్కృతి, సంవేదనలు చిత్రణ బలంగా వుంటే ఎంతకాలమైనా, ఆ సమాజం మరో సమాజంగా మారిపోయినా చదువుతూనే వుంటారు. ఉదా.కు బాణాలు, కత్తులు, యుద్ధాలు, రాజ్యాలు, రాచరికాలు పోయినా రామాయణ, భారతాలను, పురాణ కథలను, జానపదాలను చదువుతూనే వున్నాం. చూస్తూనే వున్నాం. ఇది కథా ప్రక్రియలకు గల ప్రత్యేక సౌకర్యం.

## దేశీయ అంతర్గత వైరుధ్యాలు, సామాజిక పరిణామాలు

19. 'స్మృతి' కథల సంపుటిలోని 'మార్పు' కథలో దేశీయ అంతర్గత సామాజిక పరిణామాలను చిత్రిస్తూ. భావజాల యుద్ధం సమాజంలో ఎలా సాగుతున్నదో ఆ పాత్రల సంభాషణల ద్వారా రికార్డు చేశాను. రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పర్యటిస్తూ నేను రాష్ట్ర వ్యాప్తంగా నా ఉపన్యాసాల్లో నిప్పులు కక్కినట్టు, శరాలు సంధించినట్టుగానే సంభాషణలు, చర్చలు చిత్రించాను. ఉదాహరణకు నా ఉపన్యాసాల్లోని సారాంశాన్ని 'మార్పు' కథల్లోని పాత్రల ద్వారా ఇలా రికార్డు చేశాను.

"ఇది అశాస్త్రీయ విద్యా విధానం అనే వాళ్లను అసలు నమ్మవద్దు. వాళ్లు దొంగలు, వాళ్లు చదువుకొని మిగతావాళ్లకు ఈ చదువు అక్కరలేదని మెట్టవేదాంతం చెప్తారు – పెండ్లయినోడు సుఖంగా పెళ్లాం చేతివంట తినుకుంటూ పెళ్లికి తొందరపడే యువకుల్తో

ఈ సంసార లంపటం వద్దు నాయనా పెండ్లి చేసికొని జీవితం నాశనం చేసికోకు అని నీతులు చెప్పినట్టు! ఈ చదువు దేనికి పనికి రావడం లేదట! దేనికైనా ఈ చదువే కావాల్నాయె. ఏం ఈ చదువు చదివిన డాక్టర్లు ఇచ్చే ఇంజక్షన్లు పని చేయడం లేదా? ఈ ఇంజనీర్లు దేనికి పనికిరారా? అయితే ఈ టెక్నాలజీ, సైన్స్, అభివృద్ధి అంతా అబద్దమా? వీడు ఈ సైన్సే అన్‌సైంటిఫిక్ అన్నట్టు తాము ఆచరించని దాన్ని ఇతరులకు ఉపన్యాసాలు దంచుతూ ఎందరి బంగారు భవిష్యత్తును నాశనం చేశాడో. ఇది అశాస్త్రీయ విద్యావిధానం అంటూ విద్యార్థుల్ని చెడగొట్టేవాళ్లను చెప్పుతో కొట్టాలె. అరేయ్! నీ సర్టిఫికెట్లు చింపి అవతల పారేసి కలం పట్టకుండా, నువు చదివిన చదువుతో అది ఇచ్చిన తెలివితో సంబంధం లేకుండా నోరు విప్పకుండా వంచిన తల ఎత్తకుండా మా తాత ముత్తాతల తీరు నువ్వూ నీ కొడుకూ కూతురూ తట్టమోసి బావులు తవ్వి, కూలి పనికిపోయి బానిస జీవితం జీవిస్తే గానీ నువ్వు మాట్లాడుతున్నదేమిటో నీకు తెల్సిరాదురా! అపుడు నువు చెప్పే శ్రీరంగనీతులు వింటా." అని రాములు పాత్ర చదువు గురించిన చర్చ సందర్భంలో ఒక సిద్ధాంతాన్ని, ఒక స్కూల్ ఆఫ్ థాట్‌ను జీవితంలో భాగంగా ఇమిడ్చాను. ఆ చర్చ నిజంగానే నా మిత్రులతో కూడా జరిగిందే. కథలో కూడా అలాగే ఆయా పాత్రల ద్వారా రికార్డు చేశాను.

## జీవితంలోని చైతన్యవంతమైన భిన్న పాత్రలు, భిన్న భావజాలాలు ఒకే కథలో

20. సంభాషణ, చర్చ అధ్యాయాల్లో ముందే చెప్పాను. రెండు పాత్రలు సంభాషిస్తున్నప్పుడు వైవిధ్య పూరితంగా వుండాలని, వారి మధ్య భావవైరుధ్యం వుంటే వాటిని సంభాషణలో పొదిగి ఇరు పక్షాల వాదనలను చదువరులకు అందించడం ద్వారా చదువరులు స్వయంగా ఏది సరైనదో నిర్ణయించుకుంటారు. 'మార్పు' కథలో మార్క్సిస్టు, నక్సలైట్ భావాలను, మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్ భావాలను సమాన స్థాయిలో రెండు స్కూల్ ఆఫ్ థాట్స్‌కు న్యాయం జరిగే విధంగా చిత్రించాను. ఆ రెంటినీ అధ్యయనం చేయడంతో పాటు వాటి కోసం సామాజిక రంగంలో ఉద్యమ కారుడిగా జీవించిన అనుభవం వుండడం వల్ల వాటిని కథల్లో పెట్టడం, న్యాయం చేయడం సులభమైంది.

## కవిత్వంలో సాధ్యం కానివి కథల్లో, నవలల్లో సాధ్యమయ్యేవి ఏమిటి?

21. కవిత్వంలో కవి ఈ రెంటిలో ఏదో ఒక పార్శ్వం తీసుకుంటాడు. ఏదో ఒక దాన్ని సమర్థిస్తాడు. ఒక దాన్ని వ్యతిరేకిస్తాడు. రెంటినీ సమాన స్థాయిలో ప్రవేశ పెట్టి రెంటిలో మీకిష్టమైంది ఎన్నుకోవచ్చు అని కవి పాఠకుల కోసం వదిలేయలేదు. ఏది స్వీకరించాలో కవే నిర్ణయానికి వచ్చేసి ఇదే కరెక్టు అని బల్లగుద్ది వాదిస్తాడు. పాటకవులు, వచన కవులు, ఉపన్యాసకులు ఈ పని చేయడంలో దిట్టలు.



అందువల్ల ఆయా ఉద్యమాలు, పార్టీలు, నాయకులు వీరికి అపారమైన అవకాశాలు, గౌరవాలు ఇచ్చి వేదికలను ఎక్కిస్తాయి. సాహిత్య రంగంలో, పత్రికల్లో వారి గురించి అందలాలకు ఎక్కిస్తూ ప్రశంసిస్తుంటారు. వారంతా కలిసి ఒక బృందంగా ఏర్పడి లాబీలుగా, ప్రెషర్ గ్రూపులుగా, సైన్యంగా కవాతు చేస్తుంటారు. ఇతరులపై యుద్ధం చేస్తుంటారు. కథా, నవలా రచయితలకు ఇది సాధ్యం కాదు. అన్ని పాత్రలను తానే సృష్టించాలి. ఎవరి స్వభావాన్ని అనుసరించి వారికి డైలాగులను, లాజిక్‌ను, స్వయం సమర్థనను రచయితలే అన్ని పాత్రలకు సమకూర్చాల్సి వుంటుంది.

ఇక్కడే కథా, నవలా రచయితలకు, సమాజానికి దార్శనికులు, మార్గదర్శకులు అయ్యే ప్రత్యేక అవకాశాలు ఏర్పడుతున్నాయి. సమగ్ర సమాజ స్వరూపాన్ని చిత్రించగలిగే అవకాశం ఇలా కథ, నవల, సినిమా, టీవీ కథా రచయితలకే ప్రత్యేకం. వాల్మీకి, వ్యాసుడు మొదలుకొని ప్రాచీన కవులు, కథా కావ్యాల ద్వారా ఈ పనిని చేశారు. కానీ ఆధునిక కవి కథలేని, కథతో సంబంధంలేని కవిత్వం మాత్రమే రాస్తుంటారు. అందువల్ల ప్రాచీన కవులకు నిజమైన వారసులు కథ, నవల, సినిమా, టీవీ సీరియల్ కథా రచయితలే. మిగతా కవులందరూ కేవలం తమ భావాలను, విశ్లేషణను ప్రజలకు తెలుపుకోవడానికే పరిమితమవుతుంటారు తప్ప మొత్తం సమాజాన్ని ఒక సమగ్రతలో పట్టించుకోరు. పాట, వచన కవిత్వం పరిమితి ఇది. అవి ప్రత్యేకమైన లక్ష్యాలను నెరవేరుస్తున్నాయి. వాటికి కథ, నవలా ప్రక్రియలకు పోటీ లేదు, పోలిక లేదు. రెండూ వేర్వేరు లక్ష్యాలు, కార్యక్షేత్రాలు.

## దార్శనికుడు కథా రచయితగా ఎదుర్కొనే పరిమితులు, సౌకర్యాలు

22. నేను కథకుడిగా, తత్వవేత్తగా ఏకకాలంలో రెండు కర్తవ్యాలు చేపట్టడం వల్ల 'వేపచెట్టు', 'ప్రశాంతం', 'కామన్‌వెల్త్', 'బతుకుపయనం', 'జీవనయానం', 'సంబంధం', 'పారసైట్స్', 'అయిదవవాడు', 'వారసత్వం' తదితర కథల్లో ప్రపంచీకరణ అనుకూల, వ్యతిరేక పరిణామాలు రెంటినీ చిత్రించాను. 'బతుకుపయనం' కథలో గ్లోబలైజేషన్ వల్ల లభించిన నూతన అవకాశాల్లో అభివృద్ధిని అందుకున్న వాళ్ళ గురించి సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే ఎలా వుంటుందో లెక్చరర్ పాత్ర ద్వారా చర్చించాను. ఉదాహరణకు...

"మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా ఉండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలాలజపతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె. రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే

మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని బట్టి ఉంటుంది. బిల్‌గేట్స్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? సత్యం రామలింగరాజు, ఇన్ఫోసిస్ నారాయణమూర్తిగార్లకు ఎవరు చెప్పారు? గుమాస్తా జీవితాన్ని ప్రారంభించిన రిలయన్స్ అంబానీకి ఎవరు చెప్పారు ఎదగాలని? అనాథగా పుట్టిపెరిగిన ఫోర్డ్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? అంతా సంకల్పబలం. పట్టుదల, నిరంతర కృషి. విశ్వవిజేత అలెగ్జాండర్ ఒక మాటన్నాడు : గెలవదలచుకున్నవారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని. నేను ఇంతకన్నా కొత్తగా, అదనంగా చెప్పడానికేమీ లేదు. మీరు ఎంత ఎదిగితే అంతగా సేవచేసే అవకాశం ఉంటుంది." ఇంత చక్కగా అనేక కోణాలను చిత్రించినప్పటికీ కొందరు కేవలం గ్లోబలైజేషన్‌కు అనుకూలంగా మాత్రమే రాశానని అంటుంటారు. అలా అనే వాళ్లు ఏకపక్ష దృష్టి గల సాహితీ విమర్శకులు, కవులు, ఉద్యమ కారులు తప్ప వారెవరూ దార్శనికులు కారు. సమాజాన్ని సమగ్రంగా పరిశీలిస్తున్న సామాజిక శాస్త్రవేత్తలు కారు.

### పార్టీలు, ఉద్యమాలు ఏకపక్షంగా పాక్షిక సత్యాన్ని పూర్తి సత్యంగా భావించాలంటాయి ఎందుకు?

23. వాళ్లు అలా ఎందుకంటారంటే, వాళ్లకు సత్యం ఒక పార్శ్వమే కావాలి. అది మాత్రమే పూర్తి సత్యమని అందరినీ నమ్మించాలి. ప్రజలను వీలైనంత మందిని తమకు అనుచరులుగా మార్చుకోవాలి. తమ నాయకత్వం సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాల్లో అంగీకరించబడాలి. ఆయా రంగాలను తామే నిర్దేశించాలి. మిగతా వారిని ప్రతిపక్షం వలె మంచి ఉన్నప్పటికీ వ్యతిరేకించాలి, ఖండించాలి. ఇది ఆయా ఉద్యమాల, నాయకుల, సిద్ధాంతాల, కార్యకర్తల, సాహిత ఉద్యమాల పరిమితి. అందువల్ల వారి సాహిత్యం ఏకపక్షమై మొనాటినీకి గురై వారి భావాలతో సంబంధం లేని వారు స్వీకరించలేక పోతున్నారు. మొత్తం సమాజం వారికి పాఠకులుగా మారలేకపోతున్నారు. ఒక సెక్షన్‌కు మాత్రమే వాళ్లు పరిమితమై మొత్తం సమాజానికి ప్రతినిధులుగా ఉన్నట్టు నటిస్తుంటారు. సత్యానికి బొమ్మ, బొరుసు రెండు పార్శ్వాలు మాత్రమే కాదు. సత్యానికి బొమ్మ, బొరుసుతో పాటు మూడవ కోణం కూడా వుంటుంది. అవి వారికి కూడా తెలుసు. కానీ తాము దేన్ని నమ్ముతున్నారో అది మాత్రమే ప్రజలకు చెప్పాలని వారి ఉద్దేశం.

### కథా రచయితలే సమగ్ర సామాజిక దార్శనికులు

24. అయితే కథల్లో, నవలల్లో, సినిమాల్లో, రామాయణ, భారతాల్లోలాగా సమాజంలోని అన్ని పాత్రలను, అన్ని కోణాలను, వైవిధ్యాలను, వైరుధ్యాలను కథకుడే చిత్రించాల్సి వుంటుంది. అలా చిత్రించడానికి ఇష్టపడకపోతే అతడు కథలు, నవలలు



రాయలేడు. కేవలం కొన్ని అనుకూల పాత్రలనో, వారికి సంబంధించిన భావాలనో రాస్తారు. అందువల్ల అలాంటి వాళ్లు ఉపన్యాసాలకు, వచన కవితలకు, పాటలకు పరిమితమవుతారు తప్ప కథలు, నవలలు రాయలేరు. రాస్తే అవతలి పక్షం వాదనలు కూడా పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు ద్వారా చిత్రించాల్సే వుంటుంది. రచయిత ఎవరి పక్షం వహించినా సరే. కానీ చిత్రించక తప్పదు.

### గ్లోబలైజేషన్ శిథిల సమాజ పరిణామాలు

25. గ్లోబలైజేషన్ వల్ల జీవితాలు శిథిలమవుతున్న తీరు గురించిన 'ప్రశాంతం' కథలో ఆర్థిక శాస్త్రం, జీవనశాస్త్రంలో సహజంగా చిత్రించాను. ఉదాహరణకు... "అంగట్లో అన్నీ ఉన్నాయి. జేబులో డబ్బులు ఉండవు. చేయడానికి పని ఉండదు. ఉన్న ఫ్యాక్టరీలను వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం కింద కార్మికులను పంపించేసి మూసి వేస్తున్నారు. ఫ్యాక్టరీల స్థలాన్ని ఇళ్ళ స్థలాల కోసం అమ్మేసి కోట్లు సంపాదిస్తున్నారు. సామాన్యుల బతుకు ఇలా ఎందుకయిపోతున్నది. రైతులు కూడా కాంట్రాక్టర్లను, ప్రొక్రెయినర్లను కిరాయికి తీసుకుని వ్యవసాయం నడుపుకుంటున్నారు. కూలీలకు ఏ పని దొరకడం లేదు.

బావులు తవ్వడంపోయి బోరింగులు వేయడం వచ్చింది. చేనేత నూలు బట్టలు పోయి మిల్లు బట్టలు వచ్చాయి. మాదిగ చెప్పులు పోయి కంపెనీ చెప్పులు వచ్చాయి. ఎడ్లబండ్లు పోయి ఆటోలు, లారీలు, బస్సులు వచ్చాయి. ఇక పల్లెటూరి పాతకాలపు మనుషులు ఏం పని చేసుకుని బతకాలి. ఇవన్నీ గుర్తు చేసుకుని నిస్సహాయంగా ఏడ్చారు. ఇలా ఎందుకు జరుగుతున్నదో?"

### గ్లోబలైజేషన్ అభివృద్ధి, సామాజిక పరిణామాలు

26. అదే సమయంలో నేను గ్లోబలైజేషన్ వల్ల ఒనగూడే లాభాలను, ప్రయోజనాలను ఎలా అందుకోవాలో, అందుకు ఎలా ఎదగాలో, రష్యా, చైనాల్లో సోషలిస్టు సమాజాలు అంతరించిపోయినా తన చుట్టూ సోషలిస్టు సమాజాలను, సంబంధాలను 'బతుకుపయనం'లో, 'జీవనయానం'లో ఎలా సృష్టించుకోవాలో జీవితంలో భాగంగా చిత్రించాను. ఈ సామర్థ్యాన్ని రచయితలు, సినిమా, టీవీ సీరియల్ దర్శకులు అధ్యయనం ద్వారా పెంచుకోవడం అవసరం. జీవితానుభవాలు లేకుండా, అధ్యయనం లేకుండా సామాజిక శాస్త్రాలు, తత్వశాస్త్రాలు అధ్యయనం చేయకుండా ఇది కథల్లో, నవలల్లో, సినిమాల్లో, టీవీ సీరియల్స్‌ల్లో చిత్రించడం సాధ్యం కాదు.

### తమ జీవితాన్ని తామే విశ్లేషించుకోవడం

27. 'తెల్లబట్ట' కథలో ఎంతో జీవితం గడిచిపోయిన తర్వాత మాలతి, సారవ్వ,

ఆశయ్య కలిసి గతాన్ని కలబోసు కుంటారు. తమ జీవితాలను తామే పరిశీలించుకుంటారు. వ్యాఖ్యానించుకుంటారు. అలాంటి సందర్భాల్లో రచయితగా కూడా గ్రూప్ ఫోటోలో మరో మనిషి ఇమిడిపోయినట్టుగా కొన్ని తాత్వికాంశాలు రాస్తూ వెళ్ళాను.

"నిరాశ నిండు గర్భిణివంటిది. అనుభవించడం రావాలేగాని నిరాశలో గర్భిణి స్త్రీలా ఆనందాన్ని పొందవచ్చు. అది జీవితాన్ని కొత్తగా ప్రసవిస్తుంది. కొత్త ఆనందాన్నిస్తుంది. ఆశ ఒక ఊహ. ఆశ అందమైంది. నిరాశ ఒక వాస్తవం. నిరాశ - వాస్తవం నుండి ఊహకు చేరుకొని దాన్ని వాస్తవం చేసుకోలేకపోయిన తీరును తెలుపుతుంది. ఆశ గమనాన్ని తెలుపుతుంది. నిరాశ గమ్యం యొక్క దూరాన్ని తెలుపుతుంది. ఆశ లక్ష్యాన్ని తెలుపుతుంది. నిరాశ ఆ లక్ష్యాన్ని చేరుకోలేని దశను తెలుపుతుంది. నిరాశ దాటిన లక్ష్యాల గమ్యాలపట్ల అహాన్ని తొలగిస్తుంది. మరింత ఉన్నత జీవిత లక్ష్యాన్ని తిరిగి కొత్తగా ప్రారంభిస్తుంది."

"వర్తమానంలో మన ప్రమేయం ఏమీ లేకుండా గతం తన ప్రభావం వేస్తుంది. తన ప్రమేయం లేకుండానే సాగిపోయిన గతం కూడా సారవ్వ వర్తమానాన్ని వెంటాడుతోంది. వర్తమానాన్ని శాసించగలను అనుకొని ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన రాంరెడ్డి గతం రాంరెడ్డిని వెన్నాడుతోంది." సారవ్వ, రాంరెడ్డి జీవితాలను చెపుతూ దానికి పై గీత పెట్టిన వాక్యాన్ని రాస్తూ పోయాను. అది కథలో ఇమిడిపోతుంది. విడిగా తీసుకుంటే ఒక నిర్వచనంగా కనపడుతుంది. అలాగే సారవ్వ, మాలతి, శారద, సుశీల తమ జీవితాలతో ఆడుకున్న వారిని క్షమించాలనుకున్నారు. క్షమించక తప్పలేదు. అప్పుడు ఆ సందర్భంలో ఇలా రాశాను.

"క్షమాగుణం లేని జీవితం మనిషిని హేయంగా మార్చి క్రూరుణ్ణి చేస్తుంది. పశ్చాత్తాపంతో దహించుకుపోయి పునీతులై తిరిగి కొత్త జీవితాన్ని కోరుకునే మనిషిని క్షమాగుణంతో స్వీకరించి అవకాశం యివ్వలేని సమాజం క్రూరమైంది. పశ్చాత్తాపిని తిరిగి గతంతో బాధించే సమాజంలో పశ్చాత్తాపడ్డమే తప్పు అని తిరిగి పాతపద్ధతికే మళ్ళడాన్ని అనివార్యం చేస్తుంది. కొత్త జన్మలు ఎక్కడో లేవు. క్షమాగుణం - పశ్చాత్తాపమే తిరిగి కొత్త జన్మలనిస్తాయి. తెల్సీ తెలియకుండా గడిచిపోయిన జీవితాల్నించి తిరిగి కొత్త జీవితాల్ని ప్రారంభించే అవకాశం ఉంటే ఈ మనుషులు - ఈ సమాజం - ఈ మానవ సంబంధాలు మరింత ఉన్నతంగా ఎదుగుతాయి. సారవ్వ, శారద, సుశీలలు తిరిగి జీవితాన్ని ప్రారంభించుకునేందుకు సమాజం సహకరించగలిగితే గతంలోని అనుభవాలతో వారి కొత్త జన్మలు ఎంత ఉన్నతంగా ఉంటాయో! వారికా కొత్త జీవితం ఇవ్వడానికి పురుషులు ఎంతమంది ముందుకు రాగలరు... ఆ జైలు జీవితం వారి వ్యక్తిత్వాల్లో ఎన్ని మార్పులు తెచ్చిందో ఎవరికి చెప్పతరం! ఆ జైల్లో వారి మధ్య ఒక మహోన్నత నూతన సమాజం పురి విప్పుకుంటోంది... బావిలో పడి చావాలనుకున్న సారవ్వ ఇప్పుడు చాలా



మారిపోయింది..." ఇలా కథ నడిచేటప్పుడు కథకనువుగా ఏ మాత్రం మించకుండా అనేక విషయాలను కథకుడిగా చెపుతూ పోయాను.

"నువ్వు ఎన్ని చెప్పు. బావను నీకు నేను త్యాగం చేయలేదంటావా!" అని నవ్వుతూ సీరియస్‌గానే మాలతిని నిలదీసింది సారవ్వ.

మాలతి కోసం బావకోసం తన జీవితాన్ని త్యాగం చేశాననే భావనే సారవ్వను సజీవంగా ఆశాజీవిగా ఉంచుతోంది. అది వాస్తవం కాదని తెలిస్తే ఆమె ఆశా విశ్వాస సౌధాలు కుప్పకూలిపోతాయని మాలతి గ్రహించలేకపోయింది.

"నీ కులం-ఆర్థిక స్థితి నిన్ను చదువుకోనీయలేదు. నా కులం నన్ను ఆశయ్యతో లేచిపోనీయలేదు. అతని చదువే నిన్నూ నన్నూ - అతన్ని దగ్గర చేసింది. దూరమూ చేసింది. మీ బావ చదువుకొని యింతగా ఎదగకపోయి వుంటే నీవింతగా ప్రేమించే దానివీ కాదు. ప్రేమించినా వెంకటయ్యను మరిచినట్టే మరిచిపోయి ఉండేదానివి. నేనూ అంతే. అతని చదువు ఉద్యోగం మన యిద్దరి ప్రేమల్ని పెంచి మన పీకలమీదికి తెచ్చింది. నీవు పుట్టిన కులం కారణంగానే నీవు నీ బావను త్యాగం చేయాల్సి వచ్చింది. ఇదొక సామాజిక అనివార్యత. ఇందులో నీ త్యాగం పాలు చాలా తక్కువ. నీవు లేకపోతే మరొకరి సాయంతోనైనా మీ బావను నేను వాటేసుకునే దాన్నే గదా-ఆలోచించు." అంది మాలతి.

ఆ వివరణతో సారవ్వ దిగాలు పడిపోయింది అకస్మాత్తుగా నిస్పృహతో తూలిపడిపోయింది. సుశీల మాలతి కల్సి ఆమెను మంచం పైకి చేర్చారు. బావకోసం మాలతి కోసం తన జీవితాన్ని త్యాగం చేశాననే భావన ఒక్కసారిగా వేళ్ళు నరికిన చెట్టులా కూలిపోవడంతో సారవ్వ తట్టుకోలేకపోయింది. అది వాస్తవం అయినా కాకపోయినా ఆ భావనే ఆమెకు మళ్ళీ జీవితేచ్ఛనిస్తోందని మాలతికి అప్పుడు కానీ అర్థం కాలేదు. కొత్త ప్రాణం పోసి శారద ఎక్కించిన త్యాగం భావన యిలా దిగిపోవడం చూసి సుశీల చకితురాలైంది."

"వాస్తవాల కన్నా విశ్వాసాలు బలమైనవి. పైకి మొండిఘటంలా కన్పించే సారవ్వ హృదయం యింత సున్నితమైందా అని తొలిసారిగా చకితుడయ్యాడు ఆశయ్య. జీవిత సర్వస్వం కోల్పోయినా ఆమె ఆత్మాభిమానమే ఆమెను బతికిస్తోంది. మాలతి కూల్చింది ఆ ఆత్మాభిమానాన్నే. స్పృహ కొచ్చాక కడుపునొప్పితో గిలగిలా కొట్టుకుంది సారవ్వ."

ఇందులో గీతలు పెట్టిన వాక్యాలు కథలో భాగంగా రాయబడ్డాయి. కథనుండి విడదీస్తే ప్రత్యేకమైన స్టేట్‌మెంట్లు, వాక్యాలవుతాయి. విడిగా కొనసాగుతాయి. కథకు వాటికి సంబంధం లేకపోయినా అక్కడ చెప్పడం వల్ల కథ చిక్కబడింది. చదువరులకు ఆ విషయం పట్ల అవగాహన పెరగడానికి ఉపయోగపడింది.

## ఫెమినిస్టులు పట్టుకోలేని ఫెమినిజం సామాజిక పరిణామాలు చిత్రించిన కథలు, కథన శిల్పం

28. 'బతుకుపయనం' కథా సంపుటిలోని 'స్మృతి' కథలో ఫెమినిజం తెచ్చిన వెలుగును, దృక్పథాన్ని జీవితంలో, దృక్పథంలో ఎలాంటి మార్పు తెచ్చిందో చిత్రించాను. ఉదాహరణకు...

"ఈ మొగోల్లు ఉత్తపనిదొంగలే. పని మనది పేరు వాళ్ళది. పడుగు పోసుడు, గంజి తెచ్చుడు, కండెలు చుట్టుడు, వంట చేసుడు, పోరగాన్లను సవరిచ్చుడు అన్ని చేసుకుంట మల్ల మొగ్గంనేయాలె. అంచునెయ్యాలె ఆడోల్లు. మొగోల్లు ఏమున్నదే పడుగు సరిచేసి నేసి అమ్ముకచ్చుడు. గంతే అమ్ముకరాను వోయి రాంగరాంగ తాల్లల్ల కల్లు దాగి అంత మందం ధర తక్కువకు అమ్మిందని అబద్దాలాడుతరు."

"ఈ సంసారం ఒక్కతీరు చేస్తే పురి కట్టిందానే! మనకు పొలాలు లేకపాయె, పెరండ్లు లేకపోయె. ఇత్తులు ఏది కొన్నా ధరలు అగ్గిమండె. కూలికి పోయి ఇత్తులు తెస్తుంటి. మక్క గట్క అందరు తింటే నాకు అది గూడ దొరకక పోవు. గంజిల ఉప్పురవ్వ ఏసుకుని తాగి పంటే ఆకలికి రాత్రికి పేగులు కడుపు నొప్పితోటి వడి తిరుగుతుండె."

"బట్టనేత అంటే ఆడిసేత లేనిది అసలే కాదే. ఇంట్ల ఆడిది పోతే కుల కశిపి పోయినట్టేనే. ఆ యిల్లు యిల్లు గాదు. గాడిదలు పొర్లినట్లుంటది. పోరగాన్ల దుబ్బల పొర్లినట్టుంటరు."

సామాజిక పరిణామంలో వలసలు సృష్టించిన క్రమాలు, గ్రామాలు శిథిలమవుతూ వస్తున్న తీరు గురించి "ఇరవై ఏండ్ల కింద నూరు కుటుంబాలుండె. అల్లందరు యిక్కన్నే వుంటే తక్కువకు తక్కువ మూడువందల కుటుంబాలైతుండె. కని యిప్పుడు 50 గడప వుండచ్చు. మిగిలినోల్లందరు పొట్ట చేతపట్టుకుని ఏదో ఒక పని వెతుక్కుంట ఎటెటో పోయిన్రు. ఒక ఊరుగాదు – ఒక రేవు గాదు. ఒక పని గాదు." శిథిలమైన కుటుంబాలు, సంబంధాలు...

## ధ్వని రస సిద్ధాంతాల కథ, కథనం

29. 'జైలు' కథలో "ఊహలు వేరు. భయాలు వేరు. వాస్తవంగా చూడ్డం వేరు. పాము అని ఊహించుకుని ఉలికి పడ్డప్పుడు భయపడ్డాం. కానీ, నిజంగా పాము కనబడితే అంతగా భయపడం, దాన్ని చంపడమో మనమో తప్పుకుపోవడమో చేయాలనే ఆచరణాత్మక ఆలోచనలు కలుగుతాయి. ఊహల్లోని భయాలే ఎక్కువ భయపెడతాయి. అవి ఎదురైనప్పుడు నిజానికి అంతా భయమేమీ కాదు. నేను లాకప్‌లో ఉన్నప్పుడు, జైలుకు వచ్చిన తరువాత



కలిగిన అనుభవం ఇది. అంతకన్నా ముందు జైలంటే ఎంతో భయంగా ఉండేది. కానీ, ఇక్కడికొచ్చిన తరువాత ఆ భయం పోయింది. గాంధీ, నెహ్రూ వంటి ఎందరో గొప్పగొప్ప వాళ్ళు ఏళ్ళ తరబడి జైల్లో గడిపారు. నెల్సన్ మండేలా 27 ఏళ్ళు జైల్లోనే గడిపాడు. జైల్లో ఉన్నంత స్వేచ్ఛ నిజానికి బయటి ప్రపంచంలో ఉంటుందా?"

## సోషల్ ఎకానమీ మార్కెట్ ఎకానమీకి భిన్నమైనది

30. 'జీవనయానం' కథలో "ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఇవన్నీ రాజకీయాలే. ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే, సామాజికమైనదే. వీటితోపాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువల పట్ల సాధ్యపడుతున్నది." 'జీవనయానం' కథలో లేదా నవలికలో అనేక సందర్భాల్లో చక్కని విశ్లేషణ అందించాను. ఉదాహరణకు...

"నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల, పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు."

## ఉత్తరం ద్వారా చిత్రించే కథా కథనం

31. 'పంజరం కథను ఈ కింది స్టేట్‌మెంట్ చెప్పడానికి రాశానని అంటే అవుననే అంటాను. అయితే ఆ కథలో మధ్య తరగతికి సంబంధించిన రెండు వర్గాలను విశ్లేషించాను.

"ఈ కుటుంబం విచ్ఛిన్నమైతే పిల్లలు మనుషులందరిని ప్రేమించడం ప్రారంభిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఉన్నంతకాలం తల్లిదండ్రులు తమ పిల్లల్ని మాత్రమే ప్రేమిస్తారు. కుటుంబం మొత్తం సమాజాన్ని ప్రేమించే సంస్కృతిని నేర్పితే కుటుంబం విచ్ఛిన్నమయ్యే అవసరమూ లేదు. వ్యక్తిగత కుటుంబంలో పిల్లలు తన వాళ్ళను, తన స్వార్థాన్ని మాత్రమే ప్రేమిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఒక పంజరం.

"జీవితంలో ఇలా ఎంతో అవసరమైన ప్రతి సమయంలో నీవు సాయం చేయగలిగిన స్థాయిలో ఉండీ చేయలేదు. ఎందుకో తెల్సా! నేనంటే నీకున్న చిన్నచూపు. మధ్య తరగతిగా వున్న నువ్వు చెప్పడమే తప్ప దేన్ని ఆచరించని నీ వర్గస్వభావం. క్రమంగా నేను ఎదిగితే

నీలో చూసి ఓర్వలేనితనం. నీ సానుభూతి మీదనే నేను జీవితమంతా బతకాలని కోరుకున్నావు. అసలు సమయాల్లో ఆదుకోని నీ సానుభూతి నా మీద ఆధిక్యత చెలాయించడానికే తప్ప నీది నిజమైన ప్రేమ కాదని తెల్సుకోవడానికి నాకే దశాబ్దాలు పట్టింది." ఈ వాక్యం ఎవరి గురించి? ఇందులో ఏం చెప్పదల్చుకున్నాను?

## కార్మికవర్గాల మధ్య తరగతి, వర్ణాధిక్య మధ్య తరగతి సంస్కృతి వేర్వేరు

ఇండియాలో మధ్య తరగతి రెండు పాయలుగా ఎదుగుతూ వస్తున్నది. వ్యవసాయక సమాజంలో మధ్య తరగతిగా, సంపన్నులుగా వున్న వాళ్లు పారిశ్రామిక, ఆధునిక సమాజంలో కూడా తిరిగి నూతన మధ్య తరగతిగా ఎదిగే వాళ్ల ఒక వైపు... కులవృత్తులు వదిలి ఆధునిక విద్యనందుకొని ఆధునిక సమాజంగా ఎదుగుతున్న శూద్ర కులాల మధ్య తరగతి ఒకవైపు... ఈ రెండో మధ్య తరగతి తమ కృషితో కింది స్థాయి నుండి మధ్య తరగతిగా ఎదుగుతూ లేదా ఎదగకుండానే కొద్దికాలంలోనే స్వయం కృషితో పారిశ్రామిక వేత్తలుగా, సంపన్నులుగా ఎదిగే క్రమాలు కొన్ని సంభవించాయి. వారు సాంప్రదాయకంగా ఎదుగుతూ వస్తున్న మధ్య తరగతికి భిన్నమైన సంస్కృతిని జీవితానుభవాలనుండి ఎదిగారు. వారికి కష్టం తెలుసు, సుఖం తెలుసు. అనేక డక్కామొక్కీలు తిని నిలదొక్కుకున్న వారు. వాళ్లు మొహమాటాల ప్రేమలకు లొంగిపోరు. అందులోగల స్వార్థాన్ని వెంటనే పసిగడతారు. ఆ స్వభావాలు రెండు మధ్య తరగతి పాత్రల మధ్య సంఘర్షణకు గురి చేశాను. తాను ఎంత ఎదిగినా తన బాల్యాన్ని, జీవితాన్ని మరిచిపోలేని మిట్టపెల్లి కొమురయ్య తన జీవితం నుంచి ఇచ్చిన సందేశం. ఇలాంటిదే 'వారసత్వం' కథలో కూడా మరో కోణంలో చూడవచ్చు.

"త్యాగం చేశాననే భావనతో బతకడం, ఉత్తేజంగా జీవించడం గురించి 'దక్షయజ్ఞం', 'రాత్రిపూలు', 'తెల్లబట్ట' కథల్లో భిన్న సందర్భాల్లో, భిన్న కోణాల్లో చర్చించాను. నిరాశ గురించిన సూత్రీకరణ సైకాలజీ, తత్వశాస్త్రం నుండి తీసుకున్న అంశాలు. ఇలా మన అధ్యయనం మన కథల నైపుణ్యాన్ని, గాఢతను పెంచుతాయి. తద్వారా చదువరులకు అనేక విషయాలను కథల ద్వారా తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

## రచయితలు దార్శనికులుగా ఎదగడానికి ఏం చేయాలి?

32. ఇలా నిర్వచనాలు కవుల్లాగా, తత్వవేత్తల్లాగా ఎన్నయినా చెప్పవచ్చు. కవిత్వం కూడా రాసి కథల్లో పెట్టవచ్చు. 'గాడిద' కథలో నేను ఈ ప్రయోగం చేశాను. సంభాషణలో పంచ్ డైలాగుల రూపంలో చక్కని మాటలు చెప్పవచ్చు. కథ చెప్పే క్రమంలో చెపితే ఒకసారి ఇమిడి పోతాయి. ఒకసారి ఇమిడిపోకపోవచ్చు. కనుక ఒకటికి రెండు సార్లు సరిచూసుకుంటే మంచిది.



ఇలా కవిత్వంలో లాగే కథా, నవల, సినిమా ప్రక్రియల్లో తాత్విక నిర్వచనాలు అందించవచ్చు. ఇలా పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలు, సంభాషణల ద్వారా తాత్విక, సామాజిక అంశాలను నిర్వచించడం, చిత్రించడం రామాయణ, మహాభారత కాలం నుండి కొనసాగుతునే వున్నది. గ్రీకు సాహిత్యం, షేక్‌స్పియర్, టాల్‌స్టాయ్, ప్రేమ్‌చంద్, ఠాగూర్ మొదలైన వాళ్ళు మనకు దారి చూపారు. అయితే సందర్భం, సన్నివేశం, పాత్ర స్వభావం కలిసి రావాలి. అందుకనుకూలంగా ఆ పాత్రలను, సన్నివేశాలను, సంఘటనలను నడిపించాలి. సామాజిక శాస్త్రాల, తత్వశాస్త్రాల అధ్యయనం చేయకుండా సామాజిక ఉద్యమాల్లో, సామాజిక పరిణామాల్లో క్రియాశీలంగా పాల్గొనకుండా, పరిశీలించకుండా నేను కూడా నిర్వచనాలు, వ్యాఖ్యానాలు రాస్తానని రచయితలు పూనుకుంటే పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టు అవుతుంది. అధ్యయనం, జీవితానుభవాలు రెండూ జమిలిగా సాగడం ద్వారానే ఆయా తాత్వికాంశాలను, నిర్వచనాలను చెప్పే సాధికారికత అలవడుతుంది. అర్హత వస్తుంది. అలా సామర్థ్యం సాధించుకోకుండా రాసే వారిగురించే ఈ అధ్యాయంలో మొదట చెప్పిన వాక్యాలు కథలో స్టేట్‌మెంట్లు ఇవ్వకూడదు. పాత్రలను వ్యాఖ్యానించకూడదు. కథను చిత్రిస్తూ వెళ్ళాలి అనేవి వర్తిస్తాయి. అలా రచయితలు దానికే ప్రాధాన్యత ఇవ్వడం మంచిది. రచయిత చైతన్యం, పాత్రల చైతన్యం పెరగకుండా దార్శనిక అంశాలను రాయడం మంచిది కాదు. ఆయా విశ్లేషణలు కథా కథనంలో వొదిగిపోవాలి. నగలున్నాయని అన్ని నగలు దిగేసుకున్నట్టుగా వుండకూడదు. నేను చాలా విషయాలు తెలిసినప్పటికీ ఆయా పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు, కథా కథనం అనుసరించి అవసరమైన మేరకే కొంత మేరకే కూరలో ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి నూనెలో వేయించినట్టుగా కాస్తకాస్త వడ్డించాను. మొత్తం తెలిసిందంతా పెడితే అది మహా నవలలుగా, మహాభారతం, గ్రీక్ నాటకాలు, షేక్‌స్పియర్ నాటకాల వలే వివరంగా బహుముఖీనంగా చిత్రించాల్సి వుంటుంది.

ఒక కవిత చదివినట్టు నీవే కవిత రాసి కథలో పెట్టవచ్చు. అయితే 10-12 లైన్లు మించకుండా వుంటే కథ నడిచినట్టుగా వుంటుంది. లేకపోతే కథ డైవర్ట్ అయినట్టు అనిపిస్తుంది. ఒక పాట, ఒక వేమన సూక్తి, ఒక కవిత, ఒక తాత్విక వాక్యం ఇలా ఏదైనా కథలో ఎక్కడైనా ఇమడ్చవచ్చు. కథను ఒక ప్రవాహ శీలంగా రాసే క్రమంలోనే అది ఇమిడి పోవాలి. అప్పుడే దాని అందం.

## ముగింపులు ఎన్నో రకాలు

ముగింపులు ఎన్నో రకాలు. కథ ప్రారంభానికి, ముగింపుకు మధ్య కథ నడుస్తుంది. కథకు, ముగింపుకు మధ్య సంబంధం ఉండాలి. కొందరు సాంప్రదాయకంగా పాఠకులు

ఊహించే విధంగా, వాస్తవికంగా ముగింపులు ఇస్తారు. దీన్ని క్లోజ్ ఎండ్ ముగింపులు అంటారు. మరికొందరు ఊహించని ముగింపులు ఇస్తారు. ఆ ముగింపుల వల్ల కథ స్వభావం మొత్తం మారిపోతుంది. మరికొందరు వాస్తవికతతో సంబంధం లేకుండా ఊహాతీతమైన ముగింపులు ఇస్తారు. వీటిని కొసమెరుపు ముగింపులు అంటారు. కొసమెరుపు కథలకు చాలా పరిమితి ఉంటుందనిపించింది. రెండవ సారి ఆ కథను చదవ బుద్ధి కాదు. కథంతా ముగింపులో ఏం వుంటుందా అని కథలోని మిగతా అంశాలను గమనించకుండా వేగంగా చదువుతాం. ముగింపులో చెప్పాల్సింది ప్రారంభంలోనే చెపితే ఎలా వుంటుందని కొన్ని ప్రయోగాలు చేశాను. దాంతో మరో కథకు మరో కొత్త ముగింపు ఇవ్వాల్సి వచ్చింది. దాంతో ముగింపులు చాలా కష్టమయ్యాయి.

ముగింపు కథ సారాంశాన్ని తెలుపుతుంది. ముగింపు రిజల్టుని తెలుపుతుంది. కథా క్రమం అంతా ముగింపుతో ముక్తాయింపుకొస్తుంది. ముగింపుతో కథ లక్ష్యాన్ని, గమ్యాన్ని చేరుతుంది. ముగింపు రచయిత టోన్, దృక్పథం, కొసమెరుపు తెలుపుతుంది. జలపాతంలా సాగే మహా ప్రసంగంలో చివరి వాక్యాలు మరింత ఉత్తేజపూరితంగా ముగించాలి. అలానే కథలో చివరి పేరా శక్తివంతంగా ముగించాలి. కథ ముగుస్తుంది. కథకు ముగింపు పాఠకులకు ప్రారంభం. చదువరిలో కథ, కథాక్రమం, దాని స్పందనలు అప్పుడే మొదలవుతాయి. అందుకే 'తెల్లబట్ట' కథలో ముగ్గురు మహిళలకు రెండో పెళ్ళి అవసరమైన ముగింపు చేరాక వారిని పెళ్ళి చేసుకొమ్మని లేఖలో కోరడంతో కథ ముగుస్తుంది. నిజంగానే కోరాను. కానీ వాళ్లు వారిని పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి కాని నవవధువులనే పెళ్ళి చేసుకొన్నారు. వారిని పెళ్ళి చేసుకుంటే బాగుంటుంది అని విడాకులై రెండో పెళ్ళి అవసరమైన మగవారికి చెప్పిన సూచన అలా జరిగితే బాగుంటుందనే ఆశ, దృక్పథం.

## కొసమెరుపు కథలు

కొందరు కొసమెరుపు ముగింపు ఇస్తారు. కొసమెరుపు ముగింపుతో మొత్తం కథంతా కరెంట్‌షాక్ కొట్టినట్టుగా మారుతుంది. అంతదాకా చదివింది కొత్త కోణంలో విస్ఫోటనం చెందుతుంది. కొసమెరుపు కోసం కథంతా ఆసక్తి కరంగా చదువుతారు. కొసమెరుపుతో మెరుపు మెరుస్తుంది. అందుకోసం కథా క్రమం ఊహించని మలుపులు తిరుగుతూ వస్తుంది. మరింత ఉన్నతమైన మలుపుతో ముగింపు జరుగుతుంది. పాఠకుడు ఊహించలేని ముగింపు అయినప్పుడే కొసమెరుపు మెరుపు తీగవలె మెరుస్తుంది. అది కథకు తగినట్టుగానే, అబ్బినట్టుగానే సహజంగా వుండాలి. కథ పాఠకుల ఊహకు అందాలి. కానీ స్పష్టాస్పష్టంగా వుండాలి. ముగింపు పాఠకుల ఊహకు అందకుండా వుంటే మంచిది. కనీసం ముగింపు పేరా దాకా ఊహకు అందకుండా సాగితే మంచిది.



## కొసమెరుపులు వుండాలనుకున్నప్పుడు

కొసమెరుపులు అలాంటి జీవితాలకు వుండాలనుకుంటే కథ ప్రెజెంటేషనే మొత్తంగా మారిపోతుంది. అప్పుడది విషాదాన్ని ముగింపుగా చెప్పగలుగుతుందో లేదో! గ్రీకు విషాంత నాటకాలు కానీ విషాదాంత నవలలు, సినిమాలు గానీ ముగింపులో వుండే విషాదాన్ని మధ్యలోకి తెచ్చి కొత్త ముగింపులు, కొసమెరుపులు ఇవ్వడం సాధ్యమేనా అనే అంశాన్ని కొన్ని ప్రయోగాలు చేసి చూస్తే తెలుస్తుంది.

## అన్ని కథలకు ఊహించని మలుపులు సాధ్యమా?

కథలో సామాజిక చరిత్ర చిత్రించేటప్పుడు ఊహించని మలుపులు సాధ్యమా? కొన్నిసార్లు సాధ్యం కాకపోవచ్చు. అయినా ముగింపు ఆకర్షణీయంగా వుండాలి. కథ పూర్తయ్యాక ఏదో కొత్త విషయం, చక్కని విషయం తెలుసుకున్నామనే తృప్తి, ఉత్సాహం పాఠకుల్లో కలగాలి. కొసమెరుపు కోసం రాసే కథల వల్ల ఒక వేగం పెరుగుతుంది. ఎంత వేగంగా కథ ముందుకు సాగుతుందంటే రోడ్డు మీద వేగంగా పోతున్న వాడు క్షణం కూడా షాపుల వైపు, ఫుట్‌పాత్‌ల వైపు బ్యానర్లు, పోస్టర్ల వైపు చూడకుండా వేగంగా లక్ష్యాన్ని, గమ్యాన్ని చేరుకుంటాడు. ప్రయాణంలో కనపడేవన్నీ సరిగ్గా గమనించడు. తన వేగానికి అనుకూలంగా మాత్రమే ఊహిస్తూ ముందు చూపుతో వెళుతుంటాడు. అందువల్ల కథలోని అనేక అంశాల పట్ల దృష్టి నిలుపలేడు. ముగింపు కోసమే పరుగు.

ముగింపు చదివిన తరువాత ఆ కథను రెండవ సారి చదవడానికి ఆసక్తి వుండదు. ఎందుకంటే అది కొసమెరుపు ముగింపు గమ్యం కోసమే చకచకా నడుస్తూ ఆకర్షించింది. అందువల్ల కథలో చెప్పదలుచుకున్న మిగతా అంశాలన్నీ అప్రధానమై ముగింపు ఒక్కటే ప్రధానమై కూర్చుంటుంది. దానివల్ల కథలోని అంశాల ద్వారా పాఠకులకు అందాల్సింది సరిగ్గా అందదు.

హరికథలో కథకుడు చెప్పిన కథనే చెపుతాడు. అందరికీ తెలిసిన సుపరిచితమైన కథనే చెపుతాడు. మధ్య మధ్యలో హాస్యం పండిస్తాడు. పిట్ట కథలు చెపుతాడు. సుపరిచితమైన కథ అయినప్పటికీ హరికథను ఆసక్తిగా ఎందుకు వింటుంటారు? రామాయణం, భారతం, భగవద్గీత, బుద్ధ బోధనలు, క్రీస్తు బోధనలు తెలిసినవే మళ్ళీ మళ్ళీ ఎందుకు వింటుంటారు? అలా కథ ముగింపు తెలిసినప్పటికీ కథ అంతా తెలిసినప్పటికీ ఆసక్తిగా పాఠకుడు మళ్ళీ మళ్ళీ చదివే విధంగా కథను ఎందుకు రాయకూడదు? ఈ ప్రశ్న కొసమెరుపు కథల్ని చదివిం తర్వాత కలిగింది. ఇది కొసమెరుపు యివ్వడం సాధ్యం కాని దశకు కథ మలుపు తిరిగిన తరువాత కలిగిన అవగాహన.

కొసమెరుపులో చెప్పదల్చుకున్నదేమిటో కథ మధ్యలో గానీ, ప్రారంభంలో గానీ

ఎందుకు చెప్పకూడదు అన్పించింది. అలాంటి ప్రయోగాలు చేసి కథలు రాశాను. ముగింపును కథ మధ్యలోకి తెచ్చి కథను నడిపించాను. కథకు మళ్లీ ఏదో ఒక ముగింపు కావాలి. అది కూడా ఆసక్తికరంగా వుండాలి. కథను చదివించాలి. దాంతో ముగింపు అనేది నా కథలకు చాలా కష్టమైంది. ముగింపులివ్వడం అనేది ప్రతిసారీ అవస్థగా మారింది. అంటే కథకు రెండు ముగింపులు ప్రతి కథలో చేరాయన్న మాట. ఒక ముగింపు కథ మధ్యలో వుంటుంది. అది కథలో భాగంగా కథ నడుస్తూ అది ముగింపు అన్పించదు, ఆకర్షించదు. రెండో ముగింపు మధ్యలో ఇచ్చిన ముగింపుకు తరువాయి భాగంగాను భిన్నంగాను కొనసాగించాలి. కొసమెరుపు ఉండాలనే యావ నుండి బయట పడ్డాక కథలో ఎన్ని మార్పులు చేయడానికైనా స్వేచ్ఛ లభిస్తుంది.

కొసమెరుపు కథ శిల్పం మీద కథా వస్తువును నిలబెట్టినట్టుగా సాగుతుంది. దానివల్ల కథలో మార్పులు, చేర్పులు చేస్తే కథంతా మారిపోతుంది. కొసమెరుపు అక్కర్లేదు అనుకున్నాక కథలో మార్పులు చేసే స్వేచ్ఛ పెరిగింది. మార్పులకనువుగా కొత్త ముగింపులు ఇవ్వడం జరిగింది. అలా 'మెరుగు', 'తెల్లబట్ట', 'చెలిమ', 'వారసత్వం' కథల్లో ప్రయోగాలు చేశాను.

'వరుసలు' కథలో పెళ్ళికి వెళ్ళి ఇంటికి రావడంతో ముగుస్తుంది. ముగింపు ఆకర్షణీయంగా కనపడలేదు. ఒక వాక్యం కొత్తగా రాశాను. ముగింపులో చమత్కారం వచ్చింది.

"పెళ్ళి కాకముందు సరస్వతికి నీకు ఏదైనా సంబంధం వుండేదా?" అంటూ నిలదీసింది మా ఆవిడ.

నాకు నవ్వు వచ్చింది. ఇన్నేళ్ల సంసారం తర్వాత ఆ మాట అడగడం నన్ను బాధించింది." ఇక్కడతో వాస్తవ జీవితం ముగిసింది. కథకు ఈ ముగింపు చాల లేదు. దాంతో ఈ రెండు వాక్యాలు కొత్తగా జత చేశాను.

"నీక్కూడా నీ మేనబావలతో అలాంటి సంబంధాలు వుండేవా? ఎందుకట్లా అనుమాన పడతావు? అన్నాను.

అంతే మా ఆవిడ వరస మారింది. మరుసటి రోజు ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది."

ఆమె పుట్టింటికి వెళ్ళిపోయిన కారణం కథ నడకలోనే నిక్షిప్తమై వుంది. సరస్వతి స్వేచ్ఛగా మాట్లాడ్డం నుండే ఆమెలో అలాంటి అనుమానాలు కలిగాయి. కనుక దాని పర్యవసానంగా ఆమె పుట్టింటికి వెళ్ళిపోయిందనే మాట సహజంగానే అతుక్కుపోయింది.



కథ, నవల ముగింపు కథకు బలం చేకూర్చాలి. చీరకు అంచులాగా ప్రారంభం, ముగింపులు గట్టిగా, అందంగా వుండాలి. బూరెలు తియ్యగా వుంటాయి. లోపల పప్పు, బెల్లం లేదా చక్కెరతో చేసిన పదార్థం వుంటుంది. పైన రెండు పొరలు గోధుమ పిండితో చేసిన రొట్టె వుంటుంది. రొట్టెలో తీపి పదార్థం పెట్టి బూరెలు చేస్తారు. అలాగే కథ ప్రారంభం, ముగింపు వుంటుంది. కథ ముగింపు ట్విస్ట్‌గా వుండవచ్చు. అది కథకు అతికినట్టు కూడా వుండాలి. ఎమోషనల్‌గా, ఇంటలెక్చువల్‌గా కూడా వుండాలి. అంతదాకా సాగిన కథ సృష్టించిన సంవేదనలకు ఒక చక్కని వేదికగా వుండాలి.

ముగింపులు పాఠకులు ఊహించుకుంటారు. జీవితాన్ని రాస్తాను ముగింపు అనవసరం అని అనుకోవడం సరైంది కాదు. పాఠకులు తామే కథ ముగించాలని అనుకోరు. మనం ఇచ్చిన ముగింపులే చదవాలనుకుంటారు. చదివిన తరువాత వారికొక ఆలోచన కలుగుతుంది. దాన్నుంచి ముగింపు ఇంకా ఇలా వుంటే బాగుంటుందనుకుంటారు. బాగాలేదనుకుంటారు. చాలా బాగుందనుకుంటారు. అందువల్ల పాఠకులకు అదనపు ఆలోచన కలగడానికి ముగింపులివ్వడం చాలా అవసరం.

కథ ప్రారంభించడం, నడపడం సులభం. ముందే చెప్పినట్టు తొలి దశలో రాతలో ఐదారు పేజీలు మించకుండా రాస్తే కథ తొందరగా ముగింపులోకి వస్తుంది. అయినా కథ ముగింపు ఇవ్వడానికి కష్టపడాల్సి వుంటుంది. ముఖ్యంగా జీవితానికి దగ్గరైన,

వాస్తవికమైన కథ అయినప్పుడు ముగింపు ఇవ్వడం పట్ల ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సి వుంటుంది. కథంతా ఏమి హామి యిస్తున్నదో దాన్ని అనుసరించి ముగింపు వుండాలి. ఒక సమస్యను లేవనెత్తి కథగా మలిచినప్పుడు దానికి పరిష్కారం కూడా ముగింపులో వుండాలి. ప్రేమ, సామాజిక న్యాయం, సామాజిక మార్పు, స్నేహం, సాహసం, కరుణ, వాత్సల్యం, ఉద్యమం అనే అంశాలను తీసుకొని కథ రాసినప్పుడు మేధో పరమైన, సంవేదనల పరమైన ఆలోచన, హృదయం రెంటిని సంతృప్తి పరిచే విధంగా ముగింపు వుండాలి.

## ఆలోచన, స్పందనల మధ్య తేడా

ఆలోచన వివేచనకు సంబంధించినది. స్పందనలు హృదయానికి సంబంధించినవి. స్పందనల ద్వారా వివేచనను పాఠకులు, ప్రేక్షకులు పొందాలి. అది సాహిత్య లక్ష్యం. సాహిత్య ప్రయోజనం. అలా స్పందనలను కాకుండా మేధో పరమైన ముగింపు ఇస్తే చదువరులు తగ్గిపోతారు. మాకేదో టీచర్‌లాగా బోధ చేస్తున్నాడనుకునే అవకాశం వుంటుంది. అందువల్ల సంవేదన రూపంలోనే మేధో పరమైన అంశాలను అంతస్సారంగా నింపాలి. అందువల్ల క్లయిమాక్స్‌లో తప్పనిసరిగా ఎమోషన్‌ను కలిగించాలి. అది

తార్కికంగా కూడా వుండాలి. 'సదువు', 'తెల్లబట్ట', 'మెరుగు', 'స్మృతి', 'నాగశాల', 'వేపచెట్టు', 'కామన్‌వెల్త్', 'అయిదవవాడు' కథల్లో నా చేతనైన మేరకు వీటిని చిత్రించానే అని అనుకుంటున్నారు.

## ముగింపు రచయితకు పరీక్ష

ముగింపు రచయితకు లిట్మస్ టెస్ట్ వంటిది. రచయితను పట్టి ఇస్తుంది. కథంతా రచయిత ఎక్కడ దాక్కున్నా పట్టుకోలేకపోవచ్చు. కానీ ముగింపులో రచయిత దొరికిపోతాడు. అతడేమిటో తెలిసిపోతాడు. నీ ముగింపులు సహజంగా పాత్రల ఎదుగుదల క్రమాన్ని అనుసరించి ఎదుగుతూ వస్తుంది.

వీధుల్లో తిరిగే బాలల గురించి రాసినప్పుడు దానికి ముగింపు ఎలా ఇవ్వాలి? అనాథ పిల్లల గురించి రాసినప్పుడు ముగింపు ఎలా ఇవ్వాలి? కష్టాల గురించి రాసినప్పుడు ముగింపు ఎలా వుండాలి? ఇలాంటి సందర్భాల్లో ఇచ్చే ముగింపులు రచయిత దృక్పథాన్ని తెలుపుతాయి. సాధారణంగా ముగింపులన్నీ రచయిత దృక్పథాన్ని తెలుపుతుంటాయి.

నేను కథల ముగింపుల్లో చాలా కష్టపడ్డాను. ముగింపు ఒక పట్టాన తోచేది కాదు. ముగింపు, కథ పేరు రెండూ లింకప్ అయి వుంటాయి. ఒకటికొకటి సంబంధం కలిగి వుంటాయి. కథ పేరు ననుసరించి ముగింపు, ముగింపు ననుసరించి కథ పేరు ఖాయం చేయడం జరుగుతూ వుంటుంది. అందువల్ల నాకు కథ పేరు, కథ ముగింపు రెండూ సమస్యగానే వుండేవి. కథంతా రాస్తాము. అది జీవితం. జీవితం చావుతో ముగుస్తుంది.

కథ చావుతో ముగియనవసరం లేదు. జీవితంలోని ఒక కోణాన్ని, అంశాన్ని కథా వస్తువుగా తీసుకుంటాము. జీవితం సాగుతూనే వుంటుంది కనుక కథకు ముగింపు ఎక్కడ పెట్టాలో ఒక పట్టాన తోచదు. వాక్యానికి ఫుల్‌స్టాప్ (.) పెట్టడం చాలా సులభం. కథకు ముగింపు ఇవ్వడం అంత సులభం కాదు.

పిల్లల కథల్లో ముగింపులు సులభంగా ఇవ్వొచ్చు. ఒక నీతిని, మానవతా విలువలను చెప్పడానికి, బేతాళ కథల్లాగా ఒక సమస్యను విప్పడానికి, పరిష్కరించడానికి ముగింపులు స్పష్టంగా వుంటాయి. సినిమాల్లో ముగింపులు స్పష్టంగా వుంటాయి. ఒక హీరో, హీరోయిన్, విలన్, తల్లిదండ్రులు, సహాయ పాత్రలు, సహాయ విలన్‌లు కలిసి ముగింపులో ఓడిపోవడమో, గెలవడమో వుంటుంది. ప్రేమ విఫలమైనప్పుడు అది విషాదాంత నాటకం, సినిమా అవుతుంది. సినిమాల్లో కథలు ఒకే రకంగా ముగింపులను కలిగి వుంటాయి. నవలల్లో కూడా, సినిమాల్లోలాగా ఒకే రకమైన ముగింపులను కలిగి వుంటాయి.

కథ అలా కాదు. కథ సినిమాలాగా, నవలలాగా ఒక సమగ్ర జీవితాన్ని మొత్తం



తీసుకోదు. తీసుకున్న ఒక అంశానికే ఏదో ఒక ముగింపు ఇవ్వాలి. అది ఆకర్షణీయంగా వుండాలి. పాఠకులకు, పాత్రలకు, సజెస్టివ్‌గా వుండాలి. కుతూహలం కలిగించేదిగా వుండాలి. కథా క్రమం సాగినదాని ప్రకారంగా వుండాలి. పంచ్ వుండాలి. చీరలోని గట్టి అంచులాగా గట్టిగా వుండాలి. కుండకు అంచులేకపోతే పగిలిపోతుంది. కుండ సన్నగా వున్నప్పటికీ కుండ అంచు గట్టిగా వున్నట్టుగా కథ మొదలు, చివర వుండాలి.

అందువల్ల ముగింపు ముందే చూచాయగా ఆలోచించుకొని కథ ప్రారంభిస్తే మంచిది. అయితే చాలాసార్లు ముందనుకున్న ముగింపు మార్చాల్సి వస్తుంది. కథ మనసులో అనుకోవడం వేరు. రాసే క్రమంలో వ్యక్తిత్వాలు, పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు ఎదుగుతూ పోవడం వేరు. అవి ఎదిగిన క్రమంలోనే ముగింపులు ఇవ్వాల్సి వుంటుంది. అందువల్ల తొలుత అనుకున్న ముగింపులో మార్పులొస్తాయి.

చాలాసార్లు ఫలానా అంశం చెప్పాలని ఉత్సాహంతో కథను ప్రారంభిస్తారు. అది చక్కగా కథలోకి వచ్చేస్తుంది. ఇక ముగింపు ఇచ్చేటప్పుడు తాను సృష్టించిన కథ అనే పద్మవ్యూహంలోంచి చాకచక్యంగా ముగింపు ఇచ్చి వెనక్కి రావాలి. కథ పద్మవ్యూహంలా బంధిస్తుంది. దాని ఛేదించుకొని రావాలి. పద్మవ్యూహంలో ఎవరినైనా చంపేసి బయటకు రావచ్చు. కథలో చంపకుండా అందర్నీ మరింత బాగా బతికిస్తూ ఎలివేట్ చేస్తూ బయటకు రావాలి. అదీ యుద్ధంలోని పద్మవ్యూహానికి, కథలోని పద్మవ్యూహానికి మధ్య ప్రధానమైన తేడా.

'పాతచీర' కథను మానవ సంబంధాలు ఉమ్మడి కుటుంబాల నుండి వ్యక్తి కుటుంబాలుగా మారి తరాల అంతరంతో సంబంధాలు ఎండిపోయి అల్లుళ్లు, కూతుళ్లు, వియ్యంకులు వంటి వారితో కొత్త వారితో కొత్త సంబంధాలు ఏర్పడ్డం జరిగే క్రమంలో పాత చుట్టాలు మెల్లిమెల్లిగా దూరం కావడం ఎలా జరుగుతూ వస్తుందో అనేది కథా కథాంశం. ముగింపు ఇలా యివ్వడం జరిగింది.

## 'పాతచీర' ముగింపు

"ఎక్కడికో పోయిన లింగయ్య వచ్చి పాత సామాను గుట్ట లేకపోవడం చూసి అవాక్కయ్యాడు.

"ఈ సామాను ఏమయిందే" అంటూ ఒక్కసారిగా అరిచాడు లింగయ్య.

తన అనుభూతులు, అనుభవాలు, జ్ఞాపకాలన్నీ ఎవరో ఊడ్చి పారేసినట్టు అన్పించింది."

ఇది క్లయిమాక్స్. అంటే కథ ముగింపుకు ముందు. ఆ తరువాత

"మూడు నెలల దాకా లావణ్య ఇక్కడనే వుంటది కదా! ఇల్లు సాల్తలేదు. మీరు ఇంటెనక రేకుల కింద పడుకోన్రి. మీ కోసం వచ్చే చుట్టాలు బాలెంత వున్నకాడికస్తే ఎట్లా?" అంది కళావతి.

ఎంతో నొచ్చుకుంటూ చేసేది లేక తమ పాతబట్టలు, మంచం తీసుకొని ఇంటెనుకకు నడిచింది రాజేశ్వరమ్మ.

అత్తకే గతి లేదు. ఇంటెనకకు చిన్నగదిలోకి వెళ్ళాల్సి వచ్చింది. ఇక రాజేశ్వరమ్మ మేనమామ 80 ఏళ్ల వీరయ్య మామకు హృదయంలో, ఇంటిలో స్థానం ఎక్కడ వుంటుంది? దీన్ని పంచ్ వాక్యంలో చెప్పాలి.

"పోతనే అమ్మాయీ!" అంటూ వీరయ్య మామ వెళ్ళిపోయాడు. లావణ్య బాలింత మంచం ముందుగదిలోకి మారింది. లావణ్య రాజేశ్వరమ్మ మనమరాలు, కళావతి కూతురు. ఇలా పాత సంబంధాలు ఎండిపోవడం అనే బాధాకరమైన అంశాన్ని ఒకే ఒక్క మాటతో "పోతనే అమ్మాయీ!" అని చెప్పి ముగించాను. ఈ ముగింపు కోసం మూడు రోజులు ఆలోచించాల్సి వచ్చింది. 'పాతచీర' అనే కథ పేరుకు, ముగింపు మధ్య సంబంధం చక్కగా కుదిరిందనిపించింది.

## 'ప్రేమధార' ముగింపు

'ప్రేమధార' కథలో హృదయ విదారకమైన జీవితం పట్ల ముగింపు ఎలా ఇవ్వాలో అర్థం కాలేదు. కథ రాసినంతసేపు, చదివినంత సేపు కన్నీళ్ళే కన్నీళ్లు. ఎందుకంటే అవి నాకు స్వయంగా తెలిసిన పాత్రలు. తెలిసిన జీవితాలు. నా హృదయంలోని బాధనే సువర్ణ బాధగా క్లయిమాక్స్, ముగింపు ఇచ్చాను.

"రోజులు గడుస్తున్నాయి.

హరిబాబు తన కోసం రాకూడదనుకుంటూనే హరిబాబు కోసం ఎదురు చూస్తూ వుంది సువర్ణ. అతని పేరు మీద బతుకాలని అడుగుదామనుకోవడం వల్ల ఇలా అయిందేమోననుకుంది సువర్ణ. ఇక అడగకూడదు. అడిగి నిరాశ పడకూడదు. అతన్నుంచి ఏమీ ఆశించకూడదు. ఈ మధురమైన జ్ఞాపకాలు ఒక కమ్మని కలగా ఇలాగే మిగిలిపోనీ. అతను రావద్దు. తన కలలు, ఆశలు చెదిరిపోవద్దు అని మనస్సు నిబ్బరం చేసుకొంది సువర్ణ. అయినా సువర్ణ హరిబాబు కోసం ఎదురు చూస్తూనే వుంది. అతని పట్ల ఆమె ప్రేమధార ప్రవహిస్తూనే వుంది కన్నీరై, సెలయేరై....

... ఉదయం పిల్లలు లేవకముందు అమ్మా! నాన్నా! నా బతుకు ఇలా ఎందుకు అయిపోయింది. కట్నం ఇవ్వలేని నిస్సహాయతకు జీవితాలు ఇలా బలికావాల్సిందేనా?



బట్టల మిల్లుమూసేసిన యజమాని బాగానే వున్నాడు. అతన్ని ఎవరూ ఏమీ చేయలేక పోయారు. నాన్నా! అమ్మా! నన్నెందుకు కన్నారే అని కుమిలి కుమిలి ఏడుస్తూనే వుంది.

భాగ్య రేఖ అప్పుడప్పుడు వచ్చి కన్నీరు తుడుస్తూ వుంటుంది.

సువర్ణను ఓదార్చడానికి భాగ్యరేఖ ఒక్కరైనా వున్నారు. భాగ్యరేఖను ఓదార్చడానికి ఎవరున్నారు? ఆమె కన్నీరు ఇంకిపోయింది. వాళ్ళిద్దరూ అక్కచెల్లెలని లోకానికి తెలియదు. తెలియకుండా బతుకుతున్నారు. తెలిస్తే ఎన్నో సమస్యలు... సువర్ణ కల నిజం కావాలని భాగ్యరేఖ ఆశ. నిరాశ అవుతుందని తెలిసినా వదులుకోలేని ఆశతో సువర్ణ..."

ఇంతకన్నా ముగింపు రాయలేకపోయాను. నిజానికి ఈ కథలో భాగ్యరేఖ, సువర్ణ రెండూ ఒకే క్రమానికి సంబంధించిన పాత్రలు. సువర్ణ జీవితం భాగ్యరేఖ గత జీవితమే. ఇది కథలో ఎక్కడా వుండదు. ఒకే పాత్రకు సంబంధించిన ఇతర విషయాలు చెప్పాలనుకున్నప్పుడు కొన్ని ఇతర పాత్రలను సృష్టించాల్సి వస్తుంది. అలా భాగ్యరేఖ, సువర్ణ ఒకే అంశానికి సంబంధించిన రెండు పాత్రలు.

"నా బతుకు ఇలా ఎందుకయిపోయింది" అని గతాన్ని గుర్తు చేసుకొని బాధపడడం అంతా క్లయిమాక్స్. చివరి పేరా 'తెలిసినా వదులుకోలేని ఆశతో సువర్ణ' అనే పేరా ముగింపు. పొరపాటు చేశానని సువర్ణ గ్రహింపు.

## 'మమతలు' కథలో ముగింపు

'మమతలు' కథలో చిన్ననాటి స్నేహితురాలు సరవ్వను తలుచుకుంటూ పెళ్ళి చేసుకోకపోవడం, చేసుకున్నాక భార్య పద్మను నిర్లక్ష్యం చేస్తుంటాడు కాంతయ్య. కథంతా సాగిన తరువాత ముగింపు ఎలా ఇవ్వాలి? కొందరు సరవ్వ ఇంట్లో భర్తతో సంఘర్షణ పెరిగినట్టు ఆమెపై అనుమానపడ్డట్టు చిత్రిస్తారు. కథను ఎటో తీసుకుపోతారు. ఎన్నో మలుపు తిప్పుతారు. అపార్థాలు వాటి తొలగింపుతో సినిమా ముగిసినట్టు కథ ముగియవచ్చు. అది వారి అవగాహన. నా అవగాహన, లక్ష్యం వేరు. నేను వారి స్నేహాన్ని మరింత దగ్గర చేసాను. వారి ప్రేమ, అభివ్యక్తి రూపం మారింది.

"అక్క ఎంత బాగా రాసిందో చూడండి. ఇక నుండి నా పేరు మీద మీరు సంపాదకీయాలు రాయకండి. మీర్రాయాలనుకుంటే మీకిష్టమైన కలం పేరుతో వ్యాసంగా రాయండి. ఎడిట్ చేసి అచ్చేస్తాను..."

ఆ ఉత్తరం గబగబా చదివి లోలోన నవ్వుకుంటూ పద్మ కళ్లల్లోకి చిలిపిగా చూస్తూ కాంతయ్య "అబ్బో అక్క మీద ఎంత ప్రేమో! ఇదే రేషం అధ్యయనంలోనూ చూపిస్తే ఎదగడానికి ఎంతో కాలం పట్టదు" అంటూ ఆ ఉత్తరాన్ని తిరిగి ఇచ్చివేస్తూ పద్మ చేతిని

ముద్దుపెట్టుకోబోయాడు. పద్మ చురచురా చూస్తూ కసురుకుంది.

"వేళాపాళా లేకుండా ముద్దుల ముసుగులో ఈ మగపెత్తనమేమిటి? సరక్కా నేనూ కల్సి ఈ మీ మగ పెత్తనంపై యుద్ధం చేస్తాం. నిస్వార్థ ప్రేమ ముందు అధికారం, స్వార్థం, కులం, మతం అన్నీ వట్టివే అని నిరూపిస్తాం. మగ మహాశయా! దయచేసి రాజకీయాల కోసం మానవ సంబంధాల్సి బలిపెట్టకండి. ఇదే నేను రెండో సంచికలో రాసే సంపాదకీయం శీర్షిక పేరు."

కాంతయ్య హతాశుడయ్యాడు. పద్మ, తానూ కలిసి సరూను సాధిద్దామనుకుంటే తన అంచనా తిరగబడింది. ఇప్పుడు వాళ్ళిద్దరు ఒక్కటై ఇక నుండి తనను సాధిస్తారన్నమాట... అనుకుంటూ మూతి ముడుచుకుని తల పట్టుకున్నాడు కాంతయ్య." అంటూ ముగించాను.

కథ మలుపు తిరిగినట్టే. సరవ్వను అగ్రకులస్తురాలని వేరు చేయాలని కాంతయ్య అనుకుంటే తన భార్య, సరవ్వ కలిసి తనను వేరు చేశారు. ఇంతకీ పద్మపై సరవ్వ చూపే ప్రేమంతా కాంతయ్య మీద చూపే ప్రేమే కదా! అది రూపం మారింది. సమాజం అంగీకరించే రూపానికి సరవ్వ ప్రేమ మారిన క్రమం చిత్రించాను. కులమతాలకు అతీతంగా, పదవులు, సంపదకు అతీతంగా ప్రేమ, స్నేహం కొనసాగుతుంది అనే అవగాహనతో ముగుస్తుంది. ఇలా కథ ప్రారంభంలో ఇచ్చిన నిర్వచనానికి భిన్నమైన అవగాహనకు చేరడంతో కథ పూర్తవుతుంది. దీన్ని థీమ్ ఇతివృత్తం, లక్ష్యాన్ని చేరుకునే పరిణామ శీలత అనవచ్చు.

## 'అయిదవవాడు' కథ ముగింపు

'అయిదవవాడు' కథలో ముగింపు విషాదానందాలు కలగలసిన ముగింపుగా వచ్చింది.

"దయానంద్ ఎటో చూస్తున్నాడు. సుమలత కళ్లు వర్షిస్తున్నాయి. లోకం ఏమైనా అననీ... తాను రత్నాకర్ నుంచి విడాకులు తీసుకుంటుంది. తన ఆశయాల కోసం పునరంకితమవుతుంది."

"డాడీ! మమ్మీని పెళ్లి చేసుకోవా?" బేలగా అడిగింది భవ్య.

"పాపా! దూరంగా వుండి స్నేహంగా సహకరించుకోవడంలో వుండే పవిత్రతను సమాజం హర్షిస్తుంది. కలిసి జీవిస్తే అదే సమాజం ఈసడిస్తుంది.... ఈ విలువలు మారే దాకా సహనం తప్పదు. కాలమే సమస్యను పరిష్కరిస్తుంది. "

"అంకుల్ ఇప్పుడు మమ్మీ – మేమూ లక్నో వచ్చేస్తాం."



"అప్పుడు నా ఇంట్లో నేను మళ్ళీ పంచముడిని అవుతానేమో!" నవ్వాడు దయానంద్.
"అదేమీ నాకు తెలియదు అంకుల్. కానీ మమ్మీకి మీరు పంచప్రాణాలు"

"తొందరెందుకు గానీ ఇంకా మూడ్రోజులుంటారుగా! ఈ మూడ్రోజుల్లో పరస్పరం అవగాహన పెరుగుతుంది. అప్పుడు ప్రస్తుత నిర్ణయాలను సమీక్షించుకుందాం." దయానంద్ మాటలతో సుమలత కళ్లు మెరిసాయి. పిల్లల భవిష్యత్తుపై చింత వీడింది.

ఆ రాత్రి యిల్లు వదిలిన సుమలత మళ్ళీ తిరిగి రాలేదు. తన కోసం వెతకవద్దని ఆరు నెలల తరువాత తానే ఉత్తరం రాస్తానని ఉత్తరం రాసి పెట్టిపోయింది. ఎక్కడికి పోయిందో తెలియదు. నాలుగో రోజున కన్నీళ్లతో పిల్లలు దయానంద్ వెంట లక్నో ప్రయాణమయ్యారు."

ఈ కథలో ముగింపులు కొన్ని ఎలా వుంటాయో కూడా 'మా మమ్మీని మీరు పెళ్ళి చేసుకోండి' అని అడగడంలో సూచించాను. కానీ అలాంటి ముగింపుల వల్ల కథ ఉదాత్తత దెబ్బతింటుంది. స్వార్థమే కనపడుతుంది. నిజానికి సుమలత సామాజిక జీవి. అందువల్ల ఆమె తిరిగి సమాజానికి అంకితం కావాలనుకుంటున్నది. అందుకు పిల్లల పెంపకం ఒక ప్రధాన బాధ్యతగా నిలబడింది. ఆ బాధ్యత దయానంద్ తీసుకోవడంతో ఆమె సమాజానికి అంకితం కావడానికి వుండే అడ్డంకులు తొలగిపోయాయి. అందువల్ల ఆమె ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. సమాజంలో కలిసిపోయింది. ఈ కథ శరత్‌బాబు కథలాగా సాగిందని అన్నారు. అయితే వాళ్లు విమర్శ కోసం అన్నారు. సామాజిక కర్తవ్యం చాలా ఉదాత్తమైనది. అందువల్ల వారి జీవితాలను చిత్రించేటప్పుడు చాలా ఉదాత్తంగా చిత్రించాలి. ముగింపులు కూడా ఉదాత్తంగా వుండాలి. అదే నేను చేసిన ప్రయత్నం.

## 'వారసత్వం' ముగింపు

'వారసత్వం' కథలో పల్లెకు తనను ఇవ్వడం కిరణ్మయికి నచ్చలేదు. ఎంగేజ్‌మెంట్ రేపనగా సంబంధం కాన్సిల్ అని చెప్పి రమ్మంటుంది. సరే ఎలాగోలా నాన్నమ్మ, తాతయ్యలు సర్ది చెపుతారు. పల్లెను వదిలి పట్టణాలకు తరలి జీవితాలను, అభివృద్ధిని గెలుచుకున్న క్రమంలో పుట్టిన పిల్లలు తిరిగి పట్టణంలోనే వుండాలనుకుంటారు. ఇది కథలోని కాన్సెప్ట్. ముగింపు ఎలా ఇవ్వాలి? టీచరమ్మ తరఫున కాన్సెప్టు ముందుకు తెచ్చాను. కనుక ఆమెలో స్త్రీలకు సంబంధించిన దృక్పథంతో కథ ముగింపు ఇవ్వాలనుకున్నాను. సంబంధం ఓకే చేసుకొని ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ చేసుకోవడం, అందునా పల్లెలో అలా జరగడం చాలా అవమానకరమైన విషయంగా భావిస్తారు. తల్లిదండ్రులకు, పెద్దలకు కూడా బాధాకరమైన విషయం. ఇది క్లయిమాక్సు. దాన్ని కొనసాగిస్తూ ముగింపు ఎలా వుండాలి? అనేక విధాలుగా ఆలోచించి చివరకు ఇలా ముగించాను.

"ఇంగ్లీషు మీడియంలో చదివిన ఆడపిల్లలు ఈ పల్లెల్లో వుంటారనుకొని ఖాయం చేసుడే తప్పసలు. పెళ్ళి పత్రిక అచ్చేసాక అనలేదు నయం అని కిర్మణయినే మెచ్చుకుంటున్నారు.

ఆ రాత్రే కరీంనగర్ నుండి కోరుట్లకు ఇల్లు చేసిన లెక్చరర్ రాజేశం కూతురు చేసిన పనికి మొహం చెల్లక ఇంటివద్దే వుండిపోయాడు. ముసలి తల్లిదండ్రులు పల్లె నుండి సంబంధం కాన్సిల్ చేసుకొని ఇల్లు చేరేసరికి రాజేశం వారి కోసమే ఎదురు చూస్తూ వున్నాడు. ముఖం చాటు వేయడానికి కిరణ్మయి ఎప్పటిలా స్కూలుకు వెళ్ళిపోయింది.

"విజయ్ ఇక జీవితంలో పెళ్ళి చేసుకోడట!" అన్నాడు గంగరాజం. కోడలు లక్ష్మీబాయి సానుభూతి చూపే బదులు కూతురును వెనకేసుకొచ్చింది.

"ఆడపిల్లను మగవాళ్లు పీటల మీద పెళ్లిళ్లు ఎత్తగొట్టవచ్చు! ఏవో వంకలు పెట్టి చూడవచ్చేవాడల్లా అంటూవుంటే ఆడపిల్లలకు ఎంత అవమానంగా వుండాలె? ఒక్కసారి ఆడపిల్ల మొగోన్ని వద్దని నిరాకరిస్తే ఇంత పౌరుషమా! అయితే గానీ!" అని జాడించింది లక్ష్మీబాయి.

నిజానికి విజయ్ పట్ల సానుభూతి చూపాలి. అది స్వాతంత్ర్య సమరయోధుడైన గంగరాజం అన్నాడు కూడా. కానీ అలా ముగిస్తే కథ అవగాహన తక్కువ వున్న కథ అవుతుంది. స్త్రీల కోణాన్ని ప్రవేశ పెట్టాలి. అది కిరణ్మయి చెప్పిన మాటలాగా వుండాలి. కిరణ్మయి తల్లి ఆ మాట తల్లి హోదాలో అనడం ద్వారా ఆ మాటకు గొప్ప విలువ, అనుభవం, అనుభవసారం నుండి వెలువడిన మాటగా గంభీరంగా వుంటుంది. కిరణ్మయితోనే ఆ మాట అనిపించవచ్చు. కానీ అది పడుసో పెడుసో అనే దృష్టితో ఆ మాటను తేలికగా తీసుకుంటారు. విజయ్ వైపు సానుభూతి వెళుతుంది. ఆ సానుభూతిని కర్కశంగా కట్ చేసి స్త్రీల కోణాన్ని ప్రవేశ పెట్టి సమర్థించడంతో కథ ముగించాను. స్త్రీవాదం బలంగా రాకుండా ఇలాంటి ముగింపు ఇవ్వాలనిపించడం అంత సులువు కాదు. ఇలా స్త్రీవాదం జీవితాన్ని పరిశీలించే కోణాన్ని ఎంతగానో అభివృద్ధి పరిచింది.

**'చెలిమ' ముగింపు**

అలాగే 'చెలిమ' కథలో సర్పంచ్, జడ్‌పిటిసి ఇద్దరు స్త్రీవాదం ఆచరణలో మహిళలకు రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాక ఎన్నికయిన వాళ్లు. మహిళా రిజర్వేషన్లు భర్తలకే ఉపయోగపడ్డాయని మహిళా ప్రతినిధులను కించపరుస్తూ చాలా కథలు వచ్చాయి. వారికున్న అవగాహన అది. మహిళా ప్రతినిధులకు శిక్షణా తరగతులు నిర్వహించినప్పుడు రిసోర్స్ పర్సన్‌గా నేను వారి అనుభవాలను, చైతన్యాన్ని గమనించి దాన్ని కథల్లో పెట్టాలనుకున్నాను.



"మా పెద్దక్క బిడ్డ పెద్దదైంది. ఎల్లుండి చీరకట్టిస్తున్నరు. తప్పక రావాలి." అని జడ్‌పిటిసి సభ్యురాలు ద్యావనపెల్లి కరుణ అడగడంతో సర్పంచ్ మేకల లక్ష్మి సరేనంది. లక్ష్మిక్కూడా ఊళ్లో చిన్నపని వుంది. ఆ పనేమిటో కరుణ చెవిలో వేస్తే "ఆ పని నేను చూసుకుంటా నీకెందుకు శ్రమ అని భరోసా ఇచ్చింది. ఆ రెండు పనుల కోసం వాళ్లు కొంచెం పొద్దున్నే బయల్దేరారు." ఇది కథ ప్రారంభం. కథ ముగింపు ఎలా వుందో చూద్దాం." ఊళ్లో పని అయిపోయాక మళ్లీ ఇంటికి బయల్దేరారు. బస్‌స్టేజి దగ్గరకు వచ్చారు.

"అబ్బ... తాజా ముంజెలు. తిందామా అక్కా.. లక్ష్మికి నోరూరింది. పెద్దగ గీచి గీచి బేరం చేయకుండానే చెరి మూడు ముంజెకాయలు కొట్టించుకున్నారు. గీచి గీచి బేరం చేయడం హోదాకు భంగం అనే శిక్షణ పాఠం వారికి ఒంటబట్టినట్టుంది. ఎక్కువ బేరం చేయకపోవడంతో ఆ గౌడు మరో రెండు ముంజెకాయలు కోసి ఇచ్చాడు. అతనితో అదీ ఇదీ ఊరు విషయాలు అడిగి తెలుసుకున్నారు...

"ఈ వూరు ఎలా వుంది? నీకు నచ్చిందా..." రాజ్యం ఏలడం కోసం దత్తత ఇస్తున్న మహరాణి అడిగినట్టుగా వుంది కరుణ ప్రశ్న. లేక లక్ష్మికే అలా అనిపించింది.

"అంతా మంచిగనే వుంది కాని..." అంటూ ఆగిపోయింది లక్ష్మి.

"ఏంటిది కానీ...?"

"వచ్చే టర్మ్‌కు ఆ వూరు సర్పంచ్‌ను, అక్కడి జడ్‌పిటిసిని, ఎమ్‌పిటిసిని ఆడోళ్లకు రిజర్వు చేయించుతానంటే... సరే..."

"అబ్బ! ఇప్పుడు నువ్వు నిజంగా రాజకీయ నాయకురాలివేనే" అంటూ వయ్యారంగా లక్ష్మి తొడిగిచ్చి, నడుంగిచ్చి షేక్‌హ్యాండ్ తీసుకొని చెయ్యి నొక్కి పట్టింది కరుణ.

అప్పుడే బస్సు వచ్చింది గబ గబా బస్సెక్కారు. వెనకనుంచి ఎవరో తమ పేర్లు, పదవులను చెప్పుకుంటూ ముచ్చటిస్తున్నారు. నిండు ఆత్మ విశ్వాసంతో వాళ్లకు ప్రతి నమస్కారం చేసి సీట్లో కూర్చున్నారు వాళ్లు."

షేక్‌హ్యాండ్ తీసుకోవడంతో కథ ముగించవచ్చు. అక్కడికి ముగింపు అయిపోయింది. కానీ అవకాశాలిస్తే ఎంతగా ఎదుగుతారో అనేది నా కాన్సెప్ట్. కనుక ఎదిగిన క్రమం ఇంకా ఎదుగుతున్న క్రమం సమాజంలో వారు పొందుతున్న గౌరవాలు వారు వ్యక్తిత్వాన్ని ఎదిగించుకుంటున్న తీరు చిత్రించాలి. వారికి రిసోర్స్ పర్సన్‌గా వుండి ఇవన్నీ గమనించాను కనుక దానికి కథా రూపం ఇవ్వాలి. అలా బస్సులో వారి గురించి అనుకోవడం, వారు ప్రతి నమస్కారం చేయడం సమాజంలో వస్తున్న మార్పు, పెరుగుతున్న గౌరవాలు చిత్రించి

సన్నివేశంతో ముగించాను. సాధారణంగా డైలాగ్‌తోనే ముగిస్తారు. నా లక్ష్యం అక్కడితో ఆగలేదు. ఇంకా సుదీర్ఘమైనది. కనుక కథను కొనసాగించాను.

కథకు పెట్టిన పేరు 'చెలిమ'. చల్లిన కొద్దీ ఊరేది చెలిమ. అవకాశాలు ఇస్తే చల్లిన కొద్దీ ఊరే చెలిమ లాగా మహిళల్లో ఆలోచనలు, అవగాహన, అనుభవాలు, వ్యక్తిత్వాలు పెరుగుతాయి. అది జీవితాన్ని చూసే దృష్టిని కూడా మార్చుతుంది. ఎలా మార్చింది?

"అది కాదు చిన్నమ్మా!... మొగోళ్లు కూడా పెద్దమనిషైనట్టు వారం పది రోజులు ఇంట్ల కూర్చోబెట్టి గిట్లనే భోజనాలు పెట్టించే పండుగు ఎందుకు లేదు?" అడిగింది శృతి. "నువ్వు ఎమ్మెల్యే అయినంక అసెంబ్లీలో వేయాల్సిన ప్రశ్న ఇప్పుడు నాకేస్తే ఎట్లనే..." అంటూ నవ్వి శృతి తల నిమిరింది జడ్‌పిటిసి ద్యావనపెల్లి కరుణ.

ఈ రీతి సంభాషణ ఎందుకు పెట్టాలో కూడా దాని నేపథ్యం చెప్పాలి. నిజామాబాద్ జిల్లా కమ్మరపెల్లి సమీపంలోని రాంపూర్ గ్రామంలో సిద్ధాంత శిక్షణా శిబిరాలు నిర్వహించారు. నేను, శివసాగర్, బొజ్జా తారకం, కంచ ఐలయ్య, మొ॥ వాళ్లం రిసోర్స్ పర్సన్స్‌గా వెళ్ళాం. రెండు రోజులు అక్కడే వున్నాం. సాయంకాలాలు ఆ వూరి పిల్లలను భవిష్యత్తులో నీవు ఏమవుతావు అని ప్రశ్నిస్తూ వారితో కాలక్షేపం చేశాం. టీచర్‌నవుతా, పోలీసునవుతా వంటి జవాబులిచ్చారు తప్ప ఏ ఒక్కరూ ఎమ్మెల్యే అవుతానని, సర్పంచ్ నవుతానని అనలేదు. జీవితంలో రాజకీయాలు భాగం అనుకోవడం లేదు. కానీ కొన్ని సామాజిక వర్గాలు పారిశ్రామిక వేత్త కావడం, రాజకీయ వేత్తలు, కాంట్రాక్టర్లు కావడం వారి ఆలోచనా విధానంలోనే చిన్నప్పటి నుంచి అలవడుతూ వస్తున్నది. ఇది అందరూ సాధించాల్సిన విద్య. కనుక జీవితంలో భాగంగా వాటిని మలుచుకోవాలి. అంటే సంస్కృతిలో, ఆలోచనా విధానంలో మార్పు రావాలి. అందుకని శృతి, కరుణ, లక్ష్మి ఆలోచనల్లో వచ్చిన మార్పును చిత్రించాను.

లక్ష్మిలో వచ్చిన మార్పేమిటి?

".... గడియారం పెట్టుకుంటే ఒక చేతికన్నా గాజులు వేసుకొనుడు తప్పుద్దని ఈ పని చేసిన. ఈ చేయికి ఒక రింగు. బస్..." అంటూ నవ్వింది లక్ష్మి.

"నీకు ఇంతకుముందు ముక్కు పుల్ల కూడా వున్నట్టుంది కదా అక్కా..."

"అవును. మీటింగులకు పోవుడు వచ్చుడు, బస్సులు ఎక్కుడు దిగుడు... ఓకెయి చీమిడి చీదితే ముక్కుపుల్ల అడ్డంపడి ఇంకొక కెయి చీమిడి పడు. అది గుచ్చుకపోవుడు... అని తీసిపడేసిన. మరీ బోడోబోడ వుండొద్దని ఈ చెవిరింగులు పెట్టుకున్న." అంది లక్ష్మి.



పిల్లగాని ఇంటికి సర్పంచ్ హోదాలో పిల్లనే పిల్లగాన్ని చూడ్డానికి పోవడమనేది ఈ కథలో ఒక అంశం. అది కూడా రాజకీయ పనివిధానంలో భాగంగా సాగుతుంది.

"ఈ కొత్తరకం పెళ్లి చూపులకు పిల్లగాడేమన్నా బాధపడతాడంటావా!" అంది లక్ష్మి.

"గట్ల బాధపడేటట్టు మనం ఏం చేసినం? అందర్తోని కలిసి మాట్లాడినం. అయినా బాధపడ్తే అలాంటివాడు సర్పంచుకు భర్తగా పనికిరాడు. అసలు నన్నడిగితే పిల్లనే పిలగాని ఇంటికి చూడపోవాలె. తమ అత్తగారిల్లు, పరిసరాలు ఎట్లా వుంటాయో ఆడపిల్లకే తెల్సుకోవడం అవసరం. ఎందుకంటే ఆ పిల్ల అత్తగారింట స్థిరపడ్తది అందుకని పిల్లగాని యింటికాన్నే పిల్లగాన్ని పెండ్లిపిల్ల తీరు కూర్చోపెట్టి పిల్ల, పిల్లతల్లిదండ్రులు చూసి మాట్లాడాలె" అంది కరుణ.

కథలో ఏం చెప్పదల్చుకున్నానో జీవితాన్ని ఎలా మహిళలు చైతన్యమయి చూస్తున్నారో ఇవి స్పష్టం చేస్తాయి. ఇలా కథ ప్రారంభంలోనే వారి చైతన్యాన్ని ప్రవేశ పెట్టి మరింత చైతన్యానికి ఎదిగిన క్రమాన్ని చిత్రించాను. ఇంట్లో కూర్చుని కథలు రాస్తే ఇవి తెలిసే అవకాశం లేదు. సర్పంచులుగా, జడ్‌పిటిసిలుగా, ఆయా పార్టీల్లో మహిళా విభాగం అధ్యక్షులుగా, మండలాధ్యక్షులుగా ఎన్నికైన మహిళలతో సహచర్యం చేస్తూ వారితో గడుపుతూ వున్నప్పుడే వీటిని గమనించడం కథల్లో పెట్టడం సాధ్యం. అందువల్ల జోత్స్నా! జీవితాన్ని పరిశీలించడం అంటే పత్రికల్లో చదివి, టీవీల్లో చూడ్డం కాదు. ఫీల్డ్ మీద పరిశీలించడం. వారితో కలిసి జీవించడం కూడా. జీన్‌పాల్ సార్త్రే కన్ను ఒకటి సరిగా వుండేది కాదట! తన ఫోటోలు బాగా రావని ఫోటోలు తీయనివ్వలేదు. ఒక సుప్రసిద్ధ ఫోటోగ్రాఫర్ మూడు నెలలు అతని వెంట ఉండి అతనితో జీవించి ఫోటోలు తీసి మీకు నచ్చితేనే బయట ఇద్దాం అని చెప్పి ఫోటోలు తీశాడు. మూడు నెలల తరువాత తీసిన ఆ ఫోటోలను తీసి నేను ఇంత అందంగా వుంటానా అని ఆనందం వ్యక్తం చేశాడట జీన్‌పాల్ సార్త్రే. అలా ఒక ఫోటోకే అంతగా వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని పరిశీలించాల్సి వస్తే కథ కోసం ఇంకెంత సన్నిహితంగా పరిశీలించాల్సి వుంటుందో ఆలోచించు."

**'నానమ్మ' ముగింపు**

'నానమ్మ' కథలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పెళ్ళి చేయలేక ఆడపిల్లలు లేచిపోవడాలు చిత్రిస్తూ అదే సమయంలో మానవీయ సంబంధాలు ఎలా కొనసాగాలో సన్నివేశాలు ప్రవేశ పెట్టాను.

"గాంధీతాతా! రాట్నాన్ని జాతి చిహ్నంగా జెండానెక్కించావు. మా బతుకులకేమిచ్చావు ఆధారం" అంటూ మనస్సు మూగగా ప్రశ్నించింది." ఇది నా అవగాహన. సుగుణ మనస్సు ద్వారా చెప్పాను.

తరువాత మళ్ళీ కథలోకి వచ్చాను.

"సుగుణక్కా" అంటూ మేనకోడలు సుజాత పరుగున ఎదురొచ్చింది చూడలేదు. దాని మొహంలో పెళ్ళికళ. దాని మొహంలో నానమ్మే కనపడింది. మళ్ళీ పుట్టిన నానమ్మ నా దేవత. ఎనిమిదినెల్లల్లోనే ఎంత ఎదిగింది....! దేవకన్య వోలె ఎదురొచ్చింది. దీని పెండ్లికోసం పెండ్లి నగలేమి చేయించుకొని రాకపోతినని మనస్సు విలవిలలాడింది.

ఎందుకు చేయించుకు రాలేకపోయింది? దానికి కారణం చెప్పాలి.

"అన్నయ్య ఉత్తరం వచ్చిన్నుంచి నా గురించే తప్ప దాని గురించి ఎందుకు ఆలోచన రాలేదో ఆశ్చర్యం... మళ్ళీ పుట్టిన నానమ్మకు ఏదైనా పెళ్ళికి చేయించాలి."

ఇది పాఠకులకు ఇచ్చే సందేశం.

"నా చేతిలోని సూట్‌కేసు తీసుకొని సుజాత ఇంటికేసి దారితీసింది." సుజాతకు సుగుణకు గల అనుబంధం సూట్‌కేసు సుజాత తీసుకొని నడవడంలో గౌరవించడం, సాన్నిహిత్యం, ఆత్మీయత అన్నీ ఒక్క చర్యలో చూపించింది.

**'బతుకుపయనం' కథ ముగింపు**

'బతుకుపయనం' కథ ".... పిల్లవాడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు" అని ప్రారంభమవుతుంది. అమెరికా వెళ్ళి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడి ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ తామే పెట్టాలనుకునే ఆలోచనతో కథ ముగుస్తుంది. పిల్లవాడు చెల్లెండ్లు బీడీలు చేస్తుంటే ఆ పైసలతో చదువుకున్నాడు. తండ్రి బట్టలు నేసేవాడు. ఆ దశ నుండి ఎదిగి ఇంజనీరు అమ్మాయిని చేసుకున్నాడు. బెంగుళూరు నుండి అమెరికా వెళ్లాడు. పెద్దగా చదువుకోని చెల్లెళ్లను ఎక్కువ కట్నం ఇచ్చి టీచర్లకు ఇచ్చి పెళ్ళి చేశాడు. ఆ తరువాత బావలను కూడా అమెరికాకు పిలిపించుకోవడానికి సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్‌లు చేయమంటాడు. వారి కోసం సంస్థనే పెట్టాలనుకుంటారు. ఇది ఎదిగిన క్రమం. ఒకే జీవితంలో కూలీ పని చేసుకొని బతికే స్థాయి నుండి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే క్రమం గ్లోబలైజేషన్‌లో అందివచ్చిన అవకాశం. దాన్ని మరింత ఎదగడం కోసం ఎలా ఉపయోగించుకోవాలో అనేది ముగింపు.

"మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా వుండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలా లజపతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె.రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని బట్టి వుంటుంది. బిల్‌గేట్స్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? సత్యం, ఇన్ఫోసిస్ రామలింగరాజు, నారాయణ మూర్తి గారలకెవరు చెప్పారు? గుమాస్తా జీవితాన్ని ప్రారంభించిన రిలయన్స్ అంబానీకి ఎవరు చెప్పారు ఎదగాలని? అనాథగా పుట్టి పెరిగిన ఫోర్డ్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? అంతా సంకల్పబలం. పట్టుదల, నిరంత కృషి. విశ్వవిజేత అలెగ్జాండర్ ఒక మాటన్నాడు. గెలవదలుచుకున్న వారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని. నేను ఇంతకన్నా కొత్తగా, అదనంగా చెప్పడానికేమి లేదు. మీరు ఎంతగా ఎదిగితే అంతగా సేవ చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయం మాత్రం మర్చిపోవద్దు. బెస్టాఫ్ లక్" అన్నాడు ఇండియా నుండి ఫోన్‌లో లెక్చరర్ చంద్రమౌళి.

అందరు సంతోషంతో చప్పట్లు.

ఎందుకో తెలియక అయోమయంగా చూశారు లస్మయ్య, లచ్చింబాయి.

తమ కొడుకు, కోడలు ఏ పని చేసినా మంచిపనే చేస్తరు అని మనస్సులో తృప్తి నిలుపుకున్నారు లచ్చింబాయి, లస్మయ్య. వారికి గతమంత కళ్ళ ముందు కదలాడుతోంది.

కూతుళ్లమీద ప్రాణం కొట్టుకుంటోంది. అల్లుళ్ళు కూడా ఇక్కడికి వస్తే ఎంత మంచిగుండు అనుకున్నాడు. అదే మాట వాళ్ళను అడిగాడు.

"అలాంటి వాళ్లకోసమే ఈ సంస్థ పెడుతున్నది. వాళ్లక్కడ కంప్యూటర్ ట్రైనింగ్ చేస్తే ఇక్కడ ఏదో చిన్న పనైనా ఇప్పియ్యవచ్చు. అదే మా ప్రయత్నం" నవ్వుతూ అన్నాడు విజయ్.

అయితే మా పిల్లలు అమెరికా వెళ్ళినా అలాంటి కంపెనీ పెట్టలేదు. కొందరు పెట్టుకున్నారు. ఇలా భవిష్యత్తు ఉజ్వలంగా వుండాలని ఆశిస్తూ ఇచ్చిన ముగింపు ఇది. ఇందులో జిమ్మిక్కులకు, ట్విస్టులకు కొసమెరుపులకు అవకాశాలు తక్కువ. అలా జిమ్మిక్కులు, కొసమెరుపులు సృష్టిస్తే కథలోని గాఢత దెబ్బతింటుంది. చెప్పదలుచుకున్న కాన్సెప్ట్, వీకైపోతుంది. అందుకని ఇలాంటి సందర్భాల్లో ముగింపుల పట్ల అంత ట్విస్ట్ అక్కర్లేదని నా ఉద్దేశం.

**'ప్రశాంతం' ముగింపు**

'ప్రశాంతం' కథ గ్లోబలైజేషన్‌తో, ఆటోమైజేషన్‌తో విధ్వంసం అవుతున్న కుటుంబాల కథ ముగింపు ఇలా చిత్రించాను.

"ఆమె దుఃఖంలో కోపం లేదు... ప్రశాంతంగా ఏడుస్తోంది...

ఆ ప్రశాంతంలో ఒక నిరాశ. ఒక నిర్వేదం.

రేపటి సమాజం కూడా ఇంతేలే అని ఆశలన్ని సమాధి అవుతున్న దశ.

తండ్రి ఎల్లయ్య బైరాగి తత్వం రాగం తీస్తున్నడు.

ఇల్లంతా విధ్వంస చిహ్నాలకు బదులుగా విషాదం ప్రశాంతంగా చిక్కగా పరుచుకుంటున్నది."

విధ్వంసం, విషాదం, బీభత్సం తరువాత ముగింపు ఇంకా ఎలా వుంటుంది? జీవితం సర్వనాశనం అయిపోయాక ఇంకా ట్విస్ట్‌లు, కొసమెరుపులు ఎలా వుంటాయి? విషాద బీభత్సం మానవాళికి అంతిమ ఘడియలు. అంతిమ ఘడియలకు కొసమెరుపులు, ట్విస్ట్‌లు వుండవు. కోట్లాది ప్రజల జీవితాలు విధ్వంసం అవుతున్నాయి. వాటికి కొసమెరుపులు వుండవు.

## 'జైలు జీవితం' ముగింపు

అలాంటి ప్రయోగం ఒకటి 'జైలు జీవితం' కథలో చేశాను. అయితే అందులో విషాదాన్ని, విధ్వంసాన్ని సూచన ప్రాయంగా మాత్రమే చెప్పడం వీలు పడింది. అంటే విషాదం దాని స్థాయిలో రికార్డు కాలేకపోయింది. విషాద రసాన్ని సృష్టించే బదులుగా అది ధ్వనిగా మారిపోతుంది. తద్వారా కథ బాగా వుండవచ్చు కాని వారి జీవితం ధ్వనికోసం ధ్వంసం కాకూడదు. విషాదం విషాదంగానే స్వీకరించాలి. అనుభవించాలి, పలవరించాలి, కన్నీరు కార్చాలి. అందువల్ల విషాదాలకు కొసమెరుపు ముగింపులు జీవితంలోని విషాదానికి న్యాయం చేయవు. ఇది నా అభిప్రాయం.

'జైలు జీవితం' కథలో "ఒకసారి ఇద్దరు పోలీసులు వచ్చి కల్లు గుడాలు, మాంసం కావాలని వండించుకుని తిన్నరు. తరువాత దీన్ని చెర పట్టాలనుకున్నరు. ఇది భయపడి బయటికి వచ్చి కొడుకుకు చెప్పి నేను ఇంట్లకు పోను అని ఏడ్చింది."

"ఏమీ చేయలేక ఎవరికీ చెప్పుకోలేక నేను, కొడుకు, కోడలు ఏడ్చి ఏడ్చి అక్కడే బయట ఉన్నం. ఒక పోలీసోడు 'కూర వడ్డిద్దువు రా' అని కోడలును ఇంట్లోకి రమ్మని పిలిసిండు. కొడుకు నేను వస్తా పా అని అంటే నువ్వెందుకురా అని ఆమెనే రమ్మని బలవంతం చేసిండు. కొడుకు అప్పుడు ఎదురు తిరిగిండు. దాంతోటి కొడుకును కొట్టి దీన్ని ఇంట్లకు గుంజుకపోయిన్రు. ముసల్దాన ఎవరూ రాకుండా ఇంటి ముంగట కావలి ఉండు అని బెదిరించిన్రు. ఇట్ల ఎన్ని అవస్థలు పడ్డా కొడుకును జైలుకు పట్టిచ్చిన్రు" ఆ ముసలి తల్లి ఏడుస్తున్నది.

"అట్లా మర్లపడ్డ తరువాత కొడుకును అడ్డం రాకుండా చేయాలని పోలీస్ స్టేషన్ల వేసి పది రోజులు బాగా కొట్టి చిత్రహింసలు పెట్టి జైలుకు పంపించిన్రు. తర్వాత డ్యూటీ పేరిట వచ్చుకుంట ఎవరెవరో దీన్ని పాడు చేసిన్రు. రెండుసార్లు దిగతాగించినంక దీని పానం తెర్లయిపోయింది. ఒకసారి బాధ భరించేక ఎదురు తిరిగితే ఎన్‌కౌంటర్ చేస్తా అని బెదిరించిన్రు...

...మనసంతా ఎలాగో అయిపోయింది. ఇది నా చుట్టూతా వున్న ప్రపంచమేనా? నా చుట్టూ వున్న పల్లెల్లో ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయా?"

ముప్పయ్యేళ్లుగా నిర్బంధం జీవితాలను ఎలా ధ్వంసం చేస్తున్నదో విధ్వంసం సృష్టిస్తున్నదో స్వయంగా చూస్తున్న వాడిని. దాన్ని మరింత భయానకంగా వర్ణించడం వల్ల ప్రజలు భయపడిపోవడమే తప్ప దాన్ని ఎదిరించడం సాధ్యం కాదు. అందుకని జైళ్లు ఇంతకన్నా ఎంతో బాగుంటాయి, జైళ్లంటే భయపడాల్సిన పని లేదు అని ఒక నైతిక ధైర్యాన్ని ఇస్తే ఎదిరించి పోరాడుతారు. అది నా కాన్సెప్టు. అందుకని విషాదాలను ముగింపులో కాకుండా కథ మధ్యలో చెప్పాను. ముగింపు ఇందుకనువుగా ఇలా చిత్రించాను.

"వానికేందవ్వా...! యాల్లకు తినుకుంట మంచిగనే వున్నడు. మంచిగ పానం పట్టిండు. ఉన్న గోసంతా మాకే. ఏం పని చేసుకొని బతుకాలె. ఎట్లా బతుకాలె. వానల్లేవు. కూలి పనుల్లేవు. వకీళ్ళకు ఫీజు ఎట్లియ్యాలె! వీని పిల్లగాండ్లను ఎట్ల చదివియ్యాలె. పిలగాండ్లను ఎవరూ జీతం వుంచుకుంటలేరు. ఏం బతుకో... జైళ్లనే నయం. ఏ రంధీ లేదు. మమ్ముల్నందర్నీ జైల్లేసిన మంచిగుండు" అంటూ చెప్తోంది.

వాళ్ళ మాటలు వింటుంటే అందరికీ భద్రత, మూడు పూటలా భోజనం. మనిషి వికాసానికి తోడ్పడే విధంగా ప్రపంచమంతా జైలుగా మారితే ఎంత బాగుండు అని అనిపిస్తున్నది. ఇప్పుడు నాకు జైలంటే భయంలేదు. పైగా జైలు మీద ప్రేమ కలుగుతున్నది." ఇలా కథ ముగించాను.

## రచయిత సామాజిక కర్తవ్యం

రచయితకు సామాజిక కర్తవ్యం వుంటుంది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆయా సందర్భాల్లో సామాజిక పరిణామాల్లో తనదైన కర్తవ్యం నిర్వర్తించాలి. 'ప్రశాంతం' కథలో చెప్పిన జీవన విధ్వంసం కన్నా భయంకరమైన విధ్వంసం, విషాదం వారి జీవితాల్లో పరుచుకున్నాయి.

'ప్రశాంతం' కథలో ఉపాధి మాత్రమే కోల్పోయారు. 'జైలు జీవితం' కథలో జీవితాల్నే కోల్పోయారు. ఈ విధ్వంసం పాలకులు తెచ్చి పెట్టింది. అయినా వాళ్లు ఏ ధైర్యంతో బతుకుతున్నారో ఏ ఆశతో బతుకుతున్నారో దానికి మరింత మద్దతు ఇవ్వాలి. మేమున్నామంటూ ధైర్యంగా వారి కోసం నిలబడాలి. అది ఈ కథలో కాన్సెప్టు. అలా

లేకపోతే ఆ విషాదాన్ని ఎంతైనా రాయవచ్చు. అది పాఠకులపై బలమైన ప్రభావం వేస్తుంది. కానీ పాఠకుల కోసం కాకుండా ఆ జీవితాల కోసం ఆ కథ ఏం సందేశం ఇస్తున్నది అనేది చాలా ముఖ్యమైనది. అందువల్ల పాఠకుల దృష్టిలో కాకుండా పాత్రలు, పాత్ర ధారుల దృష్టిలో ముగింపులు వుండడం అవసరం. కథ నడపడం అవసరం.

'ప్రశాంతం' కథ అందులోని పాత్రల కోసం రాసినట్టు కాదు. వారికి చేసిన మార్గదర్శనం, జీవితం గెలుచుకోవడానికి చేసిన సూచన ఏమీ లేదు. అందువల్ల అది పాఠకుల కోసం రాసినట్టు చెప్పవచ్చు. 'జైలు జీవితం' కేవలం పాఠకుల కోసం రాసినట్టు కాదు. అందులో పాత్రలకు మార్గదర్శనం వుంది. సమస్యల నుండి బయటపడే మార్గాలు వెతుక్కోవడం వుంది. అందువల్ల అది ప్రధానంగా అందులోని పాత్రల కోసం రాసింది.

## కథ చదువరుల కోసమా? పాత్రల కోసమా?

ఇప్పుడు కథ గురించి కథా, కథనం గురించి, ముగింపుల గురించి మరొక మలుపులోకి వచ్చాం. కథను పాఠకుల కోసం రాయాలా? ఆ కథల్లోని పాత్రల కోసం రాయాలా? అని చర్చలోకి ప్రవేశించాం.

నేను కథలోని పాత్రల కోసం కథ రాయాలి అని భావించి 'జైలు జీవితం', 'ఇంటల్లుడు' 'బతుకుపయనం', 'జీవనయానం', 'చెలిమ', 'నానమ్మ', 'ప్రేమధార', 'వేదవతి' 'వరుసలు', 'అయిదవవాడు', 'స్మృతి', 'వారసత్వం' 'తెల్లబట్ట', 'మెరుగు' మొదలైన కథలు రాశాను.

కథలోని పాత్రల కోసం వారి జీవితాల మెరుగుదల కోసం వారికి చేయూతనందించడం కోసం కథ రాయడమనేది కేవలం సాహిత్యానికి, సాహిత్య వస్తువు, శిల్పం, అలంకార శాస్త్రాలకు సంబంధించిన అంశం కాదు. అక్కడి నుండి దాని బంధనాలను విడగొట్టుకొని ప్రత్యక్షంగా సమాజంలోకి, జీవితంలోకి పాత్రధారుల మధ్యలోకి కథ ప్రవేశించింది. అందువల్ల వారిగురించి రాసే కథ వారికి జీవితంలో ఒకవెలుగునివ్వాలి. ఒక దారి చూపాలి. కనుక సాహిత్యం ఇంతదాకా చర్చించిన కథా విలువలు, శైలి, శిల్పాలు, రచనా పద్ధతులు అన్నీ మౌలికమైన పరిణామం చెందాల్సి వుంటుంది.

ఇంతదాకా పాఠకుల కోసం, ప్రేక్షకుల కోసం రచనలు చేయబడ్డాయి. సినిమాలు తీయబడ్డాయి. ఉద్యమాల్లో పాట, ప్రసంగాలు ప్రత్యక్షంగా ఆయా ఉద్యమాల్లో పాత్రధారులైన ప్రజలను ఉద్దేశించి సాగుతాయి. కథ, నవల, వచన కవిత, సినిమా కూడా ఇలా ప్రజల దగ్గరికి చేరాలి. ప్రజలతో మమేకం కావాలి. ప్రజలు దాన్ని చదవాలి, చూడాలి. పాటతో, ప్రసంగంతో పొందే ఉత్తేజాన్ని పొందాలి. తమ జీవితాలను మరింత



బాగుపరుచుకొనే మార్గాలను సూచించాలి. కష్టాల్లోంచి బయటపడి జీవితాలని గెలుచుకొనే అనేక మార్గాలను చూపి జీవితం పట్ల కోల్పోయిన ఆశలను తిరిగి కల్పించాలి. అప్పుడే వాళ్లు ధైర్యంగా ముందుకు సాగుతారు. జీవితం గెలుచుకోవడం కోసం ఉద్యమిస్తారు. కష్టపడతారు.

## 'ఇంటల్లుడు' ముగింపు

కథలు కొత్త అంశాన్ని పట్టుకొన్ని చెప్పగలగాలి. ఇంటల్లుడు కథలో ఈ ప్రయోగం చేశాను. అల్లున్ని శనిగ్రహం అని దశమ గ్రహం అని విమర్శిస్తుంటారు. వాస్తవ జీవితంలో అలా ఉండేది కొందరే. నిజంగా చాలామంది అల్లుళ్లు ఇంటికి పెద్ద కొడుకులాగా కర్తవ్యాలు, బాధ్యతలు నిర్వహిస్తుంటారు. బావమరుదుల, మరదళ్ల చదువులు, పెళ్లిళ్లల్లో తమ వంతు సహకారం చేస్తుంటారు. ఈ కోణాన్ని బలంగా చెప్పాలనుకున్నాను. 'ఇంటల్లుడు' కథలో దీన్ని కథ ప్రారంభంలోనే చెప్పాను.

"ఇంటల్లుడు పెద్ద కొడుకుతో సమానం. పెద్ద కొడుకు తండ్రి తర్వాత తండ్రంత. నువ్వు పూనుకోకపోతే నీ మరదలు పెళ్ళి ఎట్లయితది!" చిన్నమామ లక్ష్మిరాజం బతిమాలుతున్నాడు.

కథంతా చర్చలు, వాదోపవాదాలు, పెళ్లి ఎత్తిపోయే సీన్లు, పెళ్ళి కావలసిన పిల్ల ఏడ్వడాలు, అక్క సముదాయించడాలు, ఇంటల్లుడు రవీంద్ర చివరకు బాధ్యత తలకెత్తుకోవడం, పెళ్లి సజావుగా సాగిపోవడం సాగుతుంది. రవీంద్ర బావమరిది తన కొడుకును చదివించాలని కొత్త డిమాండు ముందుకు తీసుకొస్తాడు.

ముగింపు ఇలా ముగుస్తుంది. రవీంద్రకు సాయం చేయాలని వుంది. కానీ స్తోమత లేదు. అయినా అంగీకరించక తప్పలేదు. పదహారవ రోజు పెళ్లి పండగనాడు పెద్ద బావమరిది భార్యా పిల్లలను తీసుకు వచ్చాడు. పండగ అయిన తరువాత మరుసటి రోజు కొడుకును అక్కడే వుంచి భీవండికి బయల్దేరారు.

"పెట్టిన చెయ్యి ఊరకె ఉండది. నా బిడ్డ అన్నపూర్ణ." అంటూ మురిసిపోయింది పద్మావతి తల్లి. ఇలా ఎందుకు ముగించాను? నా అల్లుడు అని మురిసిపోవచ్చు కదా! ముందు అలా రాసి కొట్టేశాను. అది ఇంటల్లుడికి జరుగుతున్న అవమానాన్ని చెప్పదు. అన్నీ మేళ్లు పొంది చివరికి ఓడదాటాక బోడి మల్లయ్య అన్నట్టు అల్లున్ని చూసిన క్రమాన్ని ఒక మాటలో చెప్పాలి. అందుకని అత్త తన బిడ్డనే మెచ్చుకుంది. ఇలా అల్లుళ్ల ఎంత సేవ చేసినా వారికి గుర్తింపు లేకపోవడానికి వారి పట్ల సరైన అవగాహన, దృక్పథం లేకపోవడమే కారణం అని చెప్పడానికి ముగించాను. ఈ మాట ఒక వాక్యంతో చెప్పొచ్చు. అల్లుడు బాధపడ్డట్టు అతని డైలాగుతో ముగించవచ్చు. దానివల్ల ఏం జరుగుతుంది?

చర్చకు జవాబు వస్తుంది. తనను తాను సమర్థించుకునే జవాబు వస్తుంది. అది పాఠకుల్లో స్థిరపడుతుంది. కనుక అల్లుని మంచితనమే తప్ప అతడు తనకు గుర్తింపు కోరుకున్నట్టు కనుక రాస్తే ఆ త్యాగం తిరగబడి ఆః ఏ పాటి చేశావులే అనే దుస్థితికి దిగజారుతుంది. ఇది తత్వశాస్త్రం, సైకాలజీ, సామాజిక శాస్త్రం, జీవితానుభవాలు వున్నప్పుడే తెలుసుకోవడం సాధ్యపడుతుంది. లేకపోతే అల్లుడు, బిడ్డ అత్తను పూర్వపక్షం చేసి రెండు డైలాగులతో కథను ముగిస్తారు. నేను కథను అలా ముగించదల్చుకోలేదు.

ఇలా ముగింపులు పాఠకుల కోసమా, పాత్రధారుల కోసమా అనే చర్చ మౌలికమైనది. ఎవరిష్టం వారిది.

అది ప్రధాన పాత్రకు సంబంధించిన ముగింపేనా? ముగింపు చక్కని సందేశాన్ని, హామీని నిలబెట్టుకుందా? ముగింపు, కథ నడక ఒకే వేగంలో చక్కగా సాగాయా? సడన్ బ్రేక్ వేసినట్టు కథంతా అతలాకుతలమయిందా? పాఠకుడు నిన్ను నమ్ముతాడు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. కథ చదివి ఏదో కొత్త విషయం తెలుసుకున్నానని పాఠకుడు అనుకోగలగాలి. నీ ముగింపు నీ తర్వాతి కథకు అడ్వాన్సు బుకింగ్ చేసుకోవడానికి సంబంధించింది కూడా. నీ కథల ముగింపు నీ తరువాతి కథలు చదవాలో లేదో కూడా నిర్ణయిస్తుంది.

కథ ముగింపు కలలోంచి వాస్తవంలోకి రావడంతో ముగియవచ్చు. కష్టాలు వాస్తవికత నుంచి మధురమైన కలలు కనడంతో ముగియవచ్చు. కథ మొదలు పెట్టిన చోటు నుంచి అక్కడక్కడే గిరికీలు తిరగవచ్చు. కానీ ముగింపు కథ ప్రారంభం నుంచి కొంతైనా ముందుకు సాగినట్టు వుండాలి. జ్ఞాపకాలు, గతంలోకి వెళ్ళి కథంతా నడిపి వర్తమానంలోకి తిరిగి వచ్చినప్పుడు కథ ప్రారంభంలో వున్న చోటే కథ ముగియవచ్చు. కానీ ప్రారంభం కన్నా కాస్త ముందుకు నడిపితే కథ బాగుంటుంది. ఆలోచనలు, తలపోతలు మొత్తం కథంతా ఆక్రమించినా ముగింపులో కొంతైనా కొత్తదనం, కాస్త కొత్త విషయం అయోమయం నుండి స్పష్టత లోకి, ఏ నిర్ణయం లేనితనం నుండి ఒక నిర్ణయానికి రావడంతోటి కథ ముగియవచ్చు.

## 'దేవుని బిడ్డలు' ముగింపు

నేను 1980లో రాసిన ఒక కథ అచ్చుకాలేదు. ఆ కథని 2004లో జ్ఞాపకం మీద ఆధారపడి తిరగరాద్దామనుకున్నాను. అంతలో దాని కాపీ దొరికింది. అందులో ముగింపు కూడా వుంది. మళ్ళీ ఆ కథను యథాతథంగా రాశాను. ముగింపు కూడా యథాతథంగానే వచ్చింది. 25 ఏళ్ల కాలంలో కథ నిర్మాణం, నిర్వహణ, ముగింపు మార్చాలనిపించలేదు. ఆ కథ తన సొంత వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని సాధించుకుంది. ఆ కథ పేరు 'దేవుని



బిడ్డలు'. ఇద్దరు సమ వయస్కులు. ఒకరు ఇంటి యజమాని ఇంజనీరు కూతురు. ఒకరు వ్యవసాయ కూలి కొడుకు. నిర్బంధాలతో తండ్రి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. తాత మనవడ్ని వరంగల్ తీసుకొచ్చి పనిమనిషిగా ఇంట్లో జీతం కుదిర్చాడు. ఆ పిల్లవాడికి ఎప్పుడూ కష్టాలే. తల్లి కూడా అతన్ని కష్టపెట్టడం చూసి కూతురు బాధపడుతుంది. తనలాంటి వాడు తనలాగా ఎందుకు చదువుకోలేకపోతున్నాడు అని ఆలోచన మొదలవుతుంది.

అతనితో స్నేహం చేస్తుంది. అతని తల్లి సామూహిక మానభంగానికి గురై చనిపోతుంది. ఆ సందర్భంగా పది రోజుల పాటు పిల్లవాడు పనికిరాడు. గుండు కొట్టించుకొని పనికి తిరిగి వచ్చిన అతన్ని చూసి విషయం తెలుసుకోకుండా కోపంగా తిట్టి వెళ్లగొడుతుంది. అతడు ఎక్కడో ఆకలితో పార్కులో వుండిపోతాడు. కూతురు అతన్ని చూసి విషయం తెలుసుకొని ఇంటికి తీసుకొనిపోతుంది. వాళ్ళ అమ్మ చనిపోయినందుకు బాధపడుతుంది. రాత్రి అమ్మని అడుగుతుంది. అందరూ దేవుని బిడ్డలే కదా! అతనికి ఇన్ని కష్టాలు ఎందుకొస్తున్నాయి? ఎందుకు చదువు కోలేకపోతున్నాడు? అని అడుగుతుంది. తల్లి కసురుకుంటుంది.

ఆ రాత్రి నిద్రలో కలగంటుంది. తాను ఇంజనీరై తుపాకులు, రైఫిళ్లు తయారు చేస్తుంటే అతడు వాటితో యుద్ధం చేస్తున్నట్టుగా కలగంటుంది. నిద్రలో కలవరింతలకు తల్లి ఉలిక్కిపడి కూతురుకేసి చూస్తుంది. కూతురు వళ్లు జ్వరంతో బాగా వేడిగా వుంటుంది. ఇది కథ ముగింపు. ఈ కథ నిజానికి మార్చవచ్చు. కాని అందులోని పాత్రలు, వ్యక్తిత్వాలు, సంఘటనలు, సన్నివేశాలు జీవితంలో అలాగే వున్నాయి కనుక ముగింపుగానీ, కథ గానీ మార్చాల్సిన అవసరం ఏర్పడలేదు. ఇలా కథ తనకు తాను ఒక సొంత అస్తిత్వంతో నిలిచిపోతుంది.

అయితే కొన్ని కథలకు ముగింపు ఇవ్వడం అంత సులభం కాదు. నేను నవల రాసినప్పుడు ఈ సమస్యను ఎదుర్కొన్నాను. జీవితాన్నే కథగా రాసినప్పుడు జీవితంలో ఎలాంటి మలుపు రావాలో, వచ్చే అవకాశం వుంటుందో అది మాత్రమే చెప్పాల్సి వుంటుంది. అలాంటి ముగింపు జీవితానికే లేనప్పుడు దాన్ని కథలో చెప్పి ముగించడం ఎలా అనేది నేను ఎదుర్కొన్న ప్రధానమైన సమస్య. కథ రాయడం పూర్తయ్యాక ఫ్రెష్‌గా పాఠకుడిగా ఒకసారి చదువుకుంటే అనేక విషయాలు తెలుస్తాయి. సవరించుకోవచ్చు.

కథ ముగింపు కూడా పూర్తయిన తరువాత వారం పది రోజులకు పాఠకుడిలాగా కథను చదివి చూడాలి. పూర్తిగా పాఠకుడిగా మారి చదవడం అంత సులభం కాదు. తన కథ అనే ప్రేమ వుంటుంది. నవలకు, కథకు ముగింపు విషయంలో తేడా వుంటుంది నవల విస్తారంగా సాగి ముగుస్తుంది. ముగింపులో పంచ్ వుండాల్సిన అవసరం పెద్దగా

వుండదు. కథ చిన్నది. పాత్రలు, సంఘటనలు అన్నీ ఒక ముగింపులోకి రావాలి. ప్రతీకాత్మకంగా, సందేశాత్మకంగా చకితులను చేసేదిగా ఇలా ముగింపు ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. అందువల్ల చివరి పేరాలు చాలా ముఖ్యమైనవి. చివరి వాక్యం కూడా కథ ప్రారంభంలోని వాక్యం కన్నా చాలా ముఖ్యమైనది. చివరి వాక్యాలు కథకు ఒక అర్థాన్నిస్తాయి. కథ పేరుకు సార్థకత చేకూర్చాల్సి వుంటుంది.

సాంప్రదాయక కథలు, నూతన పోకడలు పోయే కథలు, ప్రయోగాత్మక కథలు అని కథల్ని మూడు విధాలుగా వర్గీకరించవచ్చు. సాంప్రదాయక కథా వస్తువు సులభంగానే గుర్తు పట్టవచ్చు. నవలలోలాగా ముగింపును కూడా అంచనా వేయవచ్చు. నవలలో లాగానే ముగింపు వుండవచ్చు. సంక్షోభాలు, సన్నివేశాలు అన్నీ పరిష్కారంలోకి రావచ్చు.

నూతన పోకడలు పోయే కథలు కథ ముగింపులో ఏ సమస్యను పరిష్కరించక పోవచ్చు. పాత్రలకు సందేశం వుండకపోవచ్చు. ఇలాంటివి చదివితే చివరి పేజీ మిస్సయిపోయామా అని అనుకునే అవకాశం వుంటుంది. ముగింపుతో కథకుడు కథను కథలోని భావాలను, పాత్రలను ఫీల్ కావాలి. వాటితో మమేకత్వం చెందాలి. అవి తనవిగా భావించగలగాలి. కథ ముగింపులో వేసిన ముడిని విప్పేదిగా కూడా వుండవచ్చు. నీ కథలో లేవనెత్తిన అంశాలు నీ కథనుండి ఆశించినవి ముగింపులో అందించాలి. అందువల్ల ముగింపు పేరాలు ముఖ్యమైనవి.

ముగింపు కథ ప్రారంభానికి కాస్త భిన్నంగా వుంటే మంచిది. కథా ప్రారంభం ఎలా వుందో ముగింపు కూడా అలాగే వుంటే కథ సాగినట్టు అనిపించదు. ప్రారంభానికి ముగింపునకు మధ్య కొంతైనా మార్పు జరగాలి. ముగింపు చివరి పేరాలు శక్తివంతంగా వుంటే మంచిది. ముగింపు పేరాను విడిగా చదివితే దానికదే బలంగా వుండాలి.

### ముగింపుల్లో చెప్పేది ప్రారంభంలోనే చెప్తే ఎలా వుంటుంది?

నా ముగింపుల్లో చెప్పదలుచుకున్నది కథ ప్రారంభంలోనే చెప్తే ఎలా వుంటుందో కొన్ని ప్రయోగాలు చేశాను. అప్పుడు కథకు మరొక ముగింపు సృష్టించాల్సి వస్తుంది. దానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నాను?

ముందే చెప్పినట్టు ముగింపుకోసం టెన్షన్ సృష్టించాక చదువరులు టెన్షన్‌గా చదువుతారు. ఒకసారి చదివాక టెన్షన్ పోతుంది. కనుక రెండవసారి అది చదవనీయదు. ఎందుకంటే టెన్షన్ రిలీజ్ అయిపోయింది. దీన్నే మరో విధంగా చెపుతాను. ట్రాఫిక్‌లో వేగంగా వెళ్లే వాళ్లు అటు ఇటు గల షాపులు, పాదచారులను, బ్యానర్‌లను గమనించకుండా వేగంగా గమ్యం చేరతారు. గమ్యం చేరాక వెనక్కి రావాల్సిన అవసరం రాదు. తన వేగంలో అందమైన షాపులు, జనం ముచ్చట్లు, పార్కులు చూడ్డం అన్నీ వదిలేస్తారు.



అలాగే కథలో వుండే అనేక విషయాలను, లోతైన అంశాలను రెండవ సారి తెలుసుకోవాలని అనిపించదు. ఇలా కొసమెరుపు ముగింపుల వల్ల హమ్మయ్యా అని సేద తీరుతారు. కథ చాలా బాగుందని అనుకుంటారు. టెన్షన్‌తో, కుతూహలంతో చదువుతున్నప్పుడు తరువాత ఏముందో అనేదే టెన్షన్. మూడు గంటల పరీక్షలో రాసిన ఆన్సర్ షీట్‌ను చాలా వేగంగా టెన్షన్‌గా రాసి హమ్మయ్య అని ముగించినట్టుగా వుంటుంది.

ఆ తరువాత కథను పక్కన పడేస్తాం. ఎంత గొప్ప విషయాలైనా మళ్లీ చదవాలని వుండక పోవచ్చు. ఇది ముగింపు, ఉత్కంఠ లక్ష్యంగా కథను రూపొందిస్తే నేనెదుర్కొన్న సమస్య. అందువల్ల దానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కథాంశాలన్నీ అప్రదానం అవుతున్నాయని భావించాను. అలాగే కథను సంభాషణలో చెపితే ఎంత గొప్ప కథాంశమైనా సంభాషణే అనుకుంటారు తప్ప కథ నడిచింది అనుకోరు, కథ రచయిత చాలా చెప్పాడని అనుకోరు. ఇది గమనించిన తరువాత సంభాషణలో కథ ఇమడ్చకూడదు అని నిర్ణయించుకున్నాను. అందువల్ల కథ, సన్నివేశాలు సృష్టించడం, ఉత్తమ పురుషలో నేను పాత్రతో సర్వసాక్షి కథనం వలె విస్తారంగా చెప్పడం అనే శైలి, శిల్పాలతో కథలను చిత్రించాను.

ఎక్కువ కథలు 'నేను'తో ప్రారంభం కావడానికి 'నేను'తో ముగియడానికి నేను వక్తగా ముప్పయ్యేళ్లుగా సభలు, సమావేశాల్లో ప్రసంగించడం, ప్రత్యక్షంగా శ్రోతలు వుండడం, వారి రిసీవింగ్ ననుసరించి ప్రసంగాన్ని ఐదారు నిమిషాలకోసారి సమీక్షించుకుంటూ శ్రోతల హావభావాలననుసరించి సరిచేసుకుంటూ చెప్పడం అలవాటయింది. అందువల్ల అదే శిల్పం, శైలి, కథలకు వచ్చింది. అలా రాయడం నాకు సులభం అన్పించింది. నేనుతో రాసే కథలకు హఠాత్ ముగింపులు సాధ్యం కావు. పరిణామ క్రమమే ముగింపుగా వుంటుంది. 'నేను' పాత్ర స్వయంగా కాలక్రమణికను అనుసరించి సాగుతూ వుంటుంది. అందువల్ల ముగింపులో మలుపులు తక్కువ. అయినా ఆసక్తికరంగా చదవడం చదివించే నేర్పును అలవర్చుకోవడం సాధ్యమే. కథ చెప్పే తీరు సరళంగా, సహజంగా వుంటూ పాఠకులకు మిత్ర వాక్యంలా వుండడం వినయాన్ని, సౌశీల్యాన్ని, సహృదయతను, స్నేహశీలతను తెలుపుతుంది.

ముగింపు లేని కథలు కూడా రాయాల్సి వస్తుంది. 'పాలు', 'ప్రశాంతం', 'ప్రేమధార', 'రాజకీయం', 'తల్లిపాలు', 'నానమ్మ', 'జైలు జీవితం', 'వేపచెట్టు', 'రాత్రిపూలు', 'ఇల్లాలు' మొదలైన కథలు ముగింపు లేని కథలుగా రాయాల్సి వచ్చింది.

ఏమైనప్పటికీ ముగింపులను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటాను. కథ అంతటికి ముగింపు చక్కగా కుదిరిందా అనేది వెరిఫై చేసుకుంటాను. ముగింపు కథ సారాంశం.

అది ముగింపులో అందిందా లేదా చూసుకుంటాను. కథ పేరుకు, ముగింపుకు మధ్య సంబంధం కుదిరిందా లేదా? ఆయా పాత్రలకు సరైన న్యాయమే జరిగిందా? ఆయా పాత్రలు ముగింపులో చెప్పిన దానికనుకూలంగా కథ అంతా నడిచినట్టేనా? లేక అకస్మాత్తుగా చెప్పినట్టయిందా? అలాంటి ముగింపు ఇవ్వాల్సి వస్తే ముగింపు కనుకూలంగా కథ మధ్యలో మరికొన్ని సన్నివేశాలు, సంఘటనలు చిత్రించాల్సి వుంటుందా? చెక్ చేసుకుంటాను. ముగింపు ముందే చెప్పినట్టు మన తరువాతి కథలు చదవడానికి అడ్వాన్సు బుకింగ్ చేసుకునే విధంగా ప్రయత్నిస్తాను. మన కథలంటే ఇష్టపడే విధంగా కథ ముగిస్తే మనకంటూ ప్రత్యేకంగా పాఠకులు పెరుగుతూ వుంటారు. కథ ముగింపు కథ సారాంశాన్ని, థీమ్‌ని, రచయిత ఉద్దేశ్యాన్ని తెలుపుతుందనే విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాను.



<u>**అంకితం... అశ్రునివాళి :**</u>

### మరొక తెలంగాణ ఉద్యమ కారుడు

## ఉప్పులంచ శంకర్

ఉప్పులంచ శంకర్ నా బాల్య మిత్రులలో ఒకరు. కరీంనగర్ జిల్లా మల్యాల తాలూకా ఆరవెల్లి గ్రామంలో 26 జూన్, 1951న నారాయణ, వెంకటమ్మ దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. పద్మశాలి కుటుంబంలో జన్మించిన ఆరవెల్లి శంకర్‌కు వారసత్వంగా కొంత వ్యవసాయం కూడా వుండేది. పుట్టినప్పుడే తండ్రిని కోల్పోయినప్పటికీ తల్లి జగిత్యాలకు చేరి బీడీలు చేస్తూ పిల్లలను చదివించింది. పెద్ద కొడుకు రాములు, మా అన్న రాజనర్సయ్య బాల్య మిత్రులైతే నేను, శంకర్ బాల్య మిత్రులం. ఉస్మానియా యూనివర్సిటీలో చేరడానికి తొలుత వేముల రమణయ్య కాస్త ఆర్థిక సాయం అందించాడు. ఆ తరువాత శంకర్ హైకో ఫ్యాబ్రిక్స్ (నేటి ఆప్కో)లో కొంతకాలం, ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో కొంతకాలం ఉద్యోగం చేసాడు. గోదావరిఖనిలో డిగ్రీ చేసిన నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా పెట్రోల్ పంపు మంజూరు చేయడంతో ఉద్యోగం వదులుకొని గోదావరిఖనిలో స్థిరపడ్డాడు.

జగిత్యాలలో 1959-60లో అయిదో తరగతి నుండి నేను, శంకర్ చిన్న నాటి స్నేహితులం. క్లాస్‌మేట్‌లం. 12వ తరగతి దాకా కలిసి చదువుకున్నాం. ఆయన నాతో పాటు 1967 మార్చిలో 12వ తరగతి కామర్స్ ఆప్షనల్‌తో పాసయ్యాక జగిత్యాల డిగ్రీ కాలేజిలో చేరి బి.కామ్. చేశాడు. అదే క్రమంలో 1968 నుండి వేగవంతమైన తెలంగాణ సేఫ్ గార్డ్స్, ఆంధ్ర గోబ్యాక్, 1969లో ఉధృతమైన జై తెలంగాణ ఉద్యమాల్లో కాలేజి కార్యదర్శిగా పాల్గొన్నారు. జైళ్ల పాలయ్యారు. ఒక విద్యా సంవత్సరం కోల్పోయాడు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర నిర్వహిస్తూనే అందరితో స్నేహం చెరిగిపోకుండా చూసుకున్నాడు. డిగ్రీ తరువాత హైదరాబాద్ చేరి ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి. చేశాడు. అప్పుడే ఆయన ప్రపంచం విశాల ప్రపంచంగా ఎదిగింది. ఆయన చూపు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి ఎదిగింది.

12 డిసెంబర్, 2009 శనివారం ఉదయం అమరుడైన మరొక తెలంగాణ ఉద్యమ కారుడు ఉప్పులంచ శంకర్. ఆయన జీవితం అరవయ్యేళ్ళ తెలంగాణ సామాజిక పరిణామాలకు సాక్షి. ఉప్పులంచ శంకర్ జీవితంలో వ్యక్తిగత జీవితం ఎంత ఉందో సామాజిక జీవితం అంతకు తక్కువ లేదు. గోదావరిఖని వంటి ప్రాంతంలో వుండడం వల్ల, జగిత్యాల డిగ్రీ కాలేజిలో, తెలంగాణ ఉద్యమంలో, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి కార్యకర్తగా నిర్వహించిన కార్యక్రమాలు, తొలినాళ్లలో నా ప్రేరణతో ఆరెస్సెస్‌లో నిర్వహించిన క్రియాశీల పాత్ర ఆయన వ్యక్తిత్వాన్ని సామాజిక వ్యక్తిత్వంగా విస్తరిస్తూ వచ్చాయి. రాజకీయాల్లో బీసీ,

ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ప్రజాస్వామికంగా ఎదగలిగే అవకాశాలు వుండి వుంటే మరిన్ని ఎత్తులకు ఎదగగలిగే నాయకత్వంగా ఎదిగినవాడు శంకర్.

జగిత్యాల మల్టీపర్పస్ హైస్కూల్‌లో ఎంతోమంది స్నేహితులను సంపాదించుకొన్నాడు. డిగ్రీ కాలేజిలో మరింతమంది స్నేహితులను సంపాదించుకొన్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో చేరాక ఆయన స్నేహ వర్గం మరింత పెరిగింది. వందలాది మంది స్నేహితులను ఎప్పుడూ గుర్తు చేస్తుండేవాడు. ఎవరు, ఎక్కడ పనిచేస్తున్నారో, ఏం పని చేస్తున్నారో అందరికీ గుర్తు చేసే సమన్వయకర్తగా ఆయన దశాబ్దాలుగా స్నేహితుల మధ్యన ఒక వారధిగా నిలిచారు. అలా దూర తీరాల్లోకి, విభిన్న రంగాల్లోకి మళ్లిన వాళ్లందరినీ తిరిగి బాల్యాన్ని గుర్తు చేస్తూ, స్నేహాన్ని కొనసాగిస్తూ అందర్నీ మానసికంగా సన్నిహితం చేయడంలో ఆరవెల్లి ఉప్పులంచ శంకర్ నిర్వహించిన పాత్ర ఎనలేనిది.

మా క్లాస్ మేట్ అయిన ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ॥ డా॥ పి. జయప్రకాశ్, ఉస్మానియా యూనివర్సిటీలో రూమ్‌మేట్‌గా కలిసి జీవించిన మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి , మాతంగి నర్సయ్య, కొప్పుల ఈశ్వర్, తదితరులు శంకర్ ఆప్త మిత్రుల్లో కొందరు. గోదావరిఖని, జగిత్యాల, మల్యాల ప్రాంతాల్లోని రాజకీయ నాయకులు ఏ పార్టీ వారైనా శంకర్ స్నేహాన్ని అభిమానించే వారు. వారందర్నీ తన వారుగా శంకర్ గౌరవించే వాడు. అవసరమైనప్పుడు వారి ఎన్నికల ప్రచారాల్లో పార్టీల కతీతంగా, స్నేహానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రచారం చేసేవాడు. గోదావరిఖనిలో మాతంగి నర్సయ్య, సోమారపు సత్యనారాయణ, కొప్పుల ఈశ్వర్, జగిత్యాలలో జీవన్ రెడ్డి, పెద్దపెల్లిలో వేముల రమణయ్య తదితరులకు ఎన్నికల్లో తనవంతు స్నేహ హస్తాన్ని అందించాడు.

శంకర్ సామాన్యుల్లోంచి ఎదిగిన అసమాన నాయకుడు, వ్యాపారవేత్త, యజమాని. ఆయన గోదావరిఖని ఫెర్టిలైజర్ సిటీ ప్రాంతంలో శ్రీకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్‌పంపు డీలర్‌గా వుంటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీలర్ల తెలంగాణ ప్రాంత సంఘంలో చురుకుగా పాల్గొన్నాడు. దాన్ని నిర్మించడంలో క్రియాశీలంగా పనిచేశాడు. తెలంగాణలో అత్యధిక అమ్మకాలు జరిపిన వాడిగా కల్తీలేని పెట్రోల్ పంపు నడుపుతున్న వాడిగా ప్రసిద్ధుడయ్యాడు. ప్రశంసా పత్రాలు పొందాడు. తోటి డీలర్లు కష్టాల్లో వున్నప్పుడు వారికి సహాయం చేయడం తన కర్తవ్యంగా భావించేవాడు.

పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలో ఎన్నో ట్రేడ్ యూనియన్‌లు కొనసాగుతుండేవి. వాటి మధ్య పోటీ వైరుధ్యం కూడా అప్పుడప్పుడు సంఘర్షణకు దారి తీసేది. ఒకరికి దగ్గరగా వుంటే మరొకరికి కోపం. శ్రీకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ యజమానిగా, ఎన్టీపిసిలో లేబర్ కాంట్రాక్టర్‌గా శంకర్ అందర్నీ కలుపుకు పోయేవాడు. అందరికీ ఆత్మీయ మిత్రుడుగా కొనసాగాడు. అది వాస్తవంగా కత్తిమీద సాము వంటిది. అలాంటి సామును విజయవంతంగా చేసిన వినయశీలి.



ఉప్పులంచ శంకర్ తెలంగాణ రాష్ట్రం గురించి నిరంతరం తపన పడుతుండేవాడు. అనేక విధాలుగా సహకరిస్తుండేవాడు. నా రచనా రంగంలో ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ అందరికీ గర్వంగా మా వాడు అని చెప్పుకుంటూ వుండేవాడు. అందరికీ పరిచయం చేస్తూ వుండేవాడు. కె.సి.ఆర్. తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష పట్టడం, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్‌లో ఆందోళన చేయడం శంకర్‌ను తిరిగి నాలుగు దశాబ్దాల జ్ఞాపకాల్లోకి, బాల్యంలోకి తీసుకెళ్లింది. వరసగా మూడు, నాలుగు రోజులు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల నిరాహార దీక్షలో ఎలాగోలా వెళ్లి కూర్చుని సాయంత్రానికి తిరిగి వచ్చేవాడు. బోంచేసి టీవీముందు కూర్చుని ఆందోళనగా చూస్తుండేవాడు. అలా వరసగా నిద్రలేని రాత్రులతో శరీరంలో మార్పులు వచ్చాయి. మంగళవారం ఉదయం చెమటలతో పాటు వాంతి కావడం గుండెపోటు అని ఎవరికీ తోచలేదు. తిరిగి బుధవారం ఉదయం చెమటలతో వాంతి కావడంతో హాస్పటల్‌కు తీసుకెళ్లడం జరిగింది. అప్పటికే తీవ్ర నష్టం జరిగిపోయింది. అపోలో ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. మనిషి దక్కలేదు. ఇలా నిరంతరం తెలంగాణ కోసం పరితపిస్తూ తెలంగాణ రాష్ట్రం ఇంకా ప్రకటించలేదేమని రంధితో, నిద్రలేమితో గుండెపోటుతో అమరుడయ్యాడు. తెలంగాణ అమరవీరుల్లో ఒకరుగా చేరిపోయాడు.

2 మార్చి, 1975న ఉప్పులంచ శంకర్‌కు పార్వతితో వివాహం జరిగింది. వారికి నలుగురు సంతానం. నలుగురు ఆడపిల్లలే. పిల్లలను చక్కగా చదివించాడు. అందరికీ స్నేహ హస్తాన్ని అందిస్తూ ఇవ్వడమే తప్ప ఇతరుల నుండి తీసుకోవడం అలవాటు లేని వ్యక్తిత్వంతో ఎదిగిన స్నేహశీలి శంకర్ హఠాన్మరణం స్నేహబృందానికి, కుటుంబ సభ్యులకు, సమాజానికి తీరని లోటు.

శంకర్, నేను హైదరాబాద్‌లోని శివం రోడ్‌లో ఒకే వీధిలో కిరాయకు వున్నాము. కుటుంబ సంబంధాలు మరింత సన్నిహితమయ్యాయి.

శంకర్ మరణ వార్త విని నా హృదయం మూగబోయింది. శరీరం కుదేలయింది. అప్పుడే మా తరం చనిపోయే క్రమం మొదలైందా అని మనసు చెదిరిపోయింది. జీవితం ఇంతేనా! అకస్మాత్తుగా శ్వాస ఆగిపోవడమా! అని పరిపరి విధాల మనసు కొట్టుకుంది. స్నేహితుల్లో ఇంత సన్నిహితంగా వుంటూ చనిపోయింది శంకరే. శంకర్ భౌతిక కాయాన్ని చూస్తూ శంకర్! చిదంబరం తెలంగాణ ఇస్తామని ప్రకటించారు. లేచిరా రా!... అంటూ మనసులో మూగగా ఏడ్చేశాను.

శంకర్ ఇటీవలే ప్రారంభించిన నా స్వీయ చరిత్ర రచనలో అనేక విషయాలను గుర్తు చేసి నమోదు చేయించాడు. ఆయన ఒక సామాజిక పరిణామంలో వికసిస్తూ వచ్చిన మానవుడు.

మనిషి మరణిస్తాడు. జ్ఞాపకాలు కొనసాగుతాయి. చరిత్ర పరిణామం సాగుతునే వుంటుంది. సామాజిక పరిణామంలో చారిత్రక వ్యక్తులుగా కొందరు మిగిలిపోతుంటారు. అలాంటి వారిలో ఉప్పులంచ శంకర్ ఒకరు. శంకర్‌కు నా అశ్రు నివాళి. ***(23.12.2009)***

## బి.ఎస్.రాములుగారి జీవిత పరిచయం

**పుట్టిన తేదీ, స్థలం** : ఆగస్టు 23, 1949, జగిత్యాల పట్టణం, కరీంనగర్ జిల్లా. పద్మశాలి కుటుంబం.

**తల్లిదండ్రులు** : కీ. శే. బేతి లక్ష్మిరాజు, కీ. శే. మిట్టపెల్లి నారాయణగారల ద్వితీయ పుత్రుడు. తండ్రి బొంబాయి బట్టల మిల్లు కార్మికుడు. ఆరో యేట 1955లో తండ్రి మృతి. తల్లి బీడీ కార్మికురాలిగా పిల్లలను పెంచి పోషించింది. 1991 జనవరి సంక్రాంతి రోజున మృతి.

**బాలశిక్ష** : సాతాని అయ్యోరు పంతులు, జగిత్యాల

**ప్రాథమిక విద్య** : 1955–60 మర్కజి (సెంట్రల్) ప్రైమరీ స్కూలు, జగిత్యాల.

**హైస్కూలు విద్య** : 1960–67 మల్టీపర్పస్ హైస్కూలు, జగిత్యాల.

**కళాశాల విద్య** : 1970–74 డి.ఓ.ఎల్, బి.ఓ.ఎల్, శ్రీలక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి, కరీంనగర్ జిల్లా.

**తెలుగుపండిత శిక్షణ** : 1979–80 కాకతీయ యూనివర్సిటీ, బీఈడీ కాలేజీ, హన్మకొండ.

**పెళ్లి** : 17, మే 1973, చెన్న నారాయణ, చెన్న గౌరమ్మల ఎనిమది పిల్లల్లో నాలుగో సంతానం ప్రథమ పుత్రిక – చెన్న శ్యామలతో, పైడిమడుగులో మెట్‌పల్లి తాలూకా, కరీంనగర్ జిల్లా. సాంప్రదాయిక వివాహం.

**రచనారంగం** : విద్యార్థి దశలో 1964 నుండి రచనలు చేస్తున్నారు. సాహిత్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**నిరుద్యోగం** : 1967–75 హైస్కూలు విద్యార్హతతో పోస్టాఫీసులో రావాల్సిన ఉద్యోగం రాకపోవడం, ఇతర ప్రాంతాల వాళ్ళు ఉద్యోగాలు ఆక్రమించడం వల్ల తొమ్మిది సంవత్సరాల పాటు నిరుద్యోగంలో చిన్న చిన్న వృత్తులు.

**ఉద్యోగం** : 17–12–1975 సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగం. 31 జులై 2007 ఉద్యోగ విరమణ.

**ఉద్యమాలు** :

1 ధర్మపురి కళాశాలలో విద్యార్థి ఉద్యమాల నిర్వహణ. 1964లో ఆరెస్సెస్ శాఖకు వెళ్లుట. 1967 నుండి 1972 ఆర్ఎస్ఎస్ ముఖ్య శిక్షక్‌గా జగిత్యాల, ధర్మపురిలలో ఆరెస్సెస్ నిర్మాణం. 1976 నుండి సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం, జిల్లా, రాష్ట్ర శాఖల నిర్వహణ.

1 1977–80 ఉద్యోగ సంఘాల నిర్మాణంతో పాటు పీడీఎస్‌యూ, ఆర్ఎస్‌యూ విద్యార్థి యువజన సంఘాల నిర్మాణంలో చేయూత నందించడం. అధ్యయన తరగతుల నిర్వహణ. 1978 నుండి పౌరహక్కుల సంఘం, హుజూరాబాద్, రాడికల్ విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణం, అంబేడ్కర్ సంఘాల నిర్మాణం. జిల్లా కార్యక్రమాలు.

1 1980 నుండి విరసం సభ్యులు. 1983– పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి. 1984 జనవరి విరసం సభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. 1984లో అనంతపూర్‌లో జరిగిన రాడికల్ యువజన సంఘం రాష్ట్ర మహా సభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక.

1 1984–88 రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. నక్సలైట్ కార్యకలాపాలు చేస్తున్నారనే ఆరోపణలతో 1984 జనవరిలో జగిత్యాలలో అరెస్టు. కరీంనగర్ జైలులో నిర్బంధం. ఉద్యోగం నుండి సస్పెండ్ చేయుట. అప్పటి నుండి పూర్తి కాలం రాడికల్ యువజన సంఘం, పౌర హక్కుల సంఘం, రాష్ట్ర కార్యకలాపాల నిర్వహణ.

1 1985లో పెరిగిన నిర్బంధం వల్ల 1985 జూన్ నుండి 90 వరకు రహస్య జీవితం. ఈ కాలంలో గద్దర్, వరవరరావు, సంజీవ్ తదితరులతో కలిసి అఖిలభారత సాహిత్య, సాంస్కృతిక, ఉద్యమ ప్రచార యాత్ర నిర్వహణ.

1 1990 ఏప్రిల్ 1న కరీంనగర్ జిల్లా మంథనిలో జరిగిన రాడికల్ యువజన సంఘం జిల్లా మహా సభల్లో బహిరంగ జీవితంలోకి రాక. ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి హయాంలో పోలీస్ కేస్ పెండింగ్‌లో ఉంచి తిరిగి ఉద్యోగంలో చేర్చుకుంటూ జిల్లా కలెక్టర్, ఉత్తర్వులతో 17 ఏప్రిల్ 1990లో సుల్తానాబాద్‌లో ఉద్యోగంలో చేరిక. జూలైలో జగిత్యాల బదిలీ.

1 1997 దాకా జగిత్యాలలో ఉద్యోగం. 1997 – 2000 సిరిసిల్లలో ఉద్యోగం. తర్వాత తిరిగి జగిత్యాలలో ఉద్యోగం. 2003 నుండి దీర్ఘ కాలిక లీవు పెట్టి పూర్తి కాలం సామాజిక జీవితానికి అంకితం చేశారు.

1 1990 నుండి రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల ఐక్యత కోసం పూలే, అంబేడ్కర్ బుద్ధిస్ట్ దృక్పథంతో సాహిత్య, భావజాల ఉద్యమాల నిర్మాణం. రాష్ట్రవ్యాప్త పర్యటన. వందలాది ప్రసంగాలు.

1 1992 డిసెంబర్ 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక ఏర్పాటు. దానికి వ్యవస్థాపక కన్వీనర్.

1 1993 ఫిబ్రవరి 12, 13 తేదీల్లో హైదరాబాద్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆం.ప్ర. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నిక. రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రచయితలను కళాకారులను సామాజిక కార్యకర్తలను తీర్చిదిద్దుట. రాజకీయ రంగంలో ఈ దృష్టితో పనిచేసే యువతరాన్ని తయారుచేయుట.

1 1996 నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సభలు, సమావేశాలు వ్యాసాలు ప్రసంగాలు. తెలంగాణ రచయితల, కళాకారుల, మేధావుల సమీకరణ. సైద్ధాంతిక వ్యాసాలు, పుస్తకాలు. తెలంగాణ రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక కన్వీనర్.

**తెలంగాణ తల్లి రూపకల్పన** : తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, భాషను వెలికి తీస్తూ, ఉద్యమిస్తూ అందులో భాగంగా తెలంగాణ తల్లి రూపకల్పన చేశారు. క్యాలండర్‌లు, విగ్రహాలు వెలయించారు.

**పత్రికా సంపాదకత్వం** : 1977లో సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగస్తుల కోసం సంఘమిత్ర పత్రిక ప్రచురణ. 1980 నుండి మంటలు పక్షపత్రిక. సృజన మాసపత్రిక. 1983 నుండి చాటింపు పక్షపత్రిక సంపాదక మిత్ర మండలిలో కృషి. 84లో కరీంనగర్ కేంద్రంగా జీవగడ్డ దినపత్రిక నిర్వహించాలని విజయ కుమార్‌తో అవగాహన. మధ్యలో నిర్బంధం వలన ఆగిపోవుట. 1995 నుండి దరకమే ఐక్యవేదిక తరపున గబ్బిలం మాసపత్రిక ప్రచురణ.

**ఆం.ప్ర. దరకమే ఐక్య వేదిక ద్వారా కృషి :**

- దరకమే ఐక్య వేదిక రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలు, సభలు, సమావేశాలు.
- వందలాది పాటలు, కథలు, 200 పుస్తకాలు వెలువడ్డాయి. కంచ ఐలయ్య గారి నేను హిందువునెట్లయిత గ్రంథం దరకమే ఐక్యవేదిక పునాది నుండి వెలువడిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. వందలాది వ్యాసాలు, దేశవ్యాప్తంగా ప్రసంగాలు.
- 125పైగా పుస్తకాలకు పీఠికలు. కథా శిక్షణా శిబిరాలు సాహితీ శిక్షణా తరగతులు సిద్ధాంత అధ్యయన తరగతులు.
- 150కి పైగా కథలు, ఆరు నవలలు, 150 సిద్ధాంత వ్యాసాలు, 150 సాహిత్య వ్యాసాలు, పది తాత్వికగ్రంథాలు, మూడు అలంకార శాస్త్ర గ్రంథాలు.
- వివిధ కథా సంకలనాల్లో వీరి కథలు 50 వరకు ప్రచురించబడ్డాయి.
- రాష్ట్రంలో వివిధ సంస్థల ద్వారా, ఇతర రాష్ట్రాల్లో నాగపూర్, ఢిల్లీ, పానిపట్, నగరాల్లో పలు సత్కారాలు, సన్మానాలు.
- 1993లో కథా సాహితీ వేదిక ప్రారంభం.

**కరీంనగర్ బుక్ ట్రస్ట్ ప్రచురణలు** :1982లో నిజాం వెంకటేశంతో కలిసి కరీంనగర్ బుక్‌ట్రస్ట్ స్థాపన. బతుకుపోరు నవల, భూమి, బొగ్గు పొరల్లో, అడవిలో వెన్నెల కథా సంపుటాల ప్రచురణ.

**విశాల సాహిత్య అకాడమీ స్థాపన** :బహిరంగ జీవితంలో వచ్చాక 1990లో విశాల సాహిత్య అకాడమీ ప్రారంభించారు. పుస్తకాల ప్రచురణ. కథా శిక్షణ శిబిరాల నిర్వహణ. సాహిత్య సభలు. సిద్ధాంత అధ్యయన తరగతుల నిర్వహణ. వందలాది యువ రచయితలను తీర్చిదిద్ది వారి రచనలను పత్రికల్లో ప్రచురణకై చేయూత. వారి పుస్తకాల ప్రచురణ. వందలాది యువ రచయితలకు ఇంటింటి గ్రంథాయం ఏర్పాటు చేసుకోవడానికి కృషి.

**సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం** : 2002 నుండి సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం స్థాపన. సభలు, సమావేశాలు, పుస్తక ప్రచురణ. విశాల సాహితి, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం తరపున 90 పుస్తకాల ప్రచురణ.

**గృహ గ్రంథాలయం** : వందలాది గ్రంథాలతో 1980 నుండి గృహ గ్రంథాలయ నిర్వహణ. ఉద్యమ కారులుగా విద్యార్థులను, యువకులను చైతన్య పరచుట కోసం మొబైల్ గ్రంథాలయ నిర్వహణ. 1984లో పోలీసులు అరెస్టు చేసినపుడు పుస్తకాలు ఎత్తుకుపోయారు. 1990నుండి తిరిగి పుస్తకాల కొనుగోలు. గ్రంథాలయ నిర్వహణ. 2004లో షోలాపూర్ గ్రంథాలయానికి 600 గ్రంథాలు వితరణ. పరిశోధక విద్యార్థులకు సహకారం.

**కార్యాలయ స్థాపన** : 1992 నుండి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీగారి జల దృశ్యంలో దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక కార్యాలయ నిర్వహణ. 2002 నుండి విశాల సాహితి, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయానికి ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ సమీపంలో కార్యాలయ నిర్వహణ. పుస్తక ప్రచురణ వేగవంతం చేయడం.



**ముఖ్యమైన ఉద్యమాలు** : 1977–1990 నక్సలైట్ భావజాలంతో పలు ప్రజాసంఘాల ఉద్యమాల నిర్మాణం. 1985–90 దేశ వ్యాప్తంగా పర్యటన. వందలాది రచయితలతో, కళాకారులతో, ఉద్యమ కారులతో చర్చలు, ప్రసంగాలు. 1996–2008 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. 1990–2008 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత కోసం అనేక సంస్థల నిర్మాణం, అధ్యయన తరగతులు. సాహిత్య శిక్షణ తరగతులు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలు. బుద్ధుడి నుండి జ్యోతిరావు పూలే, అంబేద్కర్‌ల దాకా సామాజిక తాత్వికత భూమికను అంబేద్కరిజంగా సమన్వయం చేసి రాష్ట్ర వ్యాప్తంగా భావజాల ఉద్యమ నిర్మాణం.

**భావజాల ఉద్యమం** : 1991లో వెలువడిన 'గతితర్క తత్వదర్శన భూమిక' అనే తాత్విక గ్రంథం తెలుగునాట భావజాల చర్చతీరును పూర్తిగా మార్చివేసింది. ప్రపంచ భావజాల ఉద్యమరంగంలో ఈ గ్రంథం ఒక మైలురాయి. ఈ గ్రంథం బీసీ, ఎస్సీ, ఎస్టీల వేదికైన దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక నిర్మాణానికి తాత్విక పునాది. 'గతితర్కం – అంబేద్కరిజం – మార్క్సిజం', 'అంబేద్కరిజం – సోషలిజం', 'నేను ఎవరు?', 'ప్రేమ అంటే ఏమిటి?', 'భౌతికవాద ప్రాపంచిక దృక్పథం', 'జ్ఞానం పుట్టుక', 'బహుజన తత్వం', 'బీసీలు ఏం చేయాలి?', 'భారతీయ చరిత్ర – శూద్ర దృక్పథం', 'బీసీలకు రాజకీయ అధికారం', 60 ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు', వందలాది పత్రికా వ్యాసాలు.

**అరెస్టులు** :

- 1980లో గ్రామాలకు తరలండి అని విరసం ఇచ్చిన పిలుపుతో వేములవాడ తాలూకా కోనరావుపేటకు వెళ్ళిన సందర్భంగా అరెస్టు.
- 1984 జనవరి 21న అరెస్టు. వారం రోజుల పాటు లాకప్‌లో. 20 రోజులు కరీంనగర్ జిల్లా జైలులో.
- 1985 ఏప్రిల్ 20వ తేదీన ఇంద్రవెల్లి సభ సందర్భంగా గుడి హత్నూరులో అరెస్టు. పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.బాలగోపాల్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.మురళీమనోహర్, ప్రొ॥ సీతా రామారావు తదితరులతో కలిసి మూడు రోజులు ఉట్నూరు, ఆదిలాబాద్‌లలో లాకప్‌లో.
- 1987లో హైదరాబాద్‌లో అరెస్టు. తప్పించుకోవడం

**విశ్వవిద్యాలయ సెమినార్లు** : కాకతీయ, ఆంధ్ర, ఉస్మానియా, శ్రీకృష్ణదేవరాయ, విశ్వవిద్యాలయాల్లో సెమినార్ పత్రాలు.

**అవార్డులు** :

- కొడవటిగంటి కుటుంబరావు స్మారక విప్లవ కథకు ఇచ్చే పురస్కారం – ఆదివాసుల జీవితాన్ని – పోరాటాన్ని చిత్రించిన "అడవిలో వెన్నెల" కథకు 1984 అక్టోబరు 28న తెనాలిలో కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, కొడవటిగంటి వరూధినిల నేతృత్వంలో పురస్కారం.
- బీడీ కార్మికుల జీవితాలను చిత్రించిన 'బతుకుపోరు' నవలకు 1992లో డా॥దాశరథి రంగాచార్య పురస్కారం.
- మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, బీ.సీ. ఉద్యమ నాయకులు, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం 1992.

- వరంగల్ జిల్లా 'పాలకుర్తి సోమన కళాపీఠం' వారి "పాల్కురికి సోమన" పురస్కారం–1995.
- ప్రముఖ హేతువాది త్రిపురనేని రామస్వామి చౌదరి పేరిట గల తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం–1995.
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారిచే 2002 లో బి.యస్.రాములు 'మమతలు మానవ సంబంధాలు' కథ సంపుటికి ఉత్తమ కథా సంపుటి పురస్కారం.
- షోలాపూర్–సిరిసిల్ల పద్మపీఠం వారిచే "పద్మాంజలి అవార్డు"–2001.
- దళిత సాహిత్య అకాడమీ, ఢిల్లీ వారిచే మహాత్మా జ్యోతిరావ్ పూలే ఫెలోషిప్ 2001.
- హర్యానాలోని పానిపట్‌లో ప్రేమ్‌చంద్ సమకాలికులు జయప్రకాశ్ నారాయణ్ సహచరుడైన బిహార్ కథకుడు రామవృక్ష బేనిపురి శతజయంతి పురస్కారం 2003.

**స్వర్ణకంకణాలు :**

- టిఆర్ఎస్, కెసిఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ సంబురాలు–2007లో తెలంగాణ తల్లి రూపకల్పన చేసిన సందర్భంగా బంగారు గండపెండేరంతో నిజాం కాలేజి, హైదరాబాద్‌లో సత్కారం
- డా॥ పి.యశోదారెడ్డి స్మారక తొలి పురస్కారం, స్వర్ణకంకణం. తేది : 4-11-08

**ఇతర విశేషాలు** : 50వ జన్మదిన స్వర్ణోత్సవాల సందర్భంగా జగిత్యాలలో సాహిత్య సదస్సు. 'సామాజిక తత్వవేత్త' బిరుదు ప్రదానం. 50వ జన్మదిన ప్రత్యేక సంచిక ప్రచురణ. పలు సామాజిక రాజకీయ, సాహిత్య అంశాలపై ఇంటర్వ్యూలు. 52 పుస్తకాల ప్రచురణ. మరో 10 పుస్తకాలు అముద్రితాలు. తల్లి మిట్టపల్లి లక్ష్మీరాజు పేరిట 27 మందికి విశాల సాహితీ కథా పురస్కారాల ప్రదానం.

**సామాజిక సేవారంగం** : మద్యపాన వ్యతిరేక, అవినీతి వ్యతిరేక ఉద్యమాలు. పేదలను విద్యావంతులను చేయడం. వ్యక్తిత్వ వికాసం తోడ్పాటు. ఆత్మవిశ్వాసం పెంచడం. రచయితల్లో, సామాజిక కార్యకర్తల్లో వారి సృజన, నాయకత్వ శక్తి సామర్థ్యాలను వెలికి తీయడం, ప్రోత్సహించడం. స్త్రీ విద్య ప్రాధాన్యత. ప్రజాస్వామ్య హక్కుల ప్రాధాన్యత వివరించడం. ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ. పర్యావరణ, ఆరోగ్య చైతన్యం. కనీస కూలీల, జీవన ప్రమాణాల పెంపుదలకోసం ఉద్యమించడం. పొదుపు ఉద్యమాల ఆవశ్యకత. ఆధునిక సమాజంలో అందుకోవాల్సిన స్థానం గురించి చేయూత నందించడం.

**సంఘ సంస్కరణ** : కులాంతర, మతాంతర వివాహాల ప్రోత్సాహం. కులాతీత, మతాతీత ప్రజాస్వామ్య, సామ్యవాద, సమగ్ర సామాజిక వికాసానికై సమస్త రంగాల్లో సంఘ సంస్కరణలకు ఉద్యమించడం. మూఢ విశ్వాసాల నిర్మూలన, వర్ణ, కుల వివక్షతల వ్యతిరేక ఉద్యమాలు, స్త్రీ విద్య, ఆయా కుల సంఘాలను సంఘ సంస్కరణలకై తీర్చిదిద్దుట. హిందూ, ముస్లిం, క్రైస్తవుల సమైక్యత. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజకీయ సామాజిక, సాంస్కృతికై కృషి. వివాహ పద్ధతులను, పండగలను, పాత సంస్కృతిని సంస్కరించుట. ఆధునిక విద్య, సమస్త అవకాశాలు అందరికీ అందేందుకు కృషి. కూడు, గుడ్డ, నీడ కోసం, జీవన ప్రమాణాల కోసం సమస్త మానవాళి వికాసం కోసం కృషి.



# బి.ఎస్.రాములు రచనలు

**కథలు–నవలలు**

| | | |
|---|---|---|
| 1. | బతుకుపోరు నవల (మూడవ ముద్రణ–2004) | 1982 |
| 2. | పాలు – కథల సంపుటి | 1991 |
| 3. | స్మృతి కథల సంపుటి | 1997 |
| 4. | మమతలు–మానవ సంబంధాలు కథల సంపుటి | 2000 |
| 5. | వేపచెట్టు తెలంగాణ కథలు | 2003 |
| 6. | తేనెటీగలు – కథల సంపుటి | 2004 |
| 7. | పాలు–ఇతర కథలు | 2004 |
| 8. | బతుకుపయనం – కథల సంపుటి | 2005 |

**తత్వశాస్త్రం**

| | | |
|---|---|---|
| 1. | గతితర్క తత్వదర్శన భూమిక | 1991 |
| 2. | గతితర్కం – అంబేద్కరిజం – మార్క్సిజం | 1993 |
| 3. | అంబేద్కరిజం – సోషలిజం | 1994 |
| 4. | ప్రేమ అంటే ఏమిటి? (మూడవ ముద్రణ–2004) | 1996 |
| 5. | జ్ఞానం పుట్టుక | 1998 |
| 6. | భౌతికవాద ప్రాపంచిక దృక్పథం | 1998 |
| 7. | నేను ఎవరు? గతితర్క తత్వదర్శన భూమిక | 1998 |
| 8. | బహుజనతత్వం (బీసీ, ఎస్సీ, ఎస్టీ సిద్ధాంతాలు–కార్యాచరణ) | 2004 |
| 9. | వ్యక్తిత్వ వికాసం–సామాజిక నాయకత్వం | 2006 |
| 10. | జీవితం అంటే ఏమిటి ? | 2006 |
| 11. | 60ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు | 2007 |

**వర్తమాన రాజకీయాలు–సామాజిక అంశాలు, వ్యక్తిత్వ వికాసం**

| | | |
|---|---|---|
| 1. | భారతీయ సమాజం–నేటి రాజకీయ సామాజిక పరిణామాలు | 2004 |
| 2. | యుపిలో బిఎస్‌పి గెలుపు | 2007 |
| 4. | పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సోషల్ లీడర్‌షిప్ | 2008 |
| 5. | వాట్ ఈజ్ లైఫ్ | 2008 |
| 6. | రాజ్యం – ప్రజలు | 2008 |
| 7. | సామాజిక న్యాయం అంటే ఏమిటి? | 2008 |
| 8. | అంతర్జాతీయ పరిణామాలు–దేశీయ మానవ సంబంధాలు | 2010 |

**సాహిత్య విశ్లేషణ–అలంకార శాస్త్రాలు**

| | | |
|---|---|---|
| 1 | కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి? (6వ ముద్రణ–2005) | 1993 |
| 2. | దళిత సాహిత్య గర్జన (మూడవ ముద్రణ–1995) | 1993 |
| 3. | సాహూ ఇంటర్వ్యూలు | 1994 |
| 4. | కథలబడి – కథా సాహిత్య అలంకార శాస్త్రం | 1998 |

5. సమగ్ర సామాజిక కథ 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు 2003
6. సాహిత్య చరిత్రను కొత్త చూపుతో తిరగరాయాలి 2004
7. పాట పుట్టుక 2008
8. తెలంగాణ కథకులు-కథన రీతులు (మొదటిభాగం) 2008
9. తెలంగాణ కథకులు-కథన రీతులు (రెండవభాగం) 2008
10. కథా రచన-పాఠాలు 2011
11. బీసీ కథలు (సామాజిక నేపథ్యం-విశ్లేషణ) : 2000-2010 2011

**బీసీల గురించి**

1. బీసీలు ఏం చేయాలి? 2004
2. బీసీ, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థి యువజనులారా! 2004
3. బీసీలకు రాజకీయ అధికారం 2007
4. భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం 2007
5. బీసీలు సాధికారికత 2008

**తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు-చరిత్ర-సంస్కృతి గురించి**

1. తెలంగాణ తల్లి ఎరుక 2005
2. తెలంగాణ రాష్ట్ర చరిత్ర 2006
3. తెలంగాణ రాష్ట్రం-నడుస్తున్న చరిత్ర 2006
4. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం - భవిష్యత్ కార్యక్రమాలు 2006
5. తెలంగాణ జైత్రయాత్ర 2007
6. అదిగదిగో తెలంగాణ-ఎంతో దూరంలో లేదు 2007
7. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మించండి
మీ పూరిని మీరే అధ్యయనం చేయండి 2007
8. తెలంగాణ ఉద్యమంలో నక్సలైట్ల పాత్ర 2007
9. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మలుపులు 2007
10. తెలంగాణ స్టేట్ నీడ్ ఆఫ్ రివైవల్ 2008
11. తెలంగాణ స్టోరీస్ 2008
12. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలు ఉద్యమాలు 2008
13. ప్రత్యేక తెలంగాణ 2010
14. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం 2010
15. సమైక్యాంధ్ర వాదులకు సవాలక్ష ప్రశ్నలు 2010
16. జయహో ఆంధ్ర 2010
17. సంక్షిప్తంగా నూరేళ్ల ఉద్యమాలు-వాటి నాయకత్వం 2010
18. శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన మెమోరాండం (183 పేజీలు) 2010

## బి.ఎస్.రాములు గురించి వెలువడిన గ్రంథాలు

1. బి.ఎస్.రాములు50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక 1998-2000
2. బి.ఎస్.రాములు కథలు-పరిశీలన 2007
కర్రె సదాశివ్, కాకతీయ యూనివర్సిటీ ఎంఫిల్ పొందినగ్రంథం
3. బి.ఎస్.రాములు బతుకుపోరు నవల-సామాజికత 2008
పల్లా మాలతి చంద్ర, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ
గోల్డ్ మెడల్ పొందిన ఎం.ఫిల్ గ్రంథం
4. బి.ఎస్.రాములు 'బతుకుపయనం' కథలు-పరిశీలన
మొయిలి మోహనరావు, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ 2011
5. బి.ఎస్.రాములు 'బతుకుపోరు నవల-పరిశీలన'
ఎం.లలిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ 2011
6. బి.ఎస్.రాములు కథలు - సామాజిక పరిణామాలు
నందిగామ నిర్మల కుమారి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ 2011
7. అడవిలో వెన్నెల (గిరిజన పోరాట కథలు) సమగ్ర పరిశీలన
జరుపుల రమేష్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ 2011
8. 'బి.ఎస్.రాములు సాహిత్యం - సమగ్ర పరిశీలన'
డా॥ కర్రె సదాశివ్, కాకతీయ విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి. 2011

## బి.ఎస్.రాములు విశాల సాహితి కథా పురస్కార గ్రహీతలు

| | రచయిత పేరు | కథల సంపుటి పేరు | సంవత్సరం |
|---|---|---|---|
| **62వ జన్మదినం సందర్భంగా:** | | | |
| 1. | రామా చంద్రమౌళి | 25 ఏళ్ల నాటి కథలు, జనన బీభత్సం మరణ మృదంగం | 2007-10 |
| 2. | ఐతా చంద్రయ్య | నీడల జాడలు, అంకితం | ,, |
| 3. | దిలావర్ | మచ్చు బొమ్మ, దూరాల చేరువలో | ,, |
| 4. | అనిశెట్టి రజిత | మట్టిబంధం, ఇతర కథలు | ,, |
| 5. | గూడ అంజయ్య | దళిత కథలు, పొలిమేర (నవల) | ,, |
| 6. | జీవన్ | ఇప్పపూలు (గిరిజన కథల సంకలనం) | ,, |
| 7. | శిరంశెట్టి కాంతారావు | కంచి మేకలు, మట్టితాళ్ళవల | ,, |
| 8. | వంగూరి చిట్టెన్ రాజు | అమెరికా కథానికలు సంకలనాలు | ,, |
| 9. | నారాయణస్వామి | రంగుటద్దాల కిటికీ, ఇతర కథలు | ,, |
| 10. | ఎ.ఎన్.జగన్నాథ శర్మ | పేగు కాలిన వాసన | ,, |
| 11. | కొండవీటి సత్యవతి | మెలకువ సందర్భం, 'భూమిక' పత్రిక | ,, |
| 12. | విహారి | కథాకృతి, ప్రాప్తం | ,, |
| 13. | బొజ్జా విజయభారతి | సాహిత్య సామాజిక రచనలు | ,, |
| 14. | బండ సరోజన | పాఠ్యపుస్తకాల రచన | ,, |
| 15. | సయ్యద్ నశీర్ అహమ్మద్ | ముస్లింల చరిత్ర గ్రంథాలు | ,, |
| 16. | కె.జితేంద్రబాబు | నిజాం ఆంధ్ర మహాసభల సంపుటాలు | ,, |
| **షష్టిపూర్తి సందర్భంగా** | | | |
| 17. | మన్నుబువ్వ | జాజుల గౌరి | 2004 |
| 18. | బా | రహమతుల్లా | 2004 |
| 19. | రూపాయి చెట్టు, చదరపు ఏనుగు సలీం | | 2004 |
| 20. | చలివేంద్రం, కుట్ర | జాతశ్రీ | 2005 |
| 21. | మట్టి వాసనలు | పంజాల జగన్నాథం | 2005 |
| 22. | చీకట్లో వేగుచుక్క | జి.విజయలక్ష్మి | 2005 |
| 23. | ప్రశ్న | సి.వేదవతి | 2006 |
| 24. | మొలకల పున్నమి | వేంపల్లి గంగాధర్ | 2006 |
| 25. | బతుకుతాడు, పేదోళ్ల బతుకులు | నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ | 2006 |
| 26. | అన్నం గుడ్డ | సుంకోజు దేవేంద్రాచారి | 2007 |
| 27. | గజ ఈతరాలు | గొరుసు జగదీశ్వర్ రెడ్డి | 2007 |
| 28. | కథాసాగర్ | ఎం.ఏ.సుభాన్ | 1998 |
| 29. | విశాలాంధ్ర తెలుగు కథ | కేతు విశ్వనాథరెడ్డి, సింగంనేని, సదానంద శారద | 2002 |
| 30. | దళిత కథలు-8 సంపుటాలు, స్త్రీల కథలు-6 సంపుటాలు | డా॥ కె.లక్ష్మినారాయణ | 1995-2009 |
| 31. | విశాలాంధ్ర తెలంగాణ కథ | చంద్ర, కాలువ మల్లయ్య, సదానంద శారద | 2006 |
| 32. | తొలినాటి తెలంగాణ కథలు | సంగిశెట్టి శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి | 2006 |
| 33. | తెలంగాణ కథ-6 సంపుటాలు | కర్ర ఎల్లారెడ్డి | 2003-2008 |
| 34. | తెలుగు కథకి జేజే... | సాకం నాగరాజు | 2007 |
| 35. | బంగారు కథలు, కొత్త కథ, సరికొత్తకథ, వినూత్న కథ | వేదగిరి రాంబాబు | 1996-2000 |
| 36. | మంచికథ, నచ్చిన కథ, మెచ్చిన కథ | చీకోలు సుందరయ్య | 1995-2005 |
| 37. | వతన్-ముస్లిం కథలు | స్కైబాబా, షాజహానా, ఇనాయితుల్లా | 2007 |
| 38. | కరీంనగర్ జిల్లా కథలు-రెండు సంకలనాలు భారతీయ సాహిత్యం తెలుగు కథలు | వనమాల చంద్రశేఖర్ | 1998-2004 |
| 39. | గ్లోబలైజేషన్ కథలు | డా॥ ఎస్వీ సత్యనారాయణ | 2003 |
| **50వ జన్మదినం స్వర్ణోత్సవం నుండి :** | | | |
| 40. | నవీన్ | జీవితకాల కృషికి | 1998 |
| 41. | భూపాల్ | 'అంబల్లబండ' కథల సంపుటి | 1998 |
| 42. | ఆడెపు లక్ష్మీపతి | నాలుగు దృశ్యాలు కథల సంపుటి | 1998 |
| 43. | కాలువ మల్లయ్య | 'మాకథలు' కథల సంపుటి | 1999 |
| 44. | ముదిగంటి సుజాతారెడ్డి | 'విసుర్రాయి' కథల సంపుటి | 1999 |
| 45. | శాంతి నారాయణ | 'పల్లేరు ముళ్ళు' కథల సంపుటి | 1999 |
| 46. | కె.వి.నరేందర్ | అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి | 1999 |
| 47. | ఓల్గా | ప్రయోగం, రాజకీయ కథలు | 2000 |
| 48. | ఎండ్లూరి సుధాకర్ | మల్లెమొగ్గల గొడుగు కథలు | 2000 |
| 49. | ఎ.అప్పలనాయుడు | ప్రత్యామ్నాయం కథలు | 2000 |
| 50. | వి.చంద్రశేఖర్‌రావు | లెనిన్ ప్లేస్ కథలు | 2000 |
| 51. | నాగప్పగారి సుందరరాజు | మాదిగోడు, మావూరి మైసమ్మ | 2000 |
| 52. | గంటేడ గౌరనాయుడు | ఏటిపాట కథలు | 2000 |
| 53. | బోయ జంగయ్య | బోజ కథలు | 2001 |
| 54. | అంబల్ల జనార్దన్ | బొంబాయి కథలు | 2001 |
| 55. | కుప్పిలి పద్మ | ముక్తి కథలు | 2001 |
| 56. | సింగమనేని నారాయణ | సింగమనేని కథలు | 2001 |
| 57. | పి.చంద్ | భూనిర్వాసితులు, శేషగిరినవల | 2001 |
| 58. | పెద్దింటి అశోక్ కుమార్ | వలస బతుకులు, ఎడారి మంటలు | 2001 |
| 59. | డా॥ కొలకలూరి ఇనాక్ | అస్పృశ్యగంగ (కథల సంపుటి) | 2002 |
| 60. | నంబూరి పరిపూర్ణ | ఉంటాయి మాకుషస్సులు | 2002 |
| 61. | పులుగు శ్రీనివాస్ | సంకర విత్తులు (కథల సంపుటి) | 2002 |
| 62. | కె.వరలక్ష్మి | మట్టి-బంగారం (కథల సంపుటి) | 2003 |
| 63. | నల్లాల లక్ష్మిరాజం | తిరుగు ప్రయాణం | 2003 |
| 64. | బెజ్జారపు వినోద్ కుమార్ | గవ్వలమూట (కథలసంపుటి) | 2003 |
| 65. | దాశరథి రంగాచార్య | జీవనయానం (స్వీయచరిత్ర) | 2002 |
| 66. | కీ.శే. బిట్ల నారాయణ | నా అంతరంగ తరంగాలు | 2003 |